గురువారం 24-8-2023

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50 సంపుటి: 16 సంచిక: 154



'ప్రజా ప్రతినిధులు చేయాల్సింది రెండే, ప్రజా సేవలో సమర్థతను చాటుకోవడమా! లేక తప్పుకోవడమా!'



" బ్రిక్స్ సదస్సు కోసం నేను దక్షిణాఫ్రికాలో ఉన్నా.. నా మనసు, ఆత్మ భారత్‌లోనే ఉన్నాయి. ఇప్పుడు చంద్రుడిపై భారత్ అడుగుపెట్టింది. భూగోళంపై మనం తీసుకున్న సంకల్పం చందమామపై నెరవేరింది. అమృతకాలంలో ఇది మొదటి విజయం."

భూమిపై సంకల్పం..

జాబిల్లిపై సాకారం -6లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

ఉత్కంఠ: కోల్‌కతాలో ఆసక్తిగా తిలకిస్తున్న విద్యార్థులు



ఉత్సాహం: ఇస్రోలో సైంటిస్టుల విజయోత్సాహం



సంబరం: లక్నోలో విద్యార్థుల ఆనందం



చంద్రుడి గుట్టు తెలుసుకునేలా..

- వివరాలు 7లో

భారతీయుల మేనమామ.. మన చందమామ.. చిన్నప్పుడు చందమామ కావాలని బాలరాముడు మారాం చేస్తే.. అందిరాని చందమామను అద్దంలో చూపించి ఊరుకోబెట్టిందట తల్లి. ఇక, అన్నమయ్య.. 'చందమామ రావే.. జాబిల్లి రావే..' అంటూ ఆలపించినా నెలరాజు దిగిరాలేదు. చివరకు ఇస్రో 'విక్రమ' యత్నంతో.. భారత్ విజయవంతంగా నెలరేడుపై అడుగుపెట్టింది.

రష్యా ల్యాండర్ లూనా-25 విఫలమైన చోటే భారత్ విజయపతాక ఎగురవేసింది. భూమి నుంచి చంద్రుడి దిశగా 41 రోజులపాటు సాగించిన తన ప్రయాణాన్ని చంద్రయాన్-3 మిషన్ ఘనంగా ముగించింది. ఈ ప్రయోగంలో అంతర్భాగమైన ల్యాండర్ మాడ్యూల్ 'విక్రమ్' బుధవారం సాయంత్రం 6.04 గంటలకు చందమామను సున్నితంగా ముద్దాడింది. ల్యాండింగ్ పూర్తయిన 4 గంటల అనంతరం రోవర్ 'ప్రజ్ఞాన్' ఆరు చక్రాల సాయంతో ల్యాండర్ నుంచి సురక్షితంగా బయటకు అడుగుపెట్టి.. తన కార్యాచరణ ప్రారంభించింది. ఇది రెండు వారాల పాటు జాబిల్లి ఉపరితలంపై సంచరిస్తూ విలువైన సమాచారాన్ని భూమిపైకి చేరవేయనుంది.

ముువ్వన్నెల చంద్రహాసం

6 లో



దొరికాడు నెలరేడు



అంతరిక్ష ప్రయోగాల్లో చరిత్ర సృష్టించిన భారత్

ప్రతిష్టాత్మక చంద్రయాన్-3 మిషన్ ఘన విజయం

- సాయంత్రం 6.04 గంటలకు జాబిల్లిపై దిగిన ల్యాండర్..
- రాత్రి 10.04 సమయంలో ల్యాండర్ నుంచి బయటకు వచ్చిన రోవర్ 'ప్రజ్ఞాన్'
- చంద్రుడి దక్షిణధ్రువంపై అడుగుపెట్టిన మొదటి దేశంగా భారత్ రికార్డు
- చందమామపై ల్యాండర్‌ను భద్రంగా దించిన నాలుగో దేశంగా ఘనత
- దేశ ప్రజల్లో ఆనందోత్సాహాలు..
- ఇస్రో శాస్త్రవేత్తలపై ప్రశంసల జల్లు

చంద్రయాన్-3 తరువాత?

7 లో




ప్రయాణం సాగిందిలా ..

2008లో మొట్టమొదటి మిషన్ చంద్రయాన్-1 నుంచి చంద్రయాన్-3 వరకు ఇస్రో ప్రయాణంపై కథనం

6 లో

ఈ విజయం వెనుక ఎందరెందరో...



ఇక అంగారకుడిపైకి అడుగు!

ఇస్రో చైర్మన్ సోమనాథ్ వెల్లడి

- భవిష్యత్తులో శుక్రుడితోపాటు ఇతర గ్రహాలపైకీ వెళ్తాం.. చంద్రయాన్-3 విజయం స్ఫూర్తినిచ్చింది
- దీనికోసం ఎంతగానో శ్రమించాం.. శాస్త్రవేత్తల కృషి ఫలించింది
- ఇది పూర్తిగా మేడిన్ ఇండియా మిషన్

6 లో



గర్జించిన సింహాలు

జాబిల్లిపై మన జాతీయ చిహ్నాం

6 లో


చంద్రుని ఉపరితలంపై విక్రమ్ ల్యాండర్ దిగిన ప్రదేశం

నేడు మంత్రిగా పట్నం ప్రమాణ స్వీకారం



ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి గురువారం మధ్యాహ్నం 3 గంటలకు రాజ్‌భవన్‌లో మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. తాండూరు టికెట్‌ను ఆశించిన మహేందర్‌రెడ్డిని రాజీ ఫార్ములాలో భాగంగా మంత్రివర్గంలోకి తీసుకోవాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. -8లో

ఇదండీ సంగతి



మోసగాళ్లను నమ్మితే గోసే

మెదక్ సభలో సీఎం కేసీఆర్



- రాష్ట్రాన్ని దుర్మార్గులకు అప్పగించొద్దు
- ఎన్నికలు రాగానే కాంగ్రెస్ ఆపద మొక్కులు మొక్కుతోంది
- వ్యవసాయానికి, పరిశ్రమలకు 24 గంటల విద్యుత్ అందిస్తున్న ఒకే ఒక్క రాష్ట్రం తెలంగాణ
- రాష్ట్ర ఆదాయం పెరిగే కొద్దీ సంక్షేమ పథకాల లబ్ధి పెంచుతాం
- ఎన్నికలొస్తే ఆగం కాకుండా ఎవరు నిజమైన ప్రజా సేవకులో గుర్తించాలి
- కలెక్టరేట్, ఎస్పీ, బీఆర్ఎస్ కార్యాలయ భవనాలు ప్రారంభించిన ముఖ్యమంత్రి

సాక్షి ప్రతినిధి, మెదక్: 'కోటి కుటుంబాలకు నల్లా నీళ్లు ఇస్తున్న, వ్యవసాయానికి.. పరిశ్రమలకు 24 గంటల విద్యుత్ అందిస్తున్న ఒకే ఒక్క రాష్ట్రం తెలంగాణ. ఇన్ని సౌకర్యాలను వదిలేసి రాష్ట్రాన్ని దుర్మార్గులకు అప్పగించొద్దు. చేతగాని వారి చేతుల్లో పెట్టొద్దు..' అని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మోసగాళ్ల మాటలు నమ్మితే గోస పడతామని హెచ్చరించారు. ధరణి పోర్టల్‌ను రద్దు చేస్తామంటున్న కాంగ్రెస్ పార్టీని రానున్న మిగతా 8వ పేజీలో ▶

రెండు కొత్త పథకాలు ప్రారంభం

మెదక్‌లో ముఖ్యమంత్రి రెండు కొత్త పథకాలను ప్రారంభించారు. దివ్యాంగులకు రూ.3,016 నుంచి రూ.4,016లకు పెంచిన ఆసరా పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అలాగే బీడీ టేకేదార్లకు ఆసరా పెన్షన్ వర్తింపును కూడా ప్రారంభించారు.

మెదక్ చర్చి గ్రౌండ్స్‌లో బుధవారం జరిగిన ప్రగతి శంఖారావం సభలో ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తున్న సీఎం కేసీఆర్



బుజ్జగింపులు.. రాజీనామాలు

బీఆర్ఎస్ అభ్యర్థుల జాబితా విడుదల నేపథ్యంలో పరిణామాలు



- గులాబీ పార్టీకి మాజీ ఎమ్మెల్యే వేముల, మాజీ ఎమ్మెల్సీ సంతోష్ రాజీనామా
- నేడు రాజకీయ భవిష్యత్తుపై ప్రకటన చేస్తానన్న నీలం మధు
- ఎమ్మెల్యే రాజయ్య నివాసానికి కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- మాజీ మంత్రి తుమ్మలతో ఎంపీ నామా, ఎమ్మెల్యే భాస్కర్‌రావు భేటీ
- మల్కాజిగిరిపై కొనసాగుతున్న సస్పెన్స్

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే బీఆర్ఎస్ అభ్యర్థుల జాబితా విడుదల అనంతర ప్రకంపనలు ఇంకా కొనసాగుతున్నాయి. టికెట్ దక్కని ఆశావహులను బుజ్జగించేందుకు ఓవైపు ప్రయత్నాలు జరుగుతుండగా, మరోవైపు కొందరు నేతలు పార్టీని వీడుతున్నట్టుగా ప్రకటనలు చేస్తున్నారు. కరీంనగర్ జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్సీ సంతోష్‌కుమార్, నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం బీఆర్ఎస్‌ను వీడుతున్నట్లు ప్రకటించారు. 2018లో కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన మాజీ ఎమ్మెల్సీ సంతోష్‌కుమార్ గత ఏడాది జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల కోటాలో ఎమ్మెల్సీ పదవిని ఆశించారు. కుదరకపోవడంతో కొంతకాలంగా పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటున్నారు. అయితే బుధవారం విలేకరులతో మాట్లాడుతూ..బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, పార్టీ నాయకులు తనకు తగిన ప్రాధాన్యం ఇవ్వకపోవడం బాధ కలిగించిందని అన్నారు. ప్రాధాన్యం ఇవ్వని పార్టీలో కొనసాగడం ఇష్టంలేక బీఆర్ఎస్‌కు రాజీనామా చేసినట్లు వెల్లడించారు. ప్రజల ఆశీస్సులతో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కరీంనగర్ నుంచి పోటీ చేస్తానని తెలిపారు. పదిహేను రోజుల్లో తన సన్నిహితులు, అనుచరులతో చర్చించి భవిష్యత్ మిగతా 8వ పేజీలో ▶

అసంతృప్తులకు గాలం

బీఆర్ఎస్ నేతలను పార్టీలో చేర్చుకునేందుకు కాంగ్రెస్ ప్రయత్నం

- ఈనెల 26న ఖర్గే సభలో భారీగా చేరికలు.. నల్లగొండ అసెంబ్లీకి ఎంపీ కోమటిరెడ్డి దరఖాస్తు

- వివరాలు 8లో

జడ్జి జయకుమార్ సస్పెన్షన్

- నాంపల్లి ప్రజా ప్రతినిధుల కోర్టులో జడ్జిగా విధులు
- సీఈసీ ఫిర్యాదుపై విచారణ జరిపి చర్యలు తీసుకున్న హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: కేంద్ర ఎన్నికల సంఘం చీఫ్ కమిషనర్, రాష్ట్ర ఎన్నికల సంఘం, మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌లపై కేసు నమోదు చేయాలంటూ పోలీసులకు ఆదేశాలు జారీ చేసిన నాంపల్లి ప్రజా ప్రతినిధుల కోర్టు జడ్జి జయకుమార్‌పై హైకోర్టు సస్పెన్షన్ వేటు వేసింది. ఉత్తర్వుల విషయంలో ఆయన అనుసరించాల్సిన విధానాలు పాటించలేదని అభిప్రాయపడింది. ఆయన పదవిలో ఉంటే నిష్పక్షపాతంగా విచారణ సాగేందుకు మిగతా 3వ పేజీలో ▶



ఏటా రెండుసార్లు బోర్డు పరీక్షలు

- విద్యార్థి ఉత్తమ స్కోరును ఎంచుకునే అవకాశం
- విద్యార్థులపై ఒత్తిడి తగ్గుతుంది.. కేంద్రానికి ఎన్‌సీఎఫ్ సిఫార్సు

7 లో

ర్యాంకు 2.38 లక్షలు.. ఎంబీబీఎస్‌లో

కన్వీనర్ సీటు

- ఓ ప్రైవేట్ మెడికల్ కాలేజీలో ఎస్సీ కేటగిరీ విద్యార్థికి సీటు
- గతేడాదికంటే మొదటి కౌన్సెలింగ్‌లోనే అధిక ర్యాంక్‌కు సీటు

16 లో


వాగ్నర్ చీఫ్ ప్రిగోజిన్ మృతి?



రష్యాలో జరిగిన విమాన ప్రమాదంలో 10 మంది మృతి చెందారు. మృతుల్లో వాగ్నర్ గ్రూప్ చీఫ్ యెవ్‌గెనీ ప్రిగోజిన్ ఉన్నట్టు అనుమానిస్తున్నారు.

7 లో


PAN BAHAR
ఇస్రో చేసి నిరూపించింది
చందమామపై భారత చంద్రయాన్‌ను చేర్చింది
దేశ శాస్త్రజ్ఞులు భారతదేశం
సగర్వంగా తలెత్తుకునేలా చేసారు
PAN BAHAR
THE HERITAGE ELAICHI
PAN BAHAR
THE HERITAGE ELAICHI
PAN BAHAR
THE HERITAGE ELAICHI
PEHCHAN KAMYABI KI
Toll Free No.: 1800 257 2258





ఇంతింతై...

➤ అసలు ఎక్కడ మొదలైంది.. ఇప్పుడు ఎక్కడికి చేరింది.. వామనుడిలా ఎదిగిన ఇస్రో విజయప్రస్థానంపై భారతీయులందరూ తమ ఆనందాన్ని సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. అంతరిక్ష కార్యక్రమం తొలినాళ్లలో ఇలా సైకిల్‌పై రాకెట్ విడిభాగాలను తరలించిన ఫొటోలను షేర్ చేసుకుని.. జయహో భారత్ అంటూ నినదించారు.



ఎన్‌హెచ్‌ఏఐ, రాష్ట్ర ప్రభుత్వం మధ్య సయోధ్య!

- రీజనల్ రింగురోడ్డు ఉత్తర భాగం పరిహారం పంపిణీకి ఏర్పాట్లు
- 100 కోట్లు డిపాజిట్ చేసిన సర్కారు
- అవార్డులు పాస్ అయ్యే కొద్దీ తన వాటా చెల్లించేందుకు రాష్ట్రం అంగీకారం



సాక్షి, హైదరాబాద్: రీజనల్ రింగురోడ్డు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం – కేంద్ర ప్రభుత్వం మధ్య కొంతకాలంగా కొనసాగుతున్న వివాదం సద్దుమణిగినట్టే కనిపిస్తోంది. భూసేకరణకు సంబంధించి పరిహార మొత్తంలో రాష్ట్రప్రభుత్వం తన వంతు సగం వాటా డబ్బులు డిపాజిట్ చేయాల్సిందిగా కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎన్‌హెచ్‌ఏఐ లేఖ రాయటంతో వివాదం మొదలైన విషయం తెలిసిందే. ఇప్పుడు ఒకేసారి తన వాటా మొత్తం కాకుండా, అవార్డులు పాస్ చేసిన కొద్దీ విడతల వారీగా వాటా చెల్లిస్తానంటూ తాజాగా ప్రభుత్వం చేసిన ప్రతిపాదనకు ఎన్‌హెచ్‌ఏఐ అంగీకరించింది. దీంతో భూ పరిహారం పంపిణీకి మార్గం సుగమమైంది. వారం రోజుల్లో అందుకు కావాల్సిన ఏర్పాట్లను ఎన్‌హెచ్‌ఏఐ ప్రారంభించబోతోంది. త్వరలోనే భూసేకరణ ప్రాధికార సంస్థ (కాలా)ల వారీగా పరిహారం పంపిణీ ప్రారంభం కానుంది. దీంతో రీజనల్ రింగురోడ్డు పనులు ప్రారంభించేందుకు వీలుగా టెండర్లు పిలిచేందుకు అవకాశం కలగనుంది.

రూ.100 కోట్లు జమ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

రీజనల్ రింగ్ రోడ్డు ఉత్తర భాగానికి సంబంధించి ప్రధాన గెజిట్లు జారీ అయిన విషయం తెలిసిందే. భూ పరిహారం పంపిణీకి సంబంధించిన 3డీ గెజిట్ నోటిఫికేషన్లు ఇటీవలే విడుదలయ్యాయి. అయితే వివరాలు గల్లంతైన భూములకు సంబంధించి మాత్రం ఇంకా విడుదల కావాల్సి ఉంది. 3డీ గెజిట్లు విడుదలైన భూములకు సంబంధించి పట్టాదారులకు పరిహారం అందజేసేందుకు ఎన్‌హెచ్‌ఏఐ కేంద్ర కార్యాలయం అనుమతి మంజూరు చేయటంతో స్థానిక అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 162 కి.మీ. ఉత్తర భాగానికి సంబంధించి 2 వేల హెక్టార్ల భూమిని సమీకరించాల్సి ఉంది. ఇందుకు పరిహారంగా రూ.5,170 కోట్లు అవసరమవుతాయని ఎన్‌హెచ్‌ఏఐ బడ్జెట్‌లో ఖరారు చేసింది. ఈ మొత్తంలో 50 శాతం రాష్ట్రప్రభుత్వం భరించాలి. అంటే రూ.2,585 కోట్లు, స్తంభాల వంటి వాటి తరలింపునకు అయ్యే వ్యయానికి సంబంధించి మరో రూ.363.43 కోట్లు.. మొత్తం 2,948.43 కోట్లు చెల్లించాలంటూ ఎన్‌హెచ్‌ఏఐ ప్రభుత్వానికి లేఖ రాసింది. అయితే అవార్డ్ పాస్ చేసే 3డీ గెజిట్లు కూడా విడుదల కాకుండానే పరిహారం జమ చేయాలనటం సరికాదంటూ ప్రభుత్వం నిరాకరించింది. దీనిపై ఎన్‌హెచ్‌ఏఐ మూడు లేఖలు రాసినా ప్రభుత్వం స్పందించకపోవటంతో ప్రతిష్టంభన నెలకొంది. ఆ తర్వాత అధికారులు చర్చించటంతో సయోధ్య కుదిరింది. ఇందులో భాగంగా తొలుత రూ.100 కోట్లు డిపాజిట్ చేసిన ప్రభుత్వం, పరిహారం చెల్లించే ప్రాంతాలకు అవార్డులు పాస్ చేసినప్పుడల్లా తన వాటా చెల్లిస్తాననడంతో ఎన్‌హెచ్‌ఏఐ అంగీకరించింది. తాజాగా 8 కాలాలకు సంబంధించి 3డీ గెజిట్లు విడుదల కావటంతో పరిహారం చెల్లించేందుకు ఏర్పాట్లు ప్రారంభించారు.

యాజమాన్య పత్రాలు అందజేయాల్సిందిగా ఆదేశం..

ఏయే ప్రాంతాల్లో పరిహారం పంపిణీ చేయాలో గుర్తించిన ఎన్‌హెచ్‌ఏఐ తాజాగా, సంబంధిత భూముల యజమానులు వారేనని రూఢీ చేసే ఆధారాలు సమర్పించాల్సిందిగా పట్టాదారులకు సమాచారం పంపింది. వాటితోపాటు బ్యాంకు ఖాతా వివరాలు కూడా కోరింది. డాక్యుమెంట్లను ఆన్‌లైన్‌లో దాఖలు చేశాక, రికార్డులతో సరిచూసుకుని పరిహారాన్ని డిపాజిట్ చేయనున్నారు. పూర్తి వివరాలు సిద్ధమయ్యాక కాలాల వారీగా పత్రికాముఖంగా ప్రకటనలను కూడా వెల్లడించనుంది.

భూములకు.. నిర్మాణాలకు.. చెట్లకు..

పట్టాదారుల భూములు, వాటిల్లో ఉన్న నిర్మాణాలు, తోటలు, విలువైన చెట్లకు లెక్కకట్టి పరిహారం ఇస్తారు. ఆ ప్రాంతంలో మూడేళ్ల రిజిస్ట్రేషన్ల విలువలను గుర్తించి వాటి సరాసరి లెక్కగట్టి.. దానికి మూడు రెట్లను గుణించి పరిహారంగా ఖాయం చేయనున్నారు. ఆస్తులు, చెట్లకు వాటి విలువ ఆధారంగా లెక్కగడతారు.

ఇస్రో... అభినందనలు



చంద్రయాన్‌-3 విజయం తర్వాత ఆనందం వ్యక్తం చేస్తున్న గవర్నర్ తమిళిసై

చంద్రయాన్‌–3 మిషన్ చరిత్రాత్మక విజయం సాధించినందుకు ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు. ఈ విజయం పట్ల ఎంతో గర్విస్తున్నా. దీంతో మైల్ కాల్ లక్ష్య సాధనలో దేశం మరింత చేరువైంది. ఇస్రో శాస్త్రవేతలు, బృందంతో పాటు ప్రధాని నరేంద్ర మోదీ, దేశ ప్రజలకు కూడా అభినందనలు. **– గవర్నర్ తమిళిసై సౌందరరాజన్**



సేఫ్ ల్యాండింగ్ ద్వారా చంద్రయాన్‌–3 మిషన్ సంపూర్ణ విజయం సాధించడం గొప్ప విజయం. చంద్రుని దక్షిణ ధ్రువంపై ల్యాండర్ మాడ్యూల్‌ను విజయవంతంగా చేర్చిన మొదటి దేశంగా, ప్రపంచ అంతరిక్ష పరిశోధన రంగంలో భారత్ సరికొత్త అధ్యాయాన్ని లిఖించి అరుదైన చరిత్రను సృష్టించింది. ఇ ది ప్రతీ భారతీయుడు గర్వించదగ్గ సందర్భం. ఇస్రో శాస్త్రవేత్తలకు, సిబ్బందికి, భాగస్వాములైన ప్రతి ఒ క్కరికీ అభినందనలు. చిరకాల ఆకాంక్ష నెరవేరిన సందర్భంగా యావత్ భారతదేశ ప్రజలకు ఇది పండుగ రోజు. భవిష్యత్‌లో ఇస్రో చేపట్టబోయే అంతరిక్ష పరిశోధనలకు, ప్రయోగాలకు చంద్రయాన్‌–3 విజయం గొప్ప ప్రేరణ ఇస్తుంది. ఇదే స్ఫూర్తిని కొన సాగిస్తూ, దేశ కీర్తిప్రతిష్టలను మరింతగా పెంచే దిశ గా, అంతరిక్ష పరిశోధన రంగంలో ఇస్రో తన విజ య పరంపరను కొనసాగించాలని ఆకాంక్షిస్తున్నా.

– ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు

చంద్రునిపై దక్షిణ ధ్రువానికి చంద్రయాన్‌–3 విజయవంతంగా చేరుకోవడం ఆనందంగా ఉంది. భారత అంతరిక్ష రంగంలో ఇదొక చారిత్రక మైలురాయి, అద్భుత ఘటన. ఈ ఘనతను సాధించేందుకు ఇస్రో చేసిన కృషి, నిబద్ధత ఎనలేనిది. భారతీయ అంతరిక్ష ప్రయాణానికి ఇది అద్భుత సమయం. మనం చంద్రుడిపై ఉన్నాం.

– ఐటీ, పురపాలక మంత్రి కేటీఆర్

అంతర్జాతీయంగా మెప్పు పొందేలా క్రీడా విధానం

అధికారులకు మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రానికి సంబంధించిన నూతన క్రీడా విధానం.. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడారంగ నిష్ణాతుల మెప్పు పొందేలా ఉండాలని క్రీడా శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అభిప్రాయపడ్డారు. మన రాష్ట్ర క్రీడాకారుల భవిష్యత్తును అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దేలా క్రీడా విధానం ఉండాలనేదే ముఖ్యమంత్రి కేసీఆర్ అభిమతమన్నారు. అందుకు అనుగుణంగా తుది కసరత్తు నిర్వహించాలని మంత్రి అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. క్రీడా శాఖ రూపొందించిన నూతన క్రీడా విధానం ముసాయిదాపై శ్రీనివాస్‌గౌడ్ బుధవారం టూరిజం ప్లాజా హోటల్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. వీలైనంత త్వరగా ముసాయిదాకు తుదిరూపం ఇచ్చి, వచ్చే కేబినెట్ సమావేశం నాటికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అంతర్జాతీయ స్థాయిలో విజయవంతమైన వివిధ దేశాల క్రీడా విధానాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసి వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న మెరుగైన అంశాలను క్రోడీకరించి నివేదిక ఇవ్వాలన్నారు.

జడ్జి జయకుమార్ సస్పెన్షన్

▶ మొదటి పేజీ తరువాయి

ఆటంకం కలుగుతుందని సస్పెండ్ చేస్తూ..ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. అంతేకాదు..విచారణ పూర్తిగా ముగిసే దాకా హైదరాబాద్ విడిచి వెళ్లరాదని జడ్జిని ఆదేశించింది. 2018, డిసెంబర్‌లో ఎన్నికలు జరిగిన సమయంలో దాఖలు చేసిన అఫిడవిట్‌ను శ్రీనివాస్‌గౌడ్ ట్యాంపరింగ్ చేశారని, అయినా అధికారులు పట్టించుకోలేదని పేర్కొంటూ మహబూబ్‌నగర్‌కు చెందిన చలువగాలి రాఘవేంద్రరాజు నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో ప్రైవేట్ పిటిషన్ వేశారు. నామినేషన్‌తోపాటే అఫిడవిట్ దాఖలు చేశారని, అయితే తర్వాత ఆ అఫిడవిట్‌ను సవరించారని పేర్కొన్నారు. దీనిపై విచారణ చేపట్టిన జడ్జి జయకుమార్..ఎన్నికల అధికారులు, మంత్రి, రెవెన్యూ అధికారులపై కేసు నమోదు చేయాలని పోలీసులను జూలై 31న ఆదేశించారు. అయితే కోర్టు ఆదేశించినా పోలీసులు అధికారులు, మంత్రిపై కేసు నమోదు చేయలేయడం లేదని పిటిషనర్ రాఘవేంద్రరాజు జడ్జి దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఆగస్టు 11న విచారణ చేపట్టిన జడ్జి.. సాయంత్రం 4 గంటల్లోగా కేసు నమోదు చేసి, రాతపూర్వకంగా వివరాలు వెల్లడించాలని ఆదేశించారు. పోలీసులు మంత్రితోపాటు ఎన్నికల అధికారులపై కేసు నమోదు చేశారు. ఎన్నికల అఫిడవిట్‌లో మార్పులకు సీఈసీకి ఎలాంటి సంబంధం లేకపోయినా ప్రజాప్రతినిధుల కోర్టు జడ్జి తన పరిధి దాటి వ్యవహరించారని.. విచారణ జరపాలని పేర్కొంటూ కేంద్ర ఎన్నికల సంఘం తరఫున సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ ధర్మేంద్రశర్మ తెలంగాణ హైకోర్టుకు వినతిపత్రం సమర్పించారు. ఈ మొత్తం అంశంపై హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ విచారణ చేపట్టి.. నివేదిక అందజేశారు. సీఆర్‌పీసీ సెక్షన్ 200 ప్రకారం రాఘవేంద్రరాజు ప్రైవేట్ దావా వేసినప్పుడు.. ఎలాంటి ప్రాథమిక విచారణ చేపట్టకుండానే, పిటిషనర్ వాంగ్మూలం తీసుకోకుండానే, సీఆర్‌పీసీ సెక్షన్ 156(3) కింద దర్యాప్తు చేయాలని జడ్జి ఆదేశాలు జారీ చేశారు. విధి నిర్వహణలో లోపాలున్నాయని చెప్పారు. కేంద్ర ఎన్నికల కమిషన్ వినతిపత్రం, రిజిస్ట్రార్ జనరల్ నివేదిక ఆధారంగా జడ్జిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని హైకోర్టు నిర్ణయించింది. తక్షణం విధుల నుంచి తప్పుకుని మొదటి అదనపు మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి, 15 అదనపు చీఫ్ జడ్జి(సిటీ సివిల్ కోర్టు)కు బాధ్యతలు అప్పగించాలని ఆదేశించింది.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలదే భవిష్యత్తు

ఏపీ మాజీ సీఎం చంద్రబాబు వెల్లడి

రాయదుర్గం (హైదరాబాద్): భవిష్యత్తు అంతా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలదేనని, అందుకోసం ప్రతి ఒక్కరూ ఎంటర్‌ప్రెన్యూర్లుగా మారేందుకు కృషి చేయాలని ఏపీ మాజీ సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌లో సిల్వర్‌జూబ్లీ టాక్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రిపుల్‌ఐటీ గవర్నింగ్‌బాడీ చైర్మన్ ప్రొఫెసర్ రాజ్‌రెడ్డితో ఆయన ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు చంద్రబాబు సమాధానం ఇచ్చారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ... దేశంలోనే ప్రస్తుతం టాప్5లో ఉన్న ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌ను రాబోయేకాలంలో దేశంలోనే నంబర్‌వన్ ఇన్‌స్టిట్యూట్‌గా రూపొందించేలా కృషి చేయాలని సూచించారు. నగరంలో ఎన్నో విద్యాసంస్థలు, పరిశ్రమలు, ఐటీ సంస్థల ఏర్పాటుకు ఎంతో శ్రమించామని, ఔటర్‌రింగురోడ్డు, ఎయిర్‌పోర్టు, రోడ్ల విస్తరణ ఎన్నో పనులను భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని చేశామని చెప్పారు.

హైదరాబాద్‌లో గోల్డ్‌మెన్ సాక్స్ విస్తరణ ప్రణాళిక

- మరో రెండు వేల మంది నిపుణులకు ఉద్యోగ అవకాశాలు
- అమెరికాలో మంత్రి కేటీఆర్‌తో గోల్డ్‌మెన్ సాక్స్ ప్రతినిధుల భేటీ



గోల్డ్‌మెన్ సాక్స్ ప్రతినిధులతో కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: బ్యాంకింగ్, ఫైనాన్స్ సేవలు, ఇన్సూరెన్స్ (బీఎఫ్ఎస్ఐ) రంగాల్లో హైదరాబాద్‌ను అత్యుత్తమ పెట్టుబడుల గమ్యస్థానంగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తున్నాయని ఐటీ పరిశ్రమలశాఖ మంత్రి కేటీఆర్ తెలిపారు. ఇప్పటికే ప్రపంచ ఆర్థిక బ్యాంకింగ్ ఫైనాన్స్ సేవల్లో పేరొందిన మాస్ మ్యూచువల్, హెచ్ఎస్‌బీసీ, స్టేట్ స్ట్రీట్, బెర్కాడియా వెల్స్‌ఫార్గో, జేపీ మోర్గాన్ వంటి కంపెనీలు హైదరాబాద్‌లో పెద్దఎత్తున తమ కార్యకలాపాలు విస్తరించాయన్నారు. గోల్డ్‌మెన్ సాక్స్ విస్తరణ ప్రణాళికలతో బీఎఫ్ఎస్ఐ రంగంలో హైదరాబాద్ స్థానం మరింత బలోపేతం అవుతుందని కేటీఆర్ తెలిపారు. విస్తరణ ప్రణాళికలో భాగంగా 2,500 మంది అత్యంత నైపుణ్యం కలిగిన యువకులకు ఉద్యోగాలు లభిస్తాయంటూ కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. మంత్రి కేటీఆర్‌తో న్యూయార్క్‌లోని గోల్డ్‌మెన్ సాక్స్ కంపెనీ కేంద్ర కార్యాలయంలో సంస్థ చైర్మన్, సీఈఓ డేవిడ్ ఎం.సోలమన్ బృందంతో బుధవారం జరిగిన సమావేశం అనంతరం కంపెనీ ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. విస్తరణ ప్రణాళికల్లో భాగంగా ప్రస్తుతం ఉన్న వెయ్యిమంది ఉద్యోగుల సంఖ్యను రెండు రెట్లు పెంచి మరో రెండు వేల మంది నిపుణులకు అదనంగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుంది. దీనికోసం సుమారు మూడు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ కార్యాలయాన్ని విస్తరిస్తుంది. సంస్థ బ్యాంకింగ్ సేవలు, బిజినెస్ అనలిటిక్స్, ఇంజనీరింగ్ వంటి వివిధ రంగాల్లో గోల్డ్‌మెన్ సాక్స్ సంస్థ కార్యకలాపాల బలోపేతానికి ఈ నూతన కేంద్రం పనిచేస్తుంది. సంస్థ కార్యకలాపాలకు అనుగుణంగా కావాల్సిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్ విభాగాల్లోనూ హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనున్న నూతన కార్యాలయం ప్రధానంగా దృష్టి సారిస్తుందని గోల్డ్‌మెన్‌సాక్స్ సంస్థ తెలిపింది.



పిల్లితో ఆటలాడేవాడు దాని గోటి గీతలకు సిద్ధంగా ఉండాలి.
- మిగెల్ సెర్వాంటిజ్

సాక్షి
గురువారం, 24 ఆగస్టు 2023

మహోన్నత ఘట్టం

కోట్లాదిమంది భారతీయులు ఊపిరి బిగపట్టి ఎదురుచూసిన ఒక అపురూపమైన, మహోన్నతమైన ఘట్టం అంతరిక్షంలో ఆవిష్కృతమైంది. సహస్రాబ్దాలుగా విశ్వ మానవాళికి కనువిందు చేస్తున్న చందమామపై పరిశోధనల కోసం మన శాస్త్రవేత్తలు ప్రయోగించిన చంద్రయాన్‌–3 మిషన్‌ బుధవారం అఖండ విజయం సాధించింది. ఎవరికీ లొంగిరాని చంద్రుడి తలంపైనున్న దక్షిణ ధ్రువ ప్రాంతాన్ని పరిశోధనల కోసం ఎంచుకుని, విక్రమ్‌ ల్యాండర్‌ను అక్కడే దించితీరాలన్న లక్ష్యంతో పనిచేసిన మన శాస్త్రవేత్తల సాహస ప్రయత్నం సాకారం కావడం ప్రపంచ దేశాలను అబ్బురపరిచింది. దేశం సగర్వంగా తలెత్తుకునేలా చేసింది. విక్రమ్‌ ల్యాండర్‌ సరిగ్గా అనుకున్నచోటే, అనుకున్న సమయానికే సురక్షితంగా కాలూనడం అంతర్జాతీయ అంతరిక్ష పరిశోధనల పరంపరను కీలక మలుపు తిప్పే ఒక అసాధారణ విన్యాసం. ప్రధాని నరేంద్ర మోదీ చెప్పినట్టు ఇదొక చారిత్రక ఘట్టం. దీని వెనక వందలాదిమంది శాస్త్రవేత్తల నాలుగేళ్ల నిరంతర కృషి, దృఢసంకల్పమూ పెనవేసుకుని ఉన్నాయి. ముఖ్యంగా గత 41 రోజులుగా అన్ని విభాగాలకు చెందిన శాస్త్రవేత్తలూ పరస్పర సమన్వయంతో రాత్రింబగళ్లు పనిచేస్తూ చంద్రయాన్‌ గమనాన్ని కళ్లల్లో వత్తులు వేసుకుని చూశారు. రెప్పవాల్చని నిఘాతో ఎప్పటికప్పుడు దాన్ని నిశితంగా గమనిస్తూ అవసరమైన జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ ప్రాజెక్టుతో ముడిపడిన శాస్త్ర, సాంకేతిక సిబ్బంది అందరూ చంద్రయాన్‌నే శ్వాసించారు. మరే వ్యాపకమూ లేదన్నట్టు ఈ ప్రాజెక్టుపైనే తమ సర్వశక్తులూ కేంద్రీకరించారు. మన శాస్త్రవేత్తల ప్రయోగాల్లో వైఫల్యాల శాతం అతి తక్కువ. చంద్రయాన్‌–2 ప్రాజెక్టులో పంపిన విక్రమ్‌ ల్యాండర్‌ చంద్రుడి గురుత్వాకర్షణ వేగాన్ని అధిగమించలేక విఫలమైందన్న మాటేగానీ, దాంతోపాటు పంపిన ఆర్బిటర్‌ ఇంకా పనిచేస్తూ ప్రస్తుత ప్రాజెక్టుకు అవసరమైన డేటాను అందించింది. గత నెల 14న శ్రీహరికోట నుంచి ప్రయోగించిన చంద్రయాన్‌–3 వ్యోమనౌక కక్ష్యను శాస్త్రవేత్తలు దశలవారీ పెంచుతూ రాగా, ఈనెల 1న భూ కక్ష్యను దాటుకుని చంద్రుడి కక్ష్య దిశగా అది దూసుకెళ్లింది. మరో నాలుగురోజులకు చంద్రుడి కక్ష్యలో చేరగా, ఆనాటినుంచీ దాని కక్ష్యను తగ్గించుకుంటూ వచ్చారు. ల్యాండర్‌ను కిందకు దించే ప్రక్రియను కొనసాగించాలా లేదా అన్నది కేవలం కొన్ని గంటలముందు నిర్ణయించవలసివుంటుంది. అప్పుడు కూడా అంతా సవ్యంగానే సాగుతున్నదని నిర్ధారించుకుని సరిగ్గా ముందనుకున్నట్టే సాయంత్రం 5.45కి ల్యాండర్‌ను చంద్రుడి ఉపరితలంపైకి మళ్లించే దశకు శాస్త్రవేత్తలు శ్రీకారం చుట్టారు. ఏ దశలోనూ చంద్రయాన్‌–3కి అవాంతరాలు ఎదురుకాకపోవటం, చివరకు శాస్త్రవేత్తలు సైతం అత్యంత కష్టసాధ్యమైనదని భావించిన చివరి 17 నిమిషాలూ అంచనాలకు అనుగుణంగా ముగియటం అనితర సాధ్యమైన ప్రక్రియ. ల్యాండింగ్‌ సమయంలో ఏ వ్యవస్థ విఫలమైనా ఆ వెంటనే మరో వ్యవస్థ దాన్ని నెరవేర్చేలా పకడ్బందీ ఏర్పాట్లు చేశారు.

వివిధ దేశాలు చంద్రుడిపైకి ఇంతవరకూ మొత్తం 18 వ్యోమనౌకలు పంపగా, అందులో 40 శాతం విఫలమయ్యాయి. 1959 జనవరిలో పూర్వపు సోవియెట్‌ యూనియన్‌ తొలి వ్యోమనౌకను పంపింది. 1976 తర్వాత... అంటే 47 ఏళ్ల తర్వాత ఇన్నాళ్లకు జరిపిన రెండో లూనా–25 ప్రయోగం ఆ దేశాన్ని తీవ్రంగా నిరాశ పరిచింది. ఈనెల 19న తమ వ్యోమనౌక విఫలమైందని ఆ దేశ అంతరిక్ష పరిశోధనా సంస్థ ఆ మరునాడు ప్రకటించింది. అంతరిక్ష రంగంలో కాకలు తీరిన సంస్థే విఫలమైందంటే ఇలాంటి ప్రాజెక్టుల్లో ఎన్ని సంక్లిష్టతలు ఇమిడివుంటాయో అర్థం చేసుకోవచ్చు. వాస్తవానికి మన చంద్రయాన్‌–2 ప్రాజెక్టుకు సహకరించడానికి అప్పట్లో రష్యా ముందుకొచ్చింది. 2011–12 మధ్య జరగాల్సిన ఆ ప్రయోగానికి రాకెట్, ఆర్బిటర్‌ మనం సమకూర్చుకోవటానికి, ల్యాండర్, రోవర్‌లను రష్యా అందించటానికి అవగాహన కుదిరింది. తీరా ఆ రెండూ వేరే ప్రయోగాల్లో విఫలం కావటం, రష్యా రూపొందించిన కొత్త డిజైన్లు మన రాకెట్‌కు అనువుగాలేని కారణంగా వాటిని సొంతంగానే రూపొందించుకోవాలని ఇస్రో నిర్ణయించింది. అందువల్లే 2019కి గానీ చంద్రయాన్‌–2 సాధ్యపడలేదు. అందులో ఎదురైన వైఫల్యాల నుంచి గుణపాఠం తీసుకోబట్టే తాజా విజయం చేతికందింది.

చంద్రుడిపై అతి శీతల ప్రాంతమైన దక్షిణ ధ్రువంలో ఇంతవరకూ ఏ దేశమూ తలపెట్టని అరుదైన ప్రయోగాలు ప్రజ్ఞాన్‌ రోవర్‌ నిర్వహిస్తుంది. చంద్రుడిపై ఉన్న మట్టిని, అక్కడి శిలలను సేకరించి మౌలిక, రసాయన సమ్మేళనాల డేటాను ఎప్పటికప్పుడు శాస్త్రవేత్తలకు పంపుతుంటుంది. ఉపరితలంపై ఉన్న మట్టిలోని అయాన్లనూ, ఎలక్ట్రాన్లనూ, వాటి సాంద్రతనూ మదింపు వేస్తుంది. వాటిల్లో కాలానుగుణంగా వచ్చిన మార్పులను పసిగడుతుంది. ఉపరితలంపై ఉన్న ఉష్ణోగ్రతనూ, అక్కడ వచ్చే కంపనాలనూ అంచనా వేస్తుంది. ఈ ప్రయోగాలన్నీ అది ఒక చాంద్రదినం (మనకు 14 రోజుల కాలం)లో పూర్తిచేయాల్సివుంటుంది. ఆ తర్వాత దాని జీవనయానం ముగుస్తుంది. సాంకేతికంగా ఎన్నో సంక్లిష్టలతో నిండివున్న ఈ ప్రయోగానికి సిద్ధపడటం, వేరే దేశాలతో పోలిస్తే దాన్ని అత్యంత చౌకగా (ఈ ప్రాజెక్టు వ్యయం రూ. 600 కోట్లు) పూర్తి చేయటం మన శాస్త్రవేత్తల సమర్థతను తెలియజేస్తుంది. అణ్వస్త్ర దేశంగా, అయిదో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్‌ ప్రతిష్ఠను చంద్రయాన్‌–3 ఘన విజయం మరింత పెంచింది. ఇది మరిన్ని ప్రయోగాలకు దోహదపడి మొత్తంగా మానవాళి జ్ఞానాన్ని మరింత సునిశితం చేయగలదని ఆశించాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్‌ నామ సంవత్సరం, దక్షిణాయణం, వర్ష ఋతువు, నిజ శ్రావణ మాసం, **తిథి:** శు.అష్టమి రా.9.29 వరకు, తదుపరి నవమి, **నక్షత్రం:** అనూరాధ తె.5.02 వరకు (తెల్లవారితే శుక్రవారం), తదుపరి జ్యేష్ఠ, **వర్జ్యం:** ఉ.9.04 నుండి 10.40 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.56 నుండి 10.47 వరకు, తదుపరి ప.2.56 నుండి 3.47 వరకు , **అమృతఘడియలు:** సా.6.37 నుండి 8.13 వరకు.

సూర్యోదయం : 5.47
సూర్యాస్తమయం : 6.18
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుండి 7.30 వరకు

మణిపుర్‌ గాయాల్ని మాన్పాలంటే...

విశ్లేషణ



యశోవర్ధన్‌ ఆజాద్‌

మణిపుర్‌ పోలీసులకు చెందిన సుమారు 4,500 ఆయుధాల ఆచూకీ ఇప్పటికీ తెలియదు. కేంద్రం వెంటనే రాష్ట్ర పాలనా బాధ్యతలు తీసుకోవాల్సిన అసాధారణమైన, ప్రమాదకరమైన పరిస్థితి ఇది. మణిపుర్‌ ఏళ్లుగా తుపాకుల నీడలో, మత్తుమందుల ప్రభావంలో, బలవంతపు వసూళ్ల మధ్య బతికింది. వీటన్నింటి నుంచి బయటపడేందుకు రాష్ట్రానికి న్యాయమైన అవకాశం ఇవ్వాల్సిన సమయం ఇదే. రాజకీయంగా చర్చలు ప్రారంభించాలి. ఆర్థిక పరిపుష్టికి ఊతమివ్వాలి. మణిపుర్‌లోని అన్ని తెగలు కూడా దృఢమైన, న్యాయమైన పాలన కోసం ఎదురు చూస్తున్నాయి. రాష్ట్రపతి పాలనలో సమర్థమైన అధికార యంత్రాంగం మణిపుర్‌ను మళ్లీ సరైన మార్గంలో పెట్టగలదు.

మణిపుర్‌ నివురుగప్పిన నిప్పులా అసందిగ్ధ భవిష్యత్తుకేసి చూస్తోంది. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. ఇళ్లు, దుకాణాలు, రహదారులు కూడా ధ్వంసమైపోయి రాష్ట్రం నిర్జీవమైన మట్టిదిబ్బ రూపం సంతరించుకుంది. అవిశ్వాస తీర్మానం సందర్భంగా మణిపుర్‌ ప్రస్తావన పార్లమెంటులో వచ్చింది. కానీ ఇరు పక్షాల పరస్పర నిందారోపణలతో ఒరిగింది శూన్యం. దేశ సర్వోన్నత న్యాయస్థానం మార్గదర్శకాలను అమలు చేసే క్రమంలో అస్సాం రైఫిల్స్, మణిపుర్‌ పోలీసుల మధ్య ఘర్షణపూరిత వాతావరణం కూడా పరిస్థితి మరింత దిగజారేందుకు కారణమైంది.

ఈ ఏడాది మే 4న కాంగ్పోక్పీ జిల్లాలో ఇద్దరు అమాయక మహిళలపై జరిగిన అకృత్యాలు సుప్రీంకోర్టును సైతం నిర్ఘాంతపోయేలా చేశాయి. రాష్ట్రం తన బాధ్యతను పూర్తిగా విస్మరించగా కొందరి ప్రయోజనాలు, పక్షపాతాలతో రాజకీయాలు నడిచాయి. జిల్లాలో సామూహిక అత్యాచారం జరిగితే కలెక్టర్‌ అయినా, ఎస్పీ అయినా అస్సలు సహించరాదు. అధ్వాన్నమైన స్థితి ఏమిటంటే... సంఘటన జరిగిన తొలిరోజే పోలీసులు ఎఫ్‌ఐఆర్‌ దాఖలు చేయకపోవడం. వారిని ఉద్యోగాల్లోంచి తొలగించేందుకు ఇంతకంటే బలమైన కారణం కనిపించదు. కొన్ని రోజుల తరువాత ఎఫ్‌ఐఆర్‌ దాఖలు చేసినా పరిస్థితి ఎక్కడిదక్కడే ఉంది. పోలీసులు, నాయకులు తమ బాధ్యతలను విస్మరించి, వారి వారి తెగల్లో హీరోలు కావాలని అనుకుంటే ఇంతకంటే ఎక్కువేమీ ఆశించలేము. ఈ ఘటన తరువాతి రోజే ఇంఫాల్‌లో కార్లు కడిగే పనిచేస్తున్న ఇద్దరు మహిళలపై దారుణమైన నేరం జరిగింది. రాష్ట్రం స్పందన భిన్నంగా ఏమీ లేదు. దౌర్భాగ్యకరమైన స్థితి ఏమిటంటే, ఈ మూక దాడుల్లో మహిళలూ భాగస్వాములు కావడం!

రాష్ట్ర పోలీసులకు చెందిన సుమారు 4,500 ఆయుధాల ఆచూకీ ఇప్పటికీ తెలియదు. కేంద్రం వెంటనే రాష్ట్ర పాలనా బాధ్యతలు తీసుకోవాల్సిన అసాధారణమైన, ప్రమాదకరమైన పరిస్థితి ఇది. నిఘా వర్గాలు కూడా దీనిపై కచ్చితంగా నివేదిక అందించే ఉంటాయి. రాష్ట్రం తనదైన కారణాలతో నోరు మెదపదు కానీ అంతర్గత ఘర్షణలతో అట్టుడుకుతున్న రాష్ట్రాన్ని కాపాడాల్సిన బాధ్యత కేంద్రానిది. నిబద్ధత కలిగిన హోంశాఖ కార్యదర్శి ఎవరైనా సరే... మణిపుర్‌ ఘటనపై సీరియస్‌గా స్పందించి ఉండేవారు. రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం కుప్పకూలుతున్న వైనాన్ని గమనించి రాష్ట్రపతి పాలన విధించాల్సిందిగా సిఫారసు చేసేవారు. అయితే జరిగిందేమిటి? ఎత్తుకెళ్లిన ఆయుధాలు తిరిగి ఇచ్చేయండి సామీ అని రాష్ట్ర డీజీపీ స్వయంగా బతిమాలడం, ఆయుధాల సేకరణ కోసం రాజకీయ నేతల ఇళ్ల ముంగిట్లో డ్రాప్‌బాక్స్‌ల ఏర్పాటుచేయడం!

మణిపుర్‌ విషయంలో కేంద్రం నిర్ణయాత్మకంగా వ్యవహరించాల్సిన సమయం ఇదే. రాష్ట్రం సాధారణ స్థితికి చేరుకుని తన కాళ్లపై తాను నిలబడగలగాలంటే కనీసం రెండేళ్లపాటు రాజకీయాలను



దూరంగా పెట్టాలి. నిష్పక్షపాతమైన, ప్రొఫెషనల్‌గా వ్యవహరించే యంత్రాంగం పాలనా విధులు చేపట్టాలి. మణిపుర్‌ను మళ్లీ సాధారణ స్థితికి తెచ్చేందుకు ఈ కార్యాచరణ అనుసరించడం మేలు:

1. రాష్ట్ర పెద్దగా బాధ్యతగా వ్యవహరించలేకపోయిన, ప్రజల నైతిక మద్దతు కోల్పోయిన ముఖ్యమంత్రిని వెంటనే తొలగించాలి. కుకీలతోపాటు కొందరు మైతేయిల్లోనూ ముఖ్యమంత్రిపై విశ్వాసం పోయింది. శాంతిభద్రతలు భయంకరంగా ఉన్నాయని బీజేపీ నేతలే కొందరు వ్యాఖ్యానించడం గమనార్హం. ముఖ్యమంత్రిని పదవి నుంచి తొలగించడం ద్వారా ప్రధానమంత్రి రాష్ట్రానికి మాత్రమే కాకుండా, తనకు తాను మేలు చేసుకున్న వారవుతారు. 2. రాష్ట్రపతి పాలన విధించాలి. రాష్ట్రంలోని విశ్రాంత అధికారుల్లో సమర్థులను ఎన్నుకుని గవర్నర్‌గా నియమించాలి. 3. ఐఏఎస్, ఐపీఎస్, రక్షణ శాఖల నుంచి ఒక్కొక్కరిని గవర్నర్‌కు సలహాదారులుగా నియమించాలి. జి.ఎస్‌. పంధేర్, హర్జీత్‌ సంధూ, ఎ.ఎస్‌.ఝా, నిఖిలేష్‌ ఝా, జాన్‌ షిల్షీ, జర్నైల్‌ సింగ్, బీ.ఎల్‌.వోహ్రా లాంటి అత్యుత్తమ అధికారులను పరిగణనలోకి తీసుకోవచ్చు. ఆర్థిక, పారిశ్రామిక పరిస్థితిని పునరుద్ధరించేందుకు ఆర్థికరంగ నిపుణులు ఒకరిని కూడా సలహాదారుగా నియమించుకోవచ్చు. 4. ప్రత్యేక హక్కుల చట్టంతో సైన్యాన్ని తీసుకురావద్దు. ప్రజాస్వామ్య దేశంలో ఒక రాష్ట్రాన్ని పాలించలేమన్న సంకేతాన్ని పంపడం అనవసరం. పైగా ఏఎఫ్‌ఎస్‌పీఏతో సైన్యాన్ని దింపితే అది పాత గాయాలను మళ్లీ రేపవచ్చు. 5. క్షేత్రస్థాయి పోలీసింగ్‌ మళ్లీ మొదటి నుంచి మొదలుపెట్టాలి. అవసరమైతే జిల్లా మేజిస్ట్రేట్‌లు, ఎస్పీలను డిప్యుటేషన్‌పై బయటి రాష్ట్రాల నుంచి తీసుకురావచ్చు.

6. ఆయుధాలు ఎత్తుకెళ్లిన వారిని 'సిట్‌'లు అరెస్ట్‌ చేసేలా చూడాలి. దుండగుల చేతుల్లో 4,500 ఆయుధాలున్నాయంటే మణిపుర్‌ ఇప్పుడు సాయుధ రాష్ట్రమనే లెక్క. ఆయుధాలు ఎత్తుకెళ్లిన వారి పేర్లు వెల్లడించకపోతే తగిన చర్యలుంటాయని పోలీసులను హెచ్చరించాలి. దోపిడి సమయంలో అక్కడే ఉన్నవారిపై చట్టపరమైన విచారణ జరగాలి. 7. మిలిటెంట్లకు వ్యతిరేకంగా భద్రతాదళాలు తీసుకుంటున్న చర్యలకు విఘాతం కలిగిస్తున్న మహిళా వర్గాలపై కఠినమైన చర్యలు తీసుకోవాలి. తగినంత మంది మహిళ అధికారిణులు, సిబ్బందిని ఈ కార్యక్రమాల కోసం ఉపయోగించాలి. 8. నిందితుల విచారణకు ప్రత్యేక న్యాయస్థానాలు, నేర విచారణ బృందాలను ఏర్పాటు చేయాలి. తమకు న్యాయం జరుగుతుందన్న నమ్మకం బాధితుల్లో కలిగించేందుకు ఇది అత్యవసరం. 9. కుకీ మిలిటెంటు గ్రూపులు ఇరవై ఐదింటిపై చర్యలను నిలిపి వేయడంపై ఉన్న గందరగోళాన్ని తొలగించాలి. పద్నాలుగు క్యాంపుల్లోని 2,200 మంది కేడర్‌ వద్ద ఉన్న ఆయుధాలను సమీక్షించాలి. కుకీ, మైతేయి మిలిటెంట్లు ఏర్పాటు చేసుకున్న బలవంతపు వసూళ్ల చెక్‌ పోస్టులను పెకిలించాలి. నల్లమందు మాఫియాపై స్థానిక పోలీసులు కఠిన చర్యలకు దిగాలి. ఈ మాఫియాలో కొందరు రాజకీయ నేతలూ మిలాఖత్‌ అయి ఉన్నారు. డ్రగ్‌ మాఫియాకు వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడుతున్న అదనపు ఎస్పీ థౌనావోజామ్‌ బృందం తనకు తగిన మద్దతు లేదని రాజీనామా చేయాల్సి వచ్చింది. ఇటువంటి వారిని మళ్లీ నియమించుకుని డ్రగ్‌ మాఫియా ఆటలు కట్టేలా చూడాలి. 10. నిరాశ్రయులైనవారు మళ్లీ తమ ఇళ్లకు చేరుకునేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలి. ఇందుకు రాష్ట్ర ఖజానా నుంచి ఖర్చు చేయాలి.

పాలన యంత్రాంగ చక్రాలు కదలడం మొదలై, అది ప్రజలకు స్పష్టంగా కనిపించడం మొదలుపెట్టిన తరువాత రెండో దశ కార్యకలాపాలకు శ్రీకారం చుట్టాలి. పోలీసు కౌన్సిల్స్‌ ఏర్పాటు చేసి అందులో తటస్థులైన విద్యావేత్తలు, జర్నలిస్టులు, పౌర సమాజపు సభ్యులను చేర్చాలి. గతంలో భయంతో లేదా తమ తెగలకు నిబద్ధంగా ఉండాలన్న కారణంతో కొందరు సభ్యులు రాజీనామా చేశారు. తటస్థులను సభ్యులుగా చేయడం ద్వారా శాంతి స్థాపన సాధ్యం.

చివరగా... ఘర్షణల సమయంలో ఇతరుల ప్రాణాలు కాపాడేందుకు తెగువ చూపిన వారిని బహిరంగంగా గౌరవించాలి. కుకీలున్న చోట మైతేయిలను, మైతేయిల ప్రాబల్యం ఉన్న చోట కుకీలను కాపాడిన ఘటనలు కోకొల్లలు. 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఎర్రకోట నుంచి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ మణిపుర్‌ సంక్షోభాన్ని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ పరిష్కారం దీర్ఘకాలికమైందిగా ఉండాలి. ప్రతి తెగకూ తమ బాధలు చెప్పుకునేందుకు అనువైన వేదిక, ప్రాతినిధ్యం కల్పించాలి. అప్పుడు మాత్రమే ఉగ్రవాదులు ఆయుధాలు వదిలేయడం సాధ్యమవుతుంది. కంచెలు, కందకాలు తొలగిపోతాయి.

కేంద్ర మాజీ సమాచార కమిషనర్, విశ్రాంత ఐపీఎస్‌ అధికారి, డీప్‌స్ట్రాట్‌ ఛైర్మన్‌
('ది ఇండియన్‌ ఎక్స్‌ప్రెస్‌' సౌజన్యంతో)

సోషల్‌ నెట్‌ వర్కింగ్‌ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్‌ మీడియా

చారిత్రక సందర్భం



చంద్రయాన్‌–3తో విజయవంతంగా చంద్రుడి మీద దిగినందుకు ఇండియాకూ, ఇస్రో బృందానికీ నా హృదయపూర్వక అభినందనలు. ఇది ఇండియాకే కాదు, మొత్తం ప్రపంచానికే చారిత్రక దినం.

– ఫిలిప్‌ అకర్‌మాన్, భారత్‌లో జర్మనీ రాయబారి

అద్భుత విజయం



అద్భుతమైన విజయంతో చంద్రుడి దక్షిణ ధ్రువంలో దిగిన మొదటి దేశం అయినందుకు ఇండియాకూ, 'ఇస్రో'కూ హృదయపూర్వక అభినందనలు. అంతరిక్షాన్ని తరచిచూడటంలో మీ కార్యదీక్ష మా అందరినీ 'మూన్‌స్ట్రక్‌' (ఉన్మత్తులను) చేసింది.

– నవోర్‌ గిలాన్, భారత్‌లో ఇజ్రాయిల్‌ రాయబారి

ఎందుకో తెలియొద్దా?



బిల్లును తిప్పిపంపినప్పుడు పార్లమెంటుకు/ప్రభుత్వానికి రాష్ట్రపతి ఒక లేఖను పంపాల్సిన అవసరం లేదని కొంద రంటారు. కానీ ఆయనో, ఆయన కార్యదర్శో లేఖ రాయకపోతే, బిల్లు మీద ఆయన అభ్యంతరాలను పార్లమెంట్/ప్రభుత్వం ఎలా తెలుసుకుంటుంది? అభ్యంతరాలను పేర్కొనకుండా కేవలం అలా తిప్పిపంపలేడు కదా?

– మార్కండేయ కట్జూ, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి

గర్వకారణం



నా క్లినిక్‌ ఈ రోజు (ఆగస్ట్‌ 23) సాయంత్రం 5:45 నుంచి 6:15 మధ్య తాత్కాలికంగా మూసివుంటుంది. ప్రజ్ఞాన్‌ (చంద్రయాన్‌–3 రోవర్), ప్రజ్ఞాన్‌ (చదరంగ బాలమేధావి) మన దేశానికి గర్వ కారణం.

– పి. కామత్, గుండె వైద్యుడు

ఆట కాదు!



చంద్రయాన్‌–3 విజయం పట్ల భారతీయులం ఆనందపడుతూనే, ఒక చరిత్ర పాఠాన్ని మనసులో ఉంచుకోవాలి. చంద్రుడి మీద 64 ఏళ్ల క్రితం విజయవంతంగా దిగిన మొదటి దేశం రష్యా. అయినప్పటికీ వారి చివరి మిషన్‌ విఫలమైంది. అంతరిక్షమనేది కఠినమైనది. అదేమీ క్రీడ కాదు. దాన్నో సైన్స్‌ మిషన్‌లా కాకుండా, ఐపీఎల్‌ మ్యాచులా చూడకూడదు.

– గౌరవ్‌ సబ్నిస్, అసోసియేట్‌ ప్రొఫెసర్‌

జోక్యం ఎందుకు?



ఫేస్‌బుక్‌ స్వతంత్ర ఫ్యాక్ట్‌ చెకర్స్‌ను కలిగివుందనీ, అది అన్ని దృక్కోణాలను స్వాగతిస్తుందనీ, ఎన్నికల్లో జోక్యం చేసుకోదనీ మార్క్‌ జుకర్‌బెర్గ్‌ చెబుతారు. కానీ జాతీయ ప్రజాభిప్రాయ సేకరణ సమయంలో – తమ శత్రువుల మీద సెన్సార్‌షిప్‌ విధించాలని డిమాండ్‌ చేసే యాక్టివిస్టులకు ఫేస్‌బుక్‌ నిధులు కూర్చిందని ఒక పరిశోధన కనుగొంది.

– మైకేల్‌ షెలెన్‌బెర్గర్, అమెరికా రచయిత

ఉండిపోతాం!



ఇతరుల మీద మీరు కలిగించే ప్రభావాన్ని తక్కువ అంచనా వేయొద్దు. నేను ఇప్పటికీ ఒక యూట్యూబ్‌ వీడియోలో చూపించినట్టుగా పాస్తా వండుతాను. నేను నా స్నేహితురాలికి క్రిస్మస్‌ కానుకగా ఇచ్చిన అదే బ్రాండ్‌ చాక్లెట్లను తను ఇప్పటికీ కొంటుంది. కొందరు వాళ్ల 'మాజీలు' విన్న సంగీతాన్ని ఇప్పటికీ వింటుంటారు. జనాలు వెళ్లిపోవచ్చు, కానీ జ్ఞాపకాలు ఉండి పోతాయి.

– పెర్రీ, బ్లాగర్‌

అభ్యుదయ గోపురం

ప్రజా ఉద్యమంలో పుట్టి వేద భారతాన్ని అన్వేషించిన అక్షర వాచస్పతి దాశరథి రంగాచార్యులు. రాముడిని ఆరాధ్య దైవంగా, మార్క్స్‌ను మహాత్ముడిగా కొలిచిన ఆయన సంప్రదాయ పునాదుల మీద పెరిగిన అభ్యుదయ గోపురం. తెలుగు నాట కథ, కవిత, నవల, జీవిత చరిత్ర, విమర్శ, అనువాదం వంటి ప్రక్రియలలో విశేష కృషి చేశారు. తెలంగాణ సాయుధ పోరాట కాలంలో ఆనాటి ప్రజల కడగండ్లను తన నవలల ద్వారా కళ్ళకు కట్టినట్టు చిత్రీకరించారు.

రంగాచార్య 1928 ఆగస్టు 24న మహబూబాబాద్‌ జిల్లా చిన్న గూడూరు గ్రామంలో జన్మించారు. 12 ఏళ్ల వయసులోనే నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఓనమాలు నేర్చుకున్నారు. 'ఆంధ్ర మహాసభ', 'ఆర్య సమాజ్‌' పోరాటాలకు ఆకర్షితులై ఎన్నో ఉద్యమాలు చేసి జైలు శిక్ష అనుభవించారు. తెలంగాణ సాయుధ పోరాట విరమణ తర్వాత ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా, గ్రంథాలయ నిర్వాహకులుగా కొంతకాలం పని చేశారు. ఆ తర్వాత సికింద్రాబాద్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌లో 32 ఏళ్ళు ఉద్యోగం చేసి అసిస్టెంట్‌ కమిషనర్‌ హోదాలో పదవీ విరమణ పొందారు.



దాశరథి రంగాచార్య

దాశరథి రంగాచార్య రచించిన గొప్పల నవల 'చిల్లర దేవుళ్ళు' నిజాం కాలపు భూస్వాముల ఆగడాలను దృశ్యమానం చేసింది. ఈ నవలకు కొనసాగింపుగా 'మోదుగుపూలు' రాశారు. నియంతృత్వ వ్యవస్థకు ప్రతినిధులుగా నిలిచిన పోలీస్‌ అధికారులు, జమీందార్ల అరాచకాలనూ, సామాన్య జనాల దయనీయమైన స్థితిగతులనూ ఇందులో చిత్రించారు. తెలంగాణ సాయుధ పోరాటం అనంతర పరిస్థితులను 'జనపదం' నవలలో అక్షరీకరించారు. తన ఆత్మ కథకు అక్షరూపంగా 'జీవనయానం' రచించారు. భారత, భాగవత, రామాయణాలనే కాదు... భారతీయ తాత్విక మూలాలు అయిన వేదాలను సైతం 'చతుర్వేద సంహిత' పేరుతో వ్యవహారిక వచనంలో అనువదించారు.

సాహితీ ప్రస్థానంలో అలుపెరుగని యోధుడు అయిన దాశరథి 2015 జూన్‌ 8న తుది శ్వాస విడిచారు. ఆయన రగిలించిన స్ఫూర్తి మాత్రం నవదీప్తిగా రగులుతూ ఉంటుంది.

– అంకం నరేష్‌; టీచర్, నిజామాబాద్‌
(నేడు దాశరథి రంగాచార్య జయంతి)

తిప్పలు లేకుంటనే టికిట్లు

అట్లుంటది



తెలిదేవర భానుమూర్తి

పొద్దు మీకింది. మొగులు మీద చుక్కలు ఎల్లినయి. వాడకట్టుల దీపాలు ఎల్గినయి. ట్రాఫిక్‌తోని తొవ్వలు మెస్ల కుంటున్నయి. జెనంతోని సిన్మతేటర్లు చీమల పుట్టల లెక్కున్నయి. ఇంటికి పోబుద్దిగాని సర్కార్‌ జీతగాల్లు హోటల్ల గూసోని ముచ్చట బెడుతున్నరు. గుడికాడ బిచ్చపోల్లు బిచ్చమడుక్కుంటున్నరు. ఒక్కపారే సిటి బస్సులు సోల్పుత బోతున్నయి. ఎప్పటి తీర్గనే ఆనంద్‌ బాగ్‌ చౌరస్త కాడ్కి బోయిన. గాడ రవి పాన్‌ డబ్బ ఉన్నది. గది మా దోస్తుల అడ్డ. పొద్దు మీకంగనే మా దోస్తులందరు పాన్‌ డబ్బ కాడ జమైతరు. పాన్లు దినుకుంట సిగిలేట్లు దాక్కుంట ముచ్చట బెడుతుంటరు. గీ దాని మీద గా దాని మీద అనకుంట అన్నిటి మీద గాల్లు మాట్లాడుతుంటరు. గని రాజకీయాల మీదనే ఎక్వ ముచ్చట బెడుతుంటరు. రాజకీయాల మీద ముచ్చట బెట్టుకుంట నువ్వెంత అంటె నువ్వెంత అనుకుంట మాటలతోనే కొట్లాడుతుంటరు. గా దినం నేను బోకముందు గాల్లు ఏం ముచ్చట బెట్టింర్రో నాకెర్క లేదు. గని నేను బోయినంక గీ తీర్గ మాట్లాడుకున్నరు.

''ఎలచ్చన్లు దగ్గర బడుతుంటె అన్ని పార్టిలల్ల ఎమ్మెల్యే టికిట్ల కోసం కోషిస్‌ జేసెటోల్లు ఎక్వ అయ్యింర్రు'' అని యాద్గిరి అన్నడు.

''సిట్టింగ్లందర్కి టికిట్లు ఇస్తమని కేసీఆర్‌ అన్నడు గదా! మల్ల టికిట్ల కోసం కోషిస్‌ జేసేదేమున్నది'' అని సత్నారి అన్నడు.

''కేసీఆర్‌ గట్ల అన్నంక గూడు బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యేలు ఏం జెయ్యాలె? ఏం జేస్తె టికిట్‌ వొస్తదని ఒక్క తీర్గ సోంచాయించబట్టింర్రు.''

''సోంచాయించి గాల్లు ఏం జేసింర్రు?''

''ఒక ఎమ్మెల్యే గాచారం జూసేటి పంతులు తాన్కి బోయిండు. చెయ్యి సూబెట్టుకుండు. నాకు ఎమ్మెల్యే టికిట్‌ రావాలంటె ఏం జెయ్యాలని అడిగిండు. నువ్వు టికిట్‌ ప్రాప్తి యాగం జెయ్యి. గా యాగం జేస్తివా అంటె నీకు ఎమ్మెల్యే టికిట్‌ దొర్కుతదని పంతులు జెప్పిండు. ఇగ దాంతోని గా ఎమ్మెల్యే టికిట్‌ ప్రాప్తి యాగం జేసిండు. ఒక ఎమ్మెల్యే యాల పొద్దుగాలే నిద్ర లేసిండు. నెత్తిమీది కెల్లి తానం జేసిండు. కేసీఆర్‌ ఫోట్వకు అబిసేకం జేసిండు. పూజ జేసిండు. ఫోట్వ దీపిచ్చిండు. గా ఫోట్వ పేపర్ల వొచ్చెటట్లు జేస్కుండు. ఒక ఎమ్మెల్యే కేసీఆర్‌ బొమ్మ జేపిచ్చిండు. చిర్తలు దీస్కుండు. 'మదిని నిన్ను నమ్మి కొల్తురా! మా తండ్రీ దయగాను కేసీఆరూ!' అని పాడుకుంట చిర్తలు గొట్టుకుంట బజన జేసిండు. ఇంకొక ఎమ్మెల్యే ఎన్నడు లేనిది జెనం తాన్కి బోబట్టిండు. బాగున్నరా అనుకుంట జెనం మంచిచెడ్డలు అర్సుకోబట్టిండు. గది జేస్త గిది జేస్త అని జెప్ప బట్టిండు. శని మంచిగ సూస్త లేదని ఎర్కగాంగనే ఒక ఎమ్మెల్యే శని దేవునికి పూజలు జెయ్యబట్టిండు. కొంత మంది కవిత ఇంటికి బోయింర్రు. గామెకు ఒక్క తీర్గ మస్క గొట్టింర్రు. కొంతమంది హరీశ్‌ రావు ఇంటికి బోయింర్రు. ఎట్లన్న జేసి ఎమ్మెల్యే టికిట్‌ ఇప్పియ్యమని గాయినను ఒక్క తీర్గ బత్మిలాడింర్రు. గీ తీర్గ ఎమ్మెల్యేలు టికిట్‌ కోసం కోషిస్‌ జేసింర్రు.''



''బీఆర్‌ఎస్‌ ఫస్టు లిస్టు కేసీఆర్‌ రిలీజ్‌ జేసిండు గదా!''

''అవ్‌. శ్రావణ మాసం పంచమి దినాన ధనుర్లగ్నంల బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యేల ఫస్ట్‌ లిస్టును కేసీఆర్‌ రిలీజ్‌ జేసిండు. నూటా పందొమ్మిదిల నూట పదిహేనుమందికి టికిట్లు ఇచ్చింర్రు. నాలుగు సీట్లను పెండింగ్ల బెట్టింర్రు. ఏడు గురికి దప్పిడ్సి అన్న మాట తీర్గ సిట్టింగ్లందర్కి కేసీఆర్‌ టికిట్లు ఇచ్చిండు. కామారెడ్డి, గజ్వేల్‌ నియోజక వర్గంల కెల్లి పోటీ జేస్తనని గాయిన జెప్పిండు. గీపారి తొంబై ఐదుకెల్లి నూటా ఐదు సీట్లల్ల గెలుస్తమని గాయిన అన్నడు. టికిట్లు వొచ్చిన సిట్టింగ్ల కార్యకర్తలు మోటార్‌ సైకిల్ల మీద ర్యాలి దీసింర్రు. ఒకరి మీద ఒకలు బుక్క గులాలు సల్లుకున్నరు. డప్పు సప్పుల్లల్ల డాన్సు జేసింర్రు. పటాకులు గాల్సింర్రు. కోవ పేడలు తినిపిచ్చుకుంర్రు. కేకులు గోసింర్రు. స్టేషన్‌ ఘన్‌పూర్‌ నియోజక వర్గం టికిట్‌ కడియం శ్రీహరికి ఇచ్చింర్రు. సిట్టింగ్‌ ఎమ్మెల్యే రాజయ్యకు ఇయ్యలేదు. ఇగ దాంతోని గాయిన పల్ల పల్ల ఏడ్సిండు. టికిట్‌ రాకున్నా గోడ దుంకే సవాల్‌ లేదని జెప్పిండు. ఖానాపూర్‌ సిట్టింగ్‌ ఎమ్మెల్యే రేఖా నాయక్‌కు టికిట్‌ రాలేదు. దాంతోని గామె కాంగ్రెస్లకు దుంకుతనని జెప్పింది. పెండిగ్ల బెట్టిన నాల్గు నియోజక వర్గాలల్ల జనగాం గూడ ఉన్నది. గాడ యాదగిరి రెడ్డి సిట్టింగ్‌ ఎమ్మెల్యే. పల్లా రాజేశ్వర రెడ్డి, పోచంపల్లి శ్రీనివాస్‌ రెడ్డి గూడ జనగాం టికిట్‌ కోసం ఒక్క తీర్గ కోషిస్‌ జేస్తున్నరు. నా బిడ్డను, అల్లున్ని నా కిలాఫ్‌ జేసి నాకు టికిట్‌ రాకుంట రాజేశ్వర్‌ రెడ్డి కుట్ర జేస్తున్నడని యాదగిరి రెడ్డి అన్నడు. టికిట్లు ఇచ్చేముంగట గాయిన కవిత ఇంటికి బోయినా పాయిద లేకుంట బోయింది.''

గీ తీర్గ మా దోస్తులు ముచ్చట బెట్టింర్రు.

రచయిత సీనియర్‌ జర్నలిస్ట్‌ | 99591 50491

నగుమోము

దేహమే దేవాలయం అనీ, జీవుడే సనాతన దైవం అనీ భారతీయ తాత్విక చింతనలో ఓ పాయ చెబుతోంది. అయితే ఆ జీవుడు సంతోష, విచారాలతో దోబూచులాడటమే జీవితం అంతా కనిపిస్తుంది. ఎప్పుడూ సంతోషంగా ఉండాలనే ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. కానీ మనిషి సామాజిక జీవి కాబట్టి తానున్న పరిస్థితులూ, కోరికలూ అతడి సంతోష, విషాదాలను నిర్ణయిస్తాయి. 'స్వేచ్ఛగా పుట్టిన మానవుడు ఎక్కడ చూసినా బంధనా బద్ధుడే'ననే పాశ్చాత్య చింతనాపరుల మాట ఇక్కడ గమనంలో ఉంచుకోవాలి.

కొందరు ఎప్పుడూ నగుమోముతో కనిపిస్తారు. మరికొందరు విచార వదనంతో కనిపిస్తారు. నవ్వుతూ కనిపించిన వారికి అసలు సమస్యే లేదని అనుకోకూడదు. అలాగే విచార వదనంతో కనిపించినవారికి తలకు మించిన సమస్యలు ఉన్నాయనీ అనుకోకూడదు. ఈ భూమ్మీద పుట్టిన ప్రతి జీవికీ ఏదో ఒక సమస్య ఉంటుంది. ఎవరన్నా లేదంటే మంచిదే అనుకోవాలి. సంతోషమనేది ఓ మానసిక స్థితి. కష్టం ముంచుకొచ్చిందని బాధపడుతూ ముడుచుకుపోతే మోయలేని భారాన్ని మోయవలసి వస్తుంది. అంతే తప్ప సమస్యేమీ తగ్గిపోదు. పోనీ నవ్వమంటున్నారు కదాని నవ్వితే సమస్య పారిపోతుందా? లేదు. కానీ నవ్వినప్పుడు మనసు ప్రశాంతతను పొందుతుంది. మనం సంతోషంగా నవ్వుముఖంతో ఉంటే ఇతరులు మన సాన్నిహిత్యాన్ని కోరుకుంటారు. ఫలితంగా మంచి సామాజిక సంబంధాలు ఏర్పడతాయి. మన దేహం ఈ లోకాన్ని వదిలి వెళ్లినా... మన నగుమోము మాత్రం చాలామందికి చిరకాలం గుర్తుండిపోతుంది .



జ్యోతిర్మయం

– యామిజాల జగదీశ్‌



2019-2023

➤ 2019లో చివరి నిమిషంలో చంద్రయాన్–2 ఫెయిల్ అయిన సందర్భంలో అప్పటి ఇస్రో చీఫ్ కె.శివన్ కన్నీటిపర్యంతమయ్యారు. ఆయన్ను ప్రధాని మోదీ ఓదార్చారు. అప్పట్లో ఈ చిత్రం అందరినీ కదిలించింది. ఇప్పుడు అదే శివన్ నవ్వుతూ మాట్లాడుతున్న దృశ్యాలూ అందరినీ ఆకట్టుకున్నాయి. నాలుగేళ్లుగా ఈ విజయం కోసం ఎదురుచూశానన్న శివన్.. దేశ ప్రజలకు, ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు.

కేసీఆర్ కేన్సర్ కంటే ప్రమాదకారి

- ఆయనదంతా పెగ్గుల బాగోతమే..
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థుల జాబితా దండుపాళ్యం ముఠాను తలపిస్తోంది
- కాంగ్రెస్‌లోని 30 మంది ఎమ్మెల్యే అభ్యర్థులకు డబ్బులు పంపాడు
- ఆస్తులు అమ్ముకునేందుకే ఆర్టీసీ విలీనం
- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ సంచలన వ్యాఖ్యలు



చేవెళ్ల సమ్మేళనంలో మాట్లాడుతున్న బండి సంజయ్



చంద్రయాన్-3 విజయంతో కిషన్‌రెడ్డి, లక్ష్మణ్ సంబురాలు

చేవెళ్ల: కేన్సర్ కంటే ప్రమాదకారి కేసీఆర్ అని బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ అన్నారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్లలోని సీహెచ్ఆర్ గార్డెన్‌లో బుధవారం నియోజకవర్గస్థాయి పోలింగ్‌బూత్ సమ్మేళనం ఎస్సీ నియోజకవర్గాల ఇన్‌చార్జ్, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. సమావేశానికి మాజీఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, కర్ణాటక ఎమ్మెల్యే చంద్రప్ప, రాష్ట్ర అధికార ప్రతినిధి విఠల్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ కేసీఆర్‌ను మొదటిసారి ఓటు వేసి గెలిపిస్తే మోసం చేశాడని, రెండోసారి నమ్మి ఓటేస్తే భూములన్నీ అమ్మేసి రాష్ట్రాన్ని దోచుకొని అప్పులకుప్ప చేశాడని, మూడోసారి కూడా గెలిపిస్తే కేన్సర్ మూడోదశలో ఎంత ప్రమాదకరమో అంతకుమించి ఉంటుందని విమర్శించారు. ఆయనదంతా పెగ్గుల బాగోతం తప్ప చేసిందేమీ లేదన్నారు. ఒక పెగ్గు వేస్తే దళితుడే సీఎం అంటాడు.. రెండో పెగ్గు వేస్తే దళితులకు మూడెకరాలంటాడు.. మూడో పెగ్గు వేస్తే దళితబంధు ఇస్తానంటాడు.. నాలుగో పెగ్గు వేసి హామీలన్నీ అమలు చేస్తానని చెబుతాడు.. ఐదో పెగ్గు వేసి అన్నీ తూచ్ నేనెప్పుడు అన్నానంటాడని ఎద్దేవా చేశారు. ఇటీవల ప్రకటించిన ఎమ్మెల్యేల జాబితా చూస్తుంటే దండుపాళ్యం ముఠాలా ఉందని.. వారిలో సగం మందికి పైగా బీఫాంలు ఇవ్వకుండా చేసేందుకు ఎత్తుగడ చేశారని పేర్కొన్నారు. కాంగ్రెస్‌లోని 30 మంది ఎమ్మెల్యే అభ్యర్థులకు కేసీఆర్ డబ్బులు పంపాడని, గెలవగానే వారంతా బీఆర్ఎస్‌లోకి జంప్ అవుతారని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆర్టీసీ విలీనం పెద్దకుట్ర అని.. సంస్థ ఆస్తులు అమ్ముకునేందుకు ఎంఐఎంతో కలిసి కుట్ర చేస్తున్నాడని ఆరోపించారు. చేవెళ్లలో నిర్వహించిన ఈ మొదటి సభతోనే బీజేపీ గెలుపుఖాయమని పెద్ద సంఖ్యలో వచ్చిన కార్యకర్తలను చూస్తేనే తెలుస్తోందన్నారు.

ఆ రెండు పార్టీలు ఒక్కటే : కిషన్‌రెడ్డి

బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ ఒక్కటేనని, ఈ రెండు పార్టీలకు ఓటేస్తే మజ్లిస్ నాయకత్వాన్ని బలపరిచినట్టేనని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. దళితులను మోసం చేసి వెన్నుపోటు పొడిచిన కేసీఆర్‌ను ఓడించాలని.. దళితులెవరూ ఓట్లు వేయొద్దని పిలుపునిచ్చారు. దళితబంధులో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మాఫియాగా ఏర్పడి 30శాతం కమీషన్లు దండుకొని దళితుల పొట్ట కొట్టారని ఆరోపించారు. లిక్కర్ కేసు నుంచి తప్పించుకునేందుకు ఢిల్లీలో దొంగ దీక్షలు చేసిన కేసీఆర్ కుటుంబం, మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కావాలని చేసిన పోరాటం ఉత్తదేనన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థుల ప్రకటనలో మహిళలకు కేటాయించిన స్థానాలు చూస్తేనే తెలుస్తోందన్నారు. ఇప్పటికైనా కేసీఆర్ తప్పుచేశానని ఒప్పుకొని ముక్కు నేలకు రాయాలన్నారు. వచ్చే 90 రోజుల్లో జరిగే ఎన్నికల్లో కేసీఆర్ అవినీతి, ప్రజాదోపిడీని ఎండగడుతూ వారసత్వపార్టీ అయిన బీఆర్ఎస్ నుంచి ప్రజలను రక్షించుకునేందుకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఇంకా సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు భాష, రాష్ట్ర నాయకులు అశ్వత్థామరెడ్డి, కంజర్ల ప్రకాశ్, జంగారెడ్డి, ప్రతాప్, శ్రీకాంత్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, జిల్లా నేతలు వీరేందర్‌గౌడ్, విజయ్‌కుమార్ ఉన్నారు.

ఉద్యమంగా కేసీఆర్ హఠావో: కె.లక్ష్మణ్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ మలిదశ ఉద్యమం మొదలైందని 'కేసీఆర్ హటావో-తెలంగాణ బచావో-బీజేపీ జితావో'నినాదంతో ముందుకు సాగుతున్నట్లు బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు కె.లక్ష్మణ్ అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు, హామీలు నెరవేర్చాలని ఎమ్మెల్యేల క్యాంప్ కార్యాలయాలు ముట్టడి చేసినట్లు తెలిపారు. ఉద్యమంగా కేసీఆర్ హఠావో కార్యక్రమం సాగుతుందన్నారు. రుణమాఫీ, డబుల్ బెడ్రూం, పథకాల అమలు, బీసీ బంధు కోసం ప్రజలు తిరగబడితే ప్రజల మీద, బీజేపీ కార్యకర్తల మీద లాఠీచార్జ్ చేశారని లక్ష్మణ్ మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే శ్రీధర్‌తో పాటు వందల మంది నాయకులు, కార్యకర్తలకు తీవ్ర గాయాలయ్యాయన్నారు. నయా నిజాం కేసీఆర్ రజాకార్ల మాదిరి దాడి చేస్తున్నారని, హ్యాట్రిక్ అనుకుంటే కేసీఆర్‌కు ఏ సర్వే చూసినా డకౌట్ అని తేలడంతో నిరాశ, నిస్పృహలకు లోనై ఆదర బాదరగా అభ్యర్థుల ప్రకటన చేశారని ఎద్దేవాచేశారు. దళితబంధులో ఎమ్మెల్యేలు 30 శాతం కమీషన్ తీసుకుంటున్నారని చెప్పి ఇప్పుడు వాళ్లకే టికెట్లు ఎలా ఇస్తారని లక్ష్మణ్ ప్రశ్నించారు. మంత్రులు లక్షల కోట్లు సంపాదించారని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. సమావేశంలో ఎస్.కుమార్, ప్రేమేందర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, మాగం రంగారెడ్డి, రాహుల్ పాల్గొన్నారు.

ముంపుపై ఏం చర్యలు తీసుకున్నారో చెప్పండి?



సాక్షి, హైదరాబాద్: ప్రాజెక్టుల నిర్మాణ సమయంలో వరదల కారణంగా తలెత్తే నష్ట నివారణకు ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలని కేంద్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలను హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు కేంద్ర హోంశాఖ కార్యదర్శి, కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ శాఖ కార్యదర్శి, జలశక్తి మంత్రిత్వ శాఖ కార్యదర్శి, జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ కార్యదర్శితో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను 4 వారాలకు వాయిదా వేసింది. నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణాల కారణంగా తరచుగా వచ్చే వరదలు వస్తున్నాయని, వీటిని అరికట్టడానికి నివారణ చర్యలు తీసుకునేలా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలను ఆదేశించాలని కోరుతూ తెలంగాణ జన సమితి (టీజేఎస్) అధ్యక్షుడు కోదండరాం హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ వినోద్‌కుమార్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది ఎన్ఎస్ అర్జున్‌కుమార్ వాదనలు వినిపిస్తూ.. ఇదే అంశంతో సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశామని, అయితే తెలంగాణ హైకోర్టును ఆశ్రయించాలని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించిందని చెప్పారు. తెలంగాణలో కాళేశ్వరం, ఏపీలో పోలవరం నిర్మాణం కారణంగా మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, పెద్దపల్లి, కొమురం భీం జిల్లాల్లోని పలు ప్రాంతాలు ముంపునకు గురై ఆస్తి, పంట నష్టం వాటిల్లిందన్నారు. కొన్నిసార్లు ప్రాణ నష్టం కూడా జరుగుతోందని వెల్లడించారు. అయినా రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో జరిగిన నష్టాన్ని లెక్కించడం, బాధితులకు నష్టపరిహారం చెల్లించడం, మంచిర్యాల, భద్రాచలం పట్టణాల వద్ద తగిన రక్షణ గోడలు నిర్మించడం.. వంటి చర్యలు చేపట్టడం కోసం ఓ కమిటీని వేసేలా ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తిచేశారు.

ఎప్పట్లోగా సీఐసీ, ఐసీలను నియమిస్తారు?: హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ (సీఐసీ), సమాచార కమిషనర్ల (ఐసీ)నియామకం ఎప్పుడు చేపడతారో తేదీ చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. 4 వారాలు గడువిస్తున్నామని, అప్పటిలోగా నియామక తేదీ వెల్లడించాలని స్పష్టం చేసింది. సీఐసీ, ఐసీ పోస్టులు ఖాళీగా ఉన్నా ప్రభుత్వం నియామకం చేపట్టడం లేదంటూ హైకోర్టులో ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ పిల్ దాఖలు చేసింది. ప్రజల దరఖాస్తులు పెద్ద ఎత్తున పేరుకుపోతున్నాయని, సమస్యలు పరిష్కారం కాక వారు ఇబ్బంది పడుతున్నారని పేర్కొంది. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ వినోద్‌కుమార్ ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ చేపట్టింది. ప్రభుత్వం తరఫున స్పెషల్ జీపీ సంతోశ్‌కుమార్ వాదిస్తూ.. ఇప్పటికే నియామక ప్రక్రియ చేపట్టామని చెప్పారు. దరఖాస్తుల కోసం గత నెల 3న ప్రకటన ఇవ్వగా.. సీఐసీకి 40, ఐసీలకు 273 దరఖాస్తులు వచ్చాయని వివరించారు. వీటిని పరిశీలించి తగిన వారిని ఎంపిక చేస్తామని వెల్లడించారు.

'కృష్ణా'లో చుక్కెదురు

- తెలంగాణకు 6.04 టీఎంసీలు
- తాగునీటి అవసరాల కోసమే విడుదలకు కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ సిఫారసు

సాక్షి, హైదరాబాద్: శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల నుంచి తాగునీటి అవసరాల కోసం సెప్టెంబర్ 30 తేదీ వరకు తెలంగాణకు 6.04 టీఎంసీలు, ఏపీకి 25.29 టీఎంసీల నీటిని విడుదల చేయాలని కృష్ణాబోర్డు ఆధ్వర్యంలోని త్రిసభ్య కమిటీ సిఫారసు చేసింది. ఈనెల 21న హైదరాబాద్‌లోని జలసౌధలో జరిగిన త్రిసభ్య కమిటీ సమావేశంలో కన్వీనర్ డీఎం రాయిపూరే ఈ నిర్ణయం తీసుకున్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టులో 15.609 టీఎంసీలు, శ్రీశైలంలో 58.865 టీఎంసీల లభ్యత మాత్రమే ఉందని, ఇండెంట్లలో కోరిన విధంగా తాగు, సాగునీటి అవసరాల కోసం రెండు రాష్ట్రాలకు కేటాయింపులు చేసేందుకు నిల్వలు సరిపోవని త్రిసభ్య కమిటీ అభిప్రాయపడింది. తీవ్ర వర్షాభావం నెలకొని ఉండడంతో ప్రస్తుత నీటి సంవత్సరంలో ఎగువ నుంచి ఆశించిన మేర వరద వచ్చే అవకాశం లేదని పేర్కొంది. ఈ నేపథ్యంలో తాగునీటి అవసరాలకు మాత్రమే నీటి కేటాయింపులు జరపాలని నిర్ణయం తీసుకుంది.

ఇప్పటికే తెలంగాణ 12 టీఎంసీలు, ఏపీ 7 టీఎంసీలు వాడుకున్నాయి

ప్రస్తుత నీటి సంవత్సరం ప్రారంభం నుంచి ఈ నెల 16వ తేదీ వరకు ఏపీ 7.427 టీఎంసీ లు, తెలంగాణ 12.595 టీఎంసీలు కలిపి మొ త్తం 20.022 టీఎంసీల కృష్ణా జలాలను వినియోగించుకున్నట్టు త్రిసభ్య కమిటీ చెప్పింది.

- నాగార్జునసాగర్ కుడికాల్వ ద్వారా ఏపీ 3.592 టీఎంసీలు, శ్రీశైలం నుంచి పోతిరెడ్డిపాడు ద్వారా 2.088 టీఎంసీలు, సీడబ్ల్యూఎస్(తాగునీటి పథకం) ద్వారా 1.748 టీఎంసీలను ఏపీ వాడుకున్నట్టు పేర్కొంది.
- నాగార్జునసాగర్‌ప్రాజెక్టు నుంచి జంట నగరాల తాగునీటి అవసరాలకు 3.493 టీఎంసీలు, ఏఎంఆర్‌పీ ద్వారా 2.921 టీఎంసీలు, ఎడమకాల్వ ద్వారా 1.536 టీఎంసీలు కలిపి మొత్తం 7.95 టీఎంసీలను తెలంగాణ వాడుకుంది. శ్రీశైలం నుంచి కల్వకుర్తి ఎత్తిపోతల ద్వారా 3.771 టీఎంసీలు, తాగునీటి కోసం 0.874 టీఎంసీలను తెలంగాణ వాడుకుంది.

కృష్ణాబోర్డుకు లేఖ: కోటికి పైగా జనాభా కలిగిన హైదరాబాద్ అవసరాలకు కేవలం 4.8 టీఎంసీలను నాగార్జునసాగర్ నుంచి కేటాయించడం పట్ల తెలంగాణ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు తెలంగాణ నీటిపారుద ల శాఖ ఈఎన్‌సీ సి.మురళీధర్ కృష్ణా బోర్డుకు లేఖ రాసినట్టు తెలిసింది. కృష్ణా బోర్డు నిర్ణయంతో తెలంగాణలో తీవ్ర తా గునీటి సమస్యలు ఉత్పన్నం అవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు.

సెప్టెంబర్ 30 వరకు తాగునీటి అవసరాలకు నీటి విడుదల ఇలా (టీఎంసీల్లో)

రాష్ట్రం	నాగార్జునసాగర్	శ్రీశైలం	మొత్తం
ఏపీ	6	19.29	25.29
తెలంగాణ	4.8	1.24	6.04

రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారు



కోదాడ: పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ అప్పుల కుప్పగా మార్చారని, దేశంలో మద్యం వినియోగంలో తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానంలో ఉందని నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కోదాడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో 50 లక్షల మంది ఉన్న ముదిరాజ్‌లకు బీఆర్ఎస్ ఒక్క సీటు కూడా ఇవ్వలేదని, 12 శాతం ఉన్న ముస్లింలకు మూడు సీట్లు ఇచ్చారని, వీటిలో రెండూ ఓడిపోయే సీట్లేనని జోస్యం చెప్పారు. 2018 ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు 3,016 రూపాయల నిరుద్యోగ భృతి ఇస్తానని చెప్పిన కేసీఆర్ నేటికి 16 రూపాయలు కూడా ఇవ్వలేదన్నారు. రాష్ట్రంలో 25 లక్షల మంది నిరుద్యోగులను మోసం చేసిన కేసీఆర్‌కు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. 10 సంవత్సరాల కాలంలో ఒక్క డీఎస్సీ కూడా వేయలేదని విమర్శించారు. కోదాడ ఎమ్మెల్యే అవినీతిలో కూరుకుపోయాడని, ఎవరు వెంచర్ వేసినా ఎకరాకు రూ.3 లక్షలు ఇవ్వాల్సిందేనని అన్నారు. మట్టిని కూడా వదలకుండా ట్రాక్టర్‌కు రూ.300, టిప్పర్‌కు వెయ్యిరూపాయలు వసూలు చేశాడని ఆరోపించారు. కోదాడను గంజాయికి కేంద్రంగా మార్చాడని ఇవన్నీ తాను అనడం లేదని.. బీఆర్ఎస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకులు సీఎంకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారని తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ 70 స్థానాలను గెలుచుకుంటుందని, నల్లగొండలో 12 సీట్లలో విజయం సాధించబోతున్నామని ఉత్తమ్ ధీమా వ్యక్తం చేశారు. తాను హుజూర్‌నగర్‌లో, పద్మావతి కోదాడలో పోటీ చేయబోతున్నామని, ఈ మేరకు ఏఐసీసీ, టీపీసీసీ స్థాయిలో నిర్ణయం తీసుకోబోతున్నారని చెప్పారు.

రైతుబంధు సంపూర్ణం

- 11వ విడతలో రూ.7,624.74 కోట్లు అందజేత

సాక్షి, హైదరాబాద్: వానాకాలం సీజన్‌కు సంబంధించిన రైతుబంధు సొమ్ము అందరికీ సంపూర్ణంగా అందిందని వ్యవసాయ శాఖ వెల్లడించింది. 11వ విడతలో రూ.7,624.74 కోట్లు రైతుల ఖాతాల్లోకి చేరిందని, 68.99 లక్షల మంది రైతులకు చెందిన 1.52 కోట్ల ఎకరాలకు రైతుబంధు సొమ్మును పంపిణీ చేశామని పేర్కొంది. అత్యధికంగా నల్లగొండ జిల్లాలో 5.08 లక్షల మంది రైతులకు రూ.609.67 కోట్లు, అత్యల్పంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 35,879 మంది రైతులకు రూ.33.60 కోట్లు అందాయని, రైతును రాజును చేయాలన్న సంకల్పంతో సీఎం కేసీఆర్ ముందుకు సాగుతున్నారని ఆ శాఖ తెలిపింది. కాగా, ఎన్ని ఇబ్బందులున్నా, ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ పూర్తి చేస్తున్నామని వ్యవసాయ మంత్రి నిరంజన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొ న్నారు. రైతుబంధు మొదలుపెట్టినప్పుడు ఎన్నికల కోసం అని విమర్శించారని, అయితే 11వ విడత రైతుబంధును కూడా విజయవంతంగా పూ ర్తిచేశామని ఆయన వివరించారు. ఇన్నేళ్లలో రైతుబంధు ద్వారా రూ.72, 815.09 కోట్లు నేరుగా రైతుల ఖాతాలలోకి వెళ్లినట్లు తెలిపారు. అన్నదాతల గుండెల్లో సీఎం కేసీఆర్ చిరస్థాయిగా నిలుస్తారన్నారు. అన్నం పెట్టే అన్నదాతకు ఆసరాగా నిలవాలన్నదే కేసీఆర్ తపన అని మంత్రి పేర్కొన్నారు. వ్యవసాయానికి ఉచిత కరెంట్, రైతు బంధు, రైతుబీమా పథకాలు ఇవ్వడంతోపాటు వంద శాతం పంటలు కొనుగోలు చేస్తున్న ఏకైక రాష్ట్రం దేశంలో ఒక్క తెలంగాణ మాత్రమే అని నిరంజన్‌రెడ్డి వివరించారు.

27న అమెరికాకు మంత్రి నిరంజన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: వ్యవసాయ శాఖమంత్రి నిరంజన్‌రెడ్డి అమెరికా వెళ్లేందుకు ప్రభుత్వం అనుమతించింది. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. ఈనెల 27 నుంచి సెప్టెంబరు 3 వరకు మంత్రి నేతృత్వంలో అధికారుల బృందం పర్యటించనుంది. 29 నుంచి 31 వరకు ఇల్లినాయిస్ రాష్ట్రంలో జరిగే ప్రతిష్టాత్మక ఫార్మ్ ప్రోగ్రెస్‌షోకు వారు హాజరవుతారు. అమెరికాలో ప్రముఖ వ్యవసాయక రాష్ట్రం లోవా, నార్త్ కరోలినా, వాషింగ్టన్ డీసీలో పర్యటిస్తారు. అమెరికా ఫెడరల్ వ్యవసాయ శాఖ కార్యదర్శి, అమెరికా వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులతో భేటీ కానున్నారు. ఆహార రంగ పరిశ్రమలు, వ్యవసాయ యాంత్రీకరణ, వ్యవసాయ రంగంలో డ్రోన్ల వినియోగం అంశాలపై అధ్యయనం చేస్తారు.

భద్రాద్రి దేవస్థానంలో ఆన్‌లైన్ వసతులు

భద్రాచలం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో ఆన్‌లైన్ వసతి సౌకర్యాలు బుధవారం ప్రారంభమయ్యాయి. గతంలో ఆలయ వెబ్‌సైట్‌లో భక్తులకు ఆర్జిత సేవా టికెట్లను ఆన్‌లైన్‌లో విక్రయించేవారు. దీంతో పాటు వసతిసేవలను దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్ ఇటీవలే హైదరాబాద్‌లో ప్రారంభించారు. అయితే ఈ సేవలు బుధవారం నుంచి https://bhadrachalamtemple.telangana. gov.in వెబ్‌సైట్ ద్వారా అందుబాటులోకి వచ్చాయని ఈవో రమాదేవి తెలిపారు.

క్లుప్తంగా...

బహుజనులు ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టొద్దు



మదన్‌కుమార్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్

నాంపల్లి (హైదరాబాద్): ఆత్మ గౌరవాన్ని తాకట్టుపెట్టి ఆధిపత్య కుల పార్టీల్లో జెండాలు మోసే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ నాయకులు తక్షణమే తమ పదవులకు రాజీనామా చేసి బీఎస్పీలో చేరాలని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. వరంగల్ జిల్లా నర్సంపేటకు చెందిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ గుండాల మదన్‌కుమార్ బీఆర్ఎస్ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసి బీఎస్పీలో చేరారు. ఈ సందర్భంగా ఏసీగార్డ్స్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రవీణ్‌కుమార్ మాట్లాడారు. ఆధిపత్య పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీలు జనాభాలో సింహభాగం కలిగిన బహుజనులకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడంలో, సంపదలో భాగస్వాములను చేయడంలో వివక్ష చూపుతున్నాయని ఆరోపించారు. జనాభాలో 60 శాతం ఉన్న బీసీలకు బీఆర్ఎస్ పార్టీ కేవలం 23 అసెంబ్లీ సీట్లు కేటాయించడం కేసీఆర్ అహంకారానికి నిదర్శనమని దుయ్యబట్టారు. ఆధిపత్య పార్టీల్లో పనిచేసే ఏ నాయకునికైనా రాబోయే రోజుల్లో తాటికొండ రాజయ్యకు పట్టిన గతి పడుతుందని అన్నారు. అనంతరం పార్టీలో చేరిన డాక్టర్ మదన్ కుమార్‌ను బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శిగా నియమిస్తూ ఉత్తర్వులు అందజేశారు.

కేసీఆర్ నాయకత్వంలో పనిచేస్తాం: కడియం

యాదగిరిగుట్ట: స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో గులాబీ జెండాను ఎగురవేసేందుకు సీఎం కేసీఆర్ నాయకత్వంలో అందరం కలిసి పనిచేస్తామని ఎమ్మెల్సీ, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే అభ్యర్థి కడియం శ్రీహరి అన్నారు. బుధవారం ఉదయం ఆయన యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. అనంతరం ప్రెసిడెన్షియల్ సూట్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. స్టేషన్‌ఘన్‌పూర్ ప్రస్తుత ఎమ్మెల్యే రాజయ్య సైతం పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటానని స్పష్టంగా చెప్పారని, స్టేషన్‌ఘన్‌పూర్ బీఆర్ఎస్‌కు కంచుకోట అని అన్నారు. నియోజకవర్గంలో ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని సీఎం కేసీఆర్ తనకు టికెట్ ఇచ్చారని చెప్పారు. కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావాలని యాదాద్రీశుడిని కోరుకున్నానని చెప్పారు. రాజకీయం, ఓట్ల కోసం మాట్లాడుతున్న కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఓ వైపు తెలంగాణ అభివృద్ధి, సంక్షేమానికి అవార్డులు అందిస్తుంటే.. రాష్ట్రంలో ఉన్న బీజేపీ నేతలు అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు.

కూకట్‌పల్లి భూమి భూదాన్ యజ్ఞ బోర్డుదే

సాక్షి, హైదరాబాద్: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కూకట్‌పల్లి సర్వే నంబర్ 353, 354లోని 24 ఎకరాల 26 గుంటల భూమి భూదాన్ యజ్ఞ బోర్డుకు చెందినదే అని, అది ప్రభుత్వ భూమి కాదని హైకోర్టు తేల్చిచెప్పింది. అలాగే ఎలాంటి విచారణ లేకుండా బోర్డు మాజీ చైర్మన్‌గున్న రాజేందర్‌రెడ్డిపై నమోదు చేసిన క్రిమినల్ కేసును కొట్టివేసింది. రాజేందర్‌రెడ్డిపై కూకట్‌పల్లి తహసీల్దార్ ఫోర్జరీ ఆరోపణలు చేస్తూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు 2022, ఆగస్టు 12న కేసు నమోదు చేశారు. ఈ క్రిమినల్ కేసును కొట్టివేయాలంటూ రాజేందర్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై జస్టిస్ అనుపమ చక్రవర్తి విచారణ చేపట్టి.. తీర్పు వెలువరించారు. కూకట్‌పల్లి తహసీల్దార్, పోలీసులు ఎలాంటి ప్రాథమిక విచారణ చేయకుండానే పిటిషనర్‌పై నిరాధార అభియోగాలు మోపడాన్ని న్యాయమూర్తి తప్పుబట్టారు.

చందాదారుల నగదును కాపాడాల్సిన బాధ్యత ఉంది

'మార్గదర్శి' పిటిషన్లపై తెలంగాణ హైకోర్టులో ఏపీ సర్కార్ వాదనలు

సాక్షి, హైదరాబాద్: 'మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో అక్రమాలపై ఇప్పటికే దాదాపు 300 మంది ఫిర్యాదు చేశారు. విచారణకు సంబంధించిన అంశాలతో పిటిషన్ల మీద పిటిషన్లు వేస్తుండటంతో వివరాలన్నీ పబ్లిక్ డొమైన్‌లోకి వెళ్తున్నాయి. ప్రజల డబ్బు కోట్లాది రూపాయలకు సంబంధించిన అంశం కాబట్టి వారికి వివరాలు వెల్లడించాల్సి వస్తోంది. పైసాపైసా వారు కూడబెట్టుకుంటున్న నగదు ఎక్కడికి వెళ్తోంది.. తిరిగి వస్తుందా? రాదా? అన్న విషయం తెలుసుకునే హక్కు చందాదారులకు ఉంటుంది. వారి నగదును కాపాడాల్సిన బాధ్యత మాకు (ప్రభుత్వానికి) ఉంది'అని తెలంగాణ హైకోర్టులో ఏపీ సర్కార్ వాదనలు వినిపించింది. ఏపీ ప్రభుత్వం తరఫున ప్రత్యేక జీపీ గోవిందరెడ్డి వాదనలు వినిపించారు. తమ సంస్థలో సోదాలు ఆపాలని, కఠిన చర్యలు తీసుకోకుండా ఆదేశాలివ్వాలంటూ పలు విజ్ఞప్తులతో మార్గదర్శి వేసిన పిటిషన్లపై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి బుధవారం విచారణ చేపట్టారు. విచారణ ప్రారంభ దశలో ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేమని చెప్పారు. రిట్, క్వాష్.. ఇలా రెండు రకాల పిటిషన్లు ఉన్నాయని, అన్నింటిపై ఈ కోర్టుకు పరిధి ఉందో లేదో చూడాల్సిన అవసరం కూడా ఉందన్నారు. తదుపరి విచారణను సెప్టెంబర్ 12కు వాయిదా వేశారు.

మువ్వన్నెల చంద్రహాసం


ప్రతిష్టాత్మక చంద్రయాన్-3 మిషన్ ఘన విజయం

అంతరిక్ష ప్రయోగాల్లో చరిత్ర సృష్టించిన భారత్
- సాయంత్రం 6.04 గంటలకు జాబిల్లిపై సాఫ్ట్ ల్యాండింగ్
- అవాంతరాల్లేకుండా ఉపరితలంపై క్షేమంగా దిగిన ల్యాండర్
- చంద్రుడి దక్షిణధ్రువంపై అడుగుపెట్టిన మొదటి దేశంగా భారత్ రికార్డు
- చందమామపై ల్యాండర్‌ను భద్రంగా దించిన నాలుగో దేశంగా ఘనత
- చంద్రయాన్-3 విజయంపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీ హర్షం
- దేశ ప్రజల్లో ఆనందోత్సాహాలు.. ఇస్రో శాస్త్రవేత్తలపై ప్రశంసల జల్లు
- భారత్‌కు వివిధ దేశాల అధినేతల అభినందనలు
- చంద్రుడి మూలాలను అధ్యయనం చేయనున్న రోవర్ 'ప్రజ్ఞాన్'



దిగడానికి ముందు ల్యాండర్ తీసిన చంద్రుని ఉపరితలం ఫొటో

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా)/బెంగళూరు: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) ప్రపంచ అంతరిక్ష ప్రయోగాల చరిత్రలో సరికొత్త రికార్డు సృష్టించింది. జాబిల్లి దక్షిణ ధ్రువంపై అడుగుపెట్టిన మొట్టమొదటి దేశంగా భారత్ చరిత్రకెక్కింది. చంద్రుడి ఉపరితలంపై ల్యాండర్‌ను క్షేమంగా దించిన నాలుగో దేశంగా మరో ఘనత సాధించింది. రష్యా ల్యాండర్ లూనా-25 విఫలమైన చోటే భారత్ విజయపతాక ఎగురవేసింది. భూమి నుంచి చంద్రుడి దిశగా 41 రోజులపాటు సాగించిన తన ప్రయాణాన్ని చంద్రయాన్-3 మిషన్ ఘనంగా ముగించింది. దేశ ప్రజలను ఆనందోత్సాహాల్లో ముంచెత్తింది. ప్రతి ఇంటా పండుగను తీసుకొచ్చింది. ప్రపంచవ్యాప్తంగా భారతదేశ గౌరవ ప్రతిష్టలను మరింత ఇనుమడింపజేసింది. చందమామపై పరిశోధనల కోసం ఇస్రో చేపట్టిన చంద్రయాన్-3 మిషన్ విజయవంతమైంది. ఈ ప్రయోగంలో అంతర్భాగమైన ల్యాండర్ మాడ్యూల్ 'విక్రమ్' బుధవారం సాయంత్రం 6.04 గంటలకు చందమామను సున్నితంగా ముద్దాడింది. చంద్రుడి ఉపరితలంపై ల్యాండర్ ఎలాంటి అవాంతరాలు లేకుండా సురక్షితంగా అడుగుపెట్టింది. దేశ ప్రజలంతా ఈ అద్భుతాన్ని ఉత్కంఠతో వీక్షించారు. చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతం కావడం పట్ల రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు హర్షం వ్యక్తం చేశారు. ఇస్రోను వివిధ దేశాల అధినేతలు భారత్‌కు అభినందనలు తెలియజేశారు. ల్యాండింగ్ పూర్తయ్యాక 4 గంటల అనంతరం రోవర్ 'ప్రజ్ఞాన్' ఆరు చక్రాల సాయంతో ల్యాండర్ నుంచి సురక్షితంగా బయటకు అడుగుపెట్టింది. జాబిల్లి ఉపరితలంపైకి చేరుకొని తన కార్యాచరణ ప్రారంభించింది. రెండు వారాల పాటు ఉపరితలంపై సంచరిస్తూ పరిశోధనలు చేస్తుంది. విలువైన సమాచారాన్ని భూమిపైకి చేరవేస్తుంది.




అత్యంత అరుదైన ఘనత

ప్రపంచంలో ఇప్పటిదాకా 12 దేశాలు చంద్రుడి మీదకు 141 ప్రయోగాలు చేశాయి. ఏ దేశం కూడా చంద్రుడి దక్షిణ ధ్రువంపై అడుగుపెట్టలేకపోయింది. అత్యంత అరుదైన ఈ ఘనతను భారత్ తన ఖాతాలో వేసుకుంది. చంద్రయాన్-2 వైఫల్యాల నుంచి పాఠాలు నేర్చుకొని, పొరపాట్లను సరిదిద్దుకొని చంద్రయాన్-3 ప్రయోగాన్ని విజయవంతం చేసింది ఇస్రో. అన్ని అవరోధాలను అధిగమించి నిర్దేశిత సమయానికే ల్యాండర్‌ను సరిగ్గా సాయంత్రం 6.04 గంటలకు జాబిల్లిపై భద్రంగా దించి ప్రపంచాన్ని అబ్బురపర్చింది. 140 కోట్ల మంది ఆశలను నెరవేర్చింది. టీవీలకు అతుక్కుపోయి ఏమవుతుందో అని ఆతృతగా ఎదురుచూసిన వారికి అంతులేని ఆనందాన్ని పంచింది. భారత్‌తోపాటు ప్రపంచ దేశాలు ఈ విన్యాసాన్ని ఎంతో ఆసక్తితో వీక్షించాయి. ఎలాంటి ప్రతికూల పరిస్థితులు ఎదురుకాకపోవడంతో అనుకున్న సమయానికే ప్రయోగం పూర్తయ్యింది. ల్యాండింగ్‌ను వాయిదా వేయాల్సిన పరిస్థితి తలెత్తకపోవడంతో ఇస్రో శాస్త్రవేత్తలు ఊపిరి పీల్చుకున్నారు.

37 నిమిషాలు తీవ్ర ఉత్కంఠ

చంద్రయాన్-3 మిషన్‌ను ఇస్రో గత నెల 14న ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోట నుంచి ప్రయోగించిన సంగతి తెలిసిందే. తొలుత భూమికి, చంద్రుడికి మధ్యలోని భూ మధ్యంతర కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. ప్రొపల్షన్ మాడ్యూల్‌లోని ఇంధనాన్ని మండించి ఐదుసార్లు కక్ష్య దూరాన్ని పెంచారు. ఈ నెల 5న చంద్రుడి కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. అనంతరం ప్రొపల్షన్ మాడ్యూల్‌లోని ఇంధనాన్నే మండించి ఐదుసార్లు కక్ష్య దూరాన్ని తగ్గించారు. దాంతో చంద్రయాన్-3 మిషన్ చంద్రుడికి దగ్గరవుతూ వచ్చింది. ఈ నెల 17న ప్రొపల్షన్ మాడ్యూల్ తన నుంచి ల్యాండర్ మాడ్యూల్‌ను విజయవంతంగా విడిచిపెట్టింది. ఆ తరువాత ల్యాండర్ మాడ్యూల్‌ను చంద్రుడికి మరింత సమీపానికి చేర్చారు. బుధవారం సాయంత్రం 5.27 గంటలకు సాఫ్ట్ ల్యాండింగ్ ప్రక్రియ ప్రారంభించారు. 37 నిమిషాలపాటు ఈ ప్రక్రియ కొనసాగింది. సరిగ్గా 6.04 గంటలకు ల్యాండర్ చంద్రుడి దక్షిణ ధ్రువంపై కాలుమోపింది. కొద్దిసేపటికే ల్యాండర్‌లోని ల్యాండర్ హారిజాంటల్ వెలాసిటీ కెమెరా (ఎల్‌హెచ్‌వీసీ) చంద్రుడి ఉపరితలాన్ని ఫొటోలు తీసి, భూమిపైకి పంపించింది. జాబిల్లిపై దిగిన కొద్దిసేపటి తర్వాత ల్యాండర్‌కు, బెంగళూరులోని మిషన్ ఆపరేషన్స్ కాంప్లెక్స్‌కు మధ్య కమ్యూనికేషన్ లింక్ ఏర్పడింది. ఇప్పటికే చంద్రయాన్-1 ప్రయోగంలో చంద్రుడిపై నీటి జాడలను కనుగొన్నారు. స్ఫటికాల రూపంలో నీరు ఉన్నట్లు గుర్తించారు. చంద్రయాన్-3 ద్వారా చంద్రుడి మూలాలను మరింత లోతుగా అధ్యయనం చేయనున్నారు.



సాఫ్ట్ ల్యాండింగ్ అంటే?

చంద్రయాన్-3 ప్రయోగంలో అత్యంత కీలక ఘట్టం సాఫ్ట్ ల్యాండింగ్. అధిక పీడనంతో గ్యాస్‌ను విరజిమ్ముతూ ల్యాండర్ చంద్రుడిపై దిగిన సమయంలో దుమ్ము ధూళి పైకి లేచి కెమెరాల అద్దాలను, సెన్సార్లను కమ్మేస్తుంది. దీంతో ఇతర సైంటిఫిక్ పరికరాలు దెబ్బతినే ప్రమాదం ఉంది. ఈ క్రమంలో ల్యాండర్ క్రాష్ అయ్యే అవకాశమూ లేకపోలేదు. అందుకే దుమ్ము పైకి లేవకుండా ల్యాండర్‌ను మృదువుగా దించే ప్రక్రియనే సాఫ్ట్ ల్యాండింగ్ అంటారు. దీన్ని నాలుగు దశల్లో చేపట్టి, ల్యాండర్‌ను సురక్షితంగా చంద్రుడి ఉపరితలంపైకి దించారు.

బయటకు వచ్చిన రోవర్

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): చంద్రయాన్-3 ల్యాండర్ బుధవారం సాయంత్రం 6.04 గంటలకు చంద్రుడి దక్షిణ ధ్రువం ఉపరితలంపై సురక్షితంగా దిగింది. ల్యాండర్‌లో నుంచి రాత్రి 10.04 గంటలకు రోవర్ బయటకు వచ్చింది. ఆరు చక్రాలతో కూడిన రోవర్ ప్రజ్ఞాన్ చంద్రుడిపై సెకనుకు ఒక సెంటీమీటర్ వేగంతో ముందుకు కదులుతోంది. సుమారు 500 మీటర్ల దూరం దాకా ప్రయాణించి అక్కడున్న స్థితిగతుల గురించి భూనియంత్రిత కేంద్రాలకు సమాచారాన్ని చేరవేస్తుంది. ల్యాండర్ దిగిన సందర్భంగా అందరూ పండుగ చేసుకునేలోపే రోవర్ కూడా విజయవంతంగా బయటకు రావడంతో ఇస్రో శాస్త్రవేత్తల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.

జాబిల్లిపై గర్జించిన సింహాలు..!

చంద్రుడిపై విజయవంతంగా దిగి చరిత్ర సృష్టించిన చంద్రయాన్-3... ఆ చరిత్ర తాలూకు ఆనవాళ్లను కూడా జాబిల్లి ఉపరితలంపై శాశ్వతంగా, సగర్వంగా ముద్రించింది. ప్రజ్ఞాన్‌గా పిలుస్తున్న రోవర్ వెనక చక్రాలు మన జాతీయ చిహ్నమైన మూడు సింహాలతో కూడిన అశోక చక్రాన్ని, ఇస్రో అధికారిక లోగోను చందమామ దక్షిణ ధ్రువం మీద ముద్రించాయి. తద్వారా చందమామ చెక్కిలిపై చెరగని సంతకం చేశాయి. ఇందుకు సంబంధించి ఇస్రో బుధవారం మధ్యాహ్నమే ముందస్తుగా విడుదల చేసిన కర్టెన్ రైజర్ వీడియో ఇప్పుడు వైరల్‌గా మారింది. అన్నట్టూ లాండర్, రోవర్ పని చేసేది కేవలం ఒక్క చంద్ర దినం పాటు మాత్రమేనట! అంటే భూమిపై 14 రోజులన్నట్టు!! అన్నీ అనుకూలించి, కాస్త అదృష్టమూ కలిసొస్తే అవి రెండూ మరో చంద్ర దినంపాటు పని చేసే అవకాశాన్ని కొట్టి పారేయలేమని ఇస్రో అంటోంది.



చంద్రయాన్-3 ప్రయోగం ఖర్చు: రూ.685 కోట్లు	ప్రయోగం నిర్వహించిన తేదీ 2023 జూలై 14	భూమి నుంచి చంద్రుడిపైకి ప్రయాణించిన దూరం: 3.89 లక్షల కిలోమీటర్లు
చంద్రయాన్-3 మిషన్‌ను పంపించిన రాకెట్: ఎల్‌వీఎం3-ఎం4	చంద్రుడిపై దిగిన తేదీ 2023 ఆగస్టు 23	ల్యాండర్ మాడ్యూల్ బరువు 1,752 కిలోలు
	చంద్రుడిపైకి ప్రయాణించిన రోజులు: 41	ల్యాండర్ తీసుకెళ్లిన పేలోడ్స్: 9



చంద్రునిపై దిగుతున్న ల్యాండర్ ఊహా చిత్రాలు

రోవర్ 'ప్రజ్ఞాన్' బరువు: 26 కిలోలు	ఆఖరి కక్ష్య తగ్గింపునకు పట్టిన సమయం 37 నిమిషాలు
రోవర్ తీసుకెళ్లిన పేలోడ్స్: 2	చంద్రుడిపై దిగిన సమయం: 2023 ఆగస్టు 23 సాయంత్రం 6.04 గంటలకు

ఈ విజయం వెనుక ఎందరెందరో...

ప్రముఖ శాస్త్రవేత్తలు, ఇంజనీర్ల కృషితో చంద్రయాన్-3 విజయవంతం

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చంద్రయాన్-3 మిషన్ వెనుక పలువురు కీలకమైన శాస్త్రవేత్తలు ఉన్నారు. వారి కృషి, పట్టుదల, నిరంతర శ్రమతో ప్రయోగం సఫలమైంది. వారు ఇస్రో బృందానికి నేతృత్వం వహిస్తూ ముందుండి నడిపించారు. ఈ ప్రయోగం వెనుక దాదాపు 1,000 మంది ఇంజనీర్లు, సైంటిస్టుల కృషి ఉంది. ముఖ్యమైన సైంటిస్టులు, నిపుణుల గురించి తెలుసుకుందాం.. - సాక్షి, నేషనల్ డెస్క్

ఎస్.సోమనాథ్, ఇస్రో చైర్మన్



చంద్రయాన్-3 ప్రయోగ సారథి ఇస్రో అధినేత ఎస్.సోమనాథ్. ఏరోస్పేస్ ఇంజనీరింగ్ అభ్యసించారు. బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో చదువుకున్నారు. సంస్కృత భాషలో అనర్గళంగా మాట్లాడగలరు. ఆయన పేరులోని సోమనాథ్‌కు అర్థం చంద్రుడి ప్రభువు. విక్రమ్ సారాభాయి స్పేస్ సెంటర్(వీఎస్ఎస్‌సీ), లిక్విడ్ ప్రొపల్షన్ సిస్టమ్స్ సెంటర్ డైరెక్టర్‌గా ఎస్.సోమనాథ్ సేవలందించారు. చంద్రయాన్-3ని ప్రయోగించిన బాహుబలి రాకెట్ మార్క్-3 రూపకల్పనలో కీలక పాత్ర పోషించారు. గగన్‌యాన్, ఆదిత్య-ఎల్1 ప్రయోగాల్లోనూ పాలుపంచుకుంటున్నారు.

ఎస్.మోహన కుమార్, మిషన్ డైరెక్టర్



సీనియర్ సైంటిస్టు మోహన కుమార్ విక్రమ్ సారాభాయి అంతరిక్ష కేంద్రంలో పనిచేశారు. వన్ వెబ్ ఇండియా 2 శాటిలైట్స్ ప్రాజెక్టు(ఎల్‌వీఎం3-ఎం3)లో డైరెక్టర్‌గా సేవలందించారు. చంద్రయాన్-3లో మిషన్ డైరెక్టర్‌గా వ్యవహరించారు.

ఎం.శంకరన్, యూ.ఆర్.రావు శాటిలైట్ సెంటర్ డైరెక్టర్



ఇస్రో ప్రయోగించిన వివిధ శాటిలైట్ల డిజైన్, అభివృద్ధిలో భాగస్వాములయ్యారు. ఉపగ్రహాల తయారీలో ఈయనది సుదీర్ఘ అనుభవం. మంగళ్‌యాన్, చంద్రయాన్-1, చంద్రయాన్-2 మిషన్లలో పనిచేశారు. 2021 జూన్ నుంచి యూ.ఆర్.రావు శాటిలైట్ సెంటర్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు.

ఎం.వనిత, యూ.ఆర్.రావు శాటిలైట్ సెంటర్ డిప్యూటీ డైరెక్టర్



చందమామపై చేసిన ప్రయోగానికి నాయకత్వం వహించిన మొట్టమొదటి మహిళా శాస్త్రవేత్తగా వనిత గుర్తింపు పొందారు. ఎలక్ట్రానిక్స్ సిస్టమ్స్ ఇంజనీరింగ్‌లో పట్టా పొందారు. చంద్రయాన్-2 మిషన్‌కు ప్రాజెక్టు డైరెక్టర్‌గా పనిచేశారు. ఈ అనుభవంతో చంద్రయాన్-3 విజయవంతం కావడానికి కృషి చేశారు.

పి.వీరముత్తువేల్, ప్రాజెక్టు డైరెక్టర్



తమిళనాడులోని విల్లుపురంలో జన్మించిన ప్రముఖ సైంటిస్టు వీరముత్తువేల్ 2019లో చంద్రయాన్-3 మిషన్‌లో ప్రాజెక్టు డైరెక్టర్‌గా చేరారు. నాలుగేళ్లుగా సేవలందిస్తున్నారు. ఐఐటీ-మద్రాసులో విద్యనభ్యసించారు. మాస్టర్స్ ఆఫ్ టెక్నాలజీ పట్టాలో అందుకున్నారు. చంద్రయాన్-2, మంగళ్‌యాన్ మిషన్లలోను ఆయన భాగస్వామ్యం ఉంది. ఇంతకుముందు ఇస్రో ప్రధాన కార్యాలయంలోని స్పేస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రోగ్రామ్ ఆఫీసులో డిప్యూటీ డైరెక్టర్‌గా వ్యవహరించారు. సాంకేతికపరమైన అంశాలపై అపారమైన పట్టు ఉంది.

ఎస్.ఉన్నికృష్ణన్ నాయర్, విక్రమ్ సారాభాయి స్పేస్ సెంటర్ డైరెక్టర్



ఏరోస్పేస్ ఇంజనీర్‌గా రాకెట్ ప్రయోగాల్లో ఎంతో అనుభవం ఉంది. అంతరిక్షంలోకి వ్యోమగామిని పంపే మిషన్‌ను నాయకత్వం వహిస్తున్నారు. హ్యూమన్ స్పేస్ ఫ్లైట్ సెంటర్‌కు డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. జీఎస్ఎల్‌వీ మార్క్-3 రాకెట్‌ను ఈయన నాయకత్వంలోనే అభివృద్ధి చేశారు.

కె.కల్పన, చంద్రయాన్-3 డిప్యూటీ డైరెక్టర్



ప్రముఖ ఇంజనీర్ కె.కల్పన చంద్రయాన్-3 ప్రయోగాన్ని విజయంతం చేయడానికి తన బృందంతో కలిసి పని చేశారు. మిషన్ డిప్యూటీ డైరెక్టర్‌గా సమర్థవంతంగా వ్యవహరించారు. పలు ఉపగ్రహాల తయారీలో భాగస్వాములయ్యారు. చంద్రయాన్-2, మంగళ్‌యాన్ మిషన్లలోనూ ఆమె తన వంతు సేవలు అందించారు.

వి.నారాయణన్, లిక్విడ్ ప్రొపల్షన్ సెంటర్ డైరెక్టర్

వ్యోమనౌకలకు అవసరమైన లిక్విడ్ ప్రొపల్షన్ ఇంజన్లను తయారు చేయడంలో ఈయన నిపుణులు. చంద్రయాన్-3 మిషన్‌లో భాగంగా విక్రమ్ ల్యాండర్ చంద్రుడి ఉపరితలంపై సాఫ్ట్ ల్యాండింగ్ కావడానికి తోడ్పడిన థ్రస్ట్ ఇంజన్లను నారాయణన్ నేతృత్వంలోనే అభివృద్ధి చేశారు. ఐఐటీ-ఖరగ్‌పూర్‌లో చదువుకున్నారు. క్రయోజెనిక్ ఇంజన్ల అభివృద్ధి, తయారీలోనూ మంచి అనుభవం ఉంది.

భూమిపై సంకల్పం.. జాబిల్లిపై సాకారం

- చంద్రయాన్-3 విజయంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం
- ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు
- ఈ విజయం ప్రపంచంలోని ప్రజలందరిదీ..
- ఆకాశమే హద్దు కాదని భారత్ నిరూపిస్తోంది
- త్వరలోనే 'చందమామ ఏక్ టూర్ కే'

న్యూఢిల్లీ: చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతం కావడం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఇస్రో శాస్త్రవేత్తలపై ప్రశంసల వర్షం కురిపించారు. వారికి అభినందనలు తెలియజేశారు. భారత జాతీయ పతాకాన్ని రెపరెపలాడిస్తూ తన ఆనందాన్ని పంచుకున్నారు. ఇప్పుడు చంద్రుడిపై భారత్ అడుగుపెట్టిందని అన్నారు. ఇది కేవలం భారత్ విజయం కాదని చెప్పారు. ఈ ఘనత ప్రపంచంలోని ప్రజలందరికీ చెందుతుందని చెప్పారు. బ్రిక్స్ సదస్సులో పాల్గొనేందుకు దక్షిణాఫ్రికాలోని జోహన్నెస్‌బర్గ్ వెళ్లిన మోదీ బుధవారం సాయంత్రం చంద్రయాన్-3 సాఫ్ట్ ల్యాండింగ్ ప్రక్రియను టీవీలో ప్రత్యక్షంగా వీక్షించారు. ల్యాండింగ్ సక్సెస్ అయిన వెంటనే ఇస్రో సైంటిస్టులను ఉద్దేశించి వర్చువల్‌గా ప్రసంగించారు. బ్రిక్స్ సదస్సు కోసం ప్రస్తుతం తాను దక్షిణాఫ్రికాలో ఉన్నప్పటికీ తన మనసు, ఆత్మ మొత్తం భారత్‌లోనే ఉన్నాయని పేర్కొన్నారు. ప్రపంచంలోని బలమైన జీ20 కూటమికి భారత్ నాయకత్వం వహిస్తున్న ఈ శుభసందర్భంలో చంద్రయాన్-3 ప్రయోగం సఫలం కావడం మరింత ఆనందాన్ని ఇస్తోందన్నారు. భూగోళంపై మనం తీసుకున్న సంకల్పం చందమామపై నెరవేరిందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ విజయం చిరస్మరణీయమని తెలిపారు. ఈ అద్భుత క్షణం శాశ్వతంగా మదిలో నిలిచిపోతుందని చెప్పారు. చంద్రుడి దక్షిణ ధ్రువంపై అడుగుపెట్టిన మొట్టమొదటి దేశంగా భారత్ చరిత్ర సృష్టించిందంటూ ప్రధాని మోదీ భావోద్వేగానికి లోనయ్యారు. ఇదొక చరిత్రాత్మక సందర్భమని ఉద్ఘాటించారు. అభివృద్ధి చెందుతున్న భారత్‌కు ఇది ప్రతీక అని చెప్పారు. కొత్త చరిత్రను భారత్ లిఖించిందని వెల్లడించారు. నవ భారతదేశంలో నూతన శిఖరాలకు చేరుకుంటున్నామని, అందుకు మనమంతా సాక్ష్యులమని వివరించారు.



ఇస్రో చైర్మన్ సోమనాథ్‌ను ఫోన్‌లో అభినందిస్తున్న మోదీ

శాస్త్రవేత్తల అంకితభావం వల్లే..

అమృతకాలంలో ఇది మొదటి విజయమని అన్నారు. ఇది అమృత వర్షమని అభివర్ణించారు. ఆకాశమే హద్దు కాదని భారత్ పదేపదే నిరూపిస్తోందని ప్రధాని మోదీ చమత్కరించారు. ఇప్పటిదాకా ఎవరూ చేరుకోని జాబిల్లి దక్షిణ ధ్రువానికి భారత్ చేరుకుందని ఉద్ఘాటించారు. మన శాస్త్రవేత్తల అంకితభావం, నైపుణ్యం వల్లే ఈ విజయం సాధ్యమైందన్నారు. చందమామకు సంబంధించిన మన ఊహాగానాలు, ప్రచారంలో ఉన్న కథలు ఇక మారుతాయని, సామెతలు కొత్త తరం కోసం కొత్త అర్థాలను వెతుక్కుంటాయని వ్యాఖ్యానించారు. భూమిని తల్లిగా, చంద్రుడిని మామగా మనం భావిస్తామని చెప్పారు. 'చందమామ దూర్ కే' అంటుంటామని, ఇకపై 'చందమామ ఏక్ టూర్ కే' అనే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని వివరించారు. తద్వారా జాబిల్లిపై పర్యటనలు త్వరలో ప్రారంభమవుతాయని పరోక్షంగా స్పష్టం చేశారు. సూర్యుడిపై పరిశోధనల కోసం 'ఆదిత్య-ఎల్1' ప్రయోగానికి ఇస్రో సిద్ధమవుతోందని చెప్పారు. శుక్రగ్రహంపైనా అధ్యయనం చేసే ప్రణాళిక ఉందన్నారు. అనంతరం ప్రధాని మోదీ ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్‌తో మాట్లాడారు. అభినందనలు తెలిపారు.

ఇక అంగారకుడిపైకి అడుగు!

ఇస్రో చైర్మన్ సోమనాథ్ వెల్లడి

బెంగళూరు: దేశం కోసం స్ఫూర్తిదాయక కార్యం సాధించినందుకు ఎంతో గర్వంగా ఉందని ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ హర్షం వ్యక్తంచేశారు. భారత శాస్త్రవేత్తల కృషి ఫలించిందని, ఇందులో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. 'చంద్రయాన్-3 విజయంతో అంగారకుడిపైకి వెళ్తాం. భవిష్యత్తులో శుక్రుడితోపాటు ఇతర గ్రహాలపైకి వెళ్తాం' అని చెప్పారు.

ఇది ఏ దేశానికైనా కష్టం

'ఈ రోజు టెక్నాలజీ ఇంతగా అభివృద్ధి చెందినా చంద్రుడిపైకి ప్రయాణం చేయడం ఏ దేశానికైనా అంత సులువు కాదు. అదీగాక సాఫ్ట్ లాండింగ్ మరింత సంక్లిష్టమైన విషయం. అయితే, కేవలం రెండు మిషన్లతోనే భారత్ సుసాధ్యం చేసి చూపింది. మానవరహిత వ్యోమనౌకను చంద్రుడి కక్ష్యలోకి ప్రవేశపెట్టేందుకు మాత్రమే చంద్రయాన్-1ను చేపట్టాం.' అని సోమనాథ్ చెప్పారు.

మేడిన్ ఇండియా మిషన్

'చంద్రయాన్-2 నుంచి నేర్చుకున్న పాఠాలు ఎంతో ఉపయోగపడ్డాయి. ప్రతి ఒక్కరూ చంద్రయాన్ విజయం కోసం ప్రార్థించారు. చంద్రయాన్-2 మిషన్‌లో పాలుపంచుకున్న చాలామంది కీలక శాస్త్రవేత్తలు చంద్రయాన్-3 మిషన్ బృందంలో పనిచేశారు. చంద్రయాన్-3లో వినియోగించిన సాంకేతిక పరిజ్ఞానం ఏ టెక్నాలజీ కంటే కూడా తక్కువ కాదు. ప్రపంచంలోని అత్యుత్తమ సెన్సర్లు మన వద్ద ఉన్నాయి. ఇది పూర్తిగా ప్రపంచస్థాయి పరికరాలతో దేశీయంగా రూపొందించిన మేడిన్ ఇండియా మిషన్' అని సోమనాథ్ చెప్పారు.

చంద్రయాన్-3 ప్రయాణం సాగిందిలా ..

- గత ఏడాది ఏప్రిల్‌లో చంద్రయాన్-3 ఫస్ట్‌లుక్‌ను ఇస్రో విడుదల చేసింది. తొలుత 2020లో చంద్రయాన్‌ను ప్రయోగించాలని భావించారు కానీ కోవిడ్-19తో ఆలస్యమైంది.
- ఈ మిషన్ కోసం ఇస్రో రూ.615 కోట్లు ఖర్చు చేసింది. చంద్రయాన్-2 కంటే తక్కువ ఖర్చుతో ఈ మిషన్ పూర్తయింది. చంద్రయాన్-2కి రూ.978 కోట్లు ఖర్చు చేశారు.

చంద్రయాన్-3 మూడు భాగాలుగా ఉంది.
1. ల్యాండర్ మాడ్యూల్ (ఎల్ఎం),
2. ప్రొపల్షన్ మాడ్యూల్ (పీఎం) 3. రోవర్

- చంద్రయాన్ ల్యాండర్ నిర్దేశించిన చంద్రుడి ఉపరితలంపై సాఫ్ట్‌గా ల్యాండ్ అయ్యే సామర్థ్యం కలిగి ఉంది.చంద్రుడిపై ఈ ల్యాండర్ (విక్రమ్) దిగిన తర్వాత రోవర్ (ప్రజ్ఞాన్) బయటకి వస్తుంది. ఈ రెండూ కలిసి చంద్రుడి ఉపరితలంపై పరిశోధనల్ని చేస్తాయి. ల్యాండర్, రోవర్‌లు పరిశోధనలకు అనుగుణమైన సైంటిఫిక్ పే లోడ్స్‌ను కలిగి ఉన్నాయి.
- ఇక ల్యాండర్ మాడ్యూల్‌ను చివరి 100 కి.మీ. దూరం వరకు మోసుకుపోవడమే ప్రొపల్షన్ మాడ్యూల్ ప్రధాన విధి.
- చంద్రయాన్-3 మిషన్ లాంచ్‌వెహికల్ మార్క్-3 (ఎల్‌వీఎం-3) రాకెట్‌ని ఆంధ్రప్రదేశ్‌లో సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి జులై 14 మధ్యాహ్నం 2.35 గంటలకు విజయవంతంగా ప్రయోగించారు. మొత్తం 41 రోజుల పాటు ఈ వ్యోమనౌక ప్రయాణించి సూపర్ సక్సెస్ కొట్టింది.
- ఆ మర్నాడు జులై 15న మొదటి ఆర్బిట్ రైజింగ్ (కక్ష్య దూరం పెంపుదల) మొదటి విడతలో భూమికి దగ్గరగా 173 కిలోమీటర్లు ఎత్తుకు, భూమికి దూరంగా 41,762 కిలోమీటర్లు ఎత్తుకు పెంచారు.
- అలా అయిదుసార్లు కక్ష్యం పెంచాక ఆగస్టు 1న అర్ధరాత్రి చంద్రయాన్-3 మిషన్‌ను పెరిజీలోకి అంటే భూమికి దగ్గరగా వుచ్చిన సమయంలో లూనార్ ట్రాన్స్ ఇంజెక్షన్ అనే ఆపరేషన్‌తో భూమధ్యంతర కక్ష్య నుంచి చంద్రుడి కక్ష్య వైపుకు విజయవంతంగా మళ్లించారు.
- ఆగస్టు 5న భూ మధ్యంతర కక్ష్య నుంచి 3,69,328 లక్షల కిలోమీటర్లు దూరం ప్రయాణించి లూనార్ ఆర్బిట్ (చంద్రుని కక్ష్య)లో 164''18074 ఎత్తుకు చేరుకుంది.
- అప్పట్నుంచి కక్ష్యను అయిదుసార్లు తగ్గించుకుంటూ వచ్చారు. ఆగస్టు 6, 9, 14, 16 తేదీలలో కక్ష్య తగ్గిస్తూ రావడంతో చంద్రయాన్-3 చంద్రుడికి మరింత చేరువైంది.
- ఆగస్టు 18న ల్యాండర్ మాడ్యూల్‌లో వున్న కొద్దిపాటి ఇంధనాన్ని మండించి చంద్రుడికి చేరువగా అంటే 113''157 కిలోమీటర్లు దగ్గరగా వెళ్లింది.
- చంద్రయాన్-3లో మరో కీలకఘట్టం విక్రమ్ ల్యాండర్, ప్రజ్ఞాన్ రోవర్‌లతో కూడిన లాండర్ మాడ్యూల్ (ఎల్ఎమ్) ప్రొపల్షన్ మాడ్యూల్ నుంచి ఆగస్టు 17న విజయవంతంగా విడిపోయింది. దీంతో చంద్రయాన్-3 ల్యాండర్ మాడ్యూల్ చంద్రుడి చుట్టూ ఉన్న 100 కి.మీ. వృత్తాకార కక్ష్యలోకి ప్రవేశించింది.
- ల్యాండర్ మాడ్యూల్ చిట్టచివరి డీ బూస్టింగ్ ప్రక్రియ ఆగస్టు 20న విజయవంతంగా పూర్తయింది. అప్పట్నుంచి ఆ ల్యాండర్ చంద్రుడి చుట్టూ 25 134కి.మీ. కక్ష్యలో పరిభ్రమించింది.
- ఈ ప్రయోగంలో ఇస్రో మొట్టమొదటి సారిగా థొరెటల్-అబల్ అనే లిక్విడ్ ఇంజిన్‌లను ఉపయోగించింది
- ఆగస్టు 23 సాయంత్రం 5. 44 గంటలకు ల్యాండర్ విక్రమ్ ఈ ప్రత్యేక ఇంజిన్ల సాయంతో దశల వారీగా వేగాన్ని తగ్గించుకుంటూ వచ్చింది. సరిగ్గా 6.04 గంటలకు జాబిల్లి దక్షిణ ధ్రువంపై విజయవంతంగా దిగిన విక్రమ్ ల్యాండర్ దిగడంతో భారత్ కీర్తి పతాక చంద్రుడిపై రెపరెపలాడింది.
- రోవర్ చంద్రుడి ఉపరితలంపైకి వచ్చాక సెకెండ్‌కు ఒక సెంటీమీటర్ వేగంతో కదులుతూ ఒక లూనార్ డే (చంద్రరోజు) పనిచేస్తుంది. ఒక లూనార్ డే అంటే భూమి మీద కొలిస్తే 14 రోజులు అవుతుంది. అంటే సెప్టెంబర్ 7 దాకా 500 మీటర్లు దూరం ప్రయాణిస్తుంది.


ఢిల్లీలోని నెహ్రూ ప్లానెటోరియంలో చంద్రయాన్-3 ల్యాండింగ్‌ను టీవీలో ప్రత్యక్షంగా వీక్షిస్తూ సంబరాల్లో మునిగిపోయిన విద్యార్థులు


చంద్రయాన్-3 విజయవంతం కావడంతో ఢిల్లీలో జాతీయ జెండా ప్రదర్శిస్తున్న కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి జితేంద్ర సింగ్

చంద్రయాన్ -3 తరువాత?

- నలభై రోజుల ఉత్కంఠపై శుభం కార్డు పడింది!
- 140 కోట్ల మంది ప్రజల ఆకాంక్షలు సాకారమయ్యాయి!
- అగ్రరాజ్యాలను తోసిరాజంటూ.. భారత్ జాబిల్లి దక్షిణ ధ్రువంపై జెండా పాతేసింది!
- అన్నివైపుల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి!
- బాగానే ఉంది కానీ... వాట్ నెక్స్ట్?
- జాబిల్లి దక్షిణ ధ్రువంపై దిగిన తొలిదేశం తరువాతి లక్ష్యం ఏమిటి?
- ఈ విజయంతో మనకొచ్చే లాభాలేమిటి? మానవాళికి ఒరిగేదేమిటి?



భారత అంతరిక్ష పరిశోధన సంస్థ తన రెండో ప్రయత్నంలో జాబిల్లి దక్షిణ ధ్రువంపై రోవర్‌ను ల్యాండ్ చేయడంలో విజయం సాధించింది. భవిష్యత్తు ఏమిటన్న విషయానికి క్లుప్తంగా ఇవ్వగలిగిన సమాధానం ఆకాశమే హద్దుగా అంతరిక్ష రంగంలో మనదైన ముద్రను వేయడమే అని చెప్పవచ్చు. ఎందుకంటే ఈ ఏడాదిలోనే రష్యా, ఇజ్రాయెల్‌లు రెండూ జాబిల్లి దక్షిణ ధ్రువంపై దిగేందుకు విఫలయత్నం చేశాయి. భారత్ మాత్రమే విజయం సాధించగలిగింది. కచ్చితంగా ఇది భారత శాస్త్రవేత్తల సునిశిత ప్లానింగ్, ఆలోచన, నిబద్ధతలకు ప్రత్యక్ష ప్రమాణం. కాబట్టి చంద్రయాన్-3 తరువాత అంతరిక్ష ప్రయోగాల కోసం ఇస్రో వైపు చూసే దేశాల సంఖ్య నిస్సందేహంగా పెరుగుతుంది. ప్రస్తుతం భారత అంతరిక్ష ప్రయోగ మార్కెట్ విలువ దాదాపు 800 కోట్ల డాలర్లని అంచనా. 2040 నాటికి ఇది ఐదు రెట్లు పెరుగుతుందని ఇప్పటికే ఒక అంచనా ఉండగా.. చంద్రయాన్-3 విజయం ఈ లక్ష్యాన్ని మరింత ముందుగానే అందుకునేందుకు అవకాశం కల్పిస్తుంది. కొన్నేళ్లుగా భారత అంతరిక్ష రంగం ఇతర దేశాల కంటే రెట్టింపు వేగంతో ఎదుగుతున్న విషయం తెలిసిందే.

కలిసొచ్చే జుగాడ్...

చంద్రయాన్ -3 ఖర్చు రూ.600 కోట్లు ఉంటే.. ఇంతే స్థాయి అంతరిక్ష ప్రయోగానికి విదేశాల్లో ఎన్నో రెట్లు ఎక్కువ ఖర్చు పెట్టాల్సి వస్తుందనేది ఇప్పటికే మనకు అనుభవమైన విషయం. అతితక్కువ ఖర్చుతో ఉపగ్రహాలను అంతరిక్షంలోకి చేర్చగలగడం ఇస్రో ప్రత్యేకతగా మారింది. కాబట్టి సొంతంగా ఉపగ్రహాలు పంపుకోలేని చాలా దేశాలిప్పుడు భారత్‌ను ఆశ్రయిస్తాయి. ఇది మనకు కలిసొచ్చే అంశం. ఇస్రోకు నేరుగా ప్రయోజనం కలిగితే ఈ సంస్థకు విడిభాగాలు, సామాన్లు సరఫరా చేసే ప్రైవేట్ కంపెనీలు బోలెడన్ని లాభాలు చవిచూస్తాయి. రక్షణ రంగంతోపాటు అంతరిక్ష రంగంలోనూ ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించేందుకు కేంద్రం ఆలోచన చేస్తున్న నేపథ్యంలో చంద్రయాన్-3 విజయం చాలా కీలకం కానుంది. విదేశీ కంపెనీలు భారతీయ సంస్థలతో కలిసి పనిచేసేందుకు, లేదా సొంతంగా కార్యకలాపాలు ప్రారంభించేందుకు అవకాశాలు మెరుగవుతాయి. ఉపగ్రహాలను మోసుకెళ్లేందుకు మానవసహిత అంతరిక్ష ప్రయోగాలకు, ఇతర అవసరాలకు వేర్వేరు శక్తిసామర్థ్యాలు కలిగిన జియోసింక్రనస్ లాంచ్ వెహికల్ కలిగి ఉండటం ఇస్రోకు లాభించే ఇంకో అంశం.

- సాక్షి, నేషనల్ డెస్క్

1972 తరువాత భూమి సహజ ఉపగ్రహం చంద్రుడిపై మనిషి కాలుపెట్టలేదు. అయితే అక్కడ నీరు ఉందన్న విషయం స్పష్టమైన తరువాత చాలా దేశాలు వ్యోమగాములను పంపేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశాయి. అమెరికా తన ఆర్టిమిస్ ప్రోగ్రామ్ ద్వారా వచ్చే ఏడాదికల్లా చంద్రుడిపైకి వ్యోమగాములను పంపడం, అక్కడే ఒక శాశ్వత స్థావరం ఏర్పాటు చేసుకోవడం వంటి లక్ష్యాలతో పనిచేస్తోంది. జాబిల్లిపై నీటితోపాటు చాలా విలువైన ఖనిజాలు ఉన్నాయన్న విషయం అందరికీ తెలిసిందే. కాలుష్యరహితమైన, అత్యంత సమర్థమైన హీలియం-3 ఆ వనరుల్లో ఒకటి.

భవిష్యత్తు అవసరాల కోసం?

భవిష్యత్తులో జాబిల్లిపైని వనరులను వాడుకునే అవకాశం లభిస్తే (శుద్ధి, రవాణా వంటి వాటికి తగిన టెక్నాలజీలు అభివృద్ధి చేసుకోవాలి) అందులో భారత్‌కూ భాగస్వామ్యం లభించేందుకు చంద్రయాన్-3 విజయం సాయపడుతుంది. అలాగే జాబిల్లిని ఒక కేంద్రంగా ఏర్పాటు చేసుకుని సౌర కుటుంబంలోని ఇతర గ్రహాలను అన్వేషించాలని, అంగారకుడిపై స్థిర నివాసం ఏర్పరచుకోవాలని మనిషి చాలాకాలంగా ఆలోచిస్తున్నాడు. ఈ ప్రస్థానంలో జాబిల్లి దక్షిణ ధ్రువం మాదిరిగా ఇతర గ్రహాలపైని అత్యంత కఠినమైన పరిస్థితులను తట్టుకుని వ్యోమనౌకలను ల్యాండ్ చేయడమెలా అన్నది తెలిసిన వారి అవసరం కచ్చితంగా ఉంటుంది. అంతేకాకుండా.. ఇస్రో ఇప్పటికే అనేక దేశాలతో కలిసి అంతరిక్ష ప్రయోగాలు నిర్వహించింది. పరిశోధనల్లోనూ భాగస్వామిగా నిలిచింది. ఈ అనుభవమంతా భవిష్యత్తులో అంతరిక్షాన్ని మన అవసరాల కోసం ఉపయోగించుకునే సందర్భంలో ఉపయోగపడుతుంది. అంతరిక్షాన్ని శాంతియుత ప్రయోజనాల కోసం వాడుకోవాలన్న భారత ప్రకటిత లక్ష్యానికి తగిన విధానాలను రూపొందించవచ్చు.

రష్యాలో విమాన ప్రమాదం

వాగ్నర్ చీఫ్ ప్రిగోజిన్ మృతి?



మాస్కో: రష్యాలో బుధవారం జరిగిన ఘోర విమాన ప్రమాదంలో 10 మంది దుర్మరణం పాలయ్యారు. రష్యా అనుకూల కిరాయి సైనిక ముఠా వాగ్నర్ గ్రూప్ చీఫ్ యెవ్‌గెనీ ప్రిగోజిన్ కూడా వారిలో ఉన్నట్లు అనుమానిస్తున్నారు. ప్రయాణికుల జాబితాలో ఆయన పేరు కూడా ఉన్నట్లు అధికారులు ధ్రువీకరించారు. అయితే ప్రిగోజిన్ విమానం ఎక్కిందీ లేనిదీ తెలడం లేదు. అతని సొంత విమానమని చెబుతున్న సదరు ప్రైవేట్ బిజినెస్ జెట్ రష్యా రాజధాని మాస్కోకు 100 కిలోమీటర్ల దూరంలో త్వెర్ ప్రాంతంలో కుప్పకూలింది. ఉక్రెయిన్‌తో యుద్ధంలో వాగ్నర్ గ్రూప్ రష్యా తరఫున పోరాడిన విషయం తెలిసిందే. ఈ ఏడాది జూన్‌లో రష్యా సైనిక నాయకత్వం మీద వాగ్నర్ గ్రూప్ సాయుధ తిరుగుబాటు చేసి విఫలమైంది. అనంతరం ప్రిగోజిన్‌ను బెలారస్‌కు ప్రవాసం పంపుతున్నట్లు రష్యా ప్రకటించింది. వాగ్నర్ గ్రూప్ సభ్యులు కూడా ఆయనను అనుసరించడమో, రిటైర్ అవడమో, రష్యా సైన్యంలో చేరడమో చేయొచ్చని పేర్కొంది.

చంద్రుడి గుట్టు తెలుసుకొనేలా..

చంద్రయాన్-3తో వివిధ పేలోడ్లను పంపించిన ఇస్రో

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): చంద్రుడిపై దాగి ఉన్న రహస్యాలను అధ్యయనం చేయడం కోసం ఇస్రో సైంటిస్టులు చంద్రయాన్-3 ప్రయోగం చేపట్టారు. ఈ మిషన్‌లో 5 ఇస్రో పేలోడ్స్, నాసాకు చెందిన ఒక పేలోడ్‌ను పంపించారు. ల్యాండర్‌ను చంద్రుడి దక్షిణ ధ్రువ ప్రాంతంలో ఉపరితలంపై దించి పరిశోధనలకు శ్రీకారం చుట్టారు. ఈ ప్రాంతంలో సూర్యరశ్మి సోకదని, చీకటిగా ఉంటుందని చెబుతున్నారు. ప్రొపల్షన్ మాడ్యూల్ చంద్రుడి కక్ష్య (లూనార్ ఆర్బిట్) నుంచి అటు భూమిని, ఇటు చంద్రుడిని అధ్యయనం చేయడానికి 'ఆర్బిటార్ స్పెక్ట్రో పోలారిమెట్రీ ఆఫ్ హ్యాబిటబుల్ ప్లానెట్ ఎర్త్' అనే ఒక సైంటిఫిక్ పరికరం అమర్చి పంపారు. ఈ సైంటిఫిక్ పేలోడ్‌తో ముఖ్యంగా చంద్రుడి ఉపరితలం నివాసయోగ్యంగా ఉందా? అనేది అధ్యయనం చేస్తారు. అలాగే చంద్రుడిపై జరుగుతున్న మార్పులను తెలుసుకోవచ్చు. జాబిల్లిని అధ్యయనం చేయడానికి ఇది ప్రయోగాత్మక పేలోడ్ కావడం విశేషం.

ల్యాండర్‌లో పేలోడ్స్ ఇవీ...

- ల్యాండర్‌లో మూడు పేలోడ్స్ ఉన్నాయి. ఇందులో లాంగ్‌ముయిర్ ప్రోబ్ (రంభ-ఎల్‌పీ) అనే సైంటిఫిక్ పేలోడ్‌తో చంద్రుడి ఉపరితలంపై ప్లాస్మా, అయాన్లు, ఎలక్ట్రాన్లు, చంద్రుడి అంతర్భాగం దాగి ఉన్న ఖనిజాలపై పరిశోధన చేస్తారు.
- చంద్రాస్ సర్ఫేస్ థర్మో ఫిజికల్ ఎక్స్‌పరిమెంట్ అనే పేలోడ్ చంద్రుడి ఉపరితలంపై ఉష్ణ లక్షణాలను కొలవడానికి, చంద్రుడిపై మ్యాప్ తయారు చేయడానికి ఉపయోగపడుతుంది.
- ఇన్‌స్ట్రుమెంట్ ఫర్ లూనార్ సీస్మిక్ యాక్టివిటీ, రేడియో అనాటమీ ఆఫ్ మూన్‌బౌండ్ హైపర్‌సెన్సిటివ్ అయానోస్పియర్, అట్మాస్ఫియర్ అనే పేలోడ్స్‌తో చంద్రుడిపై లాండింగ్ సైట్ చుట్టూ ప్రకంపనలను గుర్తిస్తారు.

రోవర్‌లోని పేలోడ్స్

- చంద్రుడి ఉపరితలం మూలక కూర్పును అధ్యయనం చేయడానికి రోవర్‌లో రెండు సైంటిఫిక్ పరికరాలను అమర్చి పంపారు. ఇందులో అల్ఫా పార్టికల్ ఎక్స్-రే స్పెక్ట్రోమీటర్ అనే పేలోడ్‌తో చంద్రుడిపై ఖనిజ సంపద, శిలాజాలను శోధిస్తారు. చంద్రుడిపై రసాయనాలుంటే వాటిని కూర్పు చేయడానికి ఉపయోగిస్తారు.
- లేజర్ ప్రేరేపిత బ్రేక్‌డౌన్ స్పెక్ట్రోస్కోప్ అనే పేలోడ్‌తో చంద్రుడిపై రాళ్లను అధ్యయనం చేస్తారు. ముఖ్యంగా చంద్రుడిపై నేల స్వభావం ఎలా ఉందో గుర్తిస్తారు.
- గ్యాస్, ప్లాస్మా పర్యావరణాన్ని అధ్యయనం చేయడానికి, చంద్రశ్రేణి అధ్యయనాల కోసం అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ 'నాసా'కు చెందిన లేజర్ రెట్రోరిఫ్లెక్టర్ శ్రేణి అనే ఒక సైంటిఫిక్ పరికరాన్ని కూడా రోవర్‌లో అమర్చారు. ఇది కూడా చంద్రుడిపై మరింత అధ్యయనం కోసమే.

విస్తారా విమానాలకు తప్పిన ముప్పు

న్యూఢిల్లీ: దేశ రాజధాని న్యూఢిల్లీ విమానాశ్రయంలో బుధవారం ఉదయం అతి పెద్ద ముప్పు తప్పింది. ఒకే రన్ వే మీద ఒకే సమయంలో రెండు విస్తారా విమానాలకు ల్యాండింగ్, టేకాఫ్‌లకు అనుమతినివ్వడంతో అతి పెద్ద ప్రమాదం త్రుటిలో తప్పిపోయింది. వివరాల్లోకి వెళితే అహ్మదాబాద్ నుంచి ఢిల్లీకి వచ్చిన విమానం ఉదయం ఒక రన్‌వేపై ల్యాండ్ అయింది. అదే సమయంలో ఢిల్లీ నుంచి బగ్‌డోగ్రాకు వెళ్లాల్సిన విమానానికి అదే రన్ వే మీద నుంచే టేకాఫ్‌కు సిబ్బంది అనుమతినిచ్చారు. అహ్మదాబాద్ విమానం పార్కింగ్ బే దగ్గరకి వాయువేగంతో వస్తూ ఉంటే బగ్‌డోగ్రాకు వెళ్లాల్సిన విమానం టేకాఫ్ అవడానికి ఎదురుగా వస్తోంది. ఆ రెండు విమానాలు ఒకదానికొకటి ఢీకొనవలసిందే. అహ్మదాబాద్-ఢిల్లీలోని మహిళా పైలట్ సోను గిల్ అది చూసి వెంటనే ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీకి) సమాచారం అందించారు. ఏటీసీ అధికారులు వెంటనే టేకాఫ్ అవ్వాల్సిన విమానాన్ని నిలిపివేయడంతో పెను ముప్పు తప్పింది.

బ్రిక్స్ విస్తరణకు భారత్ మద్దతు

- భాగస్వామ్య దేశాల ఏకాభిప్రాయంతో జరగాలి
- బ్రిక్స్ సదస్సులో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ



జోహన్నెస్‌బర్గ్: బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా (బ్రిక్స్)ల దేశాలతో కూడిన బ్రిక్స్ కూటమిని విస్తరించాలన్న ప్రతిపాదనతో భారత్ ముందుకు వచ్చింది. అయితే ఈ విస్తరణ ఏకాభిప్రాయంతో జరగాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. దక్షిణాఫ్రికా జోహన్నెస్‌బర్గ్‌లో జరుగుతున్న బ్రిక్స్ వార్షిక సదస్సులో బుధవారం నాడు ప్రధాని మోదీ ప్రసంగించారు. అద్భుతమైన భవిష్యత్‌కు బ్రిక్స్ సంసిద్ధంగా ఉండాలంటే మనం మన సమాజాలను భవిష్యత్‌కు సిద్ధం చేయాలని ప్రధాని మోదీ చెప్పారు. ఆఫ్రికన్ యూనియన్‌కు జీ20లో శాశ్వత సభ్యత్వాన్ని తాము ప్రతిపాదిస్తున్నట్టుగా చెప్పారు. ''జీ 20 సదస్సును భారత్‌లో సెప్టెంబర్ 9, 10 తేదీల్లో నిర్వహిస్తున్నాం. బ్రిక్స్ దేశాలన్నీ అందులో శాశ్వత సభ్యులే. ఆఫ్రికన్ యూనియన్‌కు కూడా జీ-20లో శాశ్వత సభ్యత్వం ఇవ్వాలని మేము ప్రతిపాదిస్తున్నాం. బ్రిక్స్ భాగస్వామ్య పక్షాలన్నీ ఇందుకు అంగీకరిస్తాయని భావిస్తున్నాం'' అని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. గ్లోబల్ సౌత్ దేశాలకు బ్రిక్స్ సదస్సులో ప్రాధాన్యం కల్పించడాన్ని ప్రధాని స్వాగతించారు. జీ-20 సదస్సులో భారత్ కూడా గ్లోబల్ సౌత్ దేశాలకు అత్యధిక ప్రాధాన్యతనిస్తుందని స్పష్టం చేశారు. గత రెండు దశాబ్దాల్లో బ్రిక్స్ దేశాలు పరస్పర సహకారంతో అత్యంత అద్భుతమైన ప్రయాణాన్ని కొనసాగించాయని ప్రధాని మోదీ అన్నారు. గ్లోబల్ సౌత్ అభివృద్ధిలో బ్రిక్స్‌కు చెందిన న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ కీలక పాత్ర పోషిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. రైల్వే రీసెర్చ్ నెట్‌వర్క్, స్టార్టప్ రంగాల్లో భారత్ చేసిన సూచనలతో అపారమైన అభివృద్ధి జరుగుతోందని అన్నారు.

పశ్చిమ దేశాల వల్లే ఉక్రెయిన్ యుద్ధం: పుతిన్

బ్రిక్స్ సదస్సులో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించిన రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఉక్రెయిన్‌పై యుద్ధం పశ్చిమ దేశాల పాపమేనని ఆరోపించారు. డాన్‌బాస్ ప్రాంతంలో నివసించే ప్రజలకు వ్యతిరేకంగా పశ్చిమ దేశాలు ఉక్రెయిన్‌లో యుద్ధానికి దిగుతున్నాయని నిందించారు. యుద్ధాన్ని నిలిపివేయడమే రష్యా మిలటరీ లక్ష్యమని పుతిన్ అన్నారు. దక్షిణాఫ్రికాకు వస్తే అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు వారెంట్లు మేరకు తనని అరెస్ట్ చేసే అవకాశం ఉందని అందుకే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్నట్లు చెప్పారు.

చంద్రయానాలకు... ఆ మట్టే ప్రయోగశాల...!

న్యూఢిల్లీ: అక్కడ చంద్రుని దక్షిణ ధ్రువం మీద సగర్వంగా జెండా పాతి చంద్రయాన్ -3 విజయనాదం చేసింది. దేశ దక్షిణ కొసన తమిళనాడులో మారుమూల విసిరేసినట్టుగా ఉండే నమ్మక్కల్ లో సంబరాలు మిన్నంటాయి. ఎందుకంటే చంద్రయాన్ ప్రయోగాల్లో అక్కడి మట్టిదే ప్రధాన పాత్ర మరి! ఎందుకు, ఎలా అన్నది ఓ ఆసక్తికరమైన కథ...! 2008లో చంద్రయాన్ -1 అనంతరం తర్వాతి ప్రయోగాలకు ఇస్రో సిద్ధమవుతున్న రోజులవి. చంద్రునిపై సఫ్ట్ లాండింగే లక్ష్యంగా చంద్రయాన్ -2 ను తయారు చేశారు. అది చంద్రునిపై దిగితే అందులోని రోవర్ బయటికి వచ్చి చంద్రుని నేలపై నడిచేలా ప్లాన్ చేశారు. అందుకోసం లాండర్ ను ఎక్కడ దించాలి? రోవర్ ఎలా నడవాలి? ఇవన్నీ ప్రశ్నలే. వాటికి సమాధానం వెదికేందుకు ఇస్రో సిద్ధమైంది. అందుకు చంద్రునిపై ఉండే మట్టి మాదిరి మట్టి కావాలి. అందుకోసం వెదుకులాట మొదలైంది. వారికి సరిపోయే మట్టి నమ్మక్కల్ లో దొరికింది. 2021లో అక్కడి నుంచి 50 టన్నుల మట్టి సేకరించారు. 2019లో చంద్రయాన్ -2 మిషన్‌లో ఆ మట్టితోనే ల్యాండర్, రోవర్ అడుగులను పరీక్షించారు. తాజాగా చంద్రయాన్ -3 ప్రయోగాలకు నమ్మక్కల్ మట్టినే వాడారు.

అది అనర్తో సైట్ మృత్తిక

'చంద్రుని ఉపరితలం మీద ఉన్నది అనర్తో సైట్ రకం మృత్తిక. తమిళనాడులోని కొన్ని చోట్ల అదే రకం మట్టి ఉన్నట్టు మేం యాదృచ్ఛికంగా చేసిన భూగర్భ పరిశోధనల్లో తేలింది. కున్నమలై, సీతంపూంది వంటి నమ్మక్కల్ పరిసర ప్రాంతాల్లో అది పుష్కలంగా దొరికింది'అని పెరియార్ విశ్వవిద్యాలయం జియాలజీ ప్రొఫెసర్ అయిన ఎస్.అన్బళగన్ వెల్లడించారు.

ఏటా రెండుసార్లు బోర్డు పరీక్షలు

- ఇంటర్‌లో ఉత్తమ స్కోరును ఎంచుకునే అవకాశం
- ఎన్‌సీఎఫ్ ప్రతిపాదనలు

న్యూఢిల్లీ: జాతీయ విద్యావిధానంలో భాగంగా పరీక్షల విధానంలో కేంద్రం కొత్త మార్పులకు సిద్ధమైంది. ఇకపై ఇంటర్‌లో ఏటా రెండుసార్లు బోర్డు పరీక్షలు నిర్వహించాలని, భారతీయ భాషలు తప్పనిసరిగా చదవాలని నూతన కరిక్యులమ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్‌సీఎఫ్) ప్రతిపాదనలు చేసింది. అలాగే, 9-12 తరగతుల విద్యార్థులకు కనీస సబ్జెక్టుల సంఖ్యను పెంచాలని చెప్పింది. ఈ మేరకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఎన్‌సీఎఫ్ నివేదికను బుధవారం జాతీయ విద్య, పరిశోధన శిక్షణ మండలికి అందించారు. ఏటా రెండు సార్లు పరీక్షలు నిర్వహించడం వల్ల ఆయా సబ్జెక్టుల్లో విద్యార్థులు ఏ పరీక్షలో అయితే ఉత్తమ మార్కులు సాధిస్తారో వాటినే ఎంచుకునే అవకాశం ఉంటుందని కేంద్ర విద్యాశాఖ చెప్పింది. ఏటా రెండుసార్లు నిర్వహించడం వల్ల విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి లేకుండా పరీక్షలు రాసే అవకాశం ఉంటుందని పేర్కొంది. క్రమక్రమంగా అన్ని బోర్డులు కూడా సెమిస్టర్ లేదా టర్మ్ బేస్డ్ వ్యవస్థకు మారతాయని కేంద్ర విద్యాశాఖ స్పష్టంచేసింది. దీనివల్ల విద్యార్థులు ఒక సబ్జెక్టును పూర్తిచేయగానే అతడు పరీక్ష రాయొచ్చని, ఇలా ఒక పరీక్ష పూర్తయినా విద్యార్థిపై కంటెంట్ భారం తగ్గుతుందని చెప్పింది. ఎన్‌సీఎఫ్‌ను ఇస్రో మాజీ చైర్మన్ కస్తూరిరంగన్ నేతృత్వంలోని జాతీయ స్టీరింగ్ కమిటీ రూపొందించింది. బోర్డు పరీక్షల్లో ఇలాంటి సంస్కరణలు తొలిసారి కాదు. 2009లో పదో తరగతిలో 'నిరంతర సమగ్ర మూల్యాంకనం (సీసీఈ)' విధానాన్ని ప్రవేశపెట్టగా, 2017లో రద్దుచేసి తిరిగి వార్షిక పరీక్షల విధానాన్ని తెచ్చారు. 9, 10 తరగతుల విద్యార్థులు ఇకపై కచ్చితంగా మూడు లాంగ్వేజ్ సబ్జెక్టులు చదవడం తప్పనిసరని ఎన్‌సీఎఫ్ సిఫార్సు చేసింది. వీరు మూడు లాంగ్వేజ్‌లతోపాటు మ్యాథ్స్, కంప్యూటేషనల్ థింకింగ్, సోషల్ సైన్స్, సైన్స్, ఆర్ట్ ఎడ్యుకేషన్, ఫిజికల్ ఎడ్యుకేషన్, వెల్-బియింగ్, వొకేషనల్ ఎడ్యుకేషన్ లాంటి వాటి నుంచి ఏడు సబ్జెక్టులు చదవాల్సి ఉంటుంది.

చరిత్రాత్మక ఘట్టం



ఇస్రో శాస్త్రవేత్తలకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అభినందనలు

న్యూఢిల్లీ: చంద్రుని ఉపరితలంపై చంద్రయాన్-3 విజయవంతంగా ల్యాండ్ కావడాన్ని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చరిత్రాత్మక ఘట్టంగా అభివర్ణించారు. 'యావద్దేశం గర్వపడే ఇలాంటి మహత్తర ఘటన జీవితకాలంలో ఒక్కసారే సంభవిస్తుంది. ఇస్రోకు, ఈ మిషన్‌లో పాలుపంచుకున్న ప్రతీఒక్కరికీ అభినందనలు' అని రాష్ట్రపతి బుధవారం వీడియో సందేశంలో చెప్పారు. మన శాస్త్రవేత్తలు చరిత్రను సృష్టించారని, నిజంగా ఇది అద్భుతమైన ఘట్టమంటూ కొనియాడారు. 'చంద్రయాన్-3 విజయం సమస్త మానవాళి సాధించిన విజయం.. ఇది మానవ సేవలో భారత్ సంప్రదాయ విజ్ఞానంతోపాటు ఆధునిక సైన్స్‌ను ఎంత గొప్పగా వినియోగించుకుందో చూపిస్తుంది' అని పేర్కొన్నారు.

భారత్‌కు శుభాకాంక్షలు: నాసా చీఫ్ బిల్ నెల్సన్



చంద్రుడి దక్షిణ ధ్రువంపై చంద్రయాన్-3 విజయవంతంగా ల్యాండ్ అయినందుకు ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు. జాబిల్లిపై అడుగిడిన నాలుగో దేశంగా నిలిచినందుకు భారత్‌కు శుభాకాంక్షలు. ఈ మిషన్‌లో మీ భాగస్వామిగా ఉన్నందుకు మాకు సంతోషంగా ఉంది.

దేశానికే గర్వకారణం

ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ హర్షం



సాక్షి, అమరావతి: చంద్రయాన్-3 మిషన్ విజయవంతం కావడంపై ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ హర్షం వ్యక్తం చేశారు. ఇస్రో శాస్త్రవేత్తలను అభినందించారు. ఇది దేశానికే గర్వకారణమన్నారు.

సీఎం వైఎస్ జగన్ అభినందనలు



చంద్రుడి ఉపరితలంపై చంద్రయాన్-3 సాఫ్ట్ ల్యాండింగ్ జరగడం దేశం గర్వించదగిన, ప్రతిష్టాత్మకమైన క్షణాలు అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివర్ణించారు. ఇస్రో సైంటిస్టుల బృందాన్ని ఆయన అభినందించారు.

అద్భుతమైన పురోగతికి నిదర్శనం: పుతిన్



చంద్రయాన్-3 ఘట్టం విజయవంతమైనందుకు భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీకి హృదయపూర్వక శుభాకాంక్షలు. అంతరిక్షం అన్వేషణలో ఇది అద్భుతమైన పురోగతి. సైన్స్ ఇంజనీరింగ్‌లో భారత్ సాధించిన అద్భుతమైన పురోగతికి నిదర్శనం.



బ్రిడ్జి కింద నలిగిన బతుకులు

మిజోరంలో ఘోరం..
18 మంది కార్మికుల దుర్మరణం

కోల్‌కతా/ఐజ్వాల్: ఈశాన్య రాష్ట్రం మిజోరంలో బుధవారం ఘోరం జరిగింది. ఐజ్వాల్ జిల్లాలో నిర్మాణంలో ఉన్న 100 మీటర్ల పొడవైన రైల్వే బ్రిడ్జి కుప్పకూలింది. నిర్మాణ పనుల్లో ఉన్న కార్మికుల్లో కనీసం 18 మంది ఈ ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. ఇంకా కనీసం ఐదుగురి జాడ తెలియాల్సి ఉంది. మృతుల్లో అత్యధికులు పశ్చిమ బెంగాల్‌కు చెందిన వారే. ప్రమాద ప్రాంతం సైరంగ్ ఐజ్వాల్‌కు 21 కిలోమీటర్ల దూరంలో ఉంది. కురింగ్ నది మీద నిర్మిస్తున్న బ్రిడ్జి పైకి చేర్చే క్రమంలో గాంట్రీ కుప్పకూలడమే ప్రమాదానికి కారణమని అధికారులు తెలిపారు. ఇప్పటిదాకా 16 మృతదేహాలను వెలికితీశారు. సహాయ, తరలింపు తదితర చర్యల్లో మిజోరం అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాల్సిందిగా బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆదేశించారు. మృతుల కుటుంబాల్లోని అర్హులకు రైల్వే శాఖ పర్మనెంట్ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రమాదంపై విచారణకు ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటైంది. ఈ దుర్ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వెలిబుచ్చారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడ్డవారికి రూ.50 వేల పరిహారాన్ని ప్రధాని కార్యాలయం ప్రకటించింది.

'యూట్యూబ్' చూస్తూ భార్యకు కాన్పు

- మగబిడ్డకు జన్మనిచ్చి.. మరణించిన భార్య
- తమిళనాడులోని కృష్ణగిరి జిల్లాలో దారుణం

హోసూరు: పురిటి నొప్పులతో బాధపడుతున్న భార్యను ఆస్పత్రికి తీసుకెళ్లకుండా యూట్యూబ్‌లో వీడియో చూస్తూ ఓ భర్త కాన్పు చేశాడు. మగబిడ్డకు జన్మనిచ్చిన ఆమె తీవ్ర రక్తస్రావమై మరణించింది. ఈ ఘటన తమిళనాడులోని కృష్ణగిరి జిల్లా హనుమంతపురంలో జరిగింది. హనుమంతపురానికి చెందిన మాదేష్(27)కు పోచ్చంపల్లి సమీపంలోని పులియంబట్టికి చెందిన వేడియప్పన్ కూతురు లోకనాయకి(27)తో రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరిద్దరూ అగ్రికల్చర్ కోర్సులో డిగ్రీ చేశారు. ఇంటి వద్ద పెరట్లో సేంద్రియ పద్ధతిలో పండించిన కూరగాయలనే తినేవారు. ఈ క్రమంలో లోకనాయకి గర్భం దాల్చగా.. ఇంటి వద్దే సహజసిద్ధంగా ప్రసవం చేయాలని వారిద్దరూ నిర్ణయించుకున్నారు. ఇందుకోసం మాదేష్ యూట్యూబ్‌లో వీడియోలు చూస్తుండేవాడు. మంగళవారం తెల్లవారు జామున లోకనాయకికి పురిటినొప్పులు ప్రారంభమయ్యాయి. ఆమెను మాదేష్ ఆస్పత్రికి తీసుకెళ్లకుండా.. ముందుగా నిర్ణయించుకున్న ప్రకారం యూట్యూబ్‌లో చూస్తూ కాన్పుకు సాయం చేశాడు. మగ బిడ్డకు జన్మనిచ్చిన అనంతరం.. లోకనాయకి తీవ్ర రక్తస్రావంతో కోమాలోకి వెళ్లింది. ఆ తర్వాత ఆమెను స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లగా.. పరిశీలించిన డాక్టర్లు లోకనాయకి మరణించినట్లు తెలిపారు.

చంద్రయాన్ విజయంలో మనోళ్లు

కృష్ణ కుమ్మరి



గద్వాల రూరల్: జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవెల్లికి చెందిన శాస్త్రవేత్త కృష్ణ కుమ్మరి చంద్రయాన్ ప్రయోగంలో తనవంతు బాధ్యత నిర్వహించారు. చంద్రయాన్–3లో మిషన్ 2 పేలోడ్స్‌కి డేటా ప్రాసెసింగ్ సాఫ్ట్‌వేర్ రాశానని, ఈడేటా ప్రాసెసింగ్‌తో చంద్రుడిపై వచ్చే ప్రకంపనాలు గుర్తించి రికార్డు చేస్తుందని తెలిపారు.

ఎన్టీపీసీ యువకుడు వెంకట కార్తీక్



జ్యోతినగర్ (రామగుండం): చంద్రయాన్–3 విజయంలో పెద్దపల్లి జిల్లాలోని ఎన్టీపీసీ రామగుండం ప్రాంతానికి చెందిన యువకుడు కాకుమాను వెంకట కార్తీక్ కీలక సేవలు అందించారు. పర్మనెంట్ టౌన్‌షిప్‌కు చెందిన కేఎల్‌వి. సత్యప్రసాద్, రమాదేవి దంపతుల కుమారుడు వెంకటకార్తీక్ బెంగళూరులో ఇస్రో శాస్త్రవేత్త. చంద్రయాన్–3 సురక్షితంగా ల్యాండ్ కావడంలో తనవంతు బాధ్యతలు నిర్వర్తించారు.

సూర్యాపేట జిల్లావాసి బండ సుష్మ



గరిడేపల్లి: చంద్రయాన్–3 విజయవంతంలో సూర్యా పేట జిల్లా గరిడేపల్లికి చెందిన బండ నర్సిరెడ్డి కూతురు బండ సుష్మ భాగస్వాములయ్యారు. బండ సుష్మ ఆమె భర్త ప్రవీణ్‌రెడ్డి ఇరువురు కూడా బెంగళూరులోని ఇస్రో కేంద్రంలో శాస్త్రవేత్తలుగా పనిచేస్తున్నారు. చంద్రయాన్–3 రోవర్ ఆపరేషన్ మేనేజర్‌గా సుష్మ ఉన్నారు. అంతరిక్ష పరిశోధనలో విజయవంతమైన చంద్రయాన్–3లో తమ కూతురు పాలుపంచుకోవడం ఎంతో గర్వంగా ఉందని సుష్మ తండ్రి నర్సిరెడ్డి అన్నారు.

ఉప్పల్ యువ శాస్త్రవేత్త దేవసాని భరత్



ఉప్పల్: ఉప్పల్ నియోజకవర్గ బీజేపీ నేత దేవసాని బాలచందర్ కుమారుడు దేవసాని భరత్ గత 7 సంవత్సరాలుగా బెంగుళూర్ ఇస్రోలో సిగ్నలింగ్ వ్యవస్థలో పనిచేస్తున్నారు. భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం ఏర్పాటు చేసిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ అండ్ సైన్స్ టెక్నాలజీలో (ఐఐఎస్‌టి) చేరాడు. అనంతరం ఇస్రోలో సైంటిస్టుగా అవకాశం వచ్చింది.

కె.కల్పన, చిత్తూరు



కల్పన చంద్రయాన్–3 ప్రాజెక్టులో అసోసియేట్ డైరెక్టర్‌గా వ్యవహరించారు. ప్రయోగం విజయవంతం కావడంలో కీలక పాత్ర పోషించారు. ల్యాండర్ సేఫ్ ల్యాండింగ్ అయిన వెంటనే బెంగళూరులోని ఇస్ట్రాక్ కేంద్రంలో ఇస్రో చైర్మన్ సోమనాథ్ ఆమెను ప్రత్యేకంగా అభినందించారు.

చందన, ఒంటిమిట్ట



కడపలోని అంబేడ్కర్ డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతూ డీఏఐడీ పూర్తిచేసిన చందన విజయవాడలో డీఎస్సీ శిక్షణ తీసుకున్న అనంతరం ఇస్రో పరీక్షలో ఎంపికయ్యారు. ఇస్రోకు ఎంపికైన తర్వాత బెంగళూరు యుఆర్.రావు శాటిలైట్ సెంటర్‌లో పనిచేస్తున్నారు. చంద్రయాన్–3 డిజైనర్‌గా చేశారు.

రాజేంద్రప్రసాద్, రాజంపేట



చంద్రయాన్–3 ప్రయోగం జరుగుతున్న తరుణంలోనే సైంటిస్ట్ అయిన రాజేంద్రప్రసాద్ ఈ ప్రయోగంలో భాగస్వామ్యమయ్యారు. ఎంటెక్ పూర్తిచేశాక హైదరాబాద్‌లోని క్వాల్‌కం కంపెనీ రూ.43 లక్షల ప్యాకేజీ ఆఫర్ వచ్చినా... తన మేథస్సును దేశానికి ఉపయోగించాలని ఆ ఉద్యోగాన్ని తిరస్కరించారు.

దుర్గాప్రసాద్..



అహ్మదాబాద్‌లోని అంతరిక్షం ఇస్రో విభాగమైన ఫిజికల్ రీసెర్చ్ లాబొరేటర్ ప్లానెటరీ శాస్త్రవేత్తగా పనిచేస్తున్న విజయనగరానికి చెందిన డాక్టర్ కరణం దుర్గప్రసాద్‌కు చంద్రయాన్–1 నుంచి ప్రస్తుత చంద్రయాన్–3 వరకు పనిచేసిన అనుభవం ఉంది. చంద్రుని ఉపరితల థర్మోఫిజికల్ ప్రయోగం అనే పరికరం లీడ్స్‌లో దుర్గాప్రసాద్ ఒకరు.






మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షి షాకు పుష్పగుచ్ఛం అందజేసి కుర్చీలో కూర్చోబెడుతున్న సీఎం కేసీఆర్. చిత్రంలో మంత్రి హరీశ్‌రావు, సీఎస్ శాంతికుమారి, ఎంపీలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, బీబీపాటిల్, ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి ● ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ రోహిణి ప్రియదర్శినికి శాలువా కప్పి అభినందిస్తున్న కేసీఆర్ ● బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కేసీఆర్. చిత్రంలో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ● దివ్యాంగులకు పెంచిన పింఛను పత్రాలు అందజేస్తున్న కేసీఆర్, హరీశ్‌రావు

మోసగాళ్లను నమ్మితే గోసే

▶ మొదటి పేజీ తరువాయి

ఎన్నికల్లో బంగాళాఖాతంలో కలపాలని పిలుపునిచ్చారు. ఎన్నికలు రాగానే కాంగ్రెస్ ఆపద మొక్కులు మొక్కుతోందని, ఆనాడు రూ.200 పెన్షన్‌కే పరిమితమై ఇప్పుడు రూ.4 వేలు ఇస్తామని చెబుతున్న ఆ పార్టీని నమ్మొద్దని అన్నారు. వ్యవసాయానికి మూడు గంటల కరెంట్ ఇస్తామని కాంగ్రెస్, వ్యవసాయ కనెక్షన్లకు మీటర్లు పెట్టాలని బీజేపీ అంటున్నాయని విమర్శించారు. సీఎం కేసీఆర్ బుధవారం మెదక్ జిల్లా కేంద్రంలో పర్యటించారు. సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయం, జిల్లా పోలీసు కార్యాలయం, బీఆర్ఎస్ పార్టీ కార్యాలయ భవనాలను ప్రారంభించారు. అనంతరం మెదక్ చర్చి గ్రౌండ్స్‌లో నిర్వహించిన ప్రగతి శంఖారావం బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి ప్రసంగించారు.

ధరణితో ఇబ్బందులు తొలగిపోయాయి..

'వరి ధాన్యం పండించడంలో రాష్ట్రం పంజాబ్‌ను మించి పోయింది. రైస్ మిల్లులు చాలనంత ధాన్యం పండుతోంది. ధరణి వచ్చాకే వారి భూములపై రైతులకు సర్వహక్కులు దక్కాయి. ధరణి రాకముందు వీఆర్‌ఓ మొదలుకుని సీసీఎల్ఏ సెక్రటరీ వరకు అంతా వారి చేతుల్లోనే ఉండేది. రైతులు ఆయా కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. తమ పంటలను విక్రయించాలంటే అనేక ఇబ్బందులు పడేవారు. సేట్లు.. బీట్ల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండేది. ధాన్యం డబ్బుల కోసం వెళితే వారం తర్వాత రావాలని, నెల రోజుల తర్వాత రావాలనే సమాధానం ఎదురయ్యేది. ధరణితో పరిస్థితి మారింది. రైతులు పండించిన ధాన్యమంతా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం కొనుగోలు చేయడం సాధ్యమవుతోంది. రైతుబంధు, రైతుబీమా వంటి పథకాల ద్వారా ప్రభుత్వం నుంచి వచ్చే లబ్ధి నేరుగా రైతుల ఖాతాల్లో జమ అవుతోంది. అదే ధరణి రద్దయితే కైలాసంలో పెద్ద పాము మింగినట్టు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతుంది..' అని కేసీఆర్ హెచ్చరించారు.

ఆలస్యమైనా రుణమాఫీ చేశాం..

'కరోనా, కేంద్రం తీసుకున్న పెద్దనోట్ల రద్దు వంటి కారణాలతో ఆలస్యమైనప్పటికీ, ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా రూ.37 వేల కోట్ల రైతుల పంట రుణాలను మాఫీ చేశాం. రైతు బీమా పథకం అమెరికా, ఇంగ్లండ్..ఇలా ప్రపంచంలో ఏ దేశంలోనూ లేదు. గుంట భూమి ఉన్న రైతు చనిపోయినా రూ.5 లక్షల బీమా పరిహారం సొమ్ము బాధిత రైతు కుటుంబానికి చెందిన వారి ఖాతాలో జమ చేస్తున్నాం. ఒక్క చాన్స్ ఇవ్వండని అడుగుతున్న కాంగ్రెస్ పార్టీతో పాటు, టీడీపీ కూడా అధికారంలో ఉన్నప్పుడు ఘనపురం ఆనకట్టను పట్టించుకోలేదు. సింగూరు ప్రాజెక్టును హైదరాబాద్‌కు పరిమితం చేసి, మెదక్, నిజామాబాద్ జిల్లాల్లో పంటలను ఎండ బెట్టారు. తెలంగాణలో అమలవుతున్న రైతు సంక్షేమ పథకాలను చూసి మహారాష్ట్ర ప్రజలు మనకు బ్రహ్మరథం పడుతున్నారు. తెలంగాణలో మాదిరిగానే మహారాష్ట్రలో కూడా బీఆర్ఎస్‌ను గెలిపించుకుంటామని ఆ రాష్ట్ర రైతులు అంటున్నారు..' అని సీఎం తెలిపారు.

సంసారాన్ని నడిపినట్లే..

'సర్కారును నడపడమంటే సంసారాన్ని నడిపినట్లే. రాష్ట్ర ఆదాయం పెరుగుతున్న మేరకు కల్యాణలక్ష్మి, పెన్షన్ మొత్తాన్ని క్రమంగా పెంచుకుంటూ వెళుతున్నాం. ప్రభుత్వ ఆదాయం పెరిగే కొద్దీ ఆయా సంక్షేమ పథకాల మొత్తాన్ని పెంచుతాం. అక్టోబర్‌లో వరంగల్‌లో జరగనున్న బహిరంగ సభలో అన్ని నిర్ణయాలు ప్రకటిస్తాం. ఎన్నికలు వస్తే ఆగం కావద్దు. ధీరత్వాన్ని ప్రదర్శించాలి. ఎవరు నిజమైన ప్రజా సేవకులో, వాస్తవం ఏంటో గుర్తిస్తే మంచి ఫలితాలు వస్తాయి..' అని కేసీఆర్ అన్నారు. బహిరంగ సభలో మంత్రులు టి.హరీశ్‌రావు, మహమూద్ అలీ, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎంపీలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, బీబీ పాటిల్, ఎమ్మెల్యేలు పద్మాదేవేందర్‌రెడ్డి, క్రాంతికిరణ్, రసమయి బాలకిషన్, భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పది సీట్లు సీఎంకు కానుకగా ఇస్తాం: హరీశ్‌రావు

మెదక్: మెదక్ జిల్లాకు దివంగత ప్రధానమంత్రి ఇందిరాగాంధీ చేయలేని పనులను ముఖ్యమంత్రి కేసీఆర్ చేశారని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. మెదక్ సభలో ఆయన మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించాక మెదక్‌కు రైలు వచ్చిందని, ఈ ప్రాంత ప్రజల దశాబ్దాల కల నెరవేరిందని అన్నారు. కాళేశ్వరం ద్వారా మెదక్ జిల్లాకు నీళ్లు అందుతున్నాయని, మండుటెండలో సైతం మత్తడులు దుంకుతున్నాయని చెప్పారు. నేడు దేశంలోనే మన రాష్ట్రం మొదటి స్థానంలో ఉండడానికి కర్త, కర్మ, క్రియ కేసీఆర్ అని కితాబిచ్చారు. ప్రతిపక్షాలు అబద్ధాలతో కాలం గడుపుతుంటే కేసీఆర్ మాత్రం అభివృద్ధితో దూసుకెళ్తున్నారని చెప్పారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో పదికి పది సీట్లు గెలిచి ముఖ్యమంత్రికి కానుకగా అందిస్తామని హరీశ్ అన్నారు.

బుజ్జగింపులు.. రాజీనామాలు

▶ మొదటి పేజీ తరువాయి

కార్యాచరణ ప్రకటిస్తానని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ఆహ్వానిస్తే ఆ పార్టీలో చేరడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కాగా నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం బుధవారం తన అనుచరులతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. బీఆర్ఎస్‌కు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. వారం రోజుల్లో తాను ఏ పార్టీలో చేరేది ప్రకటిస్తానని చెప్పిన వేముల వీరేశం నకిరేకల్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు సన్నాహాలు చేసుకుంటున్నట్లు తెలిసింది. ఇక పటాన్‌చెరు టికెట్ ఆశించిన చిట్కుల్ సర్పంచ్ నీలం మధు ముదిరాజ్‌కు టికెట్ ఇవ్వాలంటూ ఇస్నాపూర్‌లో ఆయన వర్గీయులు ర్యాలీ నిర్వహించారు. ముంబై జాతీయ రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. కాగా గురువారం తన అనుచరులతో సమావేశమైన తర్వాత రాజకీయ భవిష్యత్తుపై ప్రకటన చేస్తానని నీలం మధు వెల్లడించారు. రాజీనామాల పర్వం ఇలా ఉంటే మరోవైపు బుజ్జగింపు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి.

రాజయ్య నివాసానికి కడియం, పల్లా

స్టేషన్ ఘనపూర్ బీఆర్ఎస్ టికెట్ దక్కించుకున్న ఎమ్మెల్సీ కడియం శ్రీహరి.. మరో ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డితో కలిసి సిట్టింగ్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య నివాసానికి వెళ్లారు. ఆయన అందుబాటులో లేకపోవడంతో ఫోన్‌లో మాట్లాడారు. తాను గురువారం కలుస్తానని ఎమ్మెల్సీ పల్లాకు ఎమ్మెల్యే రాజయ్య సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. ఇంకోవైపు సీఎం ఆదేశాల మేరకు ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వర్‌రావు మిర్యాలగూడ ఎమ్మెల్యే భాస్కర్ రావుతో కలిసి బుధవారం హైదరాబాద్‌లో మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో భేటీ అయ్యారు. ఈ భేటీలో కేసీఆర్ సందేశాన్ని తుమ్మలకు వివరించడంతో పాటు ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల కోసం కలిసి పనిచేద్దామని ప్రతిపాదించినట్లు సమాచారం. పార్టీలో చేరిన నాటి నుంచి తుమ్మలకు ఇస్తున్న ప్రాధాన్యతను వివరిస్తూ ఆయన సేవలు పార్టీకి అవసరమనే విషయాన్ని నామా వివరించారు. ఈ ప్రతిపాదనకు తుమ్మల కూడా సానుకూలంగా స్పందించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

నేడు మంత్రిగా పట్నం ప్రమాణ స్వీకారం



ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి గురువారం మధ్యాహ్నం 3 గంటలకు రాజ్‌భవన్‌లో రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. తాండూరు అసెంబ్లీ టికెట్‌ను ఆశించిన మహేందర్ రెడ్డిని రాజీ ఫార్ములాలో భాగంగా మంత్రివర్గంలోకి తీసుకోవాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా పనిచేసిన ఈటల రాజేందర్ బర్తరఫ్‌తో 2021 మే నుంచి ఖాళీగా ఉన్న స్థానంలో మహేందర్ రెడ్డికి అవకాశం ఇవ్వనున్నారు. ఆయనకు సీఎం కేసీఆర్ వద్ద ఉన్న రెవెన్యూ లేదా నీటి పారుదల శాఖను అప్పగించే అవకాశమున్నట్లు సమాచారం. కాగా తాండూరు బీఆర్ఎస్ టికెట్‌ను సిట్టింగ్ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డికి కేటాయించిన సంగతి తెలిసిందే.

మైనంపల్లి వచ్చాకే నిర్ణయం!

మంత్రి హరీశ్‌రావుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుపై వేటు వేసేందుకు బీఆర్ఎస్ సన్నద్ధమవుతున్నట్లు సమాచారం. అయితే మైనంపల్లి ఇంకా పుణ్యక్షేత్రాల పర్యటనలోనే ఉన్నారు. బుధవారం తమిళనాడులోని కుంభకోణంలో దైవదర్శనం చేసుకున్న మైనంపల్లి గురువారం సాయంత్రం హైదరాబాద్‌కు చేరుకుంటారని సమాచారం. మైనంపల్లికి బీఆర్ఎస్ మల్కాజిగిరి టికెట్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. కాగా హైదరాబాద్‌కు చేరుకున్న తర్వాత మైనంపల్లి చేసే ప్రకటన ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోవాలని సీఎం కేసీఆర్ భావిస్తున్నట్లు తెలిసింది. మైనంపల్లిపై వేటు పడుతుందనే అంచనాతో పలువురు ఆశావహులు ఆ స్థానంలో పోటీకి తమ ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

అసంతృప్తులకు గాలం

- బీఆర్ఎస్ నేతలను పార్టీలో చేర్చుకునేందుకు కాంగ్రెస్ ప్రయత్నం
- ఈనెల 26న ఖర్గే సభలో పెద్ద ఎత్తున చేరికలు
- నల్లగొండ అసెంబ్లీకి ఎంపీ కోమటిరెడ్డి దరఖాస్తు

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యే టికెట్ ఆశించి భంగపడినవారు.. స్థానిక ఎమ్మెల్యేలపై అసంతృప్తి ఉన్న బీఆర్ఎస్‌నేతలను పార్టీలో చేర్చుకునేందుకు కాంగ్రెస్‌లో కసరత్తు కొనసాగుతోంది. బీఆర్ఎస్ అభ్యర్థుల జాబితా ప్రకటించిన రోజే కాంగ్రెస్ ఈ ఆపరేషన్ మొదలుపెట్టగా, త్వరలోనే సత్ఫలితాలు వస్తాయని గాంధీభవన్ వర్గాలు చెబుతున్నాయి. అయితే..ఎవరితో చర్చిస్తున్నారు? ఎక్కడ కలిసి మాట్లాడుతున్నారు? ఎవరు డీల్ చేస్తున్నారు? అనే విషయాలను మాత్రం గోప్యంగా ఉంచుతున్నారు. ఈ నెల 26న చేవెళ్లలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సమక్షంలో భారీఎత్తున ఇతర పార్టీల నుంచి నాయకులను చేర్చుకునేందుకు టీపీసీసీ సమాయత్తమవుతోంది. ఈ నేపథ్యంలో చేవెళ్ల సభలోభారీగా చేరికలుంటాయని కాంగ్రెస్‌పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

సీతా దయాకర్‌రెడ్డి ఇంటికి మల్లురవి

టీడీపీ సీనియర్ మహిళానేత, దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే సీతాదయాకర్‌రెడ్డిని పార్టీలోకి రావాలని కాంగ్రెస్ ఆహ్వానించింది. టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లురవి తదితరులు బుధవారం హైదరాబాద్‌లోని ఆమె నివాసానికి వెళ్లి ఈ మేరకు ఆహ్వానించారు. సీతా దయాకర్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని కాంగ్రెస్ నేతలు వెల్లడించారు.

జూబ్లీహిల్స్ టికెట్‌కు అజహరుద్దీన్ దరఖాస్తు

జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ టికెట్ కోసం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, టీం ఇండియా మాజీ కెప్టెన్ అజహరుద్దీన్ బుధవారం దరఖాస్తు చేసుకున్నారు.



500 దాటిన దరఖాస్తులు

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసేందుకు దరఖాస్తులు పెద్ద సంఖ్యలో సమర్పిస్తున్నారు. ఈ నెల18న దరఖాస్తుల స్వీకరణ మొదలు కాగా, మంగళవారం వరకు 300కు పైగా దరఖాస్తులు వచ్చాయి. బుధవారం ఒక్కరోజే 200 దరఖాస్తులు వచ్చాయని, దీంతో ఆ సంఖ్య 500 దాటిందని టీపీసీసీ వర్గాలు వెల్లడించాయి. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఈనెల 25వ తేదీ వరకు కొనసాగుతుందని గాంధీభవన్ వర్గాలు తెలిపాయి.

- నల్లగొండ అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి పోటీ చేసేందుకు ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బుధవారం దరఖాస్తు చేసుకున్నారు.
- మాజీమంత్రి కొండా సురేఖ, టీపీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.ఆర్.జి.వినోద్‌రెడ్డిలు కూడా తమ దరఖాస్తులను గాంధీభవన్‌లో ఇచ్చారు.
- మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు తోపాటు 10 మంది మహిళానేతలు బుధవారం టికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు.

బీసీ గర్జన సభకు రండి

కర్ణాటక సీఎంకు కాంగ్రెస్ నేతల ఆహ్వానం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న బీసీ గర్జన సభకు రావాలని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను రాష్ట్ర కాంగ్రెస్ నేతలు ఆహ్వానించారు. ఈమేరకు బుధవారం బెంగళూరులోని సీఎం కార్యాలయంలో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, మాజీ ఎంపీ వి.హనుమంతరావులు సీఎం సిద్ధరామయ్యను కలిసి ఆహ్వానించారు. తమ ఆహ్వానానికి సిద్ధరామయ్య సానుకూలంగా స్పందించారని, బీసీ డిక్లరేషన్ సభకు తప్పకుండా వస్తానని చెప్పారని భట్టి కార్యాలయ వర్గాలు వెల్లడించాయి.

బొల్లం మల్లయ్యకు సహకరించేది లేదు

కోదాడలో బీఆర్ఎస్ అసమ్మతినేతల స్పష్టీకరణ

కోదాడ: సూర్యాపేట జిల్లా కోదాడ బీఆర్ఎస్ అభ్యర్థి బొల్లం మల్లయ్యయాదవ్‌ను మార్చాలని లేకుంటే తమ పదవులకు మూకుమ్మడిగా రాజీనామా చేస్తామని అసమ్మతి నేతలు ప్రకటించారు. బుధవారం కోదాడ పెరిక భవన్‌లో సమావేశం అయిన నేతలు ప్రస్తుత ఎమ్మెల్యే, వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి బొల్లం మల్లయ్యయాదవ్‌పై విమర్శలు చేశారు. తమ నిరసనను లిఖిత పూర్వకంగా అధిష్టానానికి పంపారు. వచ్చే ఎన్నికల్లో కోదాడ అభ్యర్థిగా మల్లయ్యయాదవ్‌ను ప్రకటించడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. కోదాడ నియోజకవర్గ పార్టీ మాజీ ఇన్‌చార్జి శశిధర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో కోదాడ మాజీ ఎమ్మెల్యే చందర్‌రావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎర్నేనిబాబు, డీసీసీబీ మాజీ చైర్మన్ పాందురంగారావు, కోదాడ మున్సిపల్ చైర్‌పర్సన్ వనపర్తి శిరీష లక్ష్మీనారాయణ, చిలుకూరు, మోతె ఎంపీపీలు బండ్ల ప్రశాంతికోటయ్య, ఆశా శ్రీకాంత్‌రెడ్డి, అనంతగిరి, మోతె తదితరులు పాల్గొన్నారు.

అలకబూనిన మోత్కుపల్లి

నేడు యాదగిరిగుట్టలో ముఖ్యులతో సమావేశం



సాక్షి, యాదాద్రి: అసెంబ్లీ ఎన్నికల్లో ఆలేరు నుంచి బీఆర్ఎస్ తరఫున పోటీ చేయాలనుకున్న సీనియర్ నేత మోత్కుపల్లి నర్సింహులుకు అవకాశం దక్కకపోవడంతో భవిష్యత్ కార్యాచరణకు సిద్ధమవుతున్నారు. గురువారం యాదగిరిగుట్టలో తన అనుచరులతో సమావేశం అవుతున్నారు. దళితబంధు పథకం ప్రవేశపెట్టిన సమయంలో కేసీఆర్ మోత్కుపల్లి సలహాలు, సూచనలు తీసుకున్నారు. అయితే, ఆ తర్వాత పట్టించుకోలేదు. ఆరు నెలలుగా కేసీఆర్ అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వకపోవడం అవమానంగా భావిస్తున్నారు. టికెట్లు ప్రకటించే సమయంలోనైనా సిట్టింగులకే ఇస్తున్నామని మాట వరుసకైనా చెప్పలేదన్న ఆవేదన ఆయనలో ఉందని అనుచరులు చెబుతున్నారు.

నమ్ముకున్న నాయకులు న్యాయం చేయలేదు

వైరా ఎమ్మెల్యే రాములునాయక్



వైరా: 'నేను నమ్ముకున్న నాయకులు న్యాయం చేయలేదు. నాకు టికెట్ రాకపోవడంతో నియోజకవర్గ వ్యాప్తంగా కార్యకర్తలు బరువెక్కిన హృదయంతో ఉన్నారు. ఏది ఏమైనా సీఎం కేసీఆర్ తీసుకునే ఏ నిర్ణయానికైనా కట్టుబడి ఉంటా' అని ఖమ్మం జిల్లా వైరా ఎమ్మెల్యే రాములునాయక్ అన్నారు. బుధవారం ఆయన వైరాలోని తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తనకు ఎమ్మెల్సీ ఇస్తానని చెప్పారని, అయితే వృద్ధాప్యంలో ఉన్నందున వద్దన్నానని తెలిపారు. తనకు ఎలాంటి అసంతృప్తి లేదని, అందరితో కలిసి పని చేస్తానని, వైరా టికెట్ కేటాయించిన మదన్‌లాల్ గెలుపు కోసం కృషి చేస్తానని అన్నారు. సీఎం కేసీఆర్ భగవంతుడి కంటే ఎక్కువని, అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తున్నారని చెప్పారు. చీకటి తర్వాత వెలుగు వస్తుందంటూ కేసీఆర్ ఆశీర్వాదం ఎప్పటికైనా తనకు లభిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ వైపు కామ్రేడ్ల చూపు

- బీఆర్ఎస్‌తో బ్రేకప్‌తో కాంగ్రెస్ నేతల ఆహ్వానానికి ఎదురుచూపు
- ఒకవేళ కాంగ్రెస్‌తోనూ పొత్తు సాధ్యం కాకుంటే సొంతంగా పోటీ



సాక్షి, హైదరాబాద్: కమ్యూనిస్టులు ఇప్పుడు కాంగ్రెస్ వైపు చూస్తున్నారు. బీజేపీ, బీఆర్ఎస్‌ను ఓడించే సత్తా ఉన్న ఆ పార్టీతో జత కట్టాలని భావిస్తున్నారు. బీఆర్ఎస్‌తో పొత్తు వికటించిన నేపథ్యంలో కాంగ్రెస్‌తో వెళ్లక తప్పని పరిస్థితి నెలకొంది. పైగా దేశంలో 'ఇండియా' కూటమిలో కాంగ్రెస్, కమ్యూనిస్టులు ఉన్న విషయం తెలిసిందే. అయితే కాంగ్రెస్ స్వయంగా ఆహ్వానిస్తేనే ముందుకు సాగాలని, అప్పటివరకు వేచి చూడాలని సూత్రప్రాయంగా నిర్ణయించినట్టు తెలిసింది. పొత్తుల విషయంలో ప్రజల్లో పలుచన కాకుండా హుందాగా ముందుకు సాగాలన్నది కమ్యూనిస్టుల అభిప్రాయం.

బీఆర్ఎస్ తీరును ఎండగట్టాలని నిర్ణయం

దేశంలోనూ, రాష్ట్రంలోనూ బీజేపీ ఓటమే లక్ష్యంగా లెఫ్ట్ పార్టీలు పనిచేస్తున్నాయి. మతోన్మాదం పెరుగుతున్నందున, బీజేపీకి అడ్డుకట్ట వేసే పార్టీలు ఏవైనా సరే వాటితో ముందుకు సాగాలని నిర్ణయించాయి. ఆ ప్రకారమే ఎన్నికల్లో పొత్తులు పెట్టుకుంటున్నాయి. గతేడాది మునుగోడు ఉపఎన్నిక సందర్భంగా బీజేపీకి అడ్డుకట్ట వేసే శక్తి బీఆర్ఎస్‌కే ఉందని భావించి ఆ పార్టీతో సీపీఐ, సీపీఎంలు జతకట్టాయి. అప్పుడు వాటి ఓట్లతోనే బీఆర్ఎస్ గట్టెక్కిందన్న విషయం అందరికీ తెలిసిందే. మునుగోడు ఉప ఎన్నిక సందర్భంగా సీఎం కేసీఆర్ కమ్యూనిస్టులతో పొత్తు కొనసాగుతుందని చెప్పారు. ఖమ్మంలో జరిగిన సభలోనూ సీపీఐ జాతీయ ప్రధానకార్యదర్శి డి.రాజా, సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు, కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, ఆ పార్టీల రాష్ట్ర కార్యదర్శులు కూనంనేని సాంబశివరావు, తమ్మినేని వీరభద్రం పాల్గొని తమ ఐక్యత చాటారు. కానీ కేసీఆర్ తమను మోసం చేశారని కమ్యూనిస్టులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా, బీఆర్ఎస్‌తో కమ్యూనిస్టుల పొత్తుకు బ్రేక్ పడడంతో కాంగ్రెస్ పార్టీ ప్రస్తుత పరిణామాలను క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. 'వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, కమ్యూనిస్టులు కలిసి పోటీ చేస్తే అధికారం ఖాయం. కాబట్టి మీరు మావైపు రండి. మీరు అడిగినన్ని సీట్లు ఇస్తామని' గతంలో కాంగ్రెస్ నేతలు లెఫ్ట్ నేతలతో అన్నారు. అప్పుడు కాంగ్రెస్ ఆహ్వానాన్ని లెఫ్ట్ పార్టీలు పెడచెవిన పెట్టాయి. కానీ ఇప్పుడు కాంగ్రెస్ ఎలాంటి వైఖరి అనుసరిస్తుందో చూడాలని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఒకవేళ కమ్యూనిస్టులతో పొత్తు పెట్టుకోకుంటే.. బీఆర్ఎస్ వ్యతిరేక ఓట్లు చీలిపోతాయని, దీనివల్ల అధికార పార్టీకి ప్రయోజనం కలుగుతుందని అంటున్నారు. ఏదిఏమైనా ఈసారి బీఆర్ఎస్ తీరును తీవ్రంగా ఎండగట్టాలని లెఫ్ట్ పార్టీలు యోచిస్తున్నాయి.

ఇప్పుడు రెండే ప్రత్యామ్నాయాలు

ఇప్పుడు కమ్యూనిస్టుల ముందున్నవి రెండే ప్రత్యామ్నాయాలు. ఒకటి కాంగ్రెస్‌తో కలిసి నడవడం, రెండోది వామపక్ష, ఇతర పార్టీలతో జతకట్టి ముందుకు సాగడం. ఒకవేళ కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుంటే చెరి ఐదు అసెంబ్లీ స్థానాలు తప్పక సాధించాలన్నది ఆ పార్టీల యోచన. గౌరవప్రదమైన స్థానాలను కేటాయించడంలో కాంగ్రెస్ విఫలమైతే, రెండు కమ్యూనిస్టు పార్టీలు చెరి 25 స్థానాల్లో పోటీ చేసే ఆలోచనలో ఉన్నాయి. బీజేపీని ఓడించడం తమకే కాదు ఆయా ప్రతిపక్షపార్టీలకు కూడా అవసరమేనంటున్నారు. తాము గెలవకపోయినా, ఓడించే సత్తా మాత్రం ఉందంటున్నారు. తమకంటే వారికే తీవ్రమైన నష్టమంటున్నారు. అధికారం కావాలంటే తమ అవసరం ఆయా పార్టీలకు ఉందంటున్నారు. ఎలాగైనా ఈసారి అసెంబ్లీలో అడుగుపెట్టాలని కమ్యూనిస్టులు కృతనిశ్చయంతో ఉన్నారు.

కమ్యూనిస్టులకు కేసీఆర్ పంగనామాలు

- బీజేపీతో ఒప్పందం మేరకే వాళ్లను కరివేపాకుల్లా వాడుకుని వదిలేశారు
- తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ బొందలగడ్డగా మారింది
- బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం ఒక్కటే... ఆ మూడు పార్టీలను ఓడించండి
- మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్ చేరిక కార్యక్రమంలో టీపీసీసీ చీఫ్ రేవంత్



చంద్రశేఖర్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రేవంత్, చిత్రంలో ఠాక్రే

సాక్షి, హైదరాబాద్: బీజేపీతో పొత్తు ఖాయమైంది కాబట్టే కమ్యూనిస్టులకు కేసీఆర్ పంగనామాలు పెట్టారని టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. 'మునుగోడులో కమ్యూనిస్టులతో కలిసిన సందర్భంలో వారితో పొత్తు పెట్టుకుని బీజేపీ, కాంగ్రెస్‌లకు ప్రత్యామ్నాయంగా పోటీ చేస్తామని కేసీఆర్ ప్రకటించారు. కానీ ఢిల్లీ వెళ్లి మోదీని కలిసిన కేసీఆర్ అమిత్‌షాతో చీకటి ఒప్పందం కుదుర్చుకున్నారు. అందుకే కమ్యూనిస్టులను కరివేపాకులా వాడుకుని వదిలేశారు' అని చెప్పారు. బుధవారం గాంధీభవన్‌లో మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్ తన అనుచరులతో కలిసి రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ, బీజేపీతో ఒప్పందం మేరకే కమ్యూనిస్టులకు సీట్లు ఇవ్వకుండా ఏకపక్షంగా కేసీఆర్ అసెంబ్లీ అభ్యర్థుల పేర్లను ప్రకటించారని అన్నారు. తెలంగాణ సాధనలో కీలకపాత్ర పోషించిన చంద్రశేఖర్ కాంగ్రెస్‌లోకి రావడం సంతోషకరమని, ఆయనకు పార్టీలో సముచిత స్థానం ఉంటుందని చెప్పారు.

సాగర్ కట్టమీద చర్చిద్దాం వస్తారా?

కాంగ్రెస్ పార్టీ ఏం చేసిందని బీఆర్ఎస్ నేతలు ప్రశ్నిస్తున్నారని, చరిత్ర తిరిగేసి చూస్తే కాంగ్రెస్ ఏం చేసిందో బీఆర్ఎస్ నేతలకు అర్థమవుతుందని రేవంత్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఏం చేసిందో నాగార్జున సాగర్ ప్రాజెక్టు కట్ట మీద కూర్చుని చర్చిద్దాం వస్తారా? అని బీఆర్ఎస్ నేతలకు ఆయన సవాల్ విసిరారు. కాంగ్రెస్ ఔటర్ రింగ్ రోడ్డు నిర్మిస్తే.. కేసీఆర్ 7,500 కోట్లకు తెగనమ్ముకున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులు నిర్మిస్తే కాళేశ్వరం పేరుతో కేసీఆర్ లక్షకోట్లు మింగాడని, కాంగ్రెస్ హయాంలో 25 లక్షల ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తే, డబుల్ బెడ్‌రూం ఇళ్ల పేరుతో పేద ప్రజల ఓట్లను దండుకునేందుకు వారిని కేసీఆర్ మోసం చేస్తున్నారని చెప్పారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టిన చోట తాము ఓట్లు అడగబోమని, ఇందిరమ్మ ఇళ్లు కట్టిన చోట్ల బీఆర్ఎస్ ఓట్లు అడగకుండా ఉంటారా అని రేవంత్ సవాల్ విసిరారు. తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ బొందలగడ్డ అయిందని విమర్శించారు. కామారెడ్డికి గోదావరి నీళ్లు తెచ్చిన తర్వాతే కేసీఆర్ అక్కడ పోటీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎంలు ఒక్కటేనన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని, 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను భర్తీ చేస్తామని, రూ.5 లక్షల వరకు పేదల వైద్య ఖర్చులను ఆరోగ్యశ్రీ ద్వారా భరిస్తామని, రూ.500కే గ్యాస్ సిలెండర్ ఇస్తామని, ప్రతి పేద వ్యక్తి ఇల్లు కట్టుకునేందుకు రూ.5 లక్షల సాయం అందిస్తామని పునరుద్ఘాటించారు. ఈనెల 26న చేవెళ్లలో జరిగే బహిరంగసభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు.



జాతీయ జెండాతో గవర్నర్ తమిళిసై



వీర విక్రమ.. చంద్ర దిగ్గజ.. జయహో

చంద్రయాన్-3 సక్సెస్‌పై గ్రేటర్‌లో హర్షాతిరేకాలు | అంతటా ఉద్విగ్న క్షణాలు.. ఆలయాల్లో పూజలు | బిర్లా ప్లానెటోరియం, ఓయూ క్యాంపస్, ప్రెస్‌క్లబ్‌ల్లో ప్రత్యేక ప్రదర్శనలు | టీవీలకు అతుక్కుపోయిన నగరవాసులు | చంద్రయాన్-3లో భాగస్వామిగా నగర సంస్థలు | ఇటీవల ఓయూ వేదికగా చంద్రయాన్ అంశాలను వివరించిన వ్యోమగామి రాకేష్ శర్మ



రాజేంద్రనగర్‌లోని శివానగర్‌లో..

ఎన్నాళ్లో వేచిన సాయంత్రం. నగరమంతటా ఉత్కంఠమయం. చందమామపైకి విక్రమ్ ఎప్పుడెప్పుడు వెళ్తాడా అనే ఉద్విగ్న సమయం. చివరికి 'మామ'ను ముద్దాడిన ఆనంద వీక్షణం. నగరం ఒక్కసారిగా హర్షాతిరేకాలతో తడిసిముద్దైన తన్మయత్వం.. భారత్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చంద్రయాన్- 3 ప్రయోగం విజయవంతం. అంబరమంటిన సంబరం. అంతర్జాతీయ అంతరిక్ష యవనికపై ఇండియా జెండా సమున్నతంగా ఎగిసిన వేళ సరికొత్త అధ్యాయానికి నాంది పలికింది. ఈ అరుదైన క్షణాల కోసం నగర వాసులు నరాలు తెగే ఉత్కంఠగా ఎదురుచూశారు. విక్రమ్ రోవర్ ల్యాండింగ్‌ను చూడటానికి టీవీలకు అతుక్కుపోయారు. పలు ప్రాంతాల్లో వందల సంఖ్యలో విద్యార్థులు, పరిశోధకులతో పాటు పౌరులంతా ఈ అద్భుత క్షణాలను వీక్షించడానికి ప్రత్యేక ప్రసార వేదికలను ఏర్పాటు చేయడం గమనార్హం.

– సాక్షి, సిటీబ్యూరో/కూకట్‌పల్లి/గన్‌ఫౌండ్రీ/సంతోష్‌నగర్/ ఉస్మానియా యూనివర్సిటీ



సంబరాల్లో పాల్గొన్న అంబర్‌పేట జైస్వాల్ గార్డెన్‌వాసులు



ఖైరతాబాద్ రాజ్‌నగర్ శ్రీ వీర హనుమాన్ ఆలయంలో పూజలు చేస్తున్న స్థానికులు



శంషాబాద్‌లో జాతీయ జెండాలను ప్రదర్శిస్తున్న ఎంపీ బండి సంజయ్ తదితరులు

చంద్రయాన్- 3పై బుధవారం ఉదయం నుంచే సిటీజనులు సోషల్ మీడియా వేదికగా అప్‌డేట్స్‌ను షేర్ చేస్తూ ఆసక్తి కనబరిచారు. సాయంత్రం 5.44 గంటలకు చంద్రయాన్ తన గమ్యస్థానాన్ని చేరుకుంటుందని తెలియడంతో టీవీలకు అతుక్కుపోయారు. నగరంలోని బిర్లా ప్లానెటోరియం, సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లు వేదికలుగా లైవ్ షోలు ఏర్పాటు చేశారు. పాఠశాల విద్యార్థులు ప్రత్యక్షంగా వీక్షించారు. ప్లానెటోరియంలో గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ ముఖ్య అతిథిగా పాల్గొని సేఫ్ ల్యాండింగ్‌ను వీక్షించారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఉస్మానియా వేదికగా, ఓయూలోని ఠాగూర్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రదర్శనలో వందల సంఖ్యలో విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు. పలు రెస్టారెంట్లు, మాల్స్‌ల్లోనూ చంద్రయాన్‌ను ప్రత్యక్షంగా వీక్షించారు. సైఫాబాద్ సైన్స్ కాలేజ్ విద్యార్థులు త్రివర్ణ పతాకాలతో వేడుకలను నిర్వహించారు. చంద్రయాన్ ప్రయోగం విజయవంతం కావాలంటూ బంజారాహిల్స్, కూకట్‌పల్లి తదితర ప్రాంతాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చంద్రయాన్ -3 ప్రయోగం విజయవంతమైన సందర్భంగా పలువురు ప్రముఖులు తమ స్పందనలు ఇలా వ్యక్తం చేశారు.

అపుడే చెప్పెను రాకేశ్ శర్మ..

ఇటీవల నగరలోని ఉస్మానియా వేదికగా ఓ కార్యక్రమంలో పాల్గొన్న భారత తొలి వ్యోమగామి రాకేష్ శర్మ ఇస్రో పరిశోధనల గురించి పలు అంశాలను వెల్లడించారు. భారత్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చంద్రయాన్-3, గగన్‌యాన్‌లకు సంబంధించిన అంశాలను వెల్లడించారు. చంద్రయాన్-3 ప్రయోగం విజవంతం అవుతుందని, ఈ ప్రయోగానికి ప్రణాళికలను పకడ్బందీగా రూపొందించారని ఆయన పేర్కొన్నారు. చంద్రయాన్-3 ఇతర దేశాల దృష్టిని ఆకర్షిస్తుందని ఆ రోజే పేర్కొన్నారు. తాను ఈ ప్రయోగంలో అడ్వయిజరీ మెంబర్‌గా కొనసాగుతున్నట్లు చెప్పారు.

చంద్రయాన్‌లో మన ప్రాతినిధ్యం

శ్రీహరి కోట నుంచి ప్రయోగించిన చంద్రయాన్-3లో హైదరాబాద్ నగరం కూడా కీలక పాత్ర పోషించింది. నగరంలోని మిధాని, బీహెచ్‌ఈఎల్, హిందుస్తాన్ ఏరోనాటిక్స్ వంటి పలు కంపెనీలు, పరిశోధనా సంస్థలు చంద్రయాన్ ప్రయోగంలో వివిధ దశల్లో సేవలందించాయి. చంద్రయాన్-3కి కూకట్‌పల్లిలో తయారు చేసిన పరికరాలను అమర్చటం మరోసారి చరిత్రలో నిలిచిపోయింది. ఇప్పటివరకు 50 సార్లు నాగసాయి ప్రెసీషియన్ ఇంజినీర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వారు ఉపగ్రహాల తయారీలో కీలకపాత్ర పోషిస్తున్నారు. 1998 నుంచి ఇస్రోకు విడిభాగాలు అందజేస్తున్న ఈ సంస్థ చంద్రయాన్-3కు కూడా సంబంధించిన వస్తువుల తయారీ కోసం రక్షణ శాఖ ఎంపిక చేయటం విశేషం. ఈ సంస్థ వారు బ్యాటరీలు, ల్యాండర్, రోవర్, ప్రొపెల్షన్ మాడ్యూల్ వంటి మాన్యుఫాక్చర్స్, మెకానికల్ బ్యాటరీ స్లీవ్స్ వంటి పరికరాలను అందజేశారు.

- చంద్రయాన్‌తో పాటు ఇస్రో చేస్తున్న పరిశోధనల్లో నాగసాయి కంపెనీ అధినేత బీఎస్ రెడ్డి పరికరాలను అందజేస్తున్నారు. చంద్రయాన్ మిషన్‌కు అవసరమైన నికెల్, టైటానియం లోహ మిశ్రమాలను, ఉక్కు తదితర ప్రత్యేక శాస్త్రీయ పదార్థాలను 'మిధాని' సంస్థ అభివృద్ధి చేసి సరఫరా చేసింది. ఇస్రో చేపట్టే పలు పరిశోధనల్లో ఈ సంస్థ కీలక భాగస్వామిగా కొనసాగుతోంది. ఈ ప్రయోగంలో వినియోగించిన బ్యాటరీలను భారత్ హెవీ ఎలక్ట్రికల్ లిమిటెడ్ తయారు చేసింది. వీటితో పాటు బై-మెటాలిక్ అడాప్టర్లను, క్రయోనిక్ దశలో ఉపయోగించిన పలు భాగాలను కూడా ఈ సంస్థే రూపొందించింది.

గగన్‌యాన్‌కూ నాగసాయి సేవలు

కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లోని నాగసాయి ప్రెసీషియన్ ఇంజినీర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ 25 ఏళ్లుగా సేవలు అందిస్తోంది. చంద్రయాన్-1, చంద్రయాన్-2 ప్రయోగాల్లో ఆర్బిటర్, ల్యాండర్, రోవర్‌లకు సంబంధించిన కీలకమైన పరికరాలను తయారు చేసింది. అత్యంత నాణ్యమైన నాసిల్స్‌తో పాటు గతంలో నాసిల్స్‌ను తయారు చేసేందుకు ఇజ్రాయల్ నుంచి అల్యూమినియం తీసుకొచ్చి బాలానగర్‌లో తయారు చేసి విమానాల తయారీకి సంబంధించిన విడి పరికరాలను ఇక్కడి నుంచే సప్లై చేయటం విశేషం. నాగసాయి కంపెనీ ఈసారి చంద్రయాన్-3తో పాటు ఆదిత్య-ఎల్ 1, గగన్‌యాన్‌లకూ పరికరాలు అందజేసి రికార్డు సృష్టించింది.



ఓయూలోని ఠాగూర్ ఆడిటోరియంలో..

50సార్లు అంతరిక్ష ప్రయోగాలు..

హైదరాబాద్ ఆల్విన్ కంపెనీలో ఉద్యోగంలో చేరిన బీఎస్ రెడ్డి.. తాను కూడా కొంతమందికి ఉపాధి కల్పించాలనే ఆలోచనతో 1994లో నాగసాయి కంపెనీని స్థాపించారు. అప్పటి నుంచి అనేక రకాలుగా ప్రయోగాత్మక వస్తువులు తయారు చేస్తూ రక్షణ శాఖ దృష్టిలో పడటం ఆయనకు పేరు ప్రఖ్యాతులు సంపాదించిపెట్టింది. నాసా, ఇస్రోలకు తన కంపెనీ పరికరాలను అందజేయాలనే సంకల్పంతో కొన్ని వ్యయ ప్రయాసలకు గురైనా కార్యాచరణ మొదలు పెట్టారు. బీఎస్ రెడ్డి కార్యాచరణ నైపుణ్యంపై పలు దశల్లో పరీక్షలు నిర్వహించిన జాతీయ సంస్థలు ఆయనకు అవకాశమిచ్చారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ 50 సార్లు అంతరిక్ష ప్రయోగాల్లో పరికరాలు అందజేసిన ఘనత ఆయనకే సాధ్యమైంది. దేశ, విదేశాలతో పాటు అంతరిక్షంలో కూడా కూకట్‌పల్లి ఖ్యాతిని ముందుకు తీసుకెళ్లిన బీఎస్ రెడ్డిని పలువురు అభినందిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చంద్రయాన్-3 విజయవంతం కావడం తనకెంతో గర్వంగా ఉందన్నారు.

ఇస్రో శాస్త్రవేత్తలు గ్రేట్



ఇస్రో ద్వారా చంద్రయాన్-3 విజయవంతం కావడంపై మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఇస్రో శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలిపారు. చంద్రుడి దక్షిణ ధ్రువంపై చంద్రయాన్-3 నిలవడంతో ప్రపంచ వ్యాప్తంగా భారత్ ఖ్యాతి ఇనుమడించిందన్నారు. ఇస్రో శాస్త్రవేత్తల కృషితో దేశం గర్విస్తోందని అభిప్రాయపడ్డారు.

– మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

ఇస్రో చరిత్రలో చిరస్థాయిగా..



ఈ విజయం భారతీయులందరికీ గర్వకారణం. దేశ చరిత్రలో ఇస్రో సృష్టించిన ఘనత చిరస్థాయిగా నిలిచి ఉంటుంది. కోట్లాది భారతీయులు సగర్వంగా తలెత్తుకునే సందర్భమం. ఈ ప్రయోగం పరిన్ని అద్భుత పరిశోధనలకు నాంది పలకనుంది.

– కేజీ కుమార్, బిర్లా సైన్స్ సెంటర్ డైరెక్టర్

ఇదో మైలురాయి..



ఈ మైలురాయితో భారత్ యూఎస్, చైనా, రష్యా వంటి దేశాలకు దీటుగా నిలవనుంది. కేవలం శ్రీహరి కోట నుంచే ప్రయోగాలు నిర్వహిస్తున్న భారత్‌కు మరిన్ని ప్రయోగ కేంద్రాలు అవసరముంది. ఈ విజయంతో దేశంలో పరిశోధనలు పెరగడంతో పాటు ఇతర దేశాలు వారి పరిశోధనా కార్యకలాపాలకు భారత్‌ను కేంద్రంగా వాడుకోనున్నాయి.

– సీహెచ్ మోహన్ రావు, సీసీఎంబీ మాజీ డైరెక్టర్

ఆదిత్య ఎల్-1 కూడా విజయవంతం కావాలి



ఉద్విగ్న క్షణాల్లో చంద్రయాన్-3 చంద్రుడిపై కాలుమోపడం చారిత్రక ఘట్టం. ఇలాంటి విజయాలను ఇస్రో మరిన్ని సాధించాలని ఆకాంక్షిస్తున్నా. చంద్రయాన్-3 స్ఫూర్తితో వచ్చే నెలలో ప్రయోగించనున్న ఆదిత్య ఎల్-1 కూడా సేఫ్‌గా ల్యాండింగ్ అవుతుంది.

– నగరి బీరప్ప, నిమ్స్ డైరెక్టర్



ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ఎదుట..



అల్వాల్‌లోని త్రివేణి పాఠశాలలో చంద్రయాన్-3 లాంచింగ్ టు ల్యాండింగ్ కార్యక్రమాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థులు

రణరంగమైన జీహెచ్‌ఎంసీ

బీజేపీ, కాంగ్రెస్ కార్పొరేటర్ల ధర్నాలు, నిరసనలు

- ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మనెంట్ చేయాలని డిమాండ్
- కౌన్సిల్ త్వరగా ముగిసిందంటూ మేయర్ చాంబర్ వద్ద ఆందోళన

సాక్షి, సిటీబ్యూరో/హిమాయత్‌నగర్: బల్దియా సర్వసభ్య సమావేశం రణరంగమైంది. ప్రతిపక్షాల నిరసనలు, ధర్నాలతో దద్దరిల్లింది. బీజేపీ, కాంగ్రెస్ కార్పొరేటర్లు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. బుధవారం ఉదయం 9 గంటలకే జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయ పరిసరాల్లో వందలాది పోలీసులు పహారా కాశారు. తమను పర్మనెంట్ చేయాలంటూ కొద్దిరోజులుగా సమ్మె చేస్తున్న బల్దియా ఔట్ సోర్సింగ్ కార్మికులను బీజేపీ కార్పొరేటర్లు తమ వెంట తీసుకుని జీహెచ్‌ఎంసీ కార్యాలయానికి ర్యాలీగా వస్తుండగా పోలీసులు అడ్డుకుని అరెస్టు చేశారు. కొందరు కార్మికులను ఈడ్చి వాహనాల్లో పడేశారు. చెత్త ఊడ్చి నగర ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్న తమను ప్రభుత్వం అత్యంత హీనంగా చూస్తోందంటూ కన్నీటిపర్యంతమయ్యారు. ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మనెంట్ చేయనిపక్షంలో వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తమ తడాఖా చూపిస్తామని, బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి బుద్ధి చెబుతామని హెచ్చరించారు.


మేయర్ చాంబర్ వద్ద బైఠాయింపు..

- సమావేశాన్ని తొందరగా ముగించడంతో బయటకు వచ్చిన బీజేపీ, కాంగ్రెస్ కార్పొరేటర్లు మేయర్ చాంబర్ వద్ద బైఠాయించారు. వీరి నినాదాలతో జీహెచ్‌ఎంసీ ప్రాంగణం హోరెత్తింది. ధర్నా చేయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.



మాట్లాడుతున్న కమిషనర్ రోనాల్డ్ రాస్

మేయర్ ఒక డమ్మీ అంటూ బీజేపీ కార్పొరేటర్లు ఆకుల శ్రావణి, మహాలక్ష్మిగౌడ్, ఫ్లోర్ లీడర్ శంకర్ యాదవ్‌లు ఆరోపించారు. తాము కొత్త హామీలను నెరవేర్చాలని అడగట్లేదు. ఔట్‌సోర్సింగ్ కార్మికులు కూడా ప్రభుత్వ ఉద్యోగులేనని సీఎం గతంలో ప్రకటించారని, ఆయన ప్రకటనను అమలు చేయాలని కోరితే కౌన్సిల్‌ని రద్దు చేస్తారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము అడిగే ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వకుండా మేయర్ రద్దు చేయడం దారుణమంటూ విమర్శించారు. వారం రోజులుగా కార్మికులు సమ్మె చేస్తుంటే మేయర్ ఏం చేస్తున్నారంటూ ప్రశ్నించారు. అమెరికాలో ఉన్న మంత్రి కేటీఆర్ ఫోన్ ద్వారా ఆపరేట్ చేస్తూ కౌన్సిల్‌ను అర్ధంతంగా రద్దు చేయించారంటూ బీజేపీ కార్పొరేటర్లు ఆరోపించారు. పోలీసులు రంగప్రవేశం చేసి బీజేపీ, కాంగ్రెస్ కార్పొరేటర్లను అక్కడినుంచి పంపించారు. ఈ క్రమంలో పోలీసులకు కార్పొరేటర్లకు మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట చోటు చేసుకుంది.



సమావేశానికి హాజరైన కార్పొరేటర్లు

ప్రొటోకాల్ రగడ

జీహెచ్‌ఎంసీలో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మనెంట్ చేయాలని రాజకీయాల కతీతంగా అన్ని పార్టీలూ కోరాయి. అభివృద్ధి పనుల శిలాఫలకాలపై కార్పొరేటర్ల పేర్లు వేయడం లేదని, ప్రొటోకాల్ పాటించడం లేదని.. ముఖ్యంగా వాటర్ బోర్డు పనుల్లో ఇవి ఎక్కువగా జరుగుతున్నాయని కార్పొరేటర్లు మండిపడ్డారు. వీధి దీపాలు, చెత్త సమస్యలు, డీసిల్టింగ్, నాలాల సమస్యలు తదితర సమస్యలపై ధ్వజమెత్తారు. ఎప్పటిలాగే అధికార, ప్రతిపక్ష సభ్యుల పరస్పర వాదోపవాదాలతో సభను మేయర్ విజయలక్ష్మి త్వరితంగా ముగించారు. అందుకు నిరసనగా మేయర్ కార్యాలయం ఎదుట ప్రతిపక్షాలు ధర్నా నిర్వహించాయి. కార్మికుల సమస్యలు తెలిసేలా బీజేపీ సభ్యులు చెత్త తరలింపు కార్మికుల వేషధారణలతో ఆందోళన నిర్వహించారు. మంగళవారం జరిగిన జీహెచ్‌ఎంసీ సర్వసభ్య సమావేశం ముఖ్యాంశాలు ఇలా..

- తెలంగాణ రాష్ట్రం వచ్చాక జీహెచ్‌ఎంసీ ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి వారిని పర్మనెంట్ చేస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్ దానిని అమలు చేయాలని సభ్యులు మధుసూదన్‌రెడ్డి (బీజేపీ), రాజశేఖర్ రెడ్డి (కాంగ్రెస్), సలీంబేగ్ (ఎంఐఎం)లు కోరారు. బీఆర్‌ఎస్ సభ్యుడు, మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్ సమర్థించారు. పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు పెంచింది కూడా కేసీఆరే అన్నారు. ఆర్టీసీ కార్మికుల మాదిరిగానే సందర్భం వచ్చినప్పుడు ముఖ్యమంత్రి తప్పకుండా చేస్తారని బీఆర్‌ఎస్ సభ్యులు అన్నారు. అందుకు ఎవరు అడ్డుపడ్డారో తెలుసునన్నారు. ఈ మేరకు తీర్మానం చేయాలని ప్రతిపక్ష సభ్యులు కోరారు. ఈ అంశంపై మేయర్ సూచన మేరకు కమిషనర్ రోనాల్డ్‌రాస్ మాట్లాడుతూ.. మేయర్‌తో చర్చించి సభ్యుల అభిప్రాయాన్ని ప్రభుత్వానికి పంపించి ప్రభుత్వ నిర్ణయం మేరకు వ్యవహరిస్తామని చెప్పారు.

ఇక పోలీస్‌స్టేషన్ల వద్ద నిరసనలు

పార్టీలకతీతంగా జీహెచ్‌ఎంసీ సర్వసభ్య సమావేశంలో మొదటి అంశంగా ఔట్‌సోర్సింగ్ కార్మికుల పర్మనెంట్ అంశాన్ని లేవనెత్తి, విషయాన్ని ప్రభుత్వానికి పంపేలా చేసిన కార్పొరేటర్లకు జీహెచ్‌ఎంఈయూ అధ్యక్షుడు యు.గోపాల్ కృతజ్ఞతలు తెలిపారు. ఇకనుంచి జీహెచ్‌ఎంసీ కార్యాలయాల్లో కాకుండా పోలీస్ స్టేషన్ల వద్ద నిరసన తెలియజేయాల్సిందిగా గోపాల్ కార్మికులకు పిలుపునిచ్చారు. ఉదయం 5 గంటల నుంచి పోలీస్‌స్టేషన్ల వద్ద ఉంటూ శాంతియుతంగా సమస్యలపై నిరసన తెలియజేయాలని సూచించారు. సీఐ, ఎస్‌ఐలకు కార్మికుల సమస్యల గురించి వివరించాలని కోరారు. డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు ఉద్యమం ఆగవద్దన్నారు.

నిబంధనలు పాటించడం లేదు..

- ఆయా పనుల సందర్భంగా అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని, శిలాఫలకాలపై కార్పొరేటర్ల పేర్లు వేయడం లేరని, ప్రారంభోత్సవాలకు చివరి నిమిషంలో సమాచారమిస్తున్నారని, ప్రారంభోత్సవాలకు వస్తున్న అధికార పార్టీ ఎమ్మెల్యేలు తమ పార్టీ డివిజన్ నాయకుల ఫొటో లేనందున వెళ్లిపోయిన సంఘటనలున్నాయని సభ దృష్టికి తెచ్చారు. వార్డు కార్యాలయాలు ఏర్పాటు చేసినా పంద్రాగస్టు నాడు జెండా ఎగురవేసే దిక్కు లేకుండా పోయిందని, ప్రభుత్వ పథకాలైన కళ్యాణలక్ష్మి, దళితబంధువంటి వాటి పంపిణీ సందర్భంగా తమను ఆహ్వానించడం లేరని, అక్కడా ఎమ్మెల్యేల పెత్తనమే సాగుతోందన్నారు. ప్రొటోకాల్ పాటించడం లేదని మేయర్ అంగీకరించారు. ఇంటర్నల్ రాజకీయాల వల్లేనని అధికారి తెలపడంతో ఇకపై ఇలాంటి పరిస్థితి ఎదురవకుండా తగిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ రోనాల్డ్ రాస్ హామీ ఇచ్చారు.
- వీధిదీపాలు, చెత్త, నాలాలు, వీధికుక్కలు తదితర సమస్యల్ని సభ్యులు ప్రస్తావించారు.
- కార్పొరేటర్లకు గౌరవమివ్వకున్నా భరిస్తున్న మీరు బానిసలంటూ బీఆర్‌ఎస్ సభ్యులనుద్దేశించి బీజేపీ సభ్యులు వ్యాఖ్యానించారు. కిషన్‌రెడ్డి చెప్పులు మోసేవారంటూ ఒకరు, కేసీఆర్ చెప్పులు మోసేవారంటూ ఒకరు రెండు పార్టీల వారు పరస్పరం వాదించుకున్నారు.
- జడ్‌సీలు కార్పొరేటర్లతో నెలకోసారి సమావేశం పెడితే స్థానికంగానే సమస్యలు పరిష్కారమవుతాయని బీజేపీ సభ్యులు ప్రస్తావించారు.
- పారిశుద్ధ్య కార్మికుల వేతనం రూ.500 నుంచి అన్ని ప్రభుత్వాలు పెంచుతూవచ్చాయని, చరిత్ర తెలియనందున మేయర్ బీఆర్‌ఎస్సే పెంచిందన్నారని కాంగ్రెస్ సభ్యురాలు అనడంతో, మేయర్‌ను అవమానించారని, క్షమాపణ చెప్పాలని బీఆర్‌ఎస్ సభ్యులు డిమాండ్ చేశారు.
- మేయర్ అన్ని అంశాలను చర్చించకుండా సభను త్వరితంగా ముగించడంపై బీజేపీ, కాంగ్రెస్ సభ్యులు మేయర్ చాంబర్ ఎదుట బైఠాయించి మేయర్ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. పోలీసులు వారిని అక్కడి నుంచి పార్కింగ్ ప్రదేశానికి తరలించారు.అక్కడా ధర్నాకు దిగడంతో పోలీస్ వ్యాన్లలోకి ఎక్కించారు.
- కార్మికులను పర్మనెంట్ చేయాలంటూ అన్ని పార్టీలూ కోరినా మేయర్ తీర్మానం చేయకపోవడంపై వారు మండిపడ్డారు.
- మీడియాను కౌన్సిల్‌హాల్‌లోకి అనుమతించలేదు. నిరసనగా విషయాన్ని మేయర్‌కు తెలియజేయాలనుకున్న ప్రతినిధులను పట్టించుకోకుండా మేయర్ కౌన్సిల్ హాల్‌లోకి వెళ్లిపోయారు.
- ప్రజాధనంతో ఏర్పాటు చేస్తున్న సమావేశంలో ప్రజాసమస్యలను పట్టించుకోకుండా త్వరగా ముగించారని బీజేపీ, కాంగ్రెస్ విమర్శించాయి.

చైనీయుడితో కలిసి సైబర్ మోసాలు

ఐదుగురు అంతర్రాష్ట్ర నిందితులు అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో: చైనాకు చెందిన సైబర్ మోసగాడితో చేతులు కలిపి లోన్ యాప్ బాధితులకు ఫోన్లు చేసి బెదిరిస్తూ బలవంతంగా డబ్బులు వసూలు చేస్తున్న ఐదుగురి అంతర్రాష్ట్ర ముఠా సభ్యులను రాచకొండ సైబర్ క్రైమ్ పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి రూ.1.50 లక్షల నగదుతో పాటు మూడు ల్యాప్‌టాప్‌లు, ఆరు సెల్‌ఫోన్లు, 18 సిమ్ కార్డులు, 11 డెబిట్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ బుధవారం వివరాలను మీడియాకు వెల్లడించారు. గుర్గామ్‌కు చెందిన అశుతోష్ మిశ్రా, లవ్‌మీత్ సైనీ, ప్రశాంత్ కుమార్ తన్వర్, ప్రిన్స్ పాల్, వికాస్ శర్మలకు టెలిగ్రామ్‌లో చైనాకు చెందిన గినా అనే సైబర్ నేరస్తుడితో పరిచయం ఏర్పడింది. గినా లోన్ యాప్‌లలో రుణాలు తీసుకున్న రుణ గ్రహీతల వ్యక్తిగత సమాచారాన్ని ఈ ముఠా సభ్యులకు అందించేవాడు. ప్రతి రోజు వినియోగదారుని ఐడీ, పాస్‌వర్డ్‌లతో కూడిన లింక్‌ను పంపించేవాడు. ఆయా వివరాలతో ఈ ముఠా సభ్యులు రుణ గ్రహీతలకు వాట్సాప్ ద్వారా ఫోన్లు, మెసేజ్‌లు చేసి బెదిరింపులకు పాల్పడేవారు. బాధితుల ఫొటోలను అసభ్యకరంగా చిత్రీకరించి బాధితుల కాంటాక్ట్ లిస్ట్‌లోని వారికి పంపించి బ్లాక్ మెయిల్ చేసేవారు. ఈక్రమంలో రాచకొండ కమిషనరేట్ పరిధిలోని బాధితుడు షేక్ అబ్దుల్ బారీ హ్యాండీ లోన్ యాప్ ద్వారా రూ.10,500 రుణాన్ని తీసుకున్నాడు. దీంతో అతని వివరాలను తస్కరించిన ఈ ముఠా సభ్యులు బాధితుడి ఫొటోలను మార్ఫింగ్ చేసి సామాజిక మాధ్యమాలలో పెడతామని బెదిరించి రూ.2,49 లక్షలు బలవంతంగా వసూలు చేశారు. దీంతో బాధితుడు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న ఇన్‌స్పెక్టర్ బీ రాజు, టీ కిరణ్ కుమార్‌లు సాంకేతిక ఆధారాలను సేకరించి మోసగాళ్లు హర్యానాలోని గుర్గావ్ నుంచి ఈ సైబర్ మోసాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. దీంతో ప్రత్యేక బృందంతో అక్కడికి వెళ్లిన అధికారులు ఐదుగురు నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

మోకిలాలో మరోసారి గజం రూ.లక్ష

సాక్షి, సిటీబ్యూరో: మోకిలాలో భూముల ధరలు మరోసారి మోత మోగించాయి. బుధవారం హెచ్ఎండీఏ నిర్వహించిన ఆన్‌లైన్ బిడ్డింగ్‌లో గజం గరిష్టంగా రూ.లక్ష చొప్పున అమ్ముడైంది. సగటున రూ.63,512లకు గజం చొప్పున విక్రయించారు. సుమారు 300 ప్లాట్‌లతో మోకిలాలో హెచ్ఎండీఏ రెండో దశ అమ్మకాలను ప్రారంభించిన మొదటి రోజు 60 ప్లాట్లకు వేలం నిర్వహించగా అన్నింటికీ అనూహ్యమైన డిమాండ్ లభించింది. 58 ప్లాట్ల అమ్మకాల ద్వారా రూ.122.42 కోట్ల ఆదాయం లభించింది.

'రామ్‌రాజ్' నుంచి రూ.లక్ష పంచె



రూ.లక్ష విలువైన పట్టు పంచెలను ఆవిష్కరిస్తున్న నాగరాజన్ తదితరులు

అమీర్‌పేట: రామ్‌రాజ్ కాటన్ సంస్థ 40 వార్షికోత్సవ వేడుకల్ని బుధవారం అమీర్‌పేట హోటల్ గ్రీన్ పార్కు మ్యారి గోల్డ్ హోటల్‌లో ఘనంగా నిర్వహించారు. డీలర్లు, డిస్ట్రిబ్యూటర్ల కోసం వస్త్ర ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు కె.ఆర్.నాగరాజన్ మాట్లాడుతూ నాణ్యమైన వస్త్రాలను అందించడమే లక్ష్యంగా తమ సంస్థ పనిచేస్తోందన్నారు. అనంతరం రూ.లక్ష రూపాయలు విలువచేసే సరికొత్త పట్టు పంచెను ఆయన ఆవిష్కరించారు. 1983వ సంవత్సరంలో రామరాజ్ పంచెలను నగరంలో ఆవిష్కరించినట్లు గుర్తు చేశారు. కేవలం వ్యాపార దృక్పథంతో కాకుండా దేశ సంస్కృతిని కాపాడుతూనే లక్షలాది మంది నేత కార్మికులకు ఉపాధి అవకాశాలను కల్పించిన ఘనత రామ్‌రాజ్ కాటన్ సంస్థకు దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ నగరంతో పాటు వరంగల్, కరీంనగర్, మంచిర్యాల్, ఘట్‌కేసర్, ఇబ్రహీంపట్నం ప్రాంతాలకు చెందిన డీలర్లు, డిస్ట్రిబ్యూటర్లు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు అత్యంత అవసరం

రాష్ట్ర కార్మిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాణీకుముదిని



సదస్సులో పాల్గొన్న రాణి కుముదిని తదితరులు

సాక్షి, సిటీబ్యూరో: పరిశ్రమలో భద్రతా ప్రమాణాల నిర్వహణలో అత్యంత జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని రాష్ట్ర కార్మిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాణి కుముదిని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ఫ్యాక్టరీల శాఖ, నేషనల్ సేఫ్టీ కౌన్సిల్ రాష్ట్ర విభాగం సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లో 'సాంకేతిక అభివృద్ధిలో వృత్తి సవాళ్లు-భద్రత' అనే అంశంపై జరిగిన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఫ్యాక్టరీలలో ఆక్యుపేషనల్ హెల్త్, సేఫ్టీ పనితీరును పెంపొందించడంలో సేఫ్టీ ప్రొఫెషనల్స్ పాత్ర ప్రశంసనీయమన్నారు. ఈ సదస్సులో రాష్ట్ర ఫ్యాక్టరీల శాఖ డైరెక్టర్, నేషనల్ సేఫ్టీ కౌన్సిల్ తెలంగాణ చాప్టర్ చైర్మన్ బి.రాజగోపాలరావు, జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ వై.మోహన్ బాబు తదితరులు పాల్గొని పరిశ్రమల్లో చేపట్టాల్సిన భద్రతా ప్రమాణాలపై పలు సూచనలు చేశారు. ఈ సదస్సుకు వివిధ ఫ్యాక్టరీల నుండి 304 మంది ప్రతినిధులు హాజరయ్యారు.

గన్ మిస్ ఫైర్..హెడ్ కానిస్టేబుల్ మృతి



శ్రీకాంత్ (ఫైల్)

దూద్‌బౌలి: విధి నిర్వహణలో ఉన్న ఓ హెడ్ కానిస్టేబుల్ గన్ మిస్‌ఫైర్ అయి తీవ్ర గాయాలతో మృతి చెందిన సంఘటన హుస్సేనీఆలం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..సూర్యాపేట జిల్లా గరిడెపల్లి మండలం అప్పన్నపేట గ్రామానికి చెందిన 12వ బెటాలియన్ హెడ్ కానిస్టేబుల్ (పీసీ-1769) శ్రీకాంత్ (29) హుస్సేనీఆలం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఖబూతర్‌ఖానా ఔట్ పోస్టులో విధులు నిర్వహిస్తున్నాడు. 2018 బ్యాచ్‌కు చెందిన శ్రీకాంత్ రెండున్నర సంవత్సరాలుగా ఇక్కడ విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం రాత్రి నైట్ డ్యూటీలో ఉండి..ఔట్ పోస్టులో నిద్రిస్తుండగా పక్కనే ఉన్న గన్ మిస్‌ఫైర్ కావడంతో గొంతుకు గాయమైంది. దీంతో శ్రీకాంత్‌ను వెంటనే ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు ఉన్నతాధికారులు ఉస్మానియాకు చేరుకొని వివరాలను సేకరించారు.

మియాపూర్‌లో పేలిన తూటా

- హోటల్ జనరల్ మేనేజర్‌పై గుర్తుతెలియని వ్యక్తి కాల్పులు
- నాటు తుపాకీతో మొత్తం ఆరు రౌండ్లు కాల్చిన దుండగులు
- ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి
- నిందితుడి కోసం రంగంలోకి ఐదు ప్రత్యేక బృందాలు





సంఘటన స్థలంలో పోలీసులు, ఇన్‌సెట్‌లో దేవేందర్ (ఫైల్)

మియాపూర్: మియాపూర్ పోలీసుస్టేషన్ పరిధిలోని మదీనాగూడలో బుధవారం అర్ధరాత్రి కాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ ఉదంతం స్థానికంగా తీవ్ర కలకలం సృష్టించింది. ఓ హోటల్ మేనేజర్‌పై గుర్తు తెలియని వ్యక్తి మొత్తం ఆరు రౌండ్లు కాల్చారు. తీవ్రంగా గాయపడిన బాధితుడు ఆస్పత్రికి తరలిస్తుండగా కన్నుమూశాడు. నిందితుడి కోసం ఐదు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయని డీసీపీ జి.సందీప్ తెలిపారు. కోల్‌కతాకు చెందిన దేవేందర్ గాయన్ (35) ఆరు నెలలుగా మదీనగూడలోని సందర్శిని ఎలైట్ రెస్టారెంట్‌లో జనరల్ మేనేజర్‌గా పని చేస్తున్నాడు. సికింద్రాబాద్ సమీపంలోని సుచిత్ర ప్రాంతంలో కుటుంబంతో సహా నివసిస్తున్నాడు. ఎప్పటిలాగే బుధవారం రాత్రి విధులు ముగించుకున్న ఆయన హోటల్ నుంచి బయటకు వచ్చారు. అప్పటికీ హోటల్ మూసి వేయకపోవడంతో వినియోగదారుల రాకపోకలు సాగుతున్నాయి. తన ఇంటికి వెళ్లడానికి సిద్ధమైన దేవేందర్‌కు హోటల్ ముందరే అతడి స్నేహితుడు కనిపించాడు. దీంతో అక్కడే ఆగిన ఆయన స్నేహితుడితో మాట్లాడుతున్నారు. అదే సమయంలో మదీనగూడ వైపు నుంచి ద్విచక్ర వాహనంపై హెల్మెట్ ధరించిన ఓ గుర్తుతెలియని వ్యక్తి వచ్చాడు. దేవేందర్‌కు సమీపంలోనే ఆగి తన వద్ద ఉన్న నాటు తుపాకీతో విచక్షణా రహితంగా కాల్పులు జరిపాడు. మొత్తం ఆరు రౌండ్లు కాల్చగా..నాలుగు దేవేందర్ శరీరంలోకి దూసుకుపోయాయి. తీవ్ర రక్తస్రావం కావడంతో ఆయన అక్కడిక్కడే కుప్పకూలిపోయాడు. కాల్పులు జరిపిన అనంతరం చందానగర్ వైపు పారిపోయాడు. అప్రమత్తమైన స్థానికులు సమీపంలోని ఓ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో కన్నుమూశాడు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలితో పాటు ఆస్పత్రికి చేరుకున్నారు. దేవేందర్ మృతదేహాన్ని పోస్టుమార్టం పరీక్షల నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన మియాపూర్ పోలీసులు దేవేందర్ గత చరిత్ర, కుటుంబ నేపథ్యం సహా వివిధ అంశాలు ఆరా తీస్తున్నారు. దేవేందర్‌ను టార్గెట్‌గా చేసుకున్న సదరు వ్యక్తి ఆ హోటల్ వద్ద రెక్కీ చేసి ఉంటాడని, కొద్దిసేపు వేచి చూసి ఉంటాడని అనుమానిస్తున్నారు. దీంతో గడిచిన వారం రోజులుగా ఆ హోటల్‌తో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లోని సీసీ కెమెరాలు, మదీనగూడ-సుచిత్ర, మదీనగూడ-చందానగర్ మార్గాల్లో ఉన్న సీసీ కెమెరాల ఫీడ్‌ను సేకరిస్తున్నారు. నిందితుడి కోసం ఎస్‌ఓటీ పోలీసులు గాలింపు ప్రారంభించారు.

రిజిస్ట్రేషన్ శాఖలో బదిలీలు

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ రిజిస్ట్రేషన్ శాఖలో భారీగా బదిలీలు చోటుచేసుకున్నాయి. డీఐజీ స్థాయి నుంచి సబ్ రిజిస్ట్రార్ స్థాయి వరకు బదిలీలు చేస్తూ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి నవీన్ మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్ డీఐజీగా సైదిరెడ్డి, రంగారెడ్డి డీఐజీగా ట్వింకిల్ జాన్, మేడ్చల్-మల్కాజిగిరి డీఐజీగా ఎం.రవీందర్‌లకు పోస్టింగ్ లభించింది. హైదరాబాద్ (సౌత్) జిల్లా రిజిస్ట్రార్‌గా డీవీ ప్రసాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా రిజిస్ట్రార్‌గా సంతోష్ నియమితులయ్యారు. హైదరాబాద్ ఆర్‌ఓ జాయింట్ సబ్‌రిజిస్ట్రార్-1గా సహదేవ్, జాయింట్ సబ్‌రిజిస్ట్రార్-2గా శ్రీదేవి, రంగారెడ్డి ఆర్‌ఓ జాయింట్ సబ్ రిజిస్ట్రార్-1గా సతీష్, జాయింట్ సబ్ రిజిస్ట్రార్-2గా అంజనేయులు, మేడ్చల్ ఆర్‌వో జాయింట్ సబ్‌రిజిస్ట్రార్ -1జహీర్ అహ్మద్, జాయింట్ సబ్‌రిజిస్ట్రార్-2గా రాజేంద్ర కుమార్, పటాన్‌చెరు ఆర్‌వో జాయింట్ సబ్‌రిజిస్ట్రార్-1గా హనుమంతరావు, జాయింట్ సబ్ రిజిస్ట్రార్-2గా ఎండీ సాహెర్‌అలీలకు పోస్టింగ్ లభించింది. కుత్బుల్లాపూర్‌కు మహేందర్, ఇబ్రాహింపట్నంకు సంధ్యారాణి, శంకర్‌పల్లికి బి.శ్రీనివాస్, ఆజాంపురాకు ఆనంద్, చార్మినార్‌కు వి.మురళీధరన్, నారపల్లికి శ్రీకాంత్ రెడ్డి, శామీర్‌పేటకు గోదాదేవి, చంపాపేటకు మధుబాబు, మల్కాజిగిరికి అరవింద్‌బాబు, ఘట్‌కేసర్‌కు జగన్మోహన్, షాద్‌నగర్‌కు శేషగిరి చందా, సికింద్రాబాద్‌కు యూసుఫ్-ఉర్-రహ్మాన్, ఫారుక్‌నగర్‌కు సయ్యద్ సాదక్‌అలీ, శేరిలింగంపల్లికి రవికాంత్, సదాశిపేట్‌కు హమీద్, దుద్‌బౌలీకి వనజ కుమారి, కీసరకు సురేష్, కాప్రాకు లక్ష్మారెడ్డి, గోల్కొండకు సిరాజ్ అన్వర్, కూకట్‌పల్లికి వనజ, ఎల్‌బీనగర్‌కు రాజేశ్వర్‌రెడ్డి, ఉప్పల్-సురేందర్, చిక్కడపల్లికి సతీష్‌కుమార్, శంషాబాద్‌కు ప్రణయ్, పెద్ద అంబర్‌పేటకు సతీష్‌లు సబ్‌రిజిస్ట్రార్లుగా నియమితులయ్యారు.

సకుటుంబ సపరివార సమేతం!

వ్యవస్థీకృతంగా గంజాయి దందా చేస్తున్న ఫ్యామిలీ

- మూడేళ్లల్లో రూ.4 కోట్లు ఆర్జించినట్లు ఆధారాలు
- ఓ మైనర్ సహా నలుగురిని పట్టుకున్న టీఎస్-నాబ్
- రూ.40.3 లక్షల నగదు సీజ్



గౌతమ్



నీతూ బాయ్

సాక్షి, సిటీబ్యూరో: గచ్చిబౌలి, గాంధీనగర్‌ల్లో జీ+2 ఇళ్ళు... స్కార్పియోతో పాటు మూడు ఖరీదైన కార్లు... కేడీఎంతో పాటు రెండు బైక్స్...బ్యాంకు ఖాతాల్లో రూ.1.53 కోట్లు... ఇంట్లో రూ.40.3 లక్షలు...మూడేళ్లుగా గంజాయి దందా చేస్తున్న కుటుంబం ఆర్జించిన ఆస్తుల చిట్టా ఇది. ఈ ఫ్యామిలీలో మైనర్ సహా నలుగురిని పట్టుకున్నామని, పరారీలో ఉన్న మరో ఆరుగురి కోసం గాలిస్తున్నామని టీఎస్-న్యాబ్ ఎస్పీ చక్రవర్తి గుమ్మి బుధవారం తెలిపారు. ఏసీపీ సీహెచ్ శ్రీధర్‌తో కలిసి బషీర్‌బాగ్‌లోని ఓల్డ్ కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పూర్తివివరాలు వెల్లడించారు.

కేసులు నమోదై, పీడీ యాక్ట్ ప్రయోగించినా...

నానక్‌రామ్‌గూడలోని లోథ బస్తీకి చెందిన కలపత్తి గౌతమ్ సింగ్, తన తల్లి నీతు బాయ్, అత్త మధు బాయ్, మైనర్ అయిన కుమారుడితో పాటు మరో ఆరుగురు బంధువులతో కలిసి ముఠా కట్టాడు. వీళ్ళు లోధా బస్తీలో కిరాణా దుకాణాలు నిర్వహిస్తున్నారు. వీరు 2021 నుంచి వ్యవస్థీకృతంగా గంజాయి దందా చేస్తున్నారు. తమ కిరాణా దుకాణాల్లోనే గంజాయి ప్యాకెట్లు దాచి ఉంచి మాల్, సరుకు, జాయింట్ అనే మారు పేర్లతో అమ్ముతున్నారు.

నెలకు రూ.9 లక్షలకు పైగా ఆదాయం...

వీళ్ళు ఈ గంజాయి ప్రధానంగా ధూల్‌పేటతో పాటు ఆంధ్రా-ఒడిస్సా సరిహద్దు ప్రాంతం నుంచి ఖరీదు చేస్తున్నారు. కేజీ రూ.8 వేలకు కొంటూ ఐదు గ్రాముల చొప్పున చిన్న ప్యాకెట్లలోకి ప్యాక్ చేస్తున్నారు. ఒక్కోటి రూ.250 చొప్పున కేజీ రూ.50 వేలకు అమ్ముతున్నారు. నెలకు వీరి ఆర్జన రూ.9 లక్షల వరకు ఉన్నట్లు పోలీసులు తేల్చారు.

రికార్డు స్థాయిలో నగదు సీజ్, ఫ్రీజ్...

దీంతో నానక్‌రామ్‌గూడపై ప్రత్యేక దృష్టి పెట్టిన ఇన్‌స్పెక్టర్ పి.రమేష్ రెడ్డి, ఎస్సై వెంకట రాములు నేతృత్వంలోని బృందాలు నిఘా ఉంచాయి. బుధవారం గౌతమ్, నీతు, మధు బాయ్‌లతో పాటు మరో మైనర్‌ను పట్టుకున్నారు. వీరి ఇంట్లో ఉన్న రూ.40.3 లక్షల నగదు సీజ్ చేసి, 16 బ్యాంకు ఖాతాల్లోని రూ.1.53 కోట్లు ఫ్రీజ్ చేశారు. ఈ గ్యాంగ్ గంజాయి దందాలో మూడేళ్ల కాలంలో రూ.4 కోట్ల వరకు సంపాదించిందని, ఈ ఆస్తుల్ని సఫేమా యాక్ట్ ప్రయోగించి స్వాధీనం చేసుకుంటామని ఎస్పీ చక్రవర్తి తెలిపారు.

100 కిలోల గంజాయి పట్టివేత



కీసర: హైదరాబాద్ మీదుగా ఒడిశా నుంచి మహారాష్ట్రకు గంజాయిని సరఫరా చేస్తున్న ఇద్దరు అంతరాష్ట్ర నిందితులను రాచకొండ పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.35 లక్షల విలువ చేసే 100 కిలోల గంజాయి, కారు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఆయా వివరాలను రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ బుధవారం మీడియాకు వివరించారు. ఒడిశాకు చెందిన భువన్ సాబీర్, వరుణ్‌కుమార్ పట్నాయక్‌లు గ్రాడ్యుయేషన్ పూర్తయ్యాక విశాఖపట్నం హన్మంతాపూర్ జంక్షన్‌లోని ఓ హార్డ్‌వేర్ దుకాణంలో పనిచేస్తున్నారు. ఇక్కడ వైజాగ్‌కు చెందిన సురేష్‌తో వీరికి పరిచయం ఏర్పడింది. సురేష్‌కు ఒడిశాలో గంజాయి సరఫరాదారులతో మంచి పరిచయాలున్నాయి. ఈక్రమంలో మహారాష్ట్రలోని పుణేలో గంజాయి దందా చేసే చింటూతో సురేష్ డీల్ కుదుర్చుకున్నాడు. ఈక్రమంలో ఒడిశా నుంచి పుణేకు గంజాయిని సరఫరా చేస్తే డబ్బు ఇస్తానని భువన్, వరుణ్‌లతో మాట్లాడుకున్నాడు. దీంతో వీరిరువురు హ్యుందాయ్ క్రెటా కారు (ఓడీ02 ఏజే 5619)లో గంజాయిని లోడ్ చేసుకొని మహారాష్ట్రకు బయలుదేరారు. ఈమేరకు బుధవారం తెల్లవారుజామున విశ్వసనీయ సమాచారం అందుకున్న మల్కాజ్‌గిరి స్పెషల్ ఆపరేషన్ టీం (ఎస్ఓటీ), కీసర పోలీసులు కీసర ఓఆర్ఆర్ టోల్‌ప్లాజా వద్ద భువన్, వరుణ్‌లను పట్టుకున్నారు. సురేష్, చింటూలు పరారీలో ఉన్నారు.

లైంగిక దాడి కేసులో తండ్రీకొడుకులకు జైలు

- బాలికను బంధించి అత్యాచారం..వేధింపులు
- కుమారుడికి జీవిత ఖైదు...తండ్రికి ఏడేళ్ల కారాగారం



నిందితులు భరత్‌కుమార్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి (ఫైల్)

రంగారెడ్డి కోర్టులు: చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో 2016లో నమోదైన మైనర్ బాలికపై అత్యాచారం కేసులో నిందితులైన తండ్రీ కొడుకులకు జైలు శిక్షతోపాటు 5 లక్షల రూపాయల భారీ జరిమానా విధిస్తూ శుక్రవారం ఎల్బీనగర్‌లోని 9వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి హరీశ తీర్పు వెలువరించారు. కోర్టు ఏపీపీ సునీత కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. సుధాకర్‌రెడ్డి, భరత్ కుమార్‌రెడ్డి ఇద్దరు తండ్రీకొడుకులు. వీరిద్దరు వృత్తిరీత్యా న్యాయవాదులు. కొత్తపేటలోని ఓ అపార్ట్‌మెంట్ పెంట్‌హౌస్‌లో ఉంటూ సూర్యాపేటకు చెందిన 15 ఏళ్ల మైనర్ బాలికను పనిలో కుదుర్చుకున్నారు. కొద్దిరోజుల తర్వాత బాలికను ఇంట్లోనే నిర్బంధించి అన్ని పనులు చేయించుకుంటూ శారీరకంగా, మానసికంగా హింసించారు. ఇంట్లో కుటుంబ సభ్యులు లేని సమయంలో లైంగిక దాడికి కూడా పాల్పడేవారు. ఓ రోజు కరెంటు పనిచేయడానికి వారింటికి వెళ్లిన ఓ ఎలక్ట్రీషియన్‌కు బాధితురాలు తన గోడు వెల్లబుచ్చింది. దీంతో వారి అఘాయిత్యాలు వెలుగు చూశాయి. పోలీసులు రంగంలోకి దిగి బాధితురాలిని తల్లిదండ్రులకు అప్పగించారు. మహిళా సంఘం నాయకురాళ్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి..నిందితులిద్దర్ని రిమాండ్‌కు తరలించారు. కేసుపై విచారణ చేపట్టిన కోర్టు..సాక్షులను విచారించి, జరిగిన పరిణామాలను తీవ్రంగా పరిగణించి ప్రధాన నిందితుడైన భరత్‌కుమార్ రెడ్డికి జీవిత ఖైదు, రూ.2 లక్షల 69 వేలు జరిమానా, మరో నిందితుడైన తండ్రి సుధాకర్‌రెడ్డికి ఏడేళ్ల జైలు, రూ.2 లక్షల 39 వేలు జరిమానా విధిస్తూ, బాధితురాలికి రూ.10 లక్షల పరిహారం మంజూరు చేస్తూ తీర్పు వెలువరించింది.

'శ్రీనిధి' ఎదుట తల్లిదండ్రుల ఆందోళన

పోచారం: యమ్నంపేట్‌లోని శ్రీనిధి యూనివర్సిటీకి అనుమతి రాకపోవడంతో వర్సిటీలో చేరిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు బుధవారం ఆందోళన చేపట్టారు. వర్సిటీలో చదువుతున్న 291 మంది విద్యార్థులను శ్రీనిధి ఇంజినీరింగ్ కళాశాలలో సర్దుబాటు చేయాలని డిమాండ్ చేశారు. సర్దుబాటు విషయంలో యాజమాన్యం ఇప్పటికే పలు మార్లు వాయిదావేయడం పట్ల వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యా సంవత్సరం వృథా కాకుండా న్యాయం చేయాలని కోరారు. పోలీసులతో గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినప్పటికీ తోసుకుంటూ వర్సిటీ ఆవరణలోకి ఆందోళనలో పాల్గొన్నవారు ప్రవేశించారు. కళాశాలలో జరుగుతున్న పరీక్షలను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ఈ తరుణంలో విద్యార్థి సంఘాల నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో యాజమాన్యం కొంత మంది ప్రతినిధులను క్యాంపస్‌కు పంపింది. సోమవారం వరకు సమస్యను పరిష్కరిస్తామని ప్రతినిధి బృందం హామీ ఇవ్వడంతో ఆందోళ విరమించారు. పరిస్థితి అదుపు తప్పకుండా డీసీపీ జానకి, ఏసీపీ నరేష్‌రెడ్డి, పోచారం ఐటీసీ పీఎస్ సీఐ అశోక్‌రెడ్డితో పాటు సమీపంలోని పోలీస్ స్టేషన్లకు చెందిన సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించారు.

నేడు డబుల్ బెడ్‌రూమ్ లబ్ధిదారుల ఎంపిక

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో గురువారం హైదరాబాద్ కలెక్టరేట్ వేదికగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం లబ్ధిదారుల ఎంపిక జరుగనుంది. కంప్యూటర్ ర్యాండమైజేషన్ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి డ్రా పద్ధతిలో అర్హులను ఎంపిక చేయనున్నారు. ఇందుకు కలెక్టరేట్‌లో సమావేశ మందిరంలో ప్రత్యేక ఏర్పాట్లు పూర్తి చేశారు. మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, మహమూద్ అలీలు పాల్గొని ఉదయం పదిన్నర గంటలకు ఆన్‌లైన్ డ్రా పద్ధతిలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను ప్రారంభించనున్నారు. నియోజకవర్గాల వారిగా విచారణ పూర్తయి అర్హత సాధించిన లబ్ధిదారుల్లో 500 మంది చొప్పున ఎంపిక జరిగే విధంగా ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు. మొదటగా నియోజకవర్గంలో మొత్తం అర్హుల జాబితా స్క్రీన్‌పై డిస్ ప్లే అవుతుంది. అందులో డ్రా పద్ధతి ద్వారా ఐదు వందల మంది లబ్ధిదారుల ఎంపిక చేసి జాబితా డిస్‌ప్లే చేస్తారు. జాబితాలో వరుసగా లబ్ధిదారుల పేర్లు, ఆధార్ నెంబర్, ఫోన్ నెంబర్ పేర్కొంటారు.

బల్కంపేట ఎల్లమ్మ ఆలయం నుంచి కొమరవెల్లి మల్లన్నకు వెండి రాఖీ

- సరికొత్త సంప్రదాయానికి నాంది పలికిన బల్కంపేట ఆలయ పాలక మండలి సభ్యులు



కొమురవెల్లి మల్లన్నకు వెండి రాఖీ సమర్పించిన ఎల్లమ్మ ఆలయ పాలక మండలి సభ్యులు

సనత్‌నగర్: బల్కంపేట ఎల్లమ్మ-పోచమ్మ దేవస్థానం పాలక మండలి సభ్యులు మునుపెన్నడూ లేని సరికొత్త సంప్రదాయానికి నాంది పలికారు. పురాణాల ప్రకారం బల్కంపేట ఎల్లమ్మ తల్లికి సోదరుడైన కొమురవెల్లి మల్లన్నకు రాఖీ అందించే సంప్రదాయానికి శ్రీకారం చుట్టారు. పాలక మండలి సభ్యుల ఆధ్వర్యంలో మొట్టమొదటిసారిగా కొమురవెల్లి మల్లికార్జునస్వామి వారికి వెండి రాఖీని, పట్టువస్త్రాలను సమర్పించారు. అంతకముందు రాఖీని బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి ముందు ఉంచి పూజలు జరిపి తీసుకువెళ్లారు. మల్లన్నకు రాఖీ సమర్పించిన అనంతరం సనత్‌నగర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ తరుపున పోటీ చేస్తున్న తలసాని శ్రీనివాస్‌యాదవ్ భారీ మెజార్టీతో గెలుపొందాలని ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో ఆంజనేయులు యాదవ్, సరాఫ్ సంతోష్, పుష్పలత, రోజారెడ్డి, గిరియాదవ్, గౌతమ్‌రెడ్డి, అనిల్, యాదగిరిగుప్తా తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

ఆకట్టుకుంటున్న వస్త్ర ప్రదర్శన



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం-12లోని కళింగ కల్చరల్ హాల్‌లో జగ్దీశ్వర్ హస్తకళా ఎక్స్‌పో ఆద్వర్యంలో హ్యాండ్లూమ్ ఇండియా పేరిట ఏర్పాటు చేసిన వస్త్ర ప్రదర్శన మహిళలను అమితంగా ఆకట్టుకుంటోంది. ప్రదర్శనలో తెలంగాణ సంప్రదాయ వస్త్రాలతో పాటు పలు రాష్ట్రాల చేనేతకారుల ఉత్పత్తులైన సిల్క్, కాటన్, డిజైనరీ చీరలతో పాటు పలు ఫ్యాన్సీ వస్తువులను సుమారు 60 స్టాల్స్‌లో ప్రదర్శిస్తున్నారు. చేనేత కళాకారుల ఉత్పత్తులు నేరుగా వినియోగదారులకు చేరాలనే సదుద్దేశంతో ఈ ప్రదర్శనను ఏర్పాటు చేశామని నిర్వాహకుడు జయేష్‌గుప్తా తెలిపారు. ఈ ప్రదర్శన ఈ నెల 28వ తేదీ వరకు కొనసాగుతుంది.

బీజేపీ ధర్నా

బంజారాహిల్స్: ప్రభుత్వ వైఫల్యాలపై బీజేపీ ఫిలింనగర్ చౌరస్తాలో చేపట్టిన ధర్నాలో ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రా రెడ్డి పాల్గొన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో తొమ్మిదేళ్లుగా కేసీఆర్ సర్కారు ప్రజలను మోసం చేస్తున్నదని ఆరోపించారు. బీసీ బంధును కేవలం పదిహేను కులాలకు మాత్రమే కాకుండా బీసీల్లో ఉన్న 120 కులాలకు వర్తింపజేయాలన్నారు. గృహలక్ష్మి పథకానికి మరో రూ. మూడు లక్షలు చేర్చాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే అనుచరులకే పథకాలు లభిస్తున్నాయని ఆరోపించారు.

చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

బంజారాహిల్స్: తెలంగాణ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన మాజీ ఎమ్మెల్సీ డి. రాజేశ్వర్‌రావు గురువారం ప్రమాణ స్వీకారోత్సవం చేయనుండగా బుధవారం బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని ఎమ్మెల్యే కాలనీ షారోన్‌ఫుల్ గాస్పెల్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చర్చి పాస్టర్ ఎం. ప్రభుదాస్ ఈ సందర్భంగా రాజేశ్వర్ రావును ప్రత్యేకంగా ఆహ్వానించి ప్రార్థనలు నిర్వహించి అభినందించి ఆశీర్వదించారు. కార్యక్రమంలో బిషప్ దైవకుమార్, ఐఏఎస్ అధికారి ఎలీష, జడల వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

'డబుల్ ఇళ్ల' పరిశీలన

ఖైరతాబాద్: ఖైరతాబాద్ డివిజన్ ఇందిరానగర్ డబుల్ బెడ్ రూం ఇళ్లను ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ బుధవారం సందర్శించారు. డబుల్ బెడ్ రూం నివాసితుల కోసం సంపు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. ప్రస్తుతం ఉన్న భజన మండలి కమ్యూనిటీ హాల్ స్థలంలోనే జీ ప్లస్ వన్‌గా నిర్మాణం చేపడతామని ఎమ్మెల్యే తెలిపారు.

వర్సిటీల పరిశోధనలు సమాజానికి ఉపయోగపడాలి



జ్యోతి వెలిగిస్తున్న ఎమ్మెల్సీ సురభి వాణీదేవి

- స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న మహిళల చరిత్రను పరిశోధకులు వెలికితీయాలని
- జాతీయ సదస్సులో ఎమ్మెల్సీ సురభి వాణీదేవి

బంజారాహిల్స్: విశ్వవిద్యాలయాల్లో జరిగే పరిశోధనలు సమాజానికి ఉపయోగపడేలా ఉండాలని ఎమ్మెల్సీ సురభి వాణీ దేవి అన్నారు. మన దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న మహిళ గాథలను వెలికితీయాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు. డా.బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ, ప్రొ.జి.రాంరెడ్డి సెంటర్ ఫర్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ -ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్‌లు సంయుక్తంగా 'స్వాతంత్ర్య పోరాటంలో గుర్తింపునకు నోచుకోని యోధులను అన్వేషించడం-సమకాలీన ఔచిత్యం' అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు బుధవారం అంబేద్కర్ వర్సిటీలో ప్రారంభం అయింది. ముఖ్యఅతిథిగా హాజరైన వాణీదేవి మాట్లాడుతూ నాటి మహిళల పోరాట పటిమను వెలికితీసి సమాజానికి తెలిపితే ఇప్పటి తరాలకు అవి స్ఫూర్తినిస్తాయన్నారు. స్వాతంత్రోద్యమ పోరాటంలో పాల్గొన్న పోరాట యోధులను పిలిచి..విశ్వవిద్యాలయాల్లో మాట్లాడించాలని, వారిని ఘనంగా సన్మానించాలని పేర్కొన్నారు. ఇలాంటివి యువతకు గొప్ప అనుభూతిని కలిగిస్తాయన్నారు. చరిత్రలో నిలవని గొప్ప స్వాతంత్ర్య పోరాట యోధుల్లో స్వామి రామానంద తీర్థ ఒకరని ఆమె వివరించారు. గౌరవ అతిథిగా హాజరైన తెలంగాణ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డా.అయాచితం శ్రీధర్ మాట్లాడుతూ భారతీయ స్వాతంత్ర్య పోరాట గాథలను విదేశీయులు రాస్తేగానే మనకు తెలియని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మనకు తెలియని చరిత్ర చాలా ఉందని, దాన్ని ఇప్పటి పరిశోధకులు వెలికితీయాల్సిన అవసరం ఉందన్నారు. ఓయూ మాజీ ప్రొఫెసర్ రమా మెల్కోటే మాట్లాడుతూ చాలా మంది భారతీయ స్వాతంత్ర్య పోరాట యోధుల గురించి వింటుంటామని, అయితే పుస్తకాల్లో అది కనిపించదని ఆవేదన వ్యక్తపర్చారు. రాజ్యాంగాన్ని రచించిన డా.బి.ఆర్.అంబేద్కర్ గురించి కూడా 1980వ దశకం వరకు పెద్దగా ప్రచారం లేదని, దళిత సంఘాల పోరాట పటిమతో ఆయన గొప్ప ఆలోచనా విధానం దేశ ప్రజలకు విరివిగా తెలిసిందని వివరించారు. తెలుగు వీరనారీమణులు చాకలి ఐలమ్మ, మల్లు స్వరాజ్యం లాంటి వాళ్లకు రావాల్సినంత గుర్తింపు రాలేదన్నారు. అంబేద్కర్ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె.సీతారామారావు, ప్రొ. జి.రాంరెడ్డి సెంటర్ ఫర్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్, డైరెక్టర్ ప్రొ. సుధారాణి, రిజిస్ట్రార్ డా.ఎ.వి.ఆర్.ఎన్ రెడ్డి ప్రసంగించారు. అనంతరం నిర్వహించిన సెషన్స్‌లో హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ హిస్టరీ విభాగం అధిపతి ప్రొ.భాంగ్య భూక్య, డెక్కన్ హెరిటేజ్ హైదరాబాద్ చైర్మన్ వేదకుమార్, తెలంగాణ రాష్ట్ర ఆర్కైవ్స్ పరిశోధనా సంస్థ డైరెక్టర్ ప్రొ.జరీనా పర్వీన్, తెలంగాణ చారిత్రక విభాగ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి డా.టి.వివేక్ తదితరులు పలు చారిత్రక అంశాలపై తమ తమ అభిప్రాయాలను, స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న, చరిత్రలో రాయని అనేక మంది పోరాట పటిమను, వాళ్ళ త్యాగాలను సదస్సు దృష్టికి తెచ్చారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఎవరూ ఆందోళన చెందొద్దు

- ఎమ్మెల్యే మాగంటి లాంటి వ్యక్తిని వదులుకోవద్దు
- మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

వెంగళరావునగర్: రాష్ట్రంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేయడమే సీఎం కేసీఆర్ లక్ష్యమని, ఈ విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు.

బీసీ బంధు పథకం కింద ఎంపికైన లబ్ధిదారులకు ఆర్థిక సాయం చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం యూసుఫ్‌గూడలోని సవేరా ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిలుగా హాజరైన మంత్రి తలసాని, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌లు లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... మొదటిదశలో చెక్కులు రానివారికి రెండో విడదతలో త్వరలోనే వస్తాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సన్నిహితులైన మాగంటి నిత్యం ప్రజల్లోనే తిరుగుతూ ప్రజా నాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్నారని అన్నారు. ఇలాంటి నాయకుడిని జూబ్లీహిల్స్ ప్రజలు వదులుకోవద్దని సూచించారు. రానున్న ఎన్నికల్లో అత్యంత మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఇదిలా ఉండగా... తమతో పాటే గెలిచిన కిషన్‌రెడ్డి అనే వ్యక్తి ఉన్నారని, ఆయన ఎన్నడూ ప్రజలకు కనిపించడంలేదని, అలాంటి నాయకులను గెలిపిస్తే మరోసారి ప్రజల ముఖం కూడా చూడరని ప్రజలు ఈ విషయంలో ఆలోచించి ఓటేయాలని సూచించారు. ఎమ్మెల్యే మాగంటి మాట్లాడుతూ... కులవృత్తిదారులకు ఆర్థిక చేయూతనందించాలనే ఉద్దేశంతోనే సీఎం కేసీఆర్ ఈ స్కీంను ఏర్పాటు చేసి చెక్కులు అందిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ ఆశన్న, నోడల్ అధికారి పద్మ, కార్పొరేటర్లు రాజ్‌కుమార్, దేదీప్య విజయ్, సంగీత యాదవ్, పలువురు సీనియర్ బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 300 మంది లబ్ధిదారులకు రూ. లక్ష చొప్పున ఆర్థిక సాయం చెక్కులను పంపిణీ చేశారు.



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి తలసాని, ఎమ్మెల్యే మాగంటి, కార్పొరేటర్లు

నగరానికి తలమానికంగా మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్ నిర్మిస్తాం

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్



వెంకటేశ్వరకాలనీ: నగరానికి తలమానికంగా మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్‌ను ప్రతాప్‌నగర్‌లో నిర్మిస్తామని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. ఎన్నికలు వస్తున్నాయి కదా అని ఏదో హామీ ఇవ్వడం లేదని ఇక్కడున్న స్థలానికి ఇప్పటికే రూ. 1.50 కోట్లు మంజూరు చేయించామని ఆయన అన్నారు. వెంకటేశ్వరకాలనీ డివిజన్ పరిధిలోని ప్రతాప్‌నగర్ బస్తీలో బుధవారం టీఎమ్మార్పీఎస్ యువసేన అధ్యక్షుడు, సీనియర్ బీఆర్ఎస్ నేత నల్ల శివమాదిగ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన బస్తీవాసులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతాప్‌నగర్ బస్తీలో గత ప్రభుత్వాల కంటే బీఆర్ఎస్ హయాంలోనే ఎక్కువ అభివృద్ధి చేశామని దానం అన్నారు. స్థానికంగా సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, బస్తీ దవాఖానా ఏర్పాటు ఇలా ఎన్నో అభివృద్ధి పనులు చేశామని గుర్తు చేశారు. అర్హులైన అందరికీ దళిత బంధు, బీసీ బంధు, మైనార్టీ బంధు పథకాలను వర్తింపజేస్తామన్నారు. ఉప్పర్ బస్తీలో పెద్ద ఎత్తున ఉన్న రేకుల నివాసితులకు గృహలక్ష్మి పథకం కింద లబ్ధిదారులను చేస్తామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు రాములు చౌహాన్, టీఎమ్మార్పీఎస్ యువసేన అధ్యక్షుడు, సీనియర్ బీఆర్ఎస్ నేత నల్ల శివ మాదిగ, గణేష్, మధు, సురేష్, అశ్విన్, జంగమ్మ, సభియా బేగం, ప్రభ, శ్రీకాంత్ పటేల్, ధన్‌రాజ్, కృష్ణ, సోమేశ్వర్ రావు, సంపత్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి నేతలు, కార్యకర్తలు దానం సమక్షంలో బీఆర్ఎస్ కండువాలు వేసుకొని పార్టీలో చేరారు.

ప్రతి సమస్యలనూ పరిష్కరిస్తాం: రోహిణ్‌రెడ్డి

పంజగుట్ట: బస్తీల్లో, కాలనీల్లో రోడ్లు గోతులమయం, ఎక్కడచూసినా మురుగు నీరు ప్రస్తుత ప్రజా ప్రతినిధులు రావడం, వెళ్లడమే కాని ఏ ఒక్కసమస్య కూడా పరిష్కరించడం లేదని ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ సి.రోహిణ్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంకెంతో కాలంలేదని అతిత్వరలోనే కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని రాగానే ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యకూ పరిష్కారం చూపుతామని ఆయన హామీ ఇచ్చారు. తిరగబడదాం-తరిమికొడదాం అనే కార్యక్రమంలో భాగంగా సోమాజిగూడ డివిజన్‌లోని బీఎస్ మక్తాలో ఆయన పర్యటించారు. ప్రతి ఇంటికీ తిరుగుతూ వారు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తాము అధికారంలోకి రాగానే నిత్యం ప్రజల మధ్యలోనే ఉంటానని ప్రతి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు నారికెళ నరేష్, నేతలు బబ్లు, సమీర్, కాటూరి రమేష్, గొల్లలు రాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీదేవికి పీహెచ్‌డీ ప్రదానం



శ్రీనగర్‌కాలనీ: నగరానికి చెందిన శ్రీ శారద గ్రూప్ ఆఫ్ కాలేజెస్ ఫౌండర్ చైర్మన్ డాక్టర్ ఎస్.శ్రీదేవికి ఉస్మానియా యూనివర్సిటీ పీహెచ్‌డీ డిగ్రీని ప్రకటించింది. బుధవారం ఎల్లారెడ్డిగూడలోని శ్రీశారద కాలేజెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ... ఓయూ యూనిర్సిటీ నుంచి లా ప్రొఫెసర్ ఎస్‌బీ ద్వాకరానాథ్ పర్యవేక్షణలో కాన్స్టిటూషనల్ డైనమిక్స్ ఆఫ్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్ త్రూ జుడీషియల్ ప్రాసెస్‌లో పరిశోధన చేసి పీహెచ్‌డీ డాక్టరేట్‌ను అందుకున్నట్లు చెప్పారు. భారత రాజ్యాంగాన్ని అనుసరిస్తూ మహిళా సాధికరతను న్యాయవ్యవస్థలో ఎలాంటి అంశాలు ముడిపడ్డాయనే అంశాలపై పూర్తిస్థాయి పరిశోధనలను చేసి యూనివర్సిటీ సమర్పించానన్నారు. డాక్టరేట్ లభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా శ్రీశారద కాలేజెస్ విద్యార్థులు, లెక్చరర్స్, సిబ్బంది అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ పవన్, ప్రిన్సిపాల్ భాస్కర్ పాల్గొన్నారు.

'చుర్రోల్టో' అవుట్‌లెట్ ప్రారంభం

లక్డీకాపూల్: వీధుల్లో తిరుగుతూ వచ్చిన ఒక ఆలోచన నుండి వచ్చిందే చుర్రోల్టో అవుటలెట్స్ అని ఆ సంస్థ వ్యవస్థాపకులు నిహార్ తెలిపారు. బుధవారం బంజారాహిల్స్‌లో కొత్త అవుట్‌లెట్‌ను ప్రారంభించిన సందర్భంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. హై స్ట్రీట్‌లోని పెద్ద దుకాణాల వరకు చుర్రోస్ 'చుర్రోల్టో'గా ఎలా విస్తరించిందో వివరించారు. కస్టమర్‌ను దృష్టిలో పెట్టుకుని వారి చుట్టూ అనుభవాన్ని సృష్టించడం ఒక అద్భుతమైన విజయమన్నారు. ఈ సందర్భంగా ఆయన చెఫ్ అమీతో కలిసి తమ 7 సంవత్సరాల విజయవంతమైన ప్రయాణాన్ని పంచుకోవడమే కాకుండా అద్భుతాలతో నిండిన మెనూ ఆవిష్కరించారు. చెఫ్ అమీ మాట్లాడుతూ... అన్ని అవుట్‌లెట్‌లు 3 కేటగిరీల కింద ఆహారం పానీయాలను అందజేస్తున్నాయి.

'అర్హులకు సంక్షేమం'లో బీఆర్ఎస్ విఫలం

వెంగళరావునగర్: జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో అర్హులైన అందరికీ ప్రభుత్వ పథకాలు అందజేయడంలో బీఆర్ఎస్ విఫలమవుతుందని బీజేపీ నేతలు విమర్శించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందజేయాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో బుధవారం యూసుఫ్‌గూడ చెక్‌పోస్టు వద్ద ఆందోళన నిర్వహించారు. ఆందోళనతో యూసుఫ్‌గూడ చెక్‌పోస్టు వద్ద భారీగా ట్రాఫిక్ స్తంభించింది. జూబ్లీహిల్స్, మధురానగర్ పోలీసులు అక్కడికి చేరుకుని ఆందోళనకారులను స్టేషన్‌కు తరలించారు. బీజేపీ జూబ్లీహిల్స్ సీనియర్ నేతలు లంకెల దీపక్‌రెడ్డి, కుంభాల గంగరాజు, డాక్టర్ పద్మ వీరపనేని, కీర్తిరెడ్డి, సంగీత, రూప, నాగమణి, కనకరాజు పాల్గొన్నారు.

చిగురు రెస్టారెంట్‌ను ప్రారంభించిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్



రెస్టారెంట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

బంజారాహిల్స్: భోజన ప్రియులకు నోరూరించే వంటకాల రుచులను అందించేందుకు జూబ్లీహిల్స్‌లో చిగురు ఏ టేస్ట్ ఆఫ్ సౌత్ రెస్టారెంట్‌ను బుధవారం మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విభిన్న ఆహార రుచులు అందించేందుకు హైదరాబాద్ కేరాఫ్‌గా నిలుస్తున్నదన్నారు. తనకు చికెన్, మటన్ అంటే చాలా ఇష్టమని తెలుగింటి రుచులు ఇక్కడ అందించడం అభినందనీయం అన్నారు. నిర్వాహకులు సంధ్యా చౌదరి, కిషోర్ కుమార్, హమీద్ తదితరులు పాల్గొన్నారు. ఇక్కడ కోడి కూర, చిల్లిగారె, చింత చిగురు పలావ్, ఘీ రైస్ చింత చిగురు ఇలా ఎన్నో దక్షిణాది రుచులు అందుబాటులో ఉన్నాయని రెస్టారెంట్ డిజైన్ థీమ్ ప్రత్యేకమని వారు తెలిపారు.

త్వరలో పేదల ప్రభుత్వం: విజయారెడ్డి




సోమాజిగూడ బస్తీవాసులతో మాట్లాడుతున్న విజయారెడ్డి

పంజగుట్ట: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే బస్తీల్లో ఉన్న సమస్యలన్నీ పరిష్కరిస్తామని టీ పీసీసీ ప్రధాన కార్యదర్శి, ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి అన్నారు. భారత్ జోడో యాత్రకు కొనసాగింపుగా రాహుల్‌గాంధీ ఇచ్చిన సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు విజయారెడ్డి సోమాజిగూడబస్తీ, కుమ్మరి బస్తీ, జాఫర్ అలీబాగ్, విష్ణుపుర తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ప్రతి గడపకూ తిరుగుతూ వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అతిత్వరలోనే పేదల ప్రభుత్వం వస్తుందని అప్పుడు పేదల సమస్యలన్నీ తీరుస్తామని హామీ ఇచ్చారు.

'బీఆర్ఎస్ నాయకులను తిరగనివ్వం'

పంజగుట్ట: రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని బొందపెడతామని కురుమ యువ జైతన్య సమితి (కేవైసీఎస్) హెచ్చరించింది. రాష్ట్రంలో సుమారు 40 లక్షల జనాభా ఉన్న కురుమలకు ఒక్క ఎమ్మెల్యే సీటూ కేటాయించక పోవడంపట్ల వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ ఎలా ప్రచారం చేస్తుందో చూస్తామని, రాళ్లతో కొడతామని హెచ్చరించారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కెవైసీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గొరిగె నర్సింహ కురుమ, ఉపాధ్యక్షులు కుండే వెంకటేష్ కురుమ, బీసీ సంఘాల రాష్ట్ర యువజన నాయకులు కనకాల శ్యామ్‌లు మాట్లాడుతూ... ముఖ్యమంత్రి కేసీఆర్ గొర్రెలను ఇచ్చి మా గొంతు కోయాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేతలు కోసిక శ్రీనివాస్‌రావు, కోనుగొటి వెంకటేశ్ కురుమ, కొల్లు రమేష్, కొత్తూరి చంద్రబౌళి కె.సత్యనారాయణ పాల్గొన్నారు.



బీజేపీ విజయమే శ్రేణుల లక్ష్యం కావాలి

రహమత్‌నగర్: రానున్న ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ అభ్యర్థి విజయమే లక్ష్యం పార్టీ శ్రేణులు సైనికుల్లా కృషి, పోరాటం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆ పార్టీ జూబ్లీహిల్స్ నియోజవర్గ పరిశీలకుడు, బెంగుళూరు నగర ఎమ్మెల్సీ గోపీనాథ్‌రెడ్డి కార్యకర్తలకు సూచించారు. ప్రవాస్‌యోజన కార్యక్రమంలో భాగంగా బుధవారం బోరబండ డివిజన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. గోపీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ... బీఆర్ఎస్ ప్రజావ్యతిరేక విధానాలను క్షేత్ర స్థాయిలో ప్రజలకు వివరించాలని సూచించారు. ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో పార్టీ కోసం ప్రతి కార్యకర్తా తప్పనిసరిగా సమయం కేటాయించాలని సూచించారు. నాయకులు బస్తీలో పర్యటిస్తూ కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి పథకాలు ప్రజలకు వివరించాలన్నారు. ఒక లక్ష్యంతో, క్రమశిక్షణతో పనిచేస్తే తప్పక విజయం సాధిస్తామన్నారు. నాయకులు జట్లుగా విడిపోయి గడపగడపకూ వెళ్లాలన్నారు. వారం రోజుల పాటు నియోజకవర్గంలో పర్యటించి పార్టీ బలాబలాలు, నాయకులు అభిప్రాయాలు సేకరించి జాతీయ పార్టీ నేతలకు సమర్పిస్తామన్నారు. గోపీనాథ్‌రెడ్డిని బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. జూబ్లీహిల్స్ నేత లంకాల దీపక్‌రెడ్డి, కుంభాల గంగారాజు, సర్వ శ్రీనివాస్, కృష్ణ, సంజీయ, ఉషా, కుమార్‌నాయక్, డివిజన్ అధ్యక్షుడు కొత్త వెంకటేశ్, శరణ్‌రెడ్డి, కృష్ణ మోహన్, సూర్య, అన్నపూర్ణ, వినోద్, మధు, రాజ్‌కుమార్, రాజేశ్వరి పాల్గొన్నారు.



సరస్వతి పీఠంలో విద్యార్థులు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్‌లోని భారతీయ విద్యాభవన్స్ ఆత్మకూరి రామారావు స్కూల్ ప్రీ ప్రైమరీ విద్యార్థులు బుధవారం హైటెక్ సిటీలోని అవధాన సరస్వతి పీఠాన్ని సందర్శించారు. సరస్వతి అమ్మవారి సన్నిధిలో శ్లోకాలు చదివారు. గురూజీ చిన్నారులకు బీజాక్షరాలు నేర్పించారు. ఇక్కడే ఉన్న గోశాలను సందర్శించిన చిన్నారులు పులకించిపోయారు. చిన్నారులకు సమాజాన్ని చూపించడం, క్షేత్ర స్థాయిలో పాఠాలు నేర్చుకునే విధంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రకృతి పర్యావరణంలో విద్యార్థులు ఆధ్యాత్మిక సందడిలో గడిపారు.

క్రైం కార్నర్..

కత్తులతో సంచరిస్తున్న ఇద్దరికి జైలు శిక్ష



నిందితులు మహ్మద్ ఇమ్రోజ్, షాయి సమీర్

ఫిలింనగర్: జేబుల్లో కత్తులు పెట్టుకొని అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు యువకులపై ఫిలింనగర్ పోలీసులు పెట్టి కేసు నమోదు చేసి బుధవారం పదో ప్రత్యేక మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఎస్.లక్ష్మణ్ రావు ఎదుట హాజరుపరిచారు. వీరికి అయిదు రోజుల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. ఫస్ట్‌ల్యాన్సర్‌కు చెందిన కూరగాయల వ్యాపారి మహ్మద్ ఇమ్రోజ్(23), మాసబ్ ట్యాంక్‌కు చెందిన సెంట్రింగ్ వర్కర్ షాయి సమీర్(23) కొంత కాలంగా ఫిలింనగర్ ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. వీరి జేబుల్లో కత్తులు లభించగా ఎందుకు పెట్టుకున్నారని అడిగితే సరైన సమాధానం చెప్పలేదు. దీంతో వీరిని న్యాయమూర్తి తీర్పుమేరకు చంచల్‌గూడ జైలుకు తరలించారు.

నీటి చౌర్యం చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

బంజారాహిల్స్: అనుమతి లేకుండా అక్రమంగా నల్లా పైప్‌లైన్ వేసుకొని మంచినీటిని చౌర్యం చేస్తున్న ప్లాట్ యజమానిపై జూబ్లీహిల్స్ పోలీసులు క్రిమినల్ కేసులు నమోదుచేశారు. వివరాలివీ... జూబ్లీహిల్స్ రోడ్ నెం. 44లోని ప్లాట్ నెం. 853-ఆర్‌లో కొంత కాలంగా మంచి నీటి పైప్‌లైన్లు అక్రమంగా వేసుకొని నీటి చౌర్యానికి పాల్పడుతున్నట్లుగా జలమండలి అధికారులకు సమాచారం అందింది. 50 ఎంఎం వాటర్ కనెక్షన్‌ను జలమండలి అనుమతి లేకుండానే తీసుకొని నీటిని వాడుకుంటున్నారని గుర్తించిన జూబ్లీహిల్స్ జలమండలి సెక్షన్ మేనేజర్ ఎస్.శ్రీహరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ప్లాట్ యజమాని పి. శ్రీనివాస్‌పై ఐపీసీ సెక్షన్ 269, 379, 430, పీడీపీపీ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. ప్రధాన పైప్‌లైన్‌ను పగలగొట్టి నిబంధనలకు విరుద్ధంగా ఈ కనెక్షన్ అక్రమంగా వేసుకున్నట్లుగా ఫిర్యాదులో పేర్కొన్నారు. గత కొన్నేళ్లుగా ఈ ఇల్లీగల్ దందా కొనసాగుతున్నదన్నారు. దీని వల్ల చుట్టుపక్కల వారికి నీటి సమస్య తలెత్తినట్లు కూడా ఆయన తెలిపారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అపోలో ఫార్మసీలో దృష్టిమరల్చి రూ. 50 వేల చోరీ

బంజారాహిల్స్: అపోలో ఫార్మసీలో దృష్టిమరల్చి క్యాష్ కౌంటర్ నుంచి నగదు తస్కరించిన ఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని కమాన్ ఎదురుగా ఉన్న అపోలో ఫార్మసీని ఎప్పటిలాగే ఆదిల్ తెరిచాడు. అదే సమయంలో గుర్తు తెలియని యువకుడు మెడిసిన్ కావాలంటూ ఆదిల్‌ను అడిగి ఆయన దృష్టి మరల్చి క్యాష్ కౌంటర్‌లో ఉన్న రూ. 50 వేల నగదుతో ఉడాయించాడు. గమనించిన ఆదిల్ ఆగంతకుడిని పట్టుకోవడానికి ప్రయత్నించి విఫలమయ్యాడు. ఫార్మసీ సీనియర్ మేనేజర్ సాగర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని నిందితుడి కోసం గాలింపు చేపట్టాడు. ఇక్కడ సీసీ పుటేజీలు పరిశీలిస్తున్నారు.

పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన వైద్యుడిపై ఫిర్యాదు

పంజగుట్ట: పెళ్లి చేసుకుంటానని సహజీవనం చేసి మోసం చేసిన వైద్యుడిపై చర్యలు తీసుకోవాలని బాధిత వైద్యురాలు పంజగుట్ట పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కేరళకు చెందిన బాధితురాలు గతంలో నిమ్స్ ఆస్పత్రిలో పీజీ వైద్యవిద్యను పూర్తిచేసి క్లీనికల్ ఫార్మాకాలజీ డిపార్ట్‌మెంట్‌లో సీనియర్ రెసిడెన్స్ వైద్యురాలిగా విధులు నిర్వహించింది. ఆ సమయంలో హాస్టల్‌లో ఉండే బాధితురాలుకు గ్యాస్ట్రో సర్జరీ డిపార్ట్‌మెంట్ వైద్యుడు డాక్టర్ సౌరవ్ చౌదరితో పరిచయం అయ్యింది. ఇద్దరూ ప్రేమించుకున్నారు. ఒకే హాస్టల్‌లో సుమారు 6 నెలలు సహజీవనం చేశారు. 2022లో సౌరవ్ చౌదరీ వైద్యవృత్తి నిమిత్తం కోల్‌కత్తాకు వెళ్లిపోయాడు. బాధిత వైద్యురాలు కూడా కేరళలో ఉంటుంది. ప్రస్తుతం సౌరవ్‌కు ఫోన్‌చేస్తే స్పందన లేదని ప్రేమించానని, పెళ్లి చేసుకుంటానని మోసం చేశారని అతనిపై చర్యలు తీసుకోవాలని బాధితురాలు బుధవారం పంజగుట్ట పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రేతల అరెస్టు

పంజగుట్ట: గుట్టుచప్పుడు కాకుండా గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని పంజగుట్ట పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... పంజగుట్ట మెట్రో స్టేషన్ వద్ద గంజాయి అమ్ముతున్నారనే సమాచారంతో పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. శ్రీనగర్‌కాలనీకి చెందిన వంశీ(23), వికారాబాద్‌కు చెందిన ప్రస్తుతం వెంకటగిరిలో ఉంటున్న ఎస్.సంతోష్ రెడ్డి (26)ని అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి చిన్న చిన్న ప్యాకెట్లలో ప్యాక్ చేసి ఉన్న 600 గ్రాముల గంజాయి, రూ. 4 వేలను స్వాధీనం చేసుకున్నారు.

యువతిని వేధిస్తున్న వ్యక్తికి జైలు శిక్ష




నిందితుడు సోలంకర్ రాజు

ఫిలింనగర్: ఫిలింనగర్ ప్రాంతంలో ఓ యువతిని వెంబడించి వేధిస్తూ ఆమె అనుమతి లేకుండా వాట్సాప్ కాల్స్ మళ్లీమళ్లీ చేస్తూ ఆమెను మానసికంగా వేధింపులకు గురి చేసిన ఘటనలో నిందితుడికి ఎనిమిది రోజుల జైలు శిక్ష విధిస్తూ నాంపల్లిలోని పదవ ప్రత్యేక మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఎస్.లక్ష్మణ్‌రావు తీర్పునిచ్చారు. పోలీసుల సమాచారం మేరకు... సంగారెడ్డి జిల్లా తడ్కల్ గ్రామానికి చెందిన సోలంకర్ రాజు(30) కొంత కాలంగా ఫిలింనగర్ ప్రాంతంలో తిరుగుతూ ఓ మహిళ వెంటపడుతూ ఆమె ఫొటోలు తీస్తూ బెదిరిస్తున్నాడు. ఫొటోలను సోషల్ మీడియాలో ఆమెకు సంబంధం లేకుండానే పోస్ట్ చేశాడు. ఇలా ఆమె వ్యక్తిగత జీవితానికి భంగం కలిగిస్తున్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు నిందితుడిపై సెక్షన్ 70(సి) సీపీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి బుధవారం న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచారు. నిందితుడికి జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

ఖైరతాబాద్ కాంగ్రెస్ టికెట్ ఇవ్వాలని వినోద్‌రెడ్డి దరఖాస్తు



హిమాయత్‌నగర్: త్వరలో జరగనున్న ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ నియోజకవర్గ టికెట్‌ను తనకు టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఎంఆర్‌జీ వినోద్‌రెడ్డి దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు బుధవారం గాంధీభవన్‌లో దరఖాస్తు సమర్పించారు.



మూన్ గురించి..
మీకు తెలుసా?

➤ మనం అనుకు న్నట్లు.. చంద మామ గుండ్రంగా ఉండడు.. గుడ్డు ఆకారం లో ఉంటాడు.. అలాగే చల్లనయ్య.. తెల్లనయ్య కాదు.. దగ్గర్నుంచి చూస్తే.. ముదురు బూడిద రంగులో ఉంటాడు. మనం ఎప్పుడు చూసినా.. చంద్రునిలోని 59 శాతం మాత్రమే మనకు కనిపిస్తుందట. అం తేకాదు.. చంద్రుడిని దగ్గర నుంచి చూస్తే.. భారీ గుంతలులాంటివి కనిపిస్తుంటాయి. ఇవన్నీ.. కొన్ని కోట్ల ఏళ్ల క్రితం ఖగోళ వస్తువులు దాన్ని ఢీకొన్నప్పుడు ఏర్పడినవే..



ఆన్‌లైన్‌లో 'అగ్రి' సెన్సెస్

- రెవెన్యూ గ్రామం యూనిట్‌గా వ్యవసాయ గణన షురూ
- ఇతర రాష్ట్రాల్లో మాన్యువల్‌గానే...
- మన దగ్గరే యాప్ ద్వారా స్మార్ట్ ఫోన్లు, ట్యాబ్‌ల వినియోగం

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: రైతుల జీవన స్థితి గతులు..సాగు కమతాల స్వరూప స్వభావాన్ని తేల్చే వ్యవసాయగణన (అగ్రికల్చర్ సెన్సెస్) ఇటీవల దేశవ్యాప్తంగా మొదలైంది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం తెలంగాణలో కూడా ఈ ప్రక్రియ కొనసాగుతోంది. భూకమతాల వారీగా రెవెన్యూ గ్రామాన్ని యూనిట్‌గా తీసుకొని సర్వే నిర్వహిస్తున్నారు. మొత్తం పది అంశాలపై మూడు దశల్లో వివరాలు సేకరిస్తున్నారు. రాష్ట్రంలో తొలిసారిగా కాగిత రహితంగా స్మార్ట్ ఫోన్లు, ట్యాబ్‌లు వినియోగించి ప్రత్యేక యాప్ ద్వారా డిజిటల్ విధానంలో ఏఈఓలు సర్వే చేస్తుండగా, మిగతా రాష్ట్రాల్లో మాన్యువల్‌గానే చేపడుతున్నారు.

2021-22 ప్రామాణికంగా 11వసారి

దేశంలో వ్యవసాయ స్థితిగతులు తెలుసుకోవడంతో పాటు అభివృద్ధి ప్రణాళిక, సామాజిక ఆర్థిక విధాన రూపకల్పనకు కేంద్రం ఐదేళ్లకు ఒకసారి వ్యవసాయ గణన నిర్వహిస్తోంది. 1979లో వ్యవసాయగణన మొదలుకాగా, చివరగా పదోసారి 2015-16లో చేపట్టారు. 11వ వ్యవసాయ గణన 2021-22లో జరగాల్సి ఉండగా, కరోనా తదితర కారణాలతో వాయిదా పడుతూ వస్తోంది. 2021-22 ప్రామాణిక సంవత్సరంగా ఈ నెల నుంచి వ్యవసాయానికి సంబంధించిన పూర్తి వివరాలు సేకరించేందుకు ప్రభుత్వం కొద్దిరోజుల క్రితమే ఆదేశాలు జారీ చేసింది.



మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం మద్దిగట్లంలో సర్వే చేస్తున్న ఏఈఓ

మూడు దశల్లో...

వానాకాలం, యాసంగిలో ఆయా రైతుల వారీగా ఏ ఏ పంటలు సాగు చేస్తున్నారో తెలుసుకునేందుకు రాష్ట్రంలో ఏటా వ్యవసాయశాఖ సర్వే చేస్తోంది. అయితే కేంద్రం మార్గదర్శకాల ప్రకారం మూడు విడతల్లో వ్యవసాయ గణన చేపట్టారు.

- మొదటి విడతలో రైతు పేరు, సామాజికస్థితి, సాగు విస్తీర్ణం, భూమి వినియోగం, పురుషులు, మహిళలు ఇలా అన్ని సేకరించి రెవెన్యూ గ్రామం వారీగా నమోదు చేస్తున్నారు.
- రెండో విడతలో ఎంపిక చేసిన 20 శాతం గ్రామాల్లో ప్రణాళిక శాఖ నిర్దేశించిన టీఆర్‌ఏఎస్ (ట్రిమ్ లీ రిపోర్టెడ్ అగ్రి స్టాటిస్టిక్స్)తో పాటు అదనంగా మరికొంత సమాచారం సేకరిస్తారు.
- మూడో దశలో ఏడు శాతం గ్రామాల్లో సాగు ఖర్చులు, యంత్రాల వినియోగం, ఎరువులు, విత్తనాలు, ప్రభుత్వ రాయితీలు తదితర వివరాలు సేకరిస్తారు.

సాంకేతికతతో సర్వే...

తాజాగా రాష్ట్రంలో చేపట్టిన వ్యవసాయ గణనలో అధికారులు వందశాతం సాంకేతికతను సద్వినియోగం చేసుకుంటున్నారు. స్మార్ట్‌ఫోన్లు, ట్యాబ్‌ల ద్వారా డిజిటల్ విధానంలో వ్యవసాయ కమతాలు, రైతుల వివరాలు సేకరిస్తున్నారు. ఇప్పటికే రైతుబంధు పథకానికి రైతుల నుంచి ఆధార్ కార్డులు, వ్యవసాయ భూముల విస్తీర్ణం, పంటల సాగు తదితర వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరచగా, వాటి ఆధారంగా వ్యవసాయగణనలో అదనపు సమాచారం తీసుకుంటున్నారు.

ప్రణాళికకు వ్యవసాయ గణన కీలకం



వ్యవసాయ స్థితిగతులు తెలుసుకోవడంతో పాటు ఆర్థిక విధాన రూపకల్పనకు వ్యవసాయ గణన ఎంతో ఉపయోగకరం. నిర్ణీత లక్ష్యం మేరకు పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నాం. జిల్లావ్యాప్తంగా వ్యవసాయశాఖ, ప్రణాళిక శాఖ అధికారులు, సిబ్బంది సర్వే నిర్వహిస్తున్నారు.

– దశరథ్, మహబూబ్‌నగర్ జిల్లా ప్రణాళికశాఖ అధికారి

ఈ నెల 31లోగా పూర్తి చేస్తాం



ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో వ్యవసాయ గణన చేయిస్తున్నాం. దీని వల్ల బహుళ ప్రయోజనాలు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న పథకాలకు అనుగుణంగా ఈ పంటల వివరాల లెక్కల సేకరణ జరుగుతోంది. ఈ నెలాఖరులోపు సర్వే పూర్తి చేస్తాం.

– బి.వెంకటేష్, మహబూబ్‌నగర్ జిల్లా వ్యవసాయ అధికారి

ప్రముఖ గణిత శాస్త్రవేత్త
డాక్టర్ సీఆర్ రావు కన్నుమూత

- అనారోగ్యంతో అమెరికాలో తుదిశ్వాస
- గణిత శాస్త్రంలో నోబెల్‌కు సమానమైన అవార్డును అందుకున్న సీఆర్ రావు
- పద్మభూషణ్, పద్మవిభూషణ్‌తో సత్కరించిన భారత ప్రభుత్వం



ఏయూ క్యాంపస్/డాబాగార్డెన్స్: ప్రపంచ ప్రఖ్యాత గణాంక, గణిత శాస్త్రవేత్త డాక్టర్ సీఆర్ రావు (102) కన్నుమూశారు. అమెరికాలో ఉన్న ఆయన అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు. 1920 సెప్టెంబర్ 10న కర్ణాటకలోని బళ్లారి జిల్లా హడగళిలో కల్యంపూడి రాధాకృష్ణా రావు (సీఆర్ రావు) తెలుగు కుటుంబంలో జన్మించారు. తర్వాత ఏపీలోని గూడూరు, నూజివీడు, నందిగామల్లో ఆయన బాల్యం గడిచింది. విశాఖలోని ఏవీఎన్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేశారు. 1940లో ఏయూలో గణిత శాస్త్రం అభ్యసించారు. అనంతరం యూనివర్సిటీ ఆఫ్ కోల్‌కతాలో ఎంఏ స్టాటస్టిక్స్ చేశారు. కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలోని కింగ్స్ కాలేజీలో 1948లో పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఇండియన్ స్టాటస్టికల్ ఇన్‌స్టిట్యూట్‌లో విద్యార్థిగా చేరి అదే సంస్థకు డైరెక్టర్‌గా ఎదిగారు. అక్కడ పదవీ విరమణ చేసిన అనంతరం అమెరికాలో స్థిరపడి అక్కడ యూనివర్సిటీ ఆఫ్ బఫెలోలో రీసెర్చ్ ప్రొఫెసర్‌గా సేవలందించారు. ఆయన 19 దేశాల నుంచి 39 డాక్టరేట్లు అందుకున్నారు. 477 పరిశోధన పత్రాలను సమర్పించారు. 15 పుస్తకాలు రాశారు. 2002లో అప్పటి అమెరికా అధ్యక్షుడు జార్జిబుష్ చేతుల మీదుగా ఆ దేశ అత్యున్నత నేషనల్ మెడల్ ఆఫ్ సైన్స్ పురస్కారాన్ని అందుకున్నారు. యూకే ఇంటర్నేషనల్ స్టాటస్టికల్ ఇన్‌స్టిట్యూట్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మ్యాథమెటికల్ సైన్స్, ఇంటర్నేషనల్ బయోమెట్రిక్ సొసైటీకి అధ్యక్షుడిగా పనిచేశారు. భారత స్టాటస్టిక్స్ రంగానికి ఆయన చేసిన సేవలకు గాను కేంద్ర ప్రభుత్వం ఆయనను 1968లో పద్మభూషణ్, 2001లో పద్మవిభూషణ్‌తో సత్కరించింది. ఎస్ఎస్ భట్నాగర్ పురస్కారాన్ని కూడా సీఆర్ రావు అందుకున్నారు. ఆయన 2020 సెప్టెంబర్ 10న 100వ పుట్టినరోజును జరుపుకున్నారు.

స్టాటస్టిక్స్‌లో నోబెల్ అంతటి గౌరవం

సీఆర్ రావుకు 75 ఏళ్ల కిందట గణాంక రంగంలో విప్లవాత్మకమైన ఆలోచనలకు బీజం వేసినందుకు గాను ఆ రంగంలో నోబెల్ బహుమతికి సమానమైన ఇంటర్నేషనల్ ప్రైజ్ ఆఫ్ స్టాటస్టిక్స్-2023 అవార్డును అందజేశారు. 102 ఏళ్ల వయసులో ఈ ఏడాదే ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు. 1945లో కోల్‌కతా మ్యాథమెటికల్ సొసైటీలో ప్రచురితమైన సీఆర్ రావు పరిశోధన పత్రానికి ఈ అవార్డు దక్కింది. ఆయన చేసిన కృషి..ఇప్పటికీ సైన్స్‌పై తీవ్ర ప్రభావాన్ని చూపుతూ ఉందని ఇంటర్నేషనల్ ప్రైజ్ ఇన్ స్టాటస్టిక్ ఫౌండేషన్ తెలిపింది.

ప్రేమికుడి వేధింపులు భరించలేక..బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య

మేడ్చల్ రూరల్: హాస్టల్ గదిలో బీటెక్ విద్యార్థిని ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మేడ్చల్ పట్టణంలో చోటు చేసుకుంది. వనపర్తి జిల్లా కొత్తకోట గ్రామానికి చెందిన సుగురు శ్రీవాణి (20) కండ్లకోయలోని సీఎంఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. మేడ్చల్ పట్టణంలోని సూర్యనగర్ కాలనీలో ఉన్న ప్రభుత్వ బీసీ హాస్టల్‌లో ఉంటోంది. వారం క్రితం ఇంటికి వెళ్లి మంగళవారం సాయంత్రం హాస్టల్‌కు తిరిగివచ్చింది. బుధవారం ఉదయం తోటి విద్యార్థులు బయటికి వెళ్లిన అనంతరం చున్నీతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆత్మహత్యకు పాల్పడిన శ్రీవాణి గదిలో సూసైడ్ నోట్ లభ్యం కాగా, తన మృతికి బాయ్ ఫ్రెండ్ కారణమంటూ నోట్‌లో రాసి ఉంది. ఓ యువకుడితో ప్రేమలో ఉన్న శ్రీవాణి, వేధింపుల వల్లే ఆత్మహత్యకు పాల్పడిందని, గొడవ కారణంగా గత కొంతకాలంగా శ్రీవాణిని యువకుడు వేధిస్తున్నాడని, కాలేజ్ వద్దకు సైతం వచ్చేవాడని ఈ విషయాలు తమతో చెప్పుకుని శ్రీవాణి బాధపడేదని తోటి విద్యార్థులు చెప్పుకొచ్చారు. శ్రీవాణి తండ్రి గోపి సైతం తన కూతురు ఆత్మహత్యకు ధన్‌రాజ్ కారణమని ఫిర్యాదులో పోలీసులకు తెలిపారు. ఈ నెల 21న శ్రీవాణి మేడ్చల్‌కు బయలుదేరిందని అదే రోజు హాస్టల్‌కు చేరుకోవాల్సిన అమ్మాయి మరునాడు మంగళవారం హాస్టల్‌కు వచ్చింది. 21న ఎక్కడ ఉందనే విషయం వెల్లడి కాలేదు. అంతేకాకుండా కుటుంబ సభ్యులకు తెలియకుండానే 20 రోజుల క్రితం ప్రైవేటు హాస్టల్ నుండి ప్రభుత్వ బీసీ హాస్టల్‌కు మారినట్లు సమాచారం.



శ్రీవాణి (ఫైల్‌ఫొటో)

మహిళా రిజర్వేషన్లు | నా ఇంటి సమస్య కాదు

మహిళా హక్కులపై 'కాంగ్రెస్' బీజేపీది ఒకే వైఖరి: కవిత



సాక్షి, హైదరాబాద్: మహిళా రిజర్వేషన్ల అంశం తన ఇంటి సమస్య కాదని.. ఇది దేశ మహిళలకు సంబంధించినదని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. మహిళా బిల్లు కోసం జంతర్‌మంతర్ వద్ద తాను ధర్నా చేసినప్పుడు కలిసిరాని పార్టీలు, నాయకులు ఇప్పుడు స్పందించడం మహిళా బిల్లు ప్రాధాన్యతను తెలియజేస్తోందని చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో కవిత మీడియాతో మాట్లాడారు. చట్టం ద్వారానే చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరుగుతుందని, అయితే మహిళల హక్కులపై కాంగ్రెస్, బీజేపీ దొందూదొందే అన్న రీతిలో వ్యవహరిస్తున్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ 2014 వరకు అధికారంలో ఉన్నా లోక్‌భలో ఎందుకు ఆమోదించలేదని ప్రశ్నించారు. పదేళ్లుగా మహిళాబిల్లుపై ప్రధాని మోదీని కాంగ్రెస్ నేతలు సోనియా, ప్రియాంక ఎందుకు నిలదీయలేదన్నారు. ఈ ఏడాది డిసెంబర్‌లో మరోమారు తాను ఢిల్లీ జంతర్‌మంతర్‌లో చేసే ధర్నాకు సోనియా, ప్రియాంకతోపాటు కేంద్రమంత్రి స్మృతి ఇరానీని కూడా ఆహ్వానిస్తానని ప్రకటించారు.

70 కోట్ల మంది మహిళల భవిష్యత్ ప్రశ్నార్థకం

మహిళాబిల్లు ఆమోదం పొందకపోవడంతో దేశంలోని 70 కోట్ల మంది మహిళల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా హక్కులపై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చాలా అవహేళనగా మాట్లాడారని కవి త ఆగ్రహం వ్యక్తం చేశారు.



సమావేశంలో రాకేశ్ శర్మ, కేఆర్‌పీ రెడ్డి, హర్మున్జి కామ, మేరీ పాల్

హైదరాబాద్‌లో ఐఎన్ఎస్ సమావేశం

సాక్షి, హైదరాబాద్: భారత పత్రికల సమాఖ్య (ఐఎన్ఎస్) సదస్సు పదిహేనేళ్ల తర్వాత హైదరాబాద్‌లో సమాఖ్య అధ్యక్షుడు కేఆర్‌పీ రెడ్డి అధ్యక్షతన బుధవారం జరిగింది. పత్రిక పరిశ్రమకు ఐఎన్ఎస్ అపెక్స్ కో ఆర్డినేషన్ సంస్థగా పనిచేస్తూ.. పరిశ్రమకు సంబంధించిన పలు అంశాలను చర్చించి, వాటిని పరిష్కరించడం, అవసరమైన వాటిని ప్రభుత్వ విభాగాల దృష్టికి తీసుకొని వెళ్తుంది. బుధవారం జరిగిన సదస్సులో కేఆర్‌పీ రెడ్డి, ఉపాధ్యక్షుడు రాకేశ్‌శర్మ, సెక్రెటరీ జనరల్ మేరీ పాల్, అడ్వర్టైజ్‌మెంట్ కమిటీ చైర్మన్ హర్మున్జి కామ, రీజినల్ అడ్వర్టైజ్‌మెంట్ కమిటీ చైర్మన్ స్థానిక అక్రెడిటెడ్ అడ్వర్టైజ్‌మెంట్ ఏజెన్సీలు, స్థానిక ఐఎన్ఎస్ పబ్లికేషన్‌తో సంప్రదింపులు జరిపి వారి నుంచి పలు అంశాలపై సమాచారం సేకరించారు. జీఎస్టీ, వాణిజ్య, ప్రభుత్వాల నుంచి రావాల్సిన ప్రకటనల చెల్లింపులు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించి కొన్నింటికి పరిష్కారాలు కనుగొన్నట్లు కేఆర్‌పీ రెడ్డి తెలిపారు.

నగర వార్తలు

రేపటి నుంచి బీఎన్ఐ షా బ్యాడ్మింటన్ లీగ్

బంజారాహిల్స్: ప్రపంచంలోనే అతిపెద్ద రిఫరల్ నెట్‌వర్కింగ్ సంస్థ బీఎన్ఐ కామధేను రియల్ ఎస్టేట్స్ భారత్ షా బ్యాడ్మింటన్ లీగ్ రెండో ఎడిషన్‌ను ఈ నెల 25, 26 తేదీల్లో నిర్వహించనున్నట్లు సంస్థ ఏరియా డైరెక్టర్ సతీష్‌కుమార్ తెలిపారు. బుధవారం బంజారాహిల్స్‌లోని బీ హబ్ ట్రైనింగ్స్ స్పేస్‌లో ట్రోఫీ, జెర్సీలను ఆయన ఆవిష్కరించారు. ఈ ట్రోఫీ కోసం 80 కన్నా ఎక్కువ జట్లు పాల్గొంటున్నాయని ప్రొఫెషనల్ బ్యాడ్మింటన్ నిబంధనల ప్రకారం టోర్నమెంట్ నిర్వహణ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కామధేను రియల్ ఎస్టేట్స్ ఎండీ హిమవంత్, స్వాతి, అర్జున్ సింగ్ పాల్గొన్నారు.

మల్కాజిగిరి టికెట్ శోభన్‌రెడ్డికి ఇవ్వాలి

- సీఎంకు టీటీయూసీ వినతి

సాక్షి,సిటీబ్యూరో: టీ టీయూసీ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు మోతే శోభన్ రెడ్డికి అసెంబ్లీ ఎన్నికల్లో మల్కాజిగిరి సీటు కేటాయించాలని టీ టీయూసీ రాష్ట్ర నేతలు, పార్టీ కార్యకర్తలు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు రాసిన వినతిపత్రంలో కోరారు. ఎమ్మెల్యే మైనంపల్లి వ్యాఖ్యల పరిణామాల నేపథ్యంలో అధిష్ఠానం మరో అభ్యర్థిని ఎంపిక చేసే యోచనలో ఉన్నట్లు తెలుస్తోందని పేర్కొంటూ, శోభన్‌రెడ్డికి కేటాయించాలని యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో అభిప్రాయపడ్డారు. టికెట్ కేటాయిస్తే ఉద్యమ సహచర బృందం, తెలంగాణ ట్రేడ్ యూనియన్ సెల్, నాయకులు, కార్యకర్తలు, కష్టపడి గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ సమావేశంలో టీటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంటి కుమార్, కార్య నిర్వాహక కార్యదర్శి నానునాయక్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్, పాల్గొన్నారు.

ప్రైవేట్ ఉద్యోగుల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సంజయ్ రెడ్డి

లక్డీకాపూల్ : తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగుల సంఘం (టీపీయుఎస్) స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కాలసాని సంజయ్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం మాదాపూర్‌లోని టీపీయూఎస్ ప్రధాన కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు సామ వెంకట్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు మియపురం నాగేశ్వర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి వై. శోభన్ రెడ్డి, సలహాదారుడు రవితేజరెడ్డి, సభ్యుడు పెద్దపల్లి శ్రావణ్ కుమార్, గూడూరు మధన్ తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాను అదుపు చేయాలి



చెక్కులు అందజేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

- జర్నలిస్టుల సంక్షేమానికి కృషి
- మంత్రి శ్రీనివాస్‌గౌడ్

సనత్‌నగర్: సోషల్ మీడియా ముసుగులో కొందరు జర్నలిస్టులుగా చెప్పుకుంటూ ఆ వృత్తికి మచ్చ తీసుకువస్తున్నారని, అలాంటి సోషల్ మీడియాను కట్టడి చేయాల్సిన అవసరం ఉందని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అభిప్రాయపడ్డారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం పాటు పడుతున్న ఏకైక ప్రభుత్వం తమదేనన్నారు. వివిధ కారణాలతో జర్నలిస్టులు మృతి చెందగా, వారి కుటుంబాలకు ఆపన్నహస్తం అందించేందుకు తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ తరుపున ఆర్థిక సహాయ చెక్కులతో పాటు పెన్షన్ కార్డుల పంపిణీ కార్యక్రమం బుధవారం జరిగింది. బేగంపేటలోని టూరిజం ప్లాజా హోటల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో 103 మంది జర్నలిస్టు కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికీ రూ.లక్ష చెక్కుతో పాటు ఐదేళ్ల కాల పరిమితితో కూడిన పెన్షన్ కార్డులను అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. కరోనా సమయంలో నాలుగు వేల మంది బాధితులకు ఆర్థిక సహాయం చేయడంతో పాటు చనిపోయిన జర్నలిస్టు కుటుంబాలకు రెండు లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందజేసిన రాష్ట్రం దేశంలో మరెక్కడా లేదన్నారు. మీడియా అకాడమీ తరుపున జర్నలిస్టుల సంక్షేమానికి ఏడేళ్లలో 19 కోట్ల నిధులను ఖర్చు చేయడం జరిగిందన్నారు. ప్రైవేటు హాస్పిటల్‌లో వైద్యం చేయించుకున్నట్లు తెలిపే బిల్లులను మీడియా అకాడమీలో అందజేస్తే సీఎంఆర్‌ఎఫ్ కింద ఆర్థిక సహాయం అందేలా కృషి చేస్తానన్నారు. తానూ ఒకప్పుడు జర్నలిస్టునేనని, వారి సాధక బాధకాలు తనకు తెలుసన్నారు. సమాచార శాఖ కమిషనర్ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 14 వేల మంది జర్నలిస్టులు ఉంటే తెలంగాణలో 22 వేల మంది జర్నలిస్టులు ఉన్నారన్నారు. మీడియా సంక్షేమం కోసం ప్రస్తుతం సమకూరుతున్న నిధులకు మరిన్ని నిధులు సమకూరేలా చూస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, సమాచార శాఖ అడిషనల్ డైరెక్టర్ కిషోర్‌బాబు, టీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి మారుతి సాగర్, మీడియా అకాడమీ సెక్రటరీ వెంకటేశ్వర రావు, మేనేజర్ వెంకటేశం పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్, బీజేపీ కార్పొరేటర్లు

వాడీ వేడి .. బల్దియా జనరల్ బాడీ..

జీహెచ్‌ఎంసీ సర్వసభ్య సమావేశం బుధవారం వాడీవేడిగా కొనసాగింది. అధికార పార్టీ కార్పొరేటర్లు తమ తమ డివిజన్లలో చేసిన అభివృద్ధి పనులపై మాట్లాడుతుండగా ప్రతిపక్ష పార్టీల కార్పొరేటర్లు వాదనను అడ్డుకున్నారు. సమావేశం అనంతరం బీజేపీ, కాంగ్రెస్ కార్పొరేటర్లు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు. మేయర్ ఛాంబర్ వద్ద బైఠాయించగా పోలీసులు అరెస్టు చేయడంతో కాసేపు ఉద్రిక్తంగా మారింది.

–సాక్షి, సిటీబ్యూరో



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న కాంగ్రెస్ కార్పొరేటర్లు



మాట్లాడుతున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి



సర్వసభ్య సమావేశానికి హాజరైన కార్పొరేటర్లు



మాట్లాడుతున్న కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్





నిరసన తెలుపుతున్న వారిని అదుపులోకి తీసుకుంటున్న దృశ్యం

9న 'స్టడీ ఆస్ట్రేలియన్' రోడ్‌షో



మాట్లాడుతున్న డాక్టర్ మోనిక కెన్నెడీ

సనత్‌నగర్: భారత్– ఆస్ట్రేలియా మధ్య విద్యా సంబంధాలను మరింతగా మెరుగుపరిచే దిశగా స్టడీ ఆస్ట్రేలియన్ రోడ్ షోలను నిర్వహించడం జరుగుతుందని ఆస్ట్రేలియా కౌన్సిల్ కమర్షియల్ మంత్రి, సీనియర్ ట్రేడ్ ఇన్వెస్ట్‌మెంట్ కమిషనర్ డాక్టర్ మోనిక కెన్నెడీ తెలిపారు. బుధవారం బేగంపేటలోని తాజ్‌వివంతా హోటల్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మోనిక కెన్నడీ మాట్లాడారు. ఆస్ట్రేలియాలో విద్యా విధానాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఆస్ట్రేలియా ప్రభుత్వం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 9న హైదరాబాద్‌లో స్టడీ ఆస్ట్రేలియన్ రోడ్ షో జరుగుతుందన్నారు. కరోనా విపత్కర పరిస్థితుల అనంతరం ఆస్ట్రేలియాకు విద్యాభ్యాసం కోసం వచ్చే విద్యార్థుల సంఖ్య పెరిగిందని గతేడాది లక్ష మంది భారతీయ విద్యార్థులు ఆయా కోర్సుల్లో చేరేందుకు ఆస్ట్రేలియా వచ్చారన్నారు. ఆస్ట్రేలియాలో అందుబాటులో ఉన్న నాణ్యమైన విద్యావకాశాలు, అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన కోర్సులు, ప్రసిద్ధి చెందిన విశ్వవిద్యాలయాల సమాచారం వంటి వివరాలను రోడ్ షో ద్వారా ఇక్కడి విద్యార్థులకు తెలియజేయడం జరుగుతుందన్నారు. ఆస్ట్రేలియాలో విద్య కోసం వచ్చే విద్యార్థులతో ఆసక్తి కలిగిన వారితో తాజ్‌వివంతా హోటల్‌లో ముఖాముఖిగా చర్చించేందుకు 26 విశ్వవిద్యాలయాలకు చెందిన ప్రతినిధులు పాల్గొననున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆస్ట్రేలియన్ ట్రేడ్ ఇన్వెస్ట్‌మెంట్ కమిషన్ డైరెక్టర్లు సంగీత కృష్ణమూర్తి, రోషన్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

11న అవార్డుల ప్రదానం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి సబితా ఇంద్రారెడ్డి

లక్డీకాపూల్: హైబిజ్ టీవీ ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డ్స్ ను వచ్చే నెల 11న ప్రదానం చేయనున్నట్లు హైబిజ్ టీవీ, తెలుగు నా మేనేజింగ్ డైరెక్టర్ ఎం. రాజగోపాల్ తెలిపారు. బుధవారం అవార్డ్స్‌కు సంబంధించిన మొదటి ఎడిషన్ పోస్టర్‌ను మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్, సీఈఓ డాక్టర్ సంధ్యారాణి, సేల్స్, మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ బి. సాయి కుమార్, మార్కెటింగ్ ఏజీఎం బిజేష్ నాయర్ పాల్గొన్నారు.

అక్రమ నల్లా కనెక్షన్ పై క్రిమినల్ కేసు

సాక్షి,సిటీబ్యూరో: అక్రమ నల్లా కనెక్షన్‌దారులపై జలమండలి కొరడా ఝుళిపిస్తోంది. అనుమతి లేకుండా ఏకంగా 50 ఎంఎం పరిమాణం గల పైప్‌లైన్‌తో అక్రమ నీటి కనెక్షన్ తీసుకున్న భవన యజమానిపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. జూబ్లీహిల్స్ సెక్షన్ పరిధిలో రోడ్ నం.44లో ప్లాట్ నం 853 యాజమాని పి.శ్రీనివాస్ ఎలాంటి అనుమతి లేకుండా 50 ఎంఎం పరిమాణం గల పైపులైన్ కనెక్షన్ తీసుకున్నట్లు జలమండలి అధికారులు గుర్తించారు. నిర్మాణంలో ఉన్న భవనానికి నీటి అవసరాల కోసం వినియోగించుకుంటున్నట్లు విచారణలో బయటపడింది. సదరు యజమానిపై జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో క్రిమినల్ కేసు నమోదు చేశారు. అధికారుల అనుమతులు లేకుండా అక్రమ నల్లా కనెక్షన్లు తీసుకుంటే అలాంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని అధికారులు హెచ్చరించారు. అక్రమ నల్లా కనెక్షన్లకు పాల్పడినట్లు తెలిస్తే 99899 98100, 99899 92268 నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
గురువారం ॥ 24-8-2023



ఆచంద్ర తారార్కం ఈ మహిళల కీర్తి

'ఇస్రో'లో పనిచేసిన తొలి తరం మహిళా శాస్త్రవేత్తల మాటల్లో తరచు వినిపించే మాట... 'ఆరోజుల్లో ఇస్రోలో చా...లా తక్కువ మంది మహిళలు ఉండేవారు' చంద్రయాన్-3కి సంబంధించి నిన్నటి ప్రత్యక్ష ప్రసారాన్ని గమనిస్తే... ఆ ప్రాజెక్ట్‌లో భాగమైన ఎంతోమంది మహిళా శాస్త్రవేత్తలు ఉత్సాహంగా కనిపిస్తారు. మార్పు స్పష్టంగా కనిపిస్తుంది. అది సంఖ్యాబలమే కాదు సామర్థ్య బలం కూడా. 'ఇస్రో' సాధించిన ఎన్నో విజయాలలో మహిళా శాస్త్రవేత్తలు భాగం అయ్యారు. ముఖ్యంగా 'చంద్రయాన్-3' ప్రాజెక్ట్‌లో రీతూ కరిధాల్ నుంచి కల్పనా కాళహస్తి వరకు ఎంతోమంది మహిళా శాస్త్రవేత్తలు మేధోశ్రమ చేశారు. చారిత్రక విజయాన్ని సొంతం చేసుకున్నారు. 'ఇస్రో సైంటిస్ట్ కావాలనుకుంటున్నాను' అని కలలు కనే ఎంతోమంది అమ్మాయిలకు స్ఫూర్తినిచ్చే అసాధారణ విజయ గాథలు ఇవి.

రాకెట్ ఉమన్: రీతూ కరిధాల్



అన్ని దశలను పూర్తి చేసుకొని విక్రమ్ ల్యాండర్ చంద్రుడి దక్షిణ ధ్రువంపై అడుగు పెట్టిన క్షణం ఒక చారిత్రక సందర్భం. ఎంత కృషి చేస్తే ఒక విజయం సొంతం అవుతుందో చెప్పిన సందర్భం.

అమోఘమైన చారిత్రక విజయాన్ని దేశానికి అందించిన 'చంద్రయాన్-3'లో భాగమైన అనేకమంది మహిళలలో రీతు కరిధాల్ ఒకరు.

గత నెలలో...

మూడు దశలను పూర్తి చేసుకొని చంద్రయాన్-3 విజయవంతంగా నిర్దేశిత కక్ష్యలోకి దూసుకెళ్లిన తరువాత ఉత్తర్‌ప్రదేశ్‌లో లక్నోలోని ఒక ఇంట్లో ఆనందం అంబరాన్ని తాకింది. వారు ఆనందంతో బాణాసంచా కాల్చారు. మిఠాయిలను చుట్టుపక్కల వారికి పంచారు. ఇక నిన్నటి రోజు ఆ ఆనందం స్థాయి ఎల్లలు దాటి ఉండవచ్చు. ఇది కోట్లాదిమంది భారతీయుల ఇంట్లో కనిపించే సాధారణ దృశ్యమే కావచ్చు.

కాని ఆ ఇంటికి ఒక ప్రత్యేకత ఉంది.

ఆ ఇంట్లో పుట్టిన రీతూ కరిధాల్ ప్రసిద్ధ చంద్రయాన్-3 మిషన్ డైరెక్టర్.

మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన రీతుకు ఆకాశం అంటే అంతులేని ఆసక్తి. అదేపనిగా నింగిలోకి చూసేది. ఏవేవో ఊహించుకునేది. అప్పటికి అవి శాస్త్రీయతకు నిలవని ఊహలు కావచ్చు. అయితే రీతూ కరిధాల్ శాస్త్రీయ రంగంలో దిగ్గజంగా వెలగడానికి ఉపకరించిన ఊహలు.

కట్ చేస్తే....

1997... భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)లోకి అడుగు పెట్టింది రీతు. చంద్రుడిపై అడుగు పెట్టినంత ఆనందంగా అనిపించింది. 'ఇస్రో' గురించి వింటూ, చదువుతూ పెరిగిన రీతు అదే 'ఇస్రో'లో 'మిషన్ ఎనాలసిస్ డివిజన్'లో ఉద్యోగిగా చేరింది. అప్పట్లో 'ఇస్రో'లో తక్కువ మంది మహిళలు పనిచేసేవారు.

ఎక్కడికి వెళ్లినా ఒంటరిగానే వెళ్లేది. ఉదయం నుంచి రాత్రి వరకు పనిచేయాల్సి వచ్చేది.

అయినా సరే, ఎప్పుడూ భయపడేది కాదు.

అసలు సిసలు భయం మాత్రం తొలి టాస్క్ రూపంలో ఎదురైంది.

'నేను చేయగలనా?' అని మొదట ఆందోళన పడింది రీతు.

చేతులెత్తేయడం తేలిక. 'చేయగలను' అనుకోవడం కష్టం. అయితే కష్టపడే వారే విజేతలవుతారు.'యస్ నేను చేయగలను' అంటూ తొలి టాస్క్‌ను విజయవంతంగా పూర్తి చేసి 'భేష్' అనిపించుకుంది.

'నాకు అప్పగించిన టాస్క్‌ను సీనియర్‌లు చేసే అవకాశం ఉన్నప్పటికీ నన్ను వెదుక్కుంటూ వచ్చింది. ఇది నన్ను పరీక్షించడానికి వచ్చిందా? అదృష్టవశాత్తు వచ్చిందా? అనేది తెలియదుగానీ నా విజయానికి కారణం... ఫిజిక్స్, మ్యాథమేటిక్స్ చదువుకున్నాననే ధైర్యం కంటే నాపై నాకు ఉన్న ఆత్మవిశ్వాసం' అంటూ గతాన్ని గుర్తు చేసుకుంటుంది రీతు.

ఆ ఆత్మవిశ్వాసం అప్పుడే కాదు ఇప్పటికీ రీతు వెన్నంటే ఉంది. ఆ ఆత్మవిశ్వాసమే ప్రతిష్ఠాత్మకమైన 'మంగళయాన్ మిషన్'లో డిప్యూటీ ఆపరేషన్స్ డైరెక్టర్‌గా, చంద్రయాన్-2 మిషన్ డైరెక్టర్‌గా పనిచేయడానికి ఇంధనంగా మారింది. చంద్రయాన్-3తో రీతూ కరిధాల్ ఒక చారిత్రక విజయంలో భాగం అయింది.

శాస్త్రవేత్తలు కావాలనుకునే కలలు కనే అమ్మాయిలకు రీతు కరిధాల్ స్ఫూర్తి ఇస్తుంది.

'నా విజయ మంత్రం ఇది' అని ఆమె ఎప్పుడూ ప్రత్యేకంగా చెప్పలేదుగానీ పరోక్షంగా వినిపించే మాట...టైమ్ మేనేజ్‌మెంట్.

కాలం విలువ తెలిసిన వారే 'టైమ్ మేనేజ్‌మెంట్'ను ఇష్టంగా ఆచరిస్తారు. ఆ ఆచరణే ఎన్నో విజయాలను బహుమానంగా ఇస్తుంది.

స్ఫూర్తిదాయక శక్తిమంతులు



● మహిళా శాస్త్రవేత్తలు, సిబ్బంది వేడుక

స్పేస్ మిషన్‌లలో భాగమైన మహిళా శాస్త్రవేత్తల గురించి మిన్నీ వేద్ 'దోజ్ మాగ్నిఫిసియెంట్ ఉమెన్ అండ్ దెయిర్ స్టోరీస్' అనే స్ఫూర్తిదాయకమైన పుస్తకాన్ని రాసింది. ఈ పుస్తకంలో 'రాకెట్ ఉమెన్'గా పేరు గాంచిన రీతూ కరిధాల్ సక్సెస్ స్టోరీ కూడా ఉంది. 'కుటుంబ జీవితం, వ్యక్తిగత జీవితాన్ని సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాను. వృత్తిపరమైన విజయాలకు కుటుంబమే పెద్ద బలం' అంటుంది రీతు.

'ఇస్రో'లో రీతులాగే ఎంతోమంది మహిళా శాస్త్రవేత్తలు ఉన్నతస్థానాల్లో ఉన్నారు. అయితే ఇది రాత్రికి రాత్రి వచ్చిన విజయం కాదని వారి ప్రయాణాన్ని పరిశీలిస్తే అర్థమవుతుంది. 'ఇస్రో'లో పనిచేయాలని అనుకోవడానికి కారణం నుంచి... ఎదుర్కొన్న ఒత్తిళ్ల వరకు వారి మాటల్లో కనిపిస్తాయి.

ఇస్రో స్పేస్ సైన్స్ ప్రోగ్రామ్ డైరెక్టర్‌గా పని చేసిన సీతా సోమసుందరం ఇలా అంటోంది...

'నేను ఇస్రోలో చేరిన కాలంలో ఇంజనీరింగ్, సైన్స్‌లలో మహిళలు చాలా తక్కువ మంది ఉండేవాళ్లు. కొందరు సీనియర్‌లకు కొన్ని అభిప్రాయాలు ఉండేవి. అందులో ఒకటి... మహిళలు ఎక్కువగా కష్టపడలేరు. పరిమిత పని గంటల్లోనే పనిచేయగలరు. ఇంటికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. అంకితభావం ఉండదు. అయితే ఇది తప్పుడు భావన అని ఇస్రోలో ఎంతోమంది మహిళా శాస్త్రవేత్తలు నిరూపించారు'. 'ఏదో ఉద్యోగం చేస్తున్నాను అనే భావన కాకుండా విజయంలో భాగం కావాలనే సంకల్ప బలం మహిళా శాస్త్రవేత్తలలో కనిపిస్తుంది. ఎన్నో విజయాలలో నిర్ణయాత్మకమైన పాత్ర పోషించారు. డెడ్ లైన్‌లను సవాలుగా తీసుకోవడం నుంచి మిషన్, నేవిగేషన్, కమ్యూనికేషన్, కంట్రోల్ సిస్టమ్, స్పేస్ క్రాఫ్ట్ డిజైన్, ట్రాకింగ్ లాంటి మేజర్ ఏరియాలలో కీలక పాత్ర పోషించి తమ సత్తా చాటారు' అంటుంది మంగళ్‌యాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా పని చేసిన ఎస్.అరుణ. స్పేస్ సైంటిస్ట్‌లు అనగానే ఏవో గంభీరమై ఊహలు తారసపడతాయి. అయితే ఈ ఉమెన్ స్పేస్ సైంటిస్ట్‌ల మాటలు విన్న తరువాత 'అందరిలాగే సాధారణ జీవితం... కానీ అసాధారణ సంకల్ప బలం' అనే సత్యం ఆవిష్కారం అవుతుంది. 'ఇస్రోకు చైర్ ఉమన్ (చైర్ పర్సన్) ఎప్పుడూ?' అనే ప్రశ్న వస్తుంటుంది. 'ఇస్రో' విజయాలలో భాగం అవుతున్న మహిళల అంకితభావాన్ని చూస్తే ఆ ప్రశ్నకు సమాధానం చెప్పే రోజు ఎంతో దూరంలో లేదు' అనిపిస్తుంది. 'ఇస్రో'లో జెండర్-న్యూట్రల్ ప్రొఫెషనల్ ఎన్విరాన్‌మెంట్ ఉంటుందనే మంచి మాటలు కూడా దీనికి కారణం.

కొన్నిసార్లు లోతైన భావాలు పలకడానికి పదాలు, పుస్తకాలు తెల్లముఖం వేస్తాయి. కళ్లు మాత్రమే నిశ్శబ్దంగా చెబుతాయి. చంద్రయాన్-3 ల్యాండింగ్‌కు సంబంధించి నిన్నటి టీవీ ప్రత్యక్ష ప్రసారంలో మహిళా శాస్త్రవేత్తల కళ్లలో కనిపించిన ఉత్సాహాన్ని, అంకితభావాన్ని గమనిస్తే ఇంకా ఎన్నో విజయాలు వారి కోసం ఎదురు చూస్తున్నాయని అనిపిస్తుంది.

సంతోష క్షణాలు: కల్పనా కాళహస్తి



కల్పనా కాళహస్తిది ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా. చెన్నైలో బి.టెక్ (ఈసీఈ) చదివారు. తండ్రి మద్రాసు హైకోర్టులో ఉద్యోగి. తల్లి గృహిణి. ఇస్రోలో పనిచేయాలని తన చిన్ననాటి నుంచి కలలు కనేది. అనుకున్నట్టుగానే 2000 సంవత్సరంలో ఇస్రోలో చేరారు. తొలుత శ్రీహరికోటలో ఐదేళ్ల పనిచేశాక బెంగళూరులోని శాటిలైట్ సెంటర్‌కు ట్రాన్స్‌ఫర్ అయ్యారు. కరోనా పాండమిక్ సమయంలో అనేక అవాంతరాలు వచ్చినప్పటికీ వాటిని సమర్థంగా ఎదుర్కొంటూ 'చంద్రయాన్-3' మిషన్‌లో అసోసియేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా ఉన్నారు. ఈమె గతంలో చంద్రయాన్-2, మంగళయాన్ ప్రాజెక్టుల్లోనూ కీలక బాధ్యతల్ని నెరవేర్చారు. ఆమె నైపుణ్యం, అంకితభావం, దూరదృష్టి వంటివి మిషన్ విజయవంతం కావడంతో గణనీయంగా తోడ్పడ్డాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఇవి చాలా సంతోషభరితమైన క్షణాలుగా ఎప్పటికీ ఉండిపోతాయి. చంద్రయాన్ 2 కాలం నుంచి లభ్యమైన ఎన్నో అనుభవాలతో ఈ మిషన్‌ను లోప రహితంగా రూపొందించాం అని చెప్పారు.

వినిపించే గొంతుక: పి.మాధురి



శ్రీహరికోట రాకెట్ లాంచింగ్ స్టేషన్ నుంచి ప్రజలకు బయటికి కనపడే అక్కడి సిబ్బంది/ సైంటిస్టుల్లో పిల్లల మాధురి ఒకరు. ఈమె షార్‌లోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్‌లో డిప్యూటీ మేనేజర్‌గా పని చేస్తున్నారు. రాకెట్ లాంచింగ్ సమయంలో వినిపించే వ్యాఖ్యానాలు, ప్రజలకు వివరించే అంశాల గొంతుక ఆమెదే.

వీళ్లే కాకుండా చంద్రయాన్-3 మిషన్‌లో మొత్తం 54 మంది మహిళా సైంటిస్టులు / ఉద్యోగులు / సిబ్బంది ఉన్నారు. వీళ్లలో చాలా మంది మహిళలు ఎంతో కీలకమైన బాధ్యతలు నెరవేర్చే డిప్యూటీ డైరెక్టర్ స్థాయి నుంచి ప్రాజెక్ట్ డైరెక్టర్ స్థాయి నుంచి అనేక స్థాయిల్లో పనిచేస్తూ... కీలకమైన, భారత్‌కు గర్వకారణమైన ఈ ప్రాజెక్టును విజయవంతం చేశారు.

సౌమ్యంగా సాధించింది



సౌమ్య ఈ తరం టెకీ. సాంకేతికతను ఆరోగ్యానికి అద్దింది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌తో వైద్యరంగంలో కొత్త ఒరవడి తెచ్చింది.

వైద్యరంగం, ఔషధాల తయారీ రంగాలు సాంకేతికతను అందుకోవాల్సినంత వేగంగా అందుకోవడం లేదనుకుంది సౌమ్య. 'మల్టిప్‌లెయిర్ ఏఐ' పేరుతో హెల్త్‌కేర్ రంగంలో ప్రవేశించింది. ఇంత సునిశితమైన, సంక్లిష్టమైన పరిశ్రమను నిర్వహించడం మగవాళ్లకే సాధ్యం అనే అభిప్రాయాన్ని చెరిపేసిందామె. 'మగవాళ్ల ప్రపంచం అనే భావన మహిళలు ప్రవేశించేటంత వరకే. ఒకసారి మహిళలు ప్రవేశిస్తే ఇక అది అపోహ మాత్రమేనని నిర్ధారణకు వచ్చేస్తాం. మా టీమ్ లో సగానికి పైగా మహిళలే. సేల్స్ విభాగంలో కూడా మహిళలు సమర్థంగా పని చేస్తున్నార'ని చెప్పింది. ఒక టెకీ హెల్త్‌కేర్ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టడానికి దారితీసిన పరిస్థితులను, హైదరాబాద్‌లో సంస్థ స్థాపించి సక్సెస్ అందుకున్న వైనాన్ని సాక్షితో పంచుకున్నారు సౌమ్య.



● సౌమ్య

భారీ మూల్యం చెల్లించాం

''నన్ను హెల్త్‌కేర్ ఇండస్ట్రీలోకి రప్పించిన కారణాలు అత్యంత బాధాకరమైనవి. మాది ఉత్తరప్రదేశ్, ప్రయాగరాజ్ (అలహాబాద్). నాన్న రవిప్రకాశ్ శ్రీవాస్తవ ఐఏఎస్ ఆఫీసర్. నాన్న డయాబెటిస్‌తో బాధపడుతుండేవారు. రొటీన్ టెస్టులు, మెడికేషన్ ఇవ్వడంలో ఎక్కడో పొరపాటు జరిగిపోయింది. మా జీవితాలు భారీ మూల్యం చెల్లించుకున్న పొరపాటు అది. వైద్యుల నిర్లక్ష్యం, రాంగ్ మెడికేషన్ కారణంగా ఆయన హఠాత్తుగా ప్రాణాలు వదిలారు. నేనప్పుడు బీటెక్ సెకండియర్‌లో ఉన్నాను. ఆ తర్వాత కొద్దిసంవత్సరాల్లోనే అమ్మకు ఒవేరియన్ క్యాన్సర్ ఉన్నట్లు తెలిసింది. మేము తెలుసుకునేటప్పటికే వ్యాధి మూడవ దశకు చేరింది. చికిత్స మొదలు పెట్టినప్పటికీ ఆరు నెలలకే అమ్మను కూడా కోల్పోయాను. అలాంటి దయనీయమైన పరిస్థితుల్లోనే బిట్స్ పిలానీలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి హైదరాబాద్‌లోని ట్రిపుల్ ఐటీలో బయోటెక్నాలజీలో మాస్టర్స్ చేశాను. సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతోంది. కానీ వైద్యరంగం ఆ వేగాన్ని అందిపుచ్చుకోవడంలో వెనకబడుతోంది. ఆ వెనుకబాటు తెచ్చిన నష్టంలో మా అమ్మానాన్నల మరణాలు కూడా భాగమేననిపించింది. ఈ రెండు రంగాల మధ్య ఉన్న అంతరాన్ని భర్తీ చేయాలనే సంకల్పం కలిగింది, చేయగలననే నమ్మకం కూడా. సమాచారలోపం తలెత్తని విధంగా మెడికల్ డాటాను పరిరక్షించగలిగే పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడానికి పూనుకున్నాను. మల్టిప్‌లెయిర్ ఏఐ స్థాపించి ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ ఆధారంగా డాటా అనలైజేషన్, డాటా మెయింటెయిన్ చేస్తున్నాం. మా సంస్థకు 'ఐఎస్ఓ 27001' సర్టిఫికేట్ వచ్చింది. మా సర్వీస్‌ను దేశవిదేశాల్లో పెద్ద ఆరోగ్య సంస్థలు తీసుకుంటున్నాయి. పేషెంట్ కేర్‌లో మొదటిది పేషెంట్ ఆరోగ్య చరిత్ర, క్రమం తప్పని పరీక్షల ద్వారా వ్యాధులను తొలిదశలోనే గుర్తించడం, పరీక్షల నివేదికల నిర్వహణ ప్రధానమైనవి. ఇక్కడ పొరపాటు జరిగితే ప్రాణాలు దక్కవని చెప్పడానికి మా పేరెంట్సే ఉదాహరణ.

ఫాలో అప్ సర్వీస్

వ్యాధి నిర్ధారణ ఆధారంగా వైద్యం అందించిన తర్వాత తదనంతర పరీక్షలను, వైద్యాన్ని అందించాల్సిన సమయానికి ఫాలో అప్ చేయడం కూడా మా సర్వీస్‌లో భాగంగా ఉంది. అలాగే భవిష్యత్తులో టెలిమెడిసిన్ విస్తరించాల్సిన అవసరం ఉంది. వైద్యచికిత్సను కుగ్రామాలకు చేరడానికి చక్కటి మాధ్యమం ఇది. పేషెంట్‌ను ఉన్న చోటనే ఉంచి ఆరోగ్యపరిస్థితిని మానిటర్ చేయడం సాధ్యమవుతుంది. నేను చదివిన టెక్, బయోటెక్ పరిజ్ఞానం ఇందుకు దోహదం చేసింది. నాకు సవాళ్లు ఎదురయ్యాయా అంటే సవాళ్లు లేని ప్రొఫెషన్ అంటూ ఏదైనా ఉంటుందా? డిజిటల్ బ్రాండింగ్, మార్కెటింగ్‌లో అవరోధాలు వచ్చాయి. మా క్లయింట్ల సందేహాలను తీరుస్తూ, వాళ్లు సమాధానపడే వరకు సహనంగా వివరించాం. సవాళ్లకు సమాధానాలు వెతుక్కుంటూ ముందుకు పోవడమే సక్సెస్‌కు దారి తీస్తుంది. వైద్యుల నిర్లక్ష్యం కారణంగా మా నాన్నను కోల్పోవడమే నన్ను ఈ రంగం వైపు నడిపించింది. ప్రతి విజయంలో మా అమ్మానాన్న కనిపిస్తున్నారు'' అని వివరించారు సౌమ్య.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

బ్యూటిప్స్

అందంగా పెంచుకుందాం!





గోళ్లు..పొడవుగా అందంగా ఉండే ఉండాలని ప్రతి అమ్మాయి కోరుకుంటుంది. కానీ కొందరిలో కొద్దిగా పెరగగానే విరిగిపోతుంటాయి. కొంతమందికి అసలు పెరగవు. దీంతో నెయిల్ పెయింట్ వేసుకోవాలంటే ఇబ్బంది. గోళ్లను చక్కగా పెంచే ఈ ఐదు చిట్కాలు పాటించి చూడండి మీ కోరిక తీరుతుంది..

- గోళ్ల పెరుగుదలను ప్రోత్సహించడంలో ఆలివ్ ఆయిల్ ముందుంటుంది. దీనిలోని విటమిన్ ఇ గోళ్లకు పోషణ అందించి చక్కగా పెరిగేలా చేస్తుంది. రాత్రి పడుకోబోయే ముందు కొద్దిగా ఆలివ్ ఆయిల్‌ను గోళ్లమీద రాసి మర్దన చేయాలి. రోజూ ఇలా చేయడం వల్ల గోళ్లకు రక్తప్రసరణ చక్కగా జరిగి గోళ్లలో పెరుగుదల కనిపిస్తుంది.
- టీస్పూను యాపిల్ సైడర్ వెనిగర్‌లో టీస్పూను వెల్లుల్లి తరుగు వేసి చక్కగా కలపాలి. ఈ మిశ్రమాన్ని గోళ్లపై రాసి పదినిమిషాల తరువాత కడిగేయాలి. క్రమం తప్పకుండా ఇలా చేస్తే గోళ్లు విరగకుండా చక్కగా పెరుగుతాయి.
- వెల్లుల్లి రెబ్బను రెండు ముక్కలు చేసి గోళ్లపై పదినిమిషాలపాటు రుద్దాలి. కొద్దిరోజుల్లోనే గోళ్ల పెరుగుదల కనిపిస్తుంది.
- ఆరెంజ్ జ్యూస్‌ను గోళ్లకు పూతలా అప్లైచేసి పదినిమిషాలు ఆరనివ్వాలి. తరువాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి. ఇది గోళ్లను అందంగా పెరిగేలా చేస్తుంది.
- ఇవన్నీ చేయలేకపోతే కొబ్బరినూనెను గోళ్లపై రాసి రోజూ మర్దన చేయాలి. కొబ్బరినూనెలోని ఫ్యాటీ ఆమ్లాలు, ఇతర పోషకాలు గోళ్ల పెరుగుదలకు దోహదపడతాయి.

ఇంటిప్స్







- ఒక్కో నిమ్మకాయను అల్యూమినియం ఫాయిల్‌లో చుట్టి రిఫ్రిజిరేటర్‌లో పెడితే ఎక్కువ రోజులపాటు తాజాగా ఉంటాయి.
- శాండ్ విచ్ మరీ మెత్తగా కాకుండా చక్కగా రావాలంటే... శాండ్ విచ్‌లో పెట్టే కూరగాయలు, బ్రెడ్ మయనేజ్, చీజ్ గది ఉష్ణోగ్రతలో ఉండేలా చూసుకోవాలి. ఇంతకు మించి వేడిగా ఉండే తేమ చేరి శాండ్ విచ్ మెత్తగా మారిపోతుంది.
- కొన్నిసార్లు పన్నీర్ ముక్కలు ఫ్రై చేసిన తరువాత గట్టిగా మారుతుంటాయి. ఇలాంటప్పుడు పన్నీర్ ముక్కలు ఫ్రై చేసిన తరువాత చల్లని నీటిలో ఐదు నుంచి పదినిమిషాలు ఉంచాలి. తరువాత కూరలో వేస్తే పన్నీర్ ముక్క మృదువుగా, మెత్తగా ఉంటుంది.

అబద్ధాలను నమ్ముతున్నారా?!

సైబర్ టాక్



నిజం నిలబడి ఉండగానే అబద్ధం ఊరంతా చుట్టి వస్తుందంటారు.. ఈ సామెత సోషల్ మీడియాలో కుప్పలు తెప్పలుగా పుట్టుకువచ్చే ఫేక్‌న్యూస్ విషయంలో సరిగ్గా సరిపోలుతుంది. ఈ ఫేక్ న్యూస్ వల్ల నిజమేదో తెలుసుకోవడం కష్టంగా మారింది. అబద్ధాన్ని నిజం అనుకునే ప్రమాదమూ ఉంటోంది. అలాగే.. ఫొటోలు, వీడియోలు కూడా ఫేక్‌వి పుట్టుకొస్తున్నాయి. లైవ్ వీడియోలోనూ ఇటీవల ఏఐ టెక్నాలజీ ద్వారా అబద్ధం కొత్తగా సోషల్‌మీడియాను ఏలుతోంది. నిజమేంటో తెలుసుకోవడానికి మనం చాలా ప్రయత్నాలు చేయాల్సి ఉంటోంది. ఎందుకంటే, అబద్ధాల వల్ల కలిగే మోసాలు ఎన్నో. వాటి బారిన పడకుండా జాగ్రత్త పడాలంటే ముందుగా నిజాలేమిటో తెలుసుకుందాం...

వార్తలకు సంబంధించిన సమాచారం, డేటా, నివేదికలు పూర్తిగా నిజమైనవి కానివి ప్రజల ముందుకు వస్తున్నాయి. అందుకని, మూలాధారాలు లేకుండా వచ్చిన సమాచారం అవాస్తవం అని గ్రహించాలి. అబద్ధపు వార్తలు విస్తృతంగా షేర్ అవుతుంటాయి. వీటికి ఎలాంటి సెన్సార్‌షిప్ ఉండదు.

నకిలీ వార్తల పుట్టుకకు..

తమకు తెలిసిన విషయాన్ని నలుగురికి తెలియజేయాలనే ఆత్రుత. స్వీయ లాభం, రాజకీయ ప్రభావం వల్ల ఇలాంటివి జరుగుతుంటాయి. కేవలం తమకు తెలిసినవి మరికొందరికి తెలియజేద్దామని నిజానిజాలు తెలుసుకోకుండా కొందరు అదేపనిగా షేర్ చేస్తుంటారు. సమాచారం అబద్ధమే కావచ్చు కానీ, దానిని షేర్ చేసే వ్యక్తి అది నిజమని నమ్ముతారు. తప్పుడు సమాచారం అని తెలిసీ ఉద్దేశపూర్వకంగానే షేర్ చేస్తారు. ఏదైనా సమస్యకు లేదా వ్యక్తికి సంబంధించిన కంటెంట్ అబద్ధమైతే మనల్ని ఆ వార్త తప్పుదారి పట్టించవచ్చు. ముఖ్యాంశాలు, విజువల్స్, క్యాప్షన్‌లు కంటెంట్‌కు సరిపోని విధంగా ఉంటాయి. మోసగించడానికి ఫొటోలు, కంటెంట్‌ను తారుమారు చేస్తుంటారు.

తనిఖీ చేసే విధానం..

- వీడియో మూలం ఎక్కడ ఉందో చెక్ చేయాలి. అది విశ్వసనీయమైనదే అని నిర్ధారించుకోవడానికి ప్రయత్నించాలి.
- సమాచారం నిజమైనదైనా ప్రత్యామ్నాయంగా ఇతర మూలాధారాల కోసం వెతకాలి.
- వీడియోలో అసహజమైన కదలికలు ఉన్నాయేమో గమనించాలి.
- డీప్ ఫేక్స్ గుర్తించడానికి 'డీప్ ఫేక్ డిటెక్షన్ మోడల్' వంటి స్పెషల్ సాఫ్ట్‌వేర్ అందుబాటులో ఉంది.
- వీడియోలోని సంఘటనలు నమ్మదగినవేనా? ఆ వీడియో ఏ సందర్భాన్ని బట్టి తీశారో ఆ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాలి.
- వీడియోలో ఉన్న వ్యక్తిని మెయిల్, ఫోన్ ద్వారా సంప్రదించి, ప్రామాణికతను ధృవీకరించుకోవడానికి ప్రయత్నించవచ్చు.

వాస్తవం తెలుసుకోవాలంటే..

- గూగుల్ రివర్స్ ఇమేజ్ చెక్ చేయాలి. లేదా ఫొటో వెరిఫికేషన్ కోసం www.tineye.comని ఉపయోగించాలి.
- ఫొటో లేదా వీడియో (https://www.invid-project.eu/tools-and-services/invid-verification-plugin/) కోసం ఇన్‌విడ్ టూల్‌కిట్ ఎక్స్‌టెన్షన్‌ని ఇన్‌స్టాల్ చేయాలి.
- ఫార్వర్డ్ చేసే ముందు ఏదైనా ఒక అంతర్జాతీయ ఫాక్ట్-చెకింగ్ నెట్‌వర్క్ ఆర్గనైజేషన్‌తో www.factly.in వాస్తవాన్ని చెక్ చేయాలి.

ఇలా గుర్తించాలి...

డీప్ ఫేక్ వీడియో లేదా ఆడియోలో ఏవైనా లోపాలు ఉన్నాయేమో జాగ్రత్తగా పరిశీలించడం, వినడం చేయాలి.

- డీప్ ఫేక్ వీడియో లేదా ఫొటోలలో లైటింగ్ నీడలను చెక్ చేయాలి. కొన్నింటిలో నీడలు కచ్చితంగా కనిపించకపోవచ్చు. ఇవే కాకుండా ఇంకేమైనా లోపాలు ఉన్నాయేమో చెక్ చేయాలి.
- వీడియోలలోని బ్యాక్‌గ్రౌండ్ చెక్ చేయాలి. సబ్జెక్ట్‌కు వీడియోలోని వ్యక్తుల కదలికల సరిపోలకపోవచ్చు. అంటే, ఎఐ టెక్నాలజీ ద్వారా నకిలీ వ్యక్తుల సృష్టి అయి ఉండవచ్చు.
- వీడియోలో వ్యక్తి కనురెప్పలు ఆర్పుతున్నారో లేదో పరిశీలించాలి.
- లైవ్ వీడియోలో మాట్లాడుతున్నప్పుడు ముఖాన్ని ఎడమ లేదా కుడికి కదిలించమని సదరు వ్యక్తిని ఉద్దేశించి అడగాలి.



ఇన్‌పుట్స్: అనీల్ రాచమల్ల, డిజిటల్ వెల్‌బియింగ్ ఎక్స్‌పర్ట్, ఎండ్ నౌ ఫౌండేషన్


స్పోర్ట్స్



అంకిత శుభారంభం

యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ క్వాలిఫయింగ్ టోర్నీ మహిళల సింగిల్స్ విభాగంలో భారత నంబర్ వన్ అంకిత రైనా శుభారంభం చేసింది. న్యూయార్క్‌లో బుధవారం జరిగిన తొలి రౌండ్‌లో ప్రపంచ 182వ ర్యాంకర్ అంకిత 6-3, 7-5తో ప్రపంచ 214వ ర్యాంకర్ మిరియమ్ బుల్గారు (రొమేనియా)పై గెలిచింది. 2 గంటల 15 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో అంకిత తన సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేసింది. భారత్‌కే చెందిన కర్మన్‌కౌర్ థండి తొలి రౌండ్‌లో 6-3, 5-7, 3-6తో ఓషీన్ డోడిన్ (ఫ్రాన్స్) చేతిలో ఓడిపోయింది.

కివీస్ కోచింగ్ బృందంలో ఫ్లెమింగ్



వన్డే వరల్డ్ కప్ సన్నాహాల్లో భాగంగా మాజీ కెప్టెన్, కోచ్‌గా అనుభవజ్ఞుడైన స్టీఫెన్ ఫ్లెమింగ్‌ను న్యూజిలాండ్ జట్టు తమ కోచింగ్ బృందంలోకి చేర్చింది. ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ ఐదుసార్లు విజేతగా నిలవడంలో కోచ్‌గా కీలకపాత్ర పోషించిన ఫ్లెమింగ్‌కు భారత గడ్డపై ఉన్న అపార అనుభవం తమ జట్టుకు అదనపు ప్రయోజనాన్ని ఇస్తుందని కివీస్ బోర్డు భావించింది. ఇంగ్లండ్ మాజీ క్రికెటర్లు జేమ్స్ ఫోస్టర్, బెల్ (ఇంగ్లండ్), సక్లాయిన్ (పాకిస్తాన్) కూడా కోచింగ్ టీమ్‌లోకి వచ్చారు.

విజేత తేలేది 'టైబ్రేక్స్'లోనే...




కార్ల్‌సన్ తరఫున తొలి ఎత్తు వేసి రెండో గేమ్‌ను ప్రారంభించిన అజర్‌బైజాన్ మహిళా గ్రాండ్‌మాస్టర్ సోఫియెవా

ప్రజ్ఞానంద, కార్ల్‌సన్ ఫైనల్ మ్యాచ్ రెండో గేమ్ కూడా 'డ్రా'

బకూ (అజర్‌బైజాన్): ప్రపంచకప్ చెస్ టోర్నీ ఓపెన్ విభాగంలో చాంపియన్ ఎవరో టైబ్రేక్స్ ద్వారా తేలనుంది. భారత యువ గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద, వరల్డ్ నంబర్‌వన్ కార్ల్‌సన్ (నార్వే) మధ్య ఫైనల్లో రెండో గేమ్ 30 ఎత్తుల్లో 'డ్రా'గా ముగిసింది. వరుసగా రెండో 'డ్రా' తర్వాత ఇద్దరూ 1-1తో సమంగా నిలిచారు. ఫలితంగా నేడు వీరిద్దరి మధ్య టైబ్రేక్ నిర్వహించి విజేతను నిర్ణయిస్తారు. ముందుగా ర్యాపిడ్ ఫార్మాట్‌లో 25 నిమిషాల నిడివిగల రెండు గేమ్‌లు ఆడిస్తారు. ఇందులో ఫలితం వస్తే ఫైనల్‌ను ముగిస్తారు. రెండు గేమ్‌ల తర్వాత కూడా సమంగా ఉంటే... ఈసారి 10 నిమిషాలు నిడివిగల రెండు గేమ్‌లు నిర్వహిస్తారు. ఇక్కడా ఫలితం తేలకపోతే 5 నిమిషాల నిడివిగల రెండు గేమ్‌లను ఆడిస్తారు. అయినా ఫలితం తేలకపోతే 3 నిమిషాల నిడివిగల గేమ్‌లను ఇద్దరిలో ఒకరు గెలిచే వరకు ఆడించి విజేతను ఖరారు చేస్తారు. 32 ఏళ్ల కార్ల్‌సన్ గతంలో క్లాసికల్, ర్యాపిడ్, బ్లిట్జ్ ఫార్మాట్‌లలో ప్రపంచ చాంపియన్‌గా నిలువగా... ప్రజ్ఞానంద కెరీర్‌లో తొలిసారి ప్రపంచకప్ ఫైనల్ ఆడుతున్నాడు.

లాంగ్‌జంప్ ఫైనల్లో జెస్విన్

- మురళీ శ్రీశంకర్‌కు నిరాశ
- ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్



జెస్విన్ ఆల్డ్రిన్

బుడాపెస్ట్ (హంగేరి): ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో తొలి నాలుగు రోజులు భారత్‌కు నిరాశ ఎదురవగా... ఐదోరోజు మిశ్రమ ఫలితాలు లభించాయి. పురుషుల లాంగ్‌జంప్‌లో జెస్విన్ ఆల్డ్రిన్ ఫైనల్‌కు అర్హత సాధించగా... మరో లాంగ్‌జంపర్ మురళీ శ్రీశంకర్ అనూహ్యంగా క్వాలిఫయింగ్‌లోనే వెనుదిరిగాడు. మహిళల జావెలిన్ త్రో ఈవెంట్‌లో అన్ను రాణి కూడా ఆకట్టుకోలేకపోయింది. క్వాలిఫయింగ్‌లో గ్రూప్ 'బి'లో పోటీపడ్డ తమిళనాడుకు చెందిన 21 ఏళ్ల జెస్విన్ 8 మీటర్ల దూరం దూకి చివరిదైన 12వ క్వాలిఫయర్‌గా ఫైనల్ బెర్త్ ఖరారు చేసుకున్నాడు. గత ఏడాది ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఫైనల్‌కు అర్హత సాధించడంతోపాటు ఏడో స్థానంలో నిలిచిన శ్రీశంకర్ ఈసారి నిరాశపరిచాడు. శ్రీశంకర్ 7.74 మీటర్ల దూరం దూకి ఓవరాల్‌గా 22వ ర్యాంక్‌లో నిలిచాడు. ఫైనల్ నేడు జరుగుతుంది. మహిళల జావెలిన్ త్రో క్వాలిఫయింగ్‌లో అన్ను రాణి ఈటెను 57.05 మీటర్ల దూరం విసిరి 19వ ర్యాంక్‌లో నిలిచింది.

వానతో ముగిసిన ఆట!

భారత్, ఐర్లాండ్ చివరి టి20 మ్యాచ్ రద్దు
- సిరీస్ 2-0తో భారత్ సొంతం

డబ్లిన్: భారత జట్టు ఐర్లాండ్ పర్యటనకు వర్షంతో ముగింపు లభించింది. బుధవారం జరగాల్సిన మూడో టి20 మ్యాచ్ వాన కారణంగా ఒక్క బంతి కూడా వేయకుండానే రద్దయింది. నిర్విరామంగా కురిసిన వర్షం తెరిపినివ్వకపోవడంతో టాస్ వేసే అవకాశం కూడా లేకుండా పోయింది. మధ్యలో కొద్దిసేపు వాన తీవ్రత తగ్గడంతో అంపైర్లు మైదానాన్ని పరీక్షించినా... కనీసం 5 ఓవర్ల మ్యాచ్ కూడా నిర్వహించే అవకాశం లేదని తేలిపోయింది. దాంతో స్థానిక కాలమానం ప్రకారం సాయంత్రం 6 గంటలకు మ్యాచ్ రద్దుపై అంపైర్లు అధికారిక ప్రకటన చేశారు. దాంతో తొలి రెండు మ్యాచ్‌లలో గెలిచిన భారత్ ఖాతాలో 2-0తో సిరీస్ చేరింది. భారత కెప్టెన్ జస్‌ప్రీత్ బుమ్రాకు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డు దక్కింది.

'చంద్రయాన్'ను వీక్షిస్తూ...

మ్యాచ్ రోజు డబ్లిన్‌లో భారత క్రికెటర్లు టీవీలో 'చంద్రయాన్-3' ప్రత్యక్ష ప్రసారాన్ని చూస్తూ సమయం గడిపారు. విక్రమ్ ల్యాండర్ చంద్రునిపై అడుగు పెట్టిన క్షణాన సంబరాలు చేసుకుంటూ భావోద్వేగంతో తమ ఆనందాన్ని ప్రదర్శించారు. మరోవైపు మాజీ క్రికెటర్ సచిన్ టెండూల్కర్, స్టార్ ప్లేయర్ కోహ్లి తదితరులు తమ సంతోషాన్ని ప్రకటిస్తూ ట్విట్టర్‌లో 'ఇస్రో'కు అభినందనలు తెలియజేశారు.



డబ్లిన్‌లో బుధవారం చంద్రయాన్-3 ప్రత్యక్ష ప్రసారాన్ని టీవీలో వీక్షిస్తున్న భారత క్రికెటర్లు

ప్రిక్వార్టర్ ఫైనల్లో గాయత్రి-ట్రెసా జోడీ



కోపెన్‌హాగెన్ (డెన్మార్క్): ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ డబుల్స్ విభాగంలో బుధవారం భారత్‌కు మంచి ఫలితాలు లభించాయి. మహిళల డబుల్స్‌లో పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ జోడీ... పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి ద్వయం ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాయి. తొలి రౌండ్‌లో 'బై' పొందిన గాయత్రి-ట్రెసా జంట రెండో రౌండ్‌లో 21-18, 21-10తో చాంగ్ చింగ్ హుయ్-యాంగ్ చింగ్ టున్ (చైనీస్ తైపీ) జోడీని ఓడించింది. తొలి రౌండ్‌లో 'బై' పొంది నేరుగా రెండో రౌండ్ మ్యాచ్ ఆడిన సాత్విక్-చిరాగ్ ద్వయం 21-16, 21-9తో కెన్నెత్ జె హుయ్-మింగ్ చుయెన్ లిమ్ (ఆస్ట్రేలియా) జోడీపై గెలిచింది.

అమన్‌ప్రీత్‌కు స్వర్ణం



బకూ (అజర్‌బైజాన్): ప్రపంచ సీనియర్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో బుధవారం భారత్‌కు ఒక స్వర్ణం, ఒక కాంస్య పతకం లభించాయి. పురుషుల 25 మీటర్ల స్టాండర్డ్ పిస్టల్ ఈవెంట్‌లో అమన్‌ప్రీత్ సింగ్ పసిడి పతకం సొంతం చేసుకోగా... మహిళల 25 మీటర్ల స్టాండర్డ్ పిస్టల్ టీమ్ విభాగంలో టియానా, యశిత, కృతిక శర్మలతో కూడిన భారత జట్టు 1601 పాయింట్లతో కాంస్య పతకం దక్కించుకుంది. 50 మంది షూటర్లు పోటీపడ్డ 25 మీటర్ల స్టాండర్డ్ పిస్టల్ ఈవెంట్‌లో అమన్‌ప్రీత్ 577 పాయింట్లతో విజేతగా అవతరించాడు. భారత్‌కే చెందిన హర్ష్ 573 పాయింట్లతో నాలుగో స్థానంలో, అక్షయ్ జైన్ 545 పాయింట్లతో 40వ స్థానంలో నిలిచారు.

ప్రత్యర్థులుగా ఇంగ్లండ్, నెదర్లాండ్స్

వన్డే వరల్డ్ కప్‌లో భారత్ వామప్ మ్యాచ్‌లు



దుబాయ్: వన్డే వరల్డ్ కప్ ప్రధాన పోరుకు ముందు సన్నాహకంగా జరిగే వామప్ మ్యాచ్‌ల షెడ్యూల్‌ను అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ప్రకటించింది. మూడు వేదికలు హైదరాబాద్, తిరువనంతపురం, గువహటి నగరాల్లో ఈ మ్యాచ్‌లు జరుగుతాయి. టోర్నీలో పాల్గొంటున్న 10 జట్లూ సెప్టెంబర్ 29 నుంచి అక్టోబర్ 3 మధ్య రెండేసి మ్యాచ్‌ల చొప్పున ఆడతాయి. సెప్టెంబర్ 30న డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్‌తో గువహటిలో తలపడే భారత్... అక్టోబర్ 3న తిరువనంతపురంలో నెదర్లాండ్స్‌ను ఎదుర్కొంటుంది. మూడు ప్రధాన మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇస్తున్న హైదరాబాద్‌లోని రాజీవ్‌గాంధీ స్టేడియంలో రెండు వామప్ మ్యాచ్‌లు కూడా జరుగుతాయి. సెప్టెంబర్ 29న పాకిస్తాన్, న్యూజిలాండ్...అక్టోబర్ 3న పాకిస్తాన్, ఆస్ట్రేలియా మధ్య ఉప్పల్ స్టేడియంలో వామప్ మ్యాచ్‌లు నిర్వహిస్తారు.

టికెటింగ్ పార్ట్‌నర్‌గా బుక్ మై షో...

వరల్డ్ కప్ కోసం 'బుక్ మై షో'ను తమ టికెటింగ్ భాగస్వామిగా బీసీసీఐ ప్రకటించింది. ప్రధాన మ్యాచ్‌లు, వామప్ మ్యాచ్‌లు కలిపి మొత్తం 58 మ్యాచ్‌ల టికెట్లను బుక్ మై షో ద్వారా కొనుగోలు చేయవచ్చు. భారత్ మినహా ఇతర జట్ల వామప్ మ్యాచ్‌లకు ఈ నెల 25 నుంచి, భారత్ ఆడే వామప్ మ్యాచ్‌లకు ఈ నెల 30 నుంచి టికెట్లు అందుబాటులో ఉంటాయి. అయితే బోర్డు స్పాన్సర్లలో ఒకరైన 'మాస్టర్ కార్డ్' వినియోగదారులకు మాత్రం ఒకరోజు ముందుగానే (నేటి సాయంత్రం 6 గంటల నుంచి, 29 సాయంత్రం 6 గంటల నుంచి) టికెట్లు లభిస్తాయి.

భారత్‌కు మూడో స్థానం




డసెల్‌డార్ఫ్ (జర్మనీ): నాలుగు దేశాల జూనియర్ మహిళల అంతర్జాతీయ హాకీ టోర్నీలో భారత జట్టు మూడో స్థానాన్ని సంపాదించింది. ఇంగ్లండ్ జట్టుతో బుధవారం జరిగిన ప్లే ఆఫ్ మ్యాచ్‌లో టీమిండియా 6-2 గోల్స్ తేడాతో ఘనవిజయం సాధించింది. భారత్ తరఫున అన్ను (26వ, 43వ ని.లో) రెండు గోల్స్ చేయగా... నీలమ్ (25వ ని.లో), సునెలితా టొప్పో (35వ ని.లో), హీనా బానో (38వ ని.లో), ముంతాజ్ ఖాన్ (40వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు. ఇంగ్లండ్ జట్టుకు క్లాడియా స్వెయిన్ (16వ ని.లో), చార్లొట్ బింగామ్ (54వ ని.లో) ఒక్కో గోల్ అందించారు.

'టాప్'లో కోస్టల్ రైడర్స్

విశాఖ స్పోర్ట్స్: ఆంధ్ర ప్రీమియర్ లీగ్ రెండో సీజన్‌లో లీగ్ దశ మ్యాచ్‌లు ముగిశాక కోస్టల్ రైడర్స్ జట్టు 16 పాయింట్లతో టాపర్‌గా నిలిచింది. ఉత్తరాంధ్ర లయన్స్, రాయలసీమ కింగ్స్ 12 పాయింట్లతో సంయుక్తంగా రెండో స్థానంలో... బెజవాడ టైగర్స్, గోదావరి టైటాన్స్ 8 పాయింట్లతో సంయుక్తంగా మూడో స్థానంలో నిలిచాయి. అయితే మెరుగైన రన్‌రేట్ ఆధారంగా ఉత్తరాంధ్ర లయన్స్‌కు రెండో స్థానం, రాయలసీమ కింగ్స్‌కు మూడో స్థానం, బెజవాడ టైగర్స్‌కు నాలుగో స్థానం లభించాయి. కోస్టల్ రైడర్స్‌తోపాటు ఈ మూడు జట్లు ప్లే ఆఫ్స్‌కు అర్హత పొందాయి. శుక్రవారం జరిగే ఎలిమినేటర్ మ్యాచ్‌లో రాయలసీమ కింగ్స్‌తో బెజవాడ టైగర్స్... క్వాలిఫయర్-1లో ఉత్తరాంధ్ర లయన్స్‌తో కోస్టల్ రైడర్స్ ఆడతాయి.
రాయలసీమ కింగ్స్‌తో చివరి రౌండ్ లీగ్ మ్యాచ్‌లో కోస్టల్ రైడర్స్ జట్టు వీజేడీ పద్ధతిలో 8 వికెట్లతో గెలిచింది. ముందుగా రాయలసీమ కింగ్స్ 18 ఓవర్లలో 9 వికెట్లకు 131 పరుగులు చేసింది. ఈ దశలో వర్షం అంతరాయం కలిగించింది. హనీష్ రెడ్డి (78; 5 ఫోర్లు, 6 సిక్స్‌లు) మెరిశాడు. వర్షం తగ్గాక కోస్టల్ రైడర్స్ జట్టుకు 17 ఓవర్లలో 124 పరుగుల విజయలక్ష్యాన్ని నిర్దేశించారు. కోస్టల్ జట్టు 14 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి 127 పరుగులు చేసి గెలిచింది. ప్రణీత్ (64 నాటౌట్; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు), చిరంజీవి (32 నాటౌట్; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) దూకుడుగా ఆడారు. మరో మ్యాచ్‌లో ఉత్తరాంధ్ర లయన్స్ ఏడు వికెట్లతో గోదావరి టైటాన్స్‌ను ఓడించింది.

సినిమా



"నా పనిని ఎంజాయ్ చేయడం కోసం నేను సినిమా రంగంలోకి వచ్చాను. మనం చేసే పని ఏదైనా అందులో సంతృప్తి దక్కాలి. 'గాండీవ ధారి అర్జున' చిత్రం చేయడం నా బాధ్యత అనిపించింది. నా మనసుకు నచ్చిన సినిమా ఇది. నాకు సంతృప్తినిచ్చింది" అని హీరో వరుణ్ తేజ్ అన్నారు. ప్రవీణ్ సత్తారు దర్శకత్వంలో వరుణ్ తేజ్, సాక్షీ వైద్య జంటగా నటించిన చిత్రం 'గాండీవధారి అర్జున'. బి. బాపినీడు సమర్పణలో బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మించిన ఈ సినిమా రేపు (శుక్రవారం) విడుదలవుతోంది. ఈ సందర్భంగా వరుణ్ తేజ్ చెప్పిన విశేషాలు.

అప్పుడే ప్రేమలో పడ్డా!

- వరుణ్ తేజ్

- ప్రవీణ్ సత్తారుగారి సినిమాలను ప్రారంభం నుంచి చూస్తున్నాను. వైవిధ్యమైన చిత్రాలు చేయటానికి ఆయన ప్రయత్నిస్తుంటాడు. ప్రవీణ్ తీసిన 'చందమామ కథలు' సినిమాలోని భావోద్వేగాలు, 'పీఎస్‌వీ గరుడవేగ' చిత్రంలోని యాక్షన్ నాకు ఇష్టం. 'గని' సినిమా సమయంలో నేను 'గాండీవధారి అర్జున' కథ విన్నాను. సాధారణంగా స్టైలిష్ యాక్షన్ మూవీ అంటే యాక్షన్, స్టైలిష్ అంశాలపై ఫోకస్ ఎక్కువగా ఉంటుంది.. కథ తక్కువగా ఉంటుంది. కానీ ప్రవీణ్‌గారు కథ చెప్పినప్పుడు అందులోని పాయింట్, భావోద్వేగాలు నచ్చాయి. ● ఈ చిత్రంలో హీరో పేరు అర్జున్. ఓ నటుడికి సామాజిక బాధ్యతాయుతమైన పాత్రల్లో నటించే అవకాశాలు తక్కువగా వస్తుంటాయి. అందుకే మంచి కథతో పాటు సామాజిక బాధ్యతను గుర్తు చేసేలా ఉండే ఈ సినిమా చేయటం సంతోషంగా ఉంది. ఈ సినిమాలో ఎక్కువగా రియలిస్టిక్ యాక్షన్ సీక్వెన్స్ ఉన్నాయి.. అవి చేస్తున్నప్పుడు నాకు గాయాలయ్యాయి. ● 'గాండీవధారి..' లో బాడీగార్డ్ రోల్ చేశాను. ఈ చిత్రం ద్వారా ప్రేక్షకులకు ఏదో సందేశం ఇచ్చి మీరు మారాలని చెప్పటం లేదు. ప్రస్తుతం ఉన్న పెద్ద సమస్యని యాక్షన్, ఎమోషన్, ఎంటర్‌టైనింగ్‌గా చెప్పే ప్రయత్నం చేశాం. సినిమా చూసి కొందరైనా మారితే మంచిదే. కథ డిమాండ్ మేరకే లండన్‌లో షూట్ చేశాం. అక్కడి వాతావరణం షూటింగ్‌కి సహకరించకపోవడం వల్ల బడ్జెట్ ముందుగా అనుకున్నదాని కంటే పెరిగింది. అయినా బీవీఎస్ఎన్ ప్రసాద్‌గారు, బాపినీడు ఖర్చుకు వెనకాడలేదు. ● సాక్షీ వైద్యకి చాలా ప్రతిభ ఉంది. తొలి రోజు షూటింగ్‌లోనే సినిమాలోని మూడు పేజీల డైలాగ్‌ని సింగిల్ టేక్‌లో చెప్పటం ఆశ్చర్యంగా అనిపించింది. మిక్కీ జె. మేయర్ అద్భుతమైన సంగీతం, అంతకు మించి నేపథ్య సంగీతం అందించారు. ప్రస్తుతం 'ఆపరేషన్ వాలెంటైన్', 'మట్కా' సినిమాలు చేస్తున్నాను.
- మీ (వరుణ్-లావణ్యా త్రిపాఠి) ప్రేమ ఎప్పుడు మొదలైంది? పెళ్లెప్పుడు? అని వరుణ్ తేజ్‌ని అడగ్గా.. ''తొలిసారి తనని కలిసినప్పుడే ('మిస్టర్' సినిమా అప్పుడు) అని నవ్వుతూ సమాధానం ఇచ్చారు. ''మా పెళ్లి ఈ ఏడాదిలోనే ఉండే అవకాశం ఉంది'' అన్నారు వరుణ్.

''లవ్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా 'ఖుషి' సినిమా ఉంటుంది. విప్లవ్, ఆరాధ్య పాత్రల్లో విజయ్ దేవరకొండ, సమంతల నటన, భావోద్వేగాలు ప్రేక్షకుల్ని కట్టిపడేస్తాయి. ఒక్క మాటలో చెప్పాలంటే 'ఖుషి'లో అన్ని వాణిజ్య అంశాలుంటాయి'' అని ఛాయాగ్రాహకుడు జి. మురళి అన్నారు. విజయ్ దేవరకొండ, సమంత జంటగా శివ నిర్వాణ దర్శకత్వం వహించిన చిత్రం 'ఖుషి'. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా సెప్టెంబర్ 1న విడుదలవుతోంది. ఈ సందర్భంగా జి. మురళి మాట్లాడుతూ– ''సినిమాటోగ్రఫీలో శిక్షణ పొంది, సినిమాల్లోకి వచ్చాను. ఎవరి వద్దా అసిస్టెంట్‌గా చేయలేదు. తెలుగులో నా తొలి సినిమా 'అందాల రాక్షసి'. ఆ తర్వాత 'ఖుషి'నే. ప్రేమ గురించి కలలు కనే యువకుడికి ప్రేమ, జీవితం అంటే మన ఊహలకు అనుగుణంగా ఉండవని తెలిసి రావడమే ఈ సినిమా నేపథ్యం. మణిరత్నంగారి సినిమాల్లో సినిమాటోగ్రాఫర్ పీసీ శ్రీరామ్‌గారు చూపించే విజువల్ బ్యూటీ 'ఖుషి'లో చూస్తారు. అయితే అలాంటి సీన్స్‌ను మేం కాపీ కొట్టలేదు.. అలాంటి అనుభూతి కలిగించేలా విజువల్స్ ఉంటాయి. ఈ సినిమా పూర్తయ్యాక ప్రేక్షకులకు కొత్త అనుభూతి కలుగుతుంది. కెమేరా ద్వారా ఆ ఎమోషన్‌ని తీసుకొచ్చేందుకు నా ప్రయత్నం చేశాను. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్‌గార్లకు సినిమాల మీద ఉన్నంత ప్యాషన్ నేను ఇంకో ప్రొడక్షన్‌లో చూడలేదు. శివ నిర్వాణగారు ఎప్పుడూ సినిమా గురించే ఆలోచిస్తుంటారు. హేషమ్ అబ్దుల్ వాహబ్ అద్భుతమైన సంగీతం ఇచ్చారు'' అన్నారు.

ఆ సీన్స్‌ని కాపీ కొట్టలేదు

- జి. మురళి



"బాయ్స్ హాస్టల్' ట్రైలర్ చూడగానే నవ్వొచ్చింది. ప్రపంచంలో కెల్లా మంచి ప్రేక్షకులు మన తెలుగు వాళ్లే. మంచి సినిమాలను భాషతో సంబంధం లేకుండా ఆదరిస్తారు. అందుకే మన ప్రేక్షకులకి దండం పెట్టాలి" అని నిర్మాత సుప్రియ యార్లగడ్డ అన్నారు. ప్రజ్వల్ బీపీ, మంజునాథ్ నాయక, రాకేష్ రాజ్‌కుమార్, శ్రీవత్స ప్రధాన పాత్రల్లో, అతిథిగా రిషబ్ శెట్టి నటించిన కన్నడ చిత్రం 'హాస్టల్ హుడుగారు బేకగిద్దరే'. ఈ చిత్రాన్ని 'బాయ్స్ హాస్టల్'గా అన్నపూర్ణ స్టూడియోస్, చాయ్ బిస్కెట్ ఫిల్మ్స్ తెలుగులో ఈ నెల 26న రిలీజ్ చేస్తున్నాయి. ఇందులో రష్మీ గౌతమ్, తరుణ్ భాస్కర్ అతిథి పాత్రలు చేశారు. ఈ చిత్ర నిర్మాతల్లో ఒకరైన సుప్రియ చెప్పిన విశేషాలు.

తెలుగు ప్రేక్షకులకు దండం పెట్టాలి

- సుప్రియ



- 'హాస్టల్ హుడుగారు బేకగిద్దరే' సినిమాని అనువదించడం కష్టంగా అనిపించింది. ఎందుకంటే వందకు పైగా వాయిస్‌లు ఉన్నాయి. చాలా జాగ్రత్తలు తీసుకొని ప్రతి వాయిస్‌ని తెలుగు నేటివిటీకి తగ్గట్టు డబ్ చేశాం. 'బాయ్స్ హాస్టల్' చూస్తున్నప్పుడు ప్రేక్షకులకు స్ట్రయిట్ తెలుగు సినిమా చూస్తున్న అనుభూతి కలుగుతుంది. చాయ్ బిస్కెట్ ఫిల్మ్స్ వాళ్ల సినిమాలను చాలా చక్కగా చేస్తున్నారు.. అందుకే వాళ్లతో కలిసి ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నాం. ● వారసత్వాన్ని కాపాడుకోవడం చాలా ముఖ్యం. 'మనం' సినిమా షూటింగ్ మరో పది రోజులు ఉందనగా తాతగారి (అక్కినేని నాగేశ్వరరావు) ఆరోగ్య పరిస్థితి తెలిసింది. అప్పటికే ఆయన 255 సినిమాలు చేశారు. 'మనం' ఆయన చివరి సినిమాగా పూర్తి చేయాలనుకున్నపుడు ఎంతో ఒత్తిడి ఉండేది. రోజుకు 22 గంటలు పని చేశాం. అయితే ఆ టైమ్‌లో ఎవరితోనూ తిట్టించుకోకపోవడం గొప్ప విషయం (నవ్వు తూ). తాతగారు ఇప్పటికీ నెలకోసారి కలలోకి వచ్చి నన్ను తిడుతుంటారు (నవ్వుతూ).
- నాగార్జునగారి కంటే మంచి నిర్మాత ఎవరూ లేరు. ఆయన యాక్టర్ అవ్వడం వల్లే అన్నపూర్ణ స్టూడియో నిలిచిందని భావిస్తాను. స్టూడియో ప్రారంభమైన కొత్తల్లో కరెంటు బిల్లు కూడా కట్టేంత ఆదాయం వచ్చేది కాదు. తాత, అమ్మమ్మ (ఏఎన్ఆర్-అన్నపూర్ణ) బాధ పడేవారు. ఇప్పుడు ఈ స్టూడియో ఇంత పెద్దగా ఎదిగిందంటే ఇందులో తాతగారు, నాగార్జునగారి కృషి ఉంది. నాకు యాక్టింగ్ వస్తుందా? రాదా అని చెక్ చేసుకోవడానికి 'గూఢచారి' చేశాను (నవ్వుతూ). 'గూఢచారి 2'లో నా పాత్ర ఉంటే నటిస్తాను. మా బ్యానర్‌లో నాగచైతన్య, అఖిల్‌లతో ప్రాజెక్ట్స్ లైన్‌లో ఉన్నాయి.



● కాజల్ ● తమన్నా ● త్రిష

ఆన్ ఇన్వెస్టిగేషన్

పోలీస్ ఆఫీసర్లుగా కొందరు నాయికలు దోషులను పట్టుకునేందుకు రెడీ అయ్యారు. ఇందులో భాగంగా కేసు వివరాల కోసం లోతుగా విచారణ చేస్తూ, ఇన్వెస్టిగేషన్ మోడ్‌లోకి వెళ్లిపోయారు. ఈ తారల పరిశోధనల విశేషాల్లోకి వెళదాం.

పవర్‌ఫుల్ సత్యభామ

హైదరాబాద్‌లో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ సత్యభామగా చార్జ్ తీసుకున్నారు కాజల్ అగర్వాల్. ఆమె టైటిల్ రోల్‌లో రూపొందుతున్న చిత్రం 'సత్యభామ'. ఈ చిత్రంలో ఏసీపీ సత్యభామ పాత్ర చేస్తున్నారు కాజల్. ఆల్రెడీ టీజర్‌ను కూడా రిలీజ్ చేశారు. అఖిల్ డేగల ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. గతంలో కొన్ని చిత్రాల్లో కాజల్ పోలీసాఫీసర్ పాత్రలో నటించినప్పటికీ ఓ పూర్తి స్థాయి ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్‌గా నటించడం ఇదే తొలిసారి.

తొలి అడుగు

రెండు దశాబ్దాలుగా అగ్రకథానాయికగా త్రిష ప్రయాణం దిగ్విజయంగా కొనసాగుతోంది. ఇప్పుడు డిజిటల్ ఎంటర్‌టైన్‌మెంట్ హవా కూడా నడుస్తున్న తరుణంలో ఈ ప్లాట్‌ఫామ్‌లో ఆమె సైన్ చేసిన తొలి వెబ్ సిరీస్ 'బృందా'. ఇందులో త్రిష పోలీసాఫీసర్‌గా నటిస్తున్నారు. పూర్తి స్థాయి పోలీసాఫీసర్ పాత్రలో త్రిష నటిస్తుండటం కూడా ఇదే మొదటిసారి అనొచ్చు. క్రైమ్-ఇన్వెస్టిగేషన్ నేపథ్యంలో ఈ సిరీస్‌కు సురేష్ వంగలా దర్శకత్వం వహిస్తున్నారు. తెలుగులో రూపొందుతున్న ఈ సిరీస్ ఇతర భాషల్లో అనువాదమై, త్వరలో స్ట్రీమింగ్ కానుంది.

ఆఖరి నిజం

ఢిల్లీలో 2018లో జరిగిన బురారి ఆత్మహత్యల ఘటన ఆధారంగా ఇప్పటికే కొన్ని వెబ్ సిరీస్‌లు రూపొందాయి. తాజాగా రూపొందిన మరో వెబ్ సిరీస్ 'ఆఖ్రీ సచ్' (ఆఖరి నిజం). ఆత్మహత్యల మిస్టరీ ఛేదించే ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ అన్యగా తమన్నా నటించారు. ఈ తరహా పాత్ర చేయడం ఇదే తొలిసారి అని ఇటీవల తమన్నా పేర్కొన్నారు. రాబీ గ్రేవాల్ ఈ వెబ్ సిరీస్‌కు దర్శకత్వం వహించారు.

ఇలా ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్స్‌గా మరికొందరు తారలు నటిస్తున్నారు.

గూఢచారి 111



● 'వెన్నెల' కిశోర్

'వెన్నెల' కిశోర్, సంయుక్తా విశ్వనాథన్ హీరో హీరోయిన్లుగా, మురళీ శర్మ కీలక పాత్రలో నటిస్తున్న స్పై యాక్షన్ కామెడీ ఫిల్మ్ 'చారి 111'. టీజీ కీర్తికుమార్ దర్శకత్వంలో అదితీ సోనీ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. బుధవారం ఈ సినిమాను ప్రకటించడంతో పాటు, కాన్సెప్ట్ టీజర్‌ను కూడా విడుదల చేశారు. ఈ సందర్భంగా టీజీ కీర్తి కుమార్ మాట్లాడుతూ– ''ఓ సిటీలో జరిగే అనుమానాస్పద ఘటనలను ఛేదించే రహస్య గూఢచారి పాత్రలో 'వెన్నెల' కిశోర్ కనిపిస్తారు. అలాగే ఆయన పాత్రలో ఓ కన్‌ఫ్యూజన్ కూడా ఉంటుంది. స్టైలిష్ యాక్షన్ సన్నివేశాలతో ఆద్యంతం వినోదభరితంగా ప్రేక్షకులను అలరించేలా ఈ సినిమా ఉంటుంది'' అన్నారు. ''స్పై జానర్‌లో 'చారి 111' కొత్తగా ఉంటుంది. కథలో చాలా సర్‌ప్రైజ్‌లు ఉన్నాయి. షూటింగ్ జరుగుతోంది'' అన్నారు అదితీ సోనీ. ఈ చిత్రానికి సంగీతం: సైమన్ కె. కింగ్.

అనులో మంచి పాత్ర చేశాను

- ఆమని



కార్తీక్ రాజు, ప్రశాంత్ కార్తి, మిస్టీ చక్రవర్తి, ఆమని, దేవీ ప్రసాద్, భీమినేని శ్రీనివాసరావు, పోసాని కృష్ణమురళి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'అను'. సందీప్ గోపిశెట్టి స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న ఈ సినిమా సెప్టెంబరులో విడుదల కానుంది. ఈ సందర్భంగా బుధవారం జరిగిన ఈ సినిమా విలేకర్ల సమావేశంలో ఆమని మాట్లాడుతూ– ''ఈ సినిమాలో ఓ మంచి పాత్ర చేశాను. చక్కని సందేశాత్మక చిత్రం ఇది. ప్రేక్షకులు ఈ సినిమాను ఆదరించాలి'' అన్నారు. ''దర్శకుడిగా నాకు ఇదే తొలి చిత్రం. సెప్టెంబరులో సినిమాను విడుదల చేయాలనుకుంటున్నాం'' అన్నారు సందీప్ గోపిశెట్టి. ''ఈ సినిమాలో విలన్‌గా చేశాను'' అన్నారు ప్రశాంత్ కార్తి. దేవీ ప్రసాద్, భీమనేని శ్రీనివాసరావు, లైన్ ప్రొడ్యూసర్ కల్యాణ్ చక్రవర్తి ఈ సినిమా విజయంపై నమ్మకం వ్యక్తం చేశారు.

సాక్షి బిజినెస్
గురువారం
24-8-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	213	65,433
నిఫ్టీ ▲	48	19,444

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	13,739	▲	233
డోజోన్స్	34,512	▲	233
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,321	▲	50
డాక్స్	15,728	▲	23
షాంఘై	3,078	▽	42
నికాయ్	32,010	▲	154

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) – ముంబై

బంగారం (24 క్యారట్)	58,520	▽	137
బంగారం (22 క్యారట్)	58,286	▽	137
వెండి (కేజీ)	72,679	▲	539

చంద్రయాన్‌పై కార్పొరేట్ల హర్షం..



చంద్రయాన్-3 విజయవంతం కావడంపై కార్పొరేట్లు హర్షం వ్యక్తం చేశారు. చంద్రయాన్ టీమ్‌ను ప్రశంసించారు.

గర్వకారణం...



ఇది ప్రతి భారతీయుడు గర్వించదగ్గ క్షణం. భారత అంతరిక్ష, సాంకేతిక ప్రయాణంలో ఒక కీలక మైలురాయి. ప్రధాని నరేంద్ర మోదీకి, ఇస్రో బృందానికి శుభాభినందనలు. రాబోయే తరాలకు ఇది ఎంతో స్ఫూర్తిదాయకంగా నిలుస్తుంది.

– ఎన్ చంద్రశేఖరన్, టాటా సన్స్ చైర్మన్

సామర్థ్యానికి నిదర్శనం



ఇస్రో, భారత సైంటిస్టులు అందరికీ హృదయపూర్వక శుభాభినందనలు. అంతరిక్ష పరిశోధనలో భారతదేశ సామర్థ్యాలకు ఈ విజయం ఒక నిదర్శనం. ఈ అపూర్వ ఘట్టంలో భాగం కావడం మాకెంతో గర్వకారణం.

– ఎస్ఎన్ సుబ్రమణ్యన్, ఎల్అండ్‌టీ సీఈవో

జాబిల్లి చేతికి అందింది



మానవ జాతి ఆరంభం నుంచి చంద్రుడిని చూస్తూ కలలు కంటూనే ఉంది. చందమామ తన మాయాజాలంతో మనల్ని స్వాప్నికులుగా మార్చింది. నేడు ఆ మాయ, సైన్స్ కలిసి జాబిల్లిని మన చేతికి అందించాయి.

– ఆనంద్ మహీంద్రా, పారిశ్రామిక దిగ్గజం

చారిత్రక క్షణం



ఇస్రో బృందానికి అభినందనలు. మీరు దేశానికి గర్వకారణం. అంతరిక్ష పరిశోధనలను విజయవంతంగా అమలు చేయగలగడం దేశానికి తన సామర్థ్యాలపై గల నమ్మకానికి నిదర్శనం. ఇది 140 కోట్ల మంది భారతీయులకు చారిత్రక క్షణం.

– గౌతమ్ అదానీ, అదానీ గ్రూప్ చైర్మన్

అద్భుత ఘట్టం



భారత అంతరిక్ష పరిశోధనల చరిత్రలో ఇది మరో అద్భుత ఘట్టం.. మన అంతరిక్ష పరిశ్రమ సామర్థ్యాలకు నిదర్శనం. మూడు దశాబ్దాలుగా భారతీయ స్పేస్ ప్రోగ్రామ్‌తో అనుబంధం కలిగి ఉండటం మాకు గర్వకారణం.

– పర్వత్ శ్రీనివాస్ రెడ్డి, ఎంటార్ టెక్నాలజీస్ ఎండీ

తనిష్క్ వరలక్ష్మీ వ్రత కలెక్షన్.. 'ఆర్ణ'

హైదరాబాద్: సంపద, సంతోషం, సుఖం అందించే దేవత లక్ష్మీదేవిని పూజిస్తూ చేసుకునే పవిత్ర వరలక్ష్మీ వ్రత పర్వదినాన్ని పురస్కరించుకుని భారత్ అతిపెద్ద జ్యువెలరీ బ్రాండ్- తనిష్క్ 'అర్ణ' పేరుతో ప్రత్యేక ఆభరణాల కలెక్షన్‌ను ఆవిష్కరించింది. ఈ మేరకు విడుదలైన ఒక ప్రకటన ప్రకారం వైవిధ్యమైన అభిరుచులకు అనుగుణంగా ఈ కలెక్షన్‌లో ప్రత్యేకమైన నెక్‌వేర్, హరామ్, వంకీలు, నడుము వడ్డాణాలు, చెవిపోగులు, బ్యాంగిల్స్‌సహా అత్యంత నాణ్యమైన, విభిన్న డిజైన్‌లతో కూడిన బంగారం, కలర్ స్టోన్స్, ముత్యాల ఆభరణాలు ఉన్నాయి. తనిష్క్ ఆభరణాల ఎక్స్ఛేంజ్‌పై 20 శాతం వరకూ తగ్గింపు ఆఫర్ కూడా అందుబాటులో ఉంది. ఈ ఆఫర్ తెలుగు రాష్ట్రాల్లోని సంస్థ అన్ని షోరూమ్‌లలో లభ్యమవుతుందని తనిష్క్ ప్రకటనలో పేర్కొంది.



కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

24-8-2023	
విశాఖ	475-00
చిత్తూరు	503-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	465-00
విజయవాడ	465-00
రిటైల్ ధర (డజను)	72.00
23-8-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	435-00
వరంగల్	437-00
రిటైల్ ధర	4.95

మార్కెట్లకు బ్యాంకింగ్ పుష్

- సెన్సెక్స్ 213 పాయింట్లు అప్
- ఇంట్రాడేలో 65,500 దాటేసింది
- 19,444కు నిఫ్టీ- 48 పాయింట్లు ప్లస్



ముంబై: తొలుత అమ్మకాలు తలెత్తినప్పటికీ వరుసగా మూడో రోజు దేశీ స్టాక్ మార్కెట్లు బలపడ్డాయి. సెన్సెక్స్ 213 పాయింట్లు పుంజుకుని 65,433 వద్ద నిలిచింది. మిడ్‌సెషన్‌లో 285 పాయింట్లు ఎగసి 65,505కు చేరింది. ఇక నిఫ్టీ 48 పాయింట్లు లాభపడి 19,444 వద్ద ముగిసింది. వెరసి మూడు రోజుల్లో సెన్సెక్స్ 485 పాయింట్లు, నిఫ్టీ 134 పాయింట్లు జమ చేసుకున్నాయి. ప్రధానంగా బ్యాంకింగ్ కౌంటర్లు మార్కెట్లకు జోష్‌నివ్వగా యూరోపియన్ మార్కెట్ల సానుకూలతలు సైతం ఇందుకు మద్దతిచ్చినట్లు విశ్లేషకులు పేర్కొన్నారు.

బ్యాంకుల జోరు

ఎన్ఎస్ఈలో ప్రధానంగా పీఎస్‌యూ, ప్రయివేట్ బ్యాంక్స్ 1.7-1.3 శాతం చొప్పున ఎగశాయి. కన్జూమర్ డ్యూరబుల్స్, మీడియా, రియల్టీ 0.6 శాతం పుంజుకోగా.. ఎఫ్ఎంసీజీ 0.5 శాతం నీరసించింది. నిఫ్టీ దిగ్గజాలలో హిందాల్కో, యాక్సిస్, ఐసీఐసీఐ, దివీస్, ఎల్అండ్‌టీ, ఎస్‌బీఐ, టాటా స్టీల్, మారుతీ, సిప్లా, నెస్లే, ఎస్‌బీఐ లైఫ్, కొటక్ బ్యాంక్ 2.3-1% మధ్య లాభపడ్డాయి. అయితే అదానీ ఎంటర్‌ప్రైజెస్ 6% పతనమైంది.

నేలచూపులోనే జియో

జియో ఫైనాన్షియల్ సర్వీసెస్‌లో వరుసగా మూడో రోజు అమ్మకాలు కొనసాగాయి. దీంతో బీఎస్ఈలో మరోసారి 5 శాతం పతనమై 227 వద్ద నిలిచింది. ఎన్ఎస్ఈలోనూ 5 శాతం డౌన్ సర్క్యూట్‌ను తాకి రూ. 225 దిగువన ముగిసింది. గత మూడు రోజులుగా ఈ షేరు లోయర్ సర్క్యూట్లను తాకుతున్న నేపథ్యంలో తాజాగా కంపెనీ మార్కెట్ క్యాప్(విలువ) రూ. 1,44,378 కోట్లకు చేరింది. రిలయన్స్ నుంచి ప్రత్యేక కంపెనీగా విడివడిన జియో ఫైనాన్షియల్ ఈ నెల 29వరకూ ప్రధాన ఇండెక్సులు సెన్సెక్స్, నిఫ్టీలలో కొనసాగనుంది.

చంద్రయాన్-3 షేర్లు జిగేల్



చంద్రయాన్-3 చంద్రుడిపై విజయవంతంగా కాలు మోపనుందన్న అంచనాల నేపథ్యంలో అంతరిక్షం, రక్షణ రంగ కంపెనీల కౌంటర్లకు భారీ డిమాండ్ ఏర్పడింది. బీఎస్ఈలో సెంటమ్ ఎలక్ట్రానిక్స్ 15 శాతం దూసుకెళ్లగా.. స్పేస్ టెక్నాలజీస్, ఎంటార్ టెక్నాలజీస్, హిందుస్తాన్ ఏరోనాటిక్స్ 5.5-3.6 శాతం మధ్య జంప్‌చేశాయి. చంద్రయాన్-3 మిషన్‌కు సెంటమ్ 200కుపైగా కీలక మాడ్యూల్స్‌ను సరఫరా చేసింది. ఇక ఈ బాటలో భారత్ ఫోర్జ్, ఆస్ట్రా మైక్రోవేవ్, ఎల్అండ్‌టీ 3-1.5 శాతం మధ్య ఎగశాయి. వీటిలో కొన్ని కౌంటర్లు ఏడాది గరిష్టాలకు చేరడం గమనార్హం!

పీఎంఎస్ సేవల్లోకి సావర్ట్

యాడ్ ఆస్ట్రా ఫండ్ ఆవిష్కరణ



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజరీ సంస్థ సావర్ట్ కొత్తగా యాడ్ ఆస్ట్రా ఫండ్ పేరిట పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్ సేవలను (పీఎంఎస్) ఆవిష్కరించింది. ఆగస్టు 26 నుంచి వీటిని అందుబాటులోకి తెస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు, సీఈవో సంకర్ష్ చందా బుధవారమిక్కడ వెల్లడించారు. మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నిబంధనల ప్రకారం కనీస పెట్టుబడి రూ. 50 లక్షల నుంచి ఉంటుందని ఆయన వివరించారు. ఇప్పటికే రూ. 30 కోట్ల వరకు పెట్టుబడి ప్రతిపాదనలు వచ్చాయని, పీఎంఎస్ ప్రారంభమయ్యాక మరో రూ. 40 కోట్ల వరకు రాగలవని సంకర్ష్ చందా చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరం ఆఖరు నాటికి రూ. 350 కోట్ల వరకూ రావచ్చని అంచనా వేస్తున్నట్లు చెప్పారు.

రూపాయి మరింత జోరు

డాలర్‌తో పోలిస్తే 82.72 వద్ద ముగింపు



న్యూఢిల్లీ: డాలర్‌తో పోలిస్తే రూపాయి వరుసగా రెండో రోజూ బలపడింది. 27 పైసలు పెరిగి 82.72 వద్ద క్లోజయ్యింది. రెండు నెలల వ్యవధిలో ఒకే రోజున రూపాయి ఇంతగా పెరగడం ఇదే ప్రథమం. ఐపీవో సంబంధ పెట్టుబడుల ప్రవాహం, దేశీ మార్కెట్లు సానుకూలంగా ఉండటం, క్రూడాయిల్ రేట్లు తగ్గుతుండటం తదితర అంశాలు రూపాయి పెరగడానికి దోహదపడినట్లు ఫారెక్స్ ట్రేడర్లు తెలిపారు. ఇంటర్‌బ్యాంక్ ఫారెక్స్ మార్కెట్లో బుధవారం దేశీ కరెన్సీ ట్రేడింగ్ 83.02 వద్ద ప్రారంభమైంది. 82.68-83.02 మధ్య తిరుగాడింది. మంగళవారం నాడు రూపాయి ఆల్‌టైమ్ కనిష్ట స్థాయిల నుంచి కోలుకుని 14 పైసలు లాభంతో 82.99 వద్ద ముగిసిన సంగతి తెలిసిందే.

అదానీ గ్రూప్ లాభాల స్పీడ్

క్యూ1లో 42 శాతం వృద్ధి



న్యూఢిల్లీ: బిలియనీర్ గౌతమ్ అదానీ గ్రూప్ కంపెనీలు ఈ ఆర్థిక సంవత్సరం(2023-24) తొలి త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించాయి. గ్రూప్‌లోని 10 లిస్టెడ్ కంపెనీలు ఏప్రిల్-జూన్(క్యూ1)లో ఉమ్మడిగా రూ. 23,532 కోట్ల నిర్వహణ లాభం(ఇబిటా) ఆర్జించాయి. గ్రూప్ చరిత్రలోనే ఇది అత్యధికం కాగా.. గతేడాది(2022-23) క్యూ1తో పోలిస్తే ఇది 42 శాతం వృద్ధి. ఇక 2018-19లో గ్రూప్ ఆర్జించిన పూర్తి ఇబిటా రూ. 24,780 కోట్లకు దాదాపు సమానమని అదానీ గ్రూప్ పేర్కొంది. డైవర్సిఫైడ్ కార్యకలాపాలు కలిగిన గ్రూప్‌లో అదానీ ఎంటర్‌ప్రైజెస్, అదానీ పోర్ట్స్, అదానీ గ్రీన్ ఎనర్జీ, అదానీ పవర్, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్, అదానీ టోటల్ గ్యాస్ తదితరాలున్నాయి. వీటి రూ. 42,115 కోట్ల నగదు నిల్వలను పరిగణించాక రూ. 18,690 కోట్ల నికర రుణ భారాన్ని కలిగి ఉన్నాయి.

రిలయన్స్ రిటైల్‌లో క్యూఐఏకు వాటా



- 0.99 శాతం వాటాకు ఖతార్ ఇన్వెస్ట్‌మెంట్ నుంచి రూ.8,278 కోట్లు
- ఇప్పటికే సిల్వర్‌లేక్, కేకేఆర్, టీపీజీ, జీఐసీ, జీఏ తదితరాల పెట్టుబడులు

న్యూఢిల్లీ: అనుబంధ కంపెనీ రిలయన్స్ రిటైల్ వెంచర్స్(ఆర్ఆర్‌వీఎల్)లో తాజాగా ఖతార్ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ(క్యూఐఏ) పెట్టుబడులు చేపట్టనున్నట్లు డైవర్సిఫైడ్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ పేర్కొంది. తద్వారా ఆర్ఆర్‌వీఎల్‌లో 0.99 శాతం వాటాను పొందనున్నట్లు రిలయన్స్ వెల్లడించింది. సొంత అనుబంధ సంస్థ ద్వారా క్యూఐఏ బిలియన్ డాలర్లు(రూ. 8,278 కోట్లు) వెచ్చించనుంది. వెరసి 100 బిలియన్ డాలర్ల(రూ. 8.27 లక్షల కోట్లు) విలువలో ఆర్ఆర్‌వీఎల్ వాటాను సొంతం చేసుకోనుంది. దేశ ఆర్థిక వ్యవస్థలోని సానుకూలతలకు, రిలయన్స్ రిటైల్ బిజినెస్ మోడల్‌కుగల సామర్థ్యాలకు ఆర్ఆర్‌వీఎల్‌లో క్యూఐఏ పెట్టుబడులు ప్రతీకలని డైరెక్టర్ ఈషా ముకేష్ అంబానీ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. తమ కంపెనీలో పెట్టుబడిదారుగా క్యూఐఏకు ఆహ్వానం పలుకుతున్నట్లు తెలియజేశారు. రిలయన్స్ గ్రూప్ మొత్తం రిటైల్ బిజినెస్‌లకు ఆర్ఆర్‌వీఎల్ హోల్డింగ్ కంపెనీగా వ్యవహరిస్తోంది. కొత్త తరహా కంపెనీలలో అదికూడా అత్యధిక వృద్ధికి వీలున్న దేశీ రిటైల్ మార్కెట్లో ఇన్వెస్ట్ చేసేందుకు సంస్థ కట్టుబడి ఉన్నట్లు క్యూఐఏ సీఈవో మన్సూర్ ఇబ్రహీం అల్‌మహ్మద్ పేర్కొన్నారు.

దిగ్గజాల క్యూ..: ఆర్ఆర్‌వీఎల్‌లో పలు గ్లోబల్ పీఈ దిగ్గజాలు 2020 ప్రారంభంలోనే భారీగా ఇన్వెస్ట్ చేశాయి. కంపెనీ 10.09% వాటాను విక్రయించడం ద్వారా 6.4 బిలియన్ డాలర్లు సమీకరించింది. కంపెనీలో ఇన్వెస్ట్ చేసిన దిగ్గజాలలో సిల్వర్‌లేక్, కేకేఆర్, ముబడాలా, అబుధాబీ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ, జీఐసీ, టీపీజీ, జనరల్ అట్లాంటిక్, సౌదీ పబ్లిక్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ ఉన్నాయి. 57 బిలియన్‌డాలర్ల(రూ. 4.2 లక్షల కోట్లు) విలువలో కంపెనీ ఈ పెట్టుబడులను సమకూర్చుకుంది. తద్వారా మూడేళ్ల క్రితం రిటైల్ రంగంలో భారీ నిధుల సమీకరణకు ఆర్ఆర్‌వీఎల్ తెరతీసింది.

విద్య, ఉద్యోగ సమాచారం

కృష్ణా జిల్లాలో ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ పోస్టులు

కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని కలెక్టర్ కార్యాలయం.. కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 01
» అర్హత: బీసీఏ, బీఎస్సీ, బీఈ/బీటెక్, పీజీ ఉత్తీర్ణతతోపాటు ఇంగ్లిష్ కమ్యూనికేషన్ స్కిల్స్ కలిగి ఉండాలి.
» వయసు: 01.07.2023 నాటికి 21 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.
» వేతనం: నెలకు రూ.22,500 చెల్లిస్తారు
» పని ప్రదేశం:కలెక్టరేట్,మచిలీపట్నం,కృష్ణా జిల్లా
» ఎంపిక విధానం: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తులను కలెక్టరేట్, మచిలీపట్నం,కృష్ణా జిల్లా చిరునామాకు పంపించాలి.
» దరఖాస్తులకు చివరితేది: 26.08.2023.
» వెబ్‌సైట్: krishna.ap.gov.in

జీజీహెచ్ ఒంగోలులో వివిధ ఉద్యోగాలు

ఒంగోలులోని గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్, డి-అడిక్షన్ సెంటర్ కాంట్రాక్ట్ ప్రాతిపదికన పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 03
» పోస్టుల వివరాలు: సైకియాట్రిస్ట్/ఎంబీబీఎస్ డాక్టర్-01, వార్డ్ బాయ్స్-01, కౌన్సిలర్-01.
» అర్హత: పోస్టును అనుసరించి ఎంబీబీఎస్, ఎనిమిదో తరగతి, డిగ్రీతోపాటు పని అనుభవం ఉండాలి.
» వేతనం: నెలకు సైకియాట్రిస్ట్‌కు రూ.60,000, వార్డు బాయ్స్‌కు రూ.13,000, కౌన్సిలర్‌కు రూ.17,500. వయసు: 18 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి.
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.దరఖాస్తును సూపరింటెండెంట్, జీజీహెచ్,ఒంగోలు చిరునామకు పంపించాలి.
» దరఖాస్తులకు చివరితేది: 28.08.2023.
» వెబ్‌సైట్: prakasam.ap.gov.in

శ్రీకాకుళం జిల్లాలో పీపీఎం కోఆర్డినేటర్ పోస్టులు

శ్రీకాకుళం జిల్లా టీబీ కంట్రోల్ ఆఫీస్.. కాంట్రాక్ట్ ప్రాతిపదికన పీపీఎం కోఆర్డినేటర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 01
» అర్హత:పీజీతోపాటు సంబంధిత రంగంలో ఏడాది పని అనుభవం ఉండాలి. టూ వీలర్ డ్రైవింగ్ లైసెన్స్, ద్విచక్ర వాహనాన్ని నడపగలగాలి.
» వేతనం: నెలకు రూ.28,980.
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును టీబీ కంట్రోల్ ఆఫీస్, రూమ్ నెం.24,హాస్పిటల్(జీజీహెచ్), బలగ, శ్రీకాకుళం చిరునామకు పంపించాలి.
» దరఖాస్తులకు చివరితేది: 28.08.2023.
» వెబ్‌సైట్: srikakulam.ap.gov.in

పశ్చిమ గోదావరి జిల్లాలో ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ పోస్టులు

పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలోని కలెక్టర్ కార్యాలయం..కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 02
» అర్హత: బీసీఏ, బీఎస్సీ, బీఈ/బీటెక్, పీజీ ఉత్తీర్ణతతోపాటు ఇంగ్లిష్ కమ్యూనికేషన్ స్కిల్స్ కలిగి ఉండాలి. » వయసు: 01.07.2022 నాటికి 21 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.
» వేతనం: నెలకు రూ.22,500 చెల్లిస్తారు.
» పని ప్రదేశం: కలెక్టరేట్(పశ్చిమ గోదావరి జిల్లా, భీమవరం), రెవెన్యూ డివిజనల్ కార్యాలయం(భీమవరం డివిజన్).
» ఎంపిక విధానం: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జిల్లా రెవెన్యూ అధికారి, కలెక్టరేట్, పశ్చిమ గోదావరి, భీమవరం చిరునామకు పంపించాలి.
» దరఖాస్తులకు చివరితేది: 25.08.2023.
» వెబ్‌సైట్: westgodavari.ap.gov.in

స్పైసెస్ బోర్డ్, కొచ్చిన్‌లో 15 ఉద్యోగాలు

కొచ్చిన్‌లోని స్పైసెస్ బోర్డ్.. వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 15
» పోస్టుల వివరాలు: ఎగ్జిక్యూటివ్, టెక్నికల్ ఆఫీసర్.
» విభాగాలు: మార్కెటింగ్, డెవలప్‌మెంట్.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌లో ఎంబీఏ/ఎంఏ ఉత్తీర్ణులవ్వాలి. కనీసం రెండేళ్ల పని అనుభవం ఉండాలి. వయసు: 40 ఏళ్లు ఉండాలి.
» వేతనం: నెలకు రూ.30,000 నుంచి రూ.35,000 చెల్లిస్తారు.
» ఎంపిక విధానం: రాతపరీక్ష/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» ఇంటర్వ్యూ వేదిక: స్పైసెస్ బోర్డ్(మినిస్ట్రీ ఆఫ్ కామర్స్-ఇండస్ట్రీ,గవర్నమెంట్ ఆఫ్ ఇండియా),సుగంధభవన్,ఎన్.హెచ్.బైపాస్,పాలరివట్టమ్.పీఓ,కొచ్చి-682025,కేరళ,ఇండియా.
» దరఖాస్తు విధానం: ఈమెయిల్, ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ది సెక్రటరీ, స్పైసెస్ బోర్డ్, కొచ్చి.
» ఈమెయిల్: hrd.sbker@gov.i
» దరఖాస్తులకు చివరితేది: 09.09.2023.
» వెబ్‌సైట్: www.indianspices.com

ఎయిమ్స్‌లో.. నర్సింగ్ ఆఫీసర్



జాబ్స్ ఇన్ఫో

నర్సింగ్ కోర్సులు పూర్తి చేసుకున్న అభ్యర్థులకు గుడ్ న్యూస్! ప్రతిష్టాత్మక వైద్య సంస్థల్లో నర్సింగ్ ఆఫీసర్స్‌గా కొలువుదీరే అవకాశం స్వాగతం పలుకుతోంది! దేశవ్యాప్తంగా ఉన్న 18 ఎయిమ్స్‌లో మూడు వేలకుపైగా నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి ఇటీవల నోటిఫికేషన్ విడుదలైంది. ప్రవేశ ప్రక్రియలో రాణిస్తే.. ఆకర్షణీయ వేతనంతో పాటు ఉజ్వల కెరీర్ సొంతమవుతుంది. ఈ నేపథ్యంలో.. ఎయిమ్స్ నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల వివరాలు, ఎంపిక విధానం, కెరీర్ స్కోప్ తదితర వివరాలు..

» మూడు వేలకుపైగా నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల భర్తీ!
» నోటిఫికేషన్ విడుదల చేసిన ఎయిమ్స్
» ఎన్ఓఆర్‌సీఈటీలో ప్రతిభతో ఎంపిక

ఎయిమ్స్ నర్సింగ్ ఆఫీసర్ రిక్రూట్‌మెంట్ ప్రక్రియ ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న 18 ఎయిమ్స్ క్యాంపస్‌లలో నర్సింగ్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేయనున్నారు. మూడు వేలకు పైగా పోస్టులు అందుబాటులో ఉన్నట్లు తెలుస్తోంది. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ఎయిమ్స్-మంగళగిరి, ఎయిమ్స్-బీబీనగర్‌లలోనూ ఖాళీలు ఉంటాయి. జాతీయ స్థాయి పరీక్షలో మెరిట్ ఆధారంగా అభ్యర్థుల ఎంపిక జరుగుతుంది.

అర్హతలు

- బీఎస్సీ నర్సింగ్/బీఎస్సీ నర్సింగ్ ఆనర్స్ ఉత్తీర్ణత ఉండాలి. లేదా పోస్ట్ బేసిక్ బీఎస్సీ నర్సింగ్ ఉత్తీర్ణులవ్వాలి(లేదా) జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీలో డిప్లొమా ఉత్తీర్ణులవ్వాలి. దీంతోపాటు 50 పడకల ఆసుపత్రిలో కనీసం రెండేళ్ల పని అనుభవం తప్పనిసరి.
- విద్యార్హతలతోపాటు రాష్ట్ర/జాతీయ నర్సింగ్ కౌన్సిల్స్‌లో నర్స్‌లు లేదా మిడ్ వైఫ్‌లుగా నమోదు చేసుకుని ఉండాలి.
- వయసు: ఆగస్ట్ 25, 2023 నాటికి 18 -30 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు, పీడబ్ల్యూడీ అభ్యర్థులకు పదేళ్లు చొప్పున గరిష్ట వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.

ఎన్ఓఆర్‌సీఈటీ

ఎయిమ్స్ క్యాంపస్‌లలోని నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి జాతీయ స్థాయిలో నర్సింగ్ ఆఫీసర్ రిక్రూట్‌మెంట్ కామన్ ఎలిజిబిలిటీ టెస్ట్ (ఎన్ఓఆర్‌సీఈటీ) నిర్వహిస్తారు. ఈ పరీక్షలో ప్రతిభ ఆధారంగా నియామకాలు ఖరారు చేస్తారు. ఎన్ఓఆర్‌సీఈటీ.. ప్రిలిమ్స్, మెయిన్స్ అనే రెండు దశలుగా ఉంటుంది.

100 మార్కులకు ప్రిలిమ్స్

ఎంపిక ప్రక్రియలో తొలి దశ ప్రిలిమ్స్‌ను 100 ప్రశ్నలు-100 మార్కులకు నిర్వహిస్తారు. వీటిలో 20 ప్రశ్నలు జనరల్ నాలెడ్జ్ అండ్ ఆప్టిట్యూడ్ నుంచి, మిగిలిన 80 ప్రశ్నలను నర్సింగ్ కోర్సులోని సబ్జెక్టుల నుంచి అడుగుతారు. పరీక్ష పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోనే ఉంటుంది. ప్రతి తప్పు సమాధానానికి 1/3వ వంతు మార్కును నెగెటివ్ మార్కుగా పరిగణిస్తారు. పరీక్షకు కేటాయించిన సమయం గంటన్నర.

రెండో దశ మెయిన్స్

మొదటి దశ ప్రిలిమ్స్‌లో చూపిన ప్రతిభ ఆధారంగా ఒక్కో పోస్ట్‌కు అయిదుగురిని చొప్పున(1:5 నిష్పత్తి) రెండో దశ మెయిన్ ఎగ్జామ్‌కు ఎంపిక చేస్తారు.అభ్యర్థులు ప్రిలిమ్స్‌లో తప్పనిసరిగా కనీస అర్హత మార్కులు సాధించాలనే నిబంధన విధించారు.జనరల్, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు 50 పర్సంటైల్; ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ అభ్యర్థులు 40 పర్సంటైల్‌ను సాధించాలి. ఈ కనీస అర్హత మార్కులు పొందిన వారినే మెయిన్స్ జాబితా రూపకల్పనకు పరిగణనలోకి తీసుకుంటారు.

మెయిన్స్.. సబ్జెక్ట్ పరీక్షగా

మెయిన్స్‌ను సబ్జెక్ట్ పరీక్షగా నిర్వహిస్తారు. మొత్తం 100 ప్రశ్నలు-100 మార్కులకు పరీక్ష ఉంటుంది. ఇందులో నర్సింగ్ కోర్సు సబ్జెక్ట్‌లోని అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. కేస్ ఆధారిత ప్రశ్నలు కూడా ఉంటాయి. మెయిన్స్ పరీక్ష కూడా ఆబ్జెక్టివ్ విధానంలోనే ఉంటుంది. 1/3 వంతు మార్కు చొప్పున నెగెటివ్ మార్కింగ్ నిబంధన ఉంది. పరీక్షకు లభించే సమయం గంటన్నర.

మెయిన్ ఆధారంగా మెరిట్ లిస్ట్

మెయిన్ పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా ఫైనల్ మెరిట్ లిస్ట్ రూపొందిస్తారు. ఈ జాబితాలో నిలిచిన వారికి ఎయిమ్స్ క్యాంపస్‌లతోపాటు ఎన్ఐటీఆర్‌డీ, జాతీయ స్థాయిలో ఇతర వైద్య విజ్ఞాన సంస్థల్లోని నర్సింగ్ ఆఫీసర్ పోస్ట్‌లకు దరఖాస్తు చేసుకునే అవకాశం లభిస్తుంది. అభ్యర్థులు దరఖాస్తు సమయంలో తమకు ఆసక్తి ఉన్న ఎయిమ్స్ క్యాంపస్‌లను ప్రాధాన్యత క్రమంలో పేర్కొనాల్సి ఉంటుంది. దానికి అనుగుణంగా ఫైనల్ మెరిట్ లిస్ట్‌లో నిలిచిన వారికి నియామకాలు ఖరారు చేస్తారు.

గ్రూప్-బి హోదాలో కొలువు

ఎన్ఓఆర్‌సీటీలో ఫైనల్ మెరిట్ లిస్ట్‌లో చోటు సొంతం చేసుకుని.. నియామకం ఖరారు చేసుకున్న వారికి ఎయిమ్స్ క్యాంపస్‌లలో గ్రూప్-బి హోదాలో నర్సింగ్ ఆఫీసర్‌గా కెరీర్ ప్రారంభమవుతుంది. పే లెవల్-7 మేరకు రూ.9,300 -రూ. 34,800 శ్రేణిలో ప్రారంభ వేతనం ఉంటుంది. 2019 నుంచి ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు.

80 శాతం మహిళలకు

ఎయిమ్స్ నర్సింగ్ ఆఫీసర్స్ రిక్రూట్‌మెంట్‌లో మహిళలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. మొత్తం ఖాళీల్లో 80 శాతం పోస్ట్‌లను మహిళలకు, మిగతా 20శాతం పోస్ట్‌లను పురుషులకు కేటాయిస్తున్నారు.

చీఫ్ నర్సింగ్ ఆఫీసర్ హోదాకు

నర్సింగ్ ఆఫీసర్ కొలువులో చేరిన వారు భవిష్యత్తులో చీఫ్ నర్సింగ్ ఆఫీసర్ స్థాయికి చేరుకునే అవకాశం ఉంది. సిస్టర్ గ్రేడ్-1, సిస్టర్ గ్రేడ్-2, అసిస్టెంట్ నర్సింగ్ సూపరింటెండెంట్, డిప్యూటీ నర్సింగ్ సూపరింటెండెంట్,నర్సింగ్ సూపరింటెండెంట్, చీఫ్ నర్సింగ్ ఆఫీసర్ పోస్ట్‌లకు పదోన్నతులు పొందొచ్చు. ఒక్కో హోదాలో కనీసం ఆరేళ్ల పని చేసిన తర్వాత పదోన్నతులకు పరిగణనలోకి తీసుకుంటారు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 25.08.2023
- ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ అవకాశం: ఆగస్ట్ 26-28, 2023
- ఎన్ఓఆర్‌సీఈటీ ప్రిలిమినరీ పరీక్ష తేదీ: సెప్టెంబర్ 17, 2023
- ఎన్ఓఆర్‌సీఈటీ మెయిన్ ఎగ్జామ్ తేదీ: అక్టోబర్ 7, 2023
- తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, గుంటూరు, కర్నూలు, విశాఖపట్నం, తిరుపతి, విజయవాడ.
- వివరాలకు వెబ్‌సైట్: www.aiimsexams.ac.in
- ఆన్‌లైన్ దరఖాస్తు వెబ్‌సైట్: http://norcet5.aiimsexams.ac.in

విజయానికి అడుగులు ఇలా

జనరల్ నాలెడ్జ్ అండ్ ఆప్టిట్యూడ్

మొదటి దశ ప్రిలిమ్స్‌లో ఉండే ఈ విభాగంలోని 20ప్రశ్నలకు సరైన సమాధానాలు ఇచ్చేందుకు కరెంట్ అఫైర్స్, పాలిటీ, జాగ్రఫీ, ముఖ్య ప్రదేశాలు, సదస్సులు, సమావేశాలు, జనరల్ సైన్స్ అంశాలు, భారత చరిత్రలోని ముఖ్యాంశాలు, దేశాలు- రాజధానులు, రాజ్యాంగ వ్యవస్థపై దృష్టి పెట్టాలి. ఆప్టిట్యూడ్ విభాగంలో ప్రశ్నల కోసం నంబర్ సిస్టమ్, సింప్లిఫికేషన్, ప్రాబబిలిటీ, టైమ్ అండ్ డిస్టెన్స్, టైమ్ అండ్ వర్క్, రేషియోస్, పర్సంటేజెస్, బేసిక్ ఇంగ్లిష్ గ్రామర్ అంశాలపై పట్టు సాధించాలి.

సబ్జెక్ట్ ప్రశ్నలకు ఇలా

ప్రిలిమ్స్‌లో 80 మార్కులకు, మెయిన్స్‌లో 100 మార్కులకు ఉండే నర్సింగ్ సబ్జెక్ట్‌లకు సంబంధించిన ప్రశ్నలకు సరైన సమాధానాలు ఇచ్చేందుకు అభ్యర్థులు బ్యాచిలర్ స్థాయిలోని నర్సింగ్ సబ్జెక్ట్‌లను, వాటిలోని ముఖ్యమైన అంశాలను అవలోకనం చేసుకోవాలి. ప్రధానంగా డ్రగ్ స్టోరేజ్ మేనేజ్‌మెంట్, హ్యూమన్ అనాటమీ అండ్ ఫిజియాలజీ, మిడ్ వైఫరీ అండ్ గైనకాలజికల్ నర్సింగ్, హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ ఫార్మసీ, హాస్పిటల్ అండ్ క్లినికల్ ఫార్మసీ, ఫండమెంటల్స్ ఆఫ్ నర్సింగ్, నర్సింగ్ మేనేజ్‌మెంట్, కమ్యూనిటీ హెల్త్ నర్సింగ్, మెడికల్ సర్జికల్స్ ఆఫ్ నర్సింగ్, మైక్రో బయాలజీ, బయో కెమిస్ట్రీ, సైకాలజీ, మెంటల్ హెల్త్, టాక్సికాలజీ, ఫస్ట్ ఎయిడ్ విధానం, కంప్యూటర్స్ ఇన్ నర్సింగ్, పిడియాట్రిక్ నర్సింగ్‌లకు సంబంధించి అన్ని అంశాలను క్షుణ్నంగా చదవాలి.



మెరిసేదంతా బంగారమేనా..



➤ చంద్రయాన్ ల్యాండర్.. బంగారు రంగులో మెరిసిపోతూ ఉంటుంది. పైగా.. ఏదో గిఫ్ట్‌ప్యాక్ చుట్టిపెట్టినట్లు గోల్డ్ ఫాయిల్‌లాగా ఉంటుంది. ఇంతకీ మెరిసేదంతా బంగారమేనా? అస్సలు కాదు.. ఇది మల్టీ లేయర్ ఇన్సులేషన్.. అనేక పొరలుగా ఉంటుంది. ఉష్ణ నిరోధకంగా దీన్ని ఉపయోగిస్తారు. అంతరిక్షంలోకి ఉపగ్రహం వెళ్లినప్పుడు అక్కడి ఉష్ణోగ్రతలు వాటిల్లోని పరికరాలపై ప్రభావం చూపుతాయి. దీని వల్ల అవి సరిగా పనిచేయలేక పోవచ్చు. దాన్ని నివారించడానికి ఇలా కప్పి ఉంచుతారు.

నీట్ ర్యాంకు 2.38 లక్షలు.. ఎంబీబీఎస్‌లో కన్వీనర్ సీటు

ఓ ప్రైవేట్ మెడికల్ కాలేజీలో ఎస్సీ కేటగిరీ విద్యార్థికి సీటు

- గతేడాదికంటే మొదటి కౌన్సెలింగ్‌లోనే అధిక ర్యాంక్‌కు సీటు
- ఎంబీబీఎస్ కన్వీనర్ కోటా మొదటివిడత జాబితా విడుదల
- వివరాలు వెల్లడించిన కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రచరిత్రలో మొదటిసారిగా కన్వీనర్ కోటాకింద ఎంబీబీఎస్‌లో అధిక ర్యాంకర్‌కు సీటు లభించింది. నీట్‌లో 2.38 లక్షల ర్యాంకు వచ్చిన ఓ విద్యార్థికి ఒక ప్రైవేట్ మెడికల్ కాలేజీలో సీటు లభించింది. ఈ విషయాన్ని కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం ప్రకటించింది. ఎంబీబీఎస్ కన్వీనర్ కోటా మొదటివిడత జాబితాను వర్సిటీ బుధవారం వెల్లడించింది. ఏ కాలేజీలో ఎవరికి సీట్లు వచ్చాయో... విద్యార్థులకు సమాచారం పంపించింది. రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో ఉన్న కన్వీనర్ సీట్లలో 4,378 సీట్లు విద్యార్థులకు కేటాయిస్తూ జాబితా విడుదల చేసింది.

➤ గతేడాది ఓ ప్రైవేట్ కాలేజీలో చివరి (నాలుగో) విడత కౌన్సెలింగ్‌లో 2.28 లక్షల ర్యాంకర్‌కు బీసీ–ఏ కేటగిరీలో కన్వీనర్ సీటు లభించగా, ఈసారి మొదటి విడత కౌన్సెలింగ్‌లోనే 2.38 లక్షల ర్యాంకు సాధించిన ఎస్సీ కేటగిరీ విద్యార్థికి కన్వీనర్ సీటు లభించడం విశేషం.

➤ గతేడాది జనరల్ కేటగిరీలో చివరి విడతలో 1.25 లక్షల ర్యాంకుకు సీటు లభించగా, ఇప్పుడు మొదటి విడతలోనే 1.31 లక్షల ర్యాంకుకు జనరల్ కేటగిరీలో సీటు వచ్చింది.



➤ బీసీ– బీ కేటగిరీలో గతేడాది 1.37 లక్షల ర్యాంకుకు సీటు రాగా, ఈసారి మొదటి విడతలోనే 1.40 లక్షల ర్యాంకర్‌కు సీటు వచ్చింది.

➤ గతేడాది బీసీ–డీ కేటగిరీలో 1.28 లక్షల ర్యాంకర్‌కు సీటు రాగా, ఈసారి 1.35 లక్షల ర్యాంకర్‌కు సీటు వచ్చింది.

➤ అన్ని కేటగిరీల్లోనూ గత ఏడాది కంటే ఎక్కువ ర్యాంకు వచ్చిన వారికి కూడా కన్వీనర్ కోటాలోనే సీట్లు వచ్చాయి.

కన్వీనర్ కోటా సీట్లకు ఇంకా మూడు నుంచి నాలుగు విడతల కౌన్సెలింగ్ జరుగుతుంది. మొదటి విడతలో సీటు వచ్చినా, జాతీయస్థాయి కౌన్సెలింగ్‌లో సీటు వచ్చినవారు ఇక్కడ చేరకుంటే, ఆ సీట్లు తదుపరి విడతల్లో కేటాయిస్తారు. అప్పుడు ఇంకా పెద్ద ర్యాంకర్‌కు సీటు వచ్చే అవకాశముంది.

పెరిగిన సీట్లు.. ఎక్కువగా అవకాశాలు

రాష్ట్రంలో వైద్యవిద్య అవకాశాలు భారీగా పెరిగాయి. గతేడాది కంటే ఈసారి ప్రభుత్వ కాలేజీల సంఖ్య పెరిగింది. కొన్ని ప్రైవేట్ కాలేజీల్లోనూ సీట్లు పెరిగాయి. 2023–24 వైద్య విద్యా సంవత్సరానికి రాష్ట్రంలోని 56 మెడికల్ కాలేజీల్లో 8,490 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి. అందులో 27 ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 3,790, 29 ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో 4,700 ఎంబీబీఎస్ సీట్లున్నాయి. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లోని అన్ని సీట్లు, ప్రైవేటు కాలేజీల్లోని 50 శాతం సీట్లు కన్వీనర్ కోటాలో భర్తీ చేస్తారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లోని సీట్లల్లో 15 శాతం అఖిలభారత కోటా కింద భర్తీ చేస్తారు. వాటిల్లో రెండు విడతల కౌన్సెలింగ్ తర్వాత సీట్లు మిగిలితే తిరిగి వాటిని మన రాష్ట్రానికే ఇస్తారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం అగ్రవర్ణాల్లో ఆర్థికంగా బలహీనవర్గాల (ఈడబ్ల్యూఎస్)కు 10 శాతం రిజర్వేషన్ అమలు చేస్తుండటం తెలిసిందే. మరోవైపు ప్రైవేట్ కాలేజీల్లోని బీ, సీ కేటగిరీ సీట్లకు కూడా త్వరలో కౌన్సెలింగ్ ప్రారంభమవుతుంది. వాటిల్లో భారీ ర్యాంకర్లకు కూడా సీట్లు వస్తాయి. జాతీయస్థాయిలో 8 లక్షల నుంచి 9 లక్షల వరకు ర్యాంకులు వచ్చిన వారికి మన ప్రైవేటు కాలేజీల్లోనూ బీ కేటగిరీలో ఎంబీబీఎస్ సీటు వస్తుందంటున్నారు.

బీడీఎస్‌కు కౌన్సెలింగ్ నేటినుంచి

ప్రభుత్వ, ప్రైవేటు దంత కళాశాలల్లో కన్వీనర్ కోటా బీడీఎస్ ప్రవేశాలకు మొదటి విడత కౌన్సెలింగ్ నోటిఫికేషన్‌ను కాళోజి వైద్య ఆరోగ్య విశ్వవిద్యాలయం విడుదల చేసింది. ఈ నెల 24 ఉదయం 10 గంటల నుండి 26వ తేదీ మధ్యాహ్నం 2 గంటల వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చు.

గురుకుల కొలువుల పరీక్షలు పూర్తి

ఈ నెల 1నుంచి 23 వరకు 19 రోజుల పాటు నిర్వహణ

- సొసైటీ వెబ్‌సైట్‌లో 'కీ'లు అందుబాటులోకి తెచ్చిన టీఆర్ఈఐఆర్‌బీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని గురుకుల విద్యా సంస్థల్లో 9,231 ఉద్యోగాల భర్తీకి సంబంధించి తెలంగాణ గురుకుల విద్యా సంస్థల నియామకాల బోర్డు(టీఆర్ఈఐఆర్‌బీ) నిర్వహించిన అర్హత పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. ఈనెల 1వ తేదీ నుంచి 23వ తేదీ వరకు మొత్తం 19 రోజుల పాటు ఈ పరీక్షలు జరిగాయి. 6,52,413 మంది అభ్యర్థులు ఈ పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా.. 4,93,727 మంది హాజరయ్యారు. పరీక్షలకు సగటున హాజరైన అభ్యర్థుల శాతం 75.68గా నమోదైంది. గురుకుల బోర్డు ఏకకాలంలో తొమ్మిది నోటిఫికేషన్లు జారీ చేసింది. ఇందులో భాగంగా దాదాపు 56 విభాగాల్లోని ఉద్యోగాల భర్తీకి సంబంధించి కేవలం 19 రోజుల్లో అత్యంత ప్రణాళికా బద్ధంగా పరీక్షలు నిర్వహించిన టీఆర్ఈఐఆర్‌బీ సరికొత్త రికార్డు సృష్టించింది. రోజుకు మూడు షిఫ్టుల్లో పూర్తిగా కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) పద్ధతిలో ఈ పరీక్షలను టీఆర్ఈఐఆర్‌బీ విజయవంతంగా పూర్తి చేసింది. ఇప్పటివరకు గురుకుల బోర్డు నిర్వహించినవన్నీ కంప్యూటర్ ఆధారిత పరీక్షలే కావడంతో మూల్యాంకన ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసే వీలుంటుంది. ముందుగా అభ్యర్థుల జవాబు పత్రాల నకళ్లు, ప్రాథమిక కీ విడుదల, అభ్యంతరాల స్వీకరణ, తుది కీ ఖరారు చేసిన తర్వాత ఫలితాలను విడుదల చేయాల్సి ఉంటుంది. ఇందులో భాగంగా టీఆర్ఈఐఆర్‌బీ నిర్వహించిన పరీక్షలకు సంబంధించిన ప్రాథమిక కీని సొసైటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. కాగా, ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ టీచర్ ఉద్యోగ కేటగిరీలకు సంబంధించి మాస్టర్ క్వశ్చన్ పేపర్లు, కీలను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచలేదు. వీటికి సంబంధించి కోర్టులో కేసు ఉండటంతో వెబ్‌సైట్‌లో పెట్టలేదని తెలుస్తోంది. ఇదిలా ఉండగా ప్రాథమిక కీ పట్ల అభ్యంతరాలుంటే ఈనెల 26వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో సమర్పించాలని గురుకుల బోర్డు కన్వీనర్ మల్లయ్య భట్టు తెలిపారు. ఈ నెలాఖరులోగా తుది కీలు తయారయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం. తుది కీ విడుదల చేసిన రోజునే అభ్యర్థులు సంబంధిత పరీక్షల్లో సాధించిన మార్కులు సైతం విడుదలవుతాయి. గురుకుల విద్యా సంస్థల్లో టాప్ పోస్టులుగా డిగ్రీ లెక్చరర్, జూనియర్ లెక్చరర్, జూనియర్, డిగ్రీ కాలేజీల్లో లైబ్రేరియన్, ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ టీచర్లకు డెమో పరీక్షలుంటాయి.



ఐదు 'రియల్' సంస్థలకు షోకాజ్ నోటీసులు

- రెరా నిబంధనలు ఉల్లంఘించినట్టు ఆరోపణలు
- అతిక్రమిస్తే చర్య: చైర్మన్ హెచ్చరిక

సాక్షి, హైదరాబాద్: రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రెరా) నిబంధనలు ఉల్లంఘించిన ఐదు రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులపై సంస్థ కన్నెర్ర జేసింది. ఈ మేరకు సంస్థ చైర్మన్ ఎన్.సత్యనారాయణ ఆదేశాల మేరకు 'రెరా'కార్యదర్శి బాలకృష్ణ బుధవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ మేరకు 15 రోజుల్లోగా వివరణ ఇవ్వాలని సదరు రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులను ఆదేశించారు. రాధే గ్రూప్ రియల్ ఎస్టేట్ సంస్థ సంగారెడ్డి జిల్లా రామచంద్రపురం మండలంలోని ఉస్మాన్ నగర్‌లో రెరా రిజిస్ట్రేషన్ పొందకుండా 'రాధే పనోరమా'ప్రాజెక్టును ప్రారంభించింది. ఎలాంటి అనుమతులు పొందకుండా ప్రీ–లాంచింగ్ పేరుతో ప్లాట్లు అమ్మకానికి పెట్టినట్లు రెరా దృష్టికి వచ్చింది. అలాగే ఓం శ్రీ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ సంస్థ 'ఓం శ్రీ సిగ్నెట్'పేరుతో ప్రాజెక్టు చేపట్టింది. ఎలాంటి అనుమతి లేకుండా ఈ–బ్లాక్ నిర్మాణం చేపట్టింది. అలాగే భువన తేజ ఇన్ఫ్రా ప్రాజెక్టు యాజమాన్యం తక్కువ రేట్లకే ప్లాట్లు అంటూ ప్రీలాంచ్ విక్రయాలు చేపట్టింది. హైదరాబాద్‌లోనే కాకుండా రాష్ట్రంలోని ఇతర నగరాల్లో కూడా ప్రీలాంచ్ ఆఫర్లు నిర్వహించడంపై షోకాజ్ నోటీసు జారీ చేశారు. టీఎంఆర్ నిర్మాణ సంస్థ 'రెరా'రిజిస్ట్రేషన్ ఉన్నప్పటికీ నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ నెంబర్ ప్రదర్శించకుండా కరపత్రాలు, బ్రోచర్ల ద్వారా ప్రచార కార్యక్రమాలు చేపట్టడంపై షోకాజ్ నోటీస్ జారీ చేశారు. సువర్ణ భూమి ఇన్‌ఫ్రా డెవలపర్స్ సంస్థ 'లేక్ వ్యూ'పేరుతో సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువు సమీపంలోని ఎల్లాపూర్ లో ప్లాట్లు విక్రయించడం ప్రారంభించింది. ఈ మేరకు షోకాజ్ నోటీసు జారీ చేశారు. కాగా, రెరా నిబంధనలు పాటించకుండా రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులు చేపట్టినా, ప్రీ లాంచింగ్ పేరుతో వినియోగదారులను మభ్యపెట్టినా కఠిన చర్యలు తప్పవని సంస్థ చైర్మన్ ఎన్.సత్యనారాయణ హెచ్చరించారు. 'రెరా'రిజిస్ట్రేషన్ లేకుండా అమ్మడం, మార్కెటింగ్, బుకింగ్స్ చేయడం నేరమని ఆయన స్పష్టం చేశారు.

ఎన్జీటీ చైర్‌పర్సన్‌గా జస్టిస్ శ్రీవాస్తవ బాధ్యతల స్వీకారం

సాక్షి, న్యూఢిల్లీ: జాతీయ హరిత ట్రిబ్యునల్ ప్రధాన ధర్మాసనం చైర్‌పర్సన్‌గా జస్టిస్ ప్రకాశ్ శ్రీవాస్తవ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జస్టిస్ శ్రీవాస్తవ మాట్లాడుతూ.. ట్రిబ్యునల్ ఏర్పాటు లక్ష్యం పూర్తిగా నెరవేరేలా కృషి చేస్తానని తెలిపారు. పర్యావరణ సమస్యలు.. ప్రధానంగా అభివృద్ధి కార్యకలాపాల మధ్య వైరుధ్యం, పర్యావరణంపై వాటి ప్రతికూల ప్రభావం వల్ల వస్తాయని స్పష్టం చేశారు. అందువల్ల సమతుల్య విధానం అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. 2021లో కల్‌కత్తా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టిన జస్టిస్ శ్రీవాస్తవ.. ఈ ఏడాది మార్చి నెలలో పదవీ విరమణ చేశారు.

సెప్టెంబర్ మూడోవారంలో 'కానిస్టేబుల్' ఫలితాలు?

- అభ్యర్థుల తుది ఎంపికజాబితాపై పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు కసరత్తు
- వివిధ విభాగాల్లో 16,929 పోస్టులు



సాక్షి, హైదరాబాద్: 'కానిస్టేబుల్ తుది ఎంపిక జాబితా'సెప్టెంబర్ మూడోవారంలో విడుదల కానున్నట్టు విశ్వసనీయ సమాచారం. వివిధ విభాగాల్లోని కానిస్టేబుల్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితా వెల్లడిపై పోలీస్ నియామక మండలి కసరత్తు ముమ్మరం చేసింది. పోలీస్‌శాఖలోని వివిధ విభాగాలు, జైళ్లశాఖ, అగ్నిమాపకశాఖ, రవాణా, ఎక్సైజ్‌శాఖల్లో కలిపి మొత్తం 16,929 కానిస్టేబుల్ పోస్టులు భర్తీ చేయనున్నారు. ఇప్పటికే తుదిరాత పరీక్షలో అర్హత సాధించిన వారి ఫలితాలు మే 30న పోలీస్ నియామకమండలి వెల్లడించడం తెలిసిందే. జూన్ 1వ తేదీన ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ పూర్తి చేశారు. గత కొన్ని రిక్రూట్‌మెంట్‌ల మాదిరిగానే ఈసారి కూడా ముందుగానే ఎస్ఐ పోస్టుల తుది ఎంపిక జాబితాను బోర్డు అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం వారి నియామక ప్రక్రియ తుదిదశలో ఉంది. ప్రస్తుతం ఎస్‌బీ ఎంక్వైరీ, మెడికల్ టెస్ట్ నడుస్తోంది. ఈ నెలాఖరు నాటికి ఎస్ఐల శిక్షణ ప్రారంభిస్తారు. ఈ నేపథ్యంలో రిక్రూట్‌మెంట్ బోర్డు అధికారులు కానిస్టేబుల్ ఫలితాలపై దృష్టి సారించారు. మొత్తం 1,01,600 మంది అభ్యర్థులు తుది అర్హత సాధించిన వారిలో ఉన్నారు. వీరికి సంబంధించిన అన్ని రికార్డులు, ఆయా జోన్లు, పోలీస్, రెవెన్యూ జిల్లాలు, సామాజికవర్గాల వారీగా ఎంపిక ప్రక్రియ ప్రస్తుతం కొనసాగుతోంది. తుది పోటీలో ఉన్న వారిలో ప్రతి ఆరుగురు అభ్యర్థుల్లో ఒకరికి ఉద్యోగం వచ్చే అవకాశం ఉన్నట్టు సమాచారం. మొత్తం ప్రక్రియ ముగిసేందుకు మరో మూడు నుంచి నాలుగు వారాలు సమయం పడుతుంది.

డీఎస్సీ–98 క్వాలిఫైడ్స్‌కు త్వరలోనే న్యాయం

విద్యాశాఖ మంత్రి సబిత హామీ



సాక్షి, హైదరాబాద్: డీఎస్సీ–1998 క్వాలిఫైడ్ అభ్యర్థులెవరూ ఆందోళన చెందవద్దని విద్యా శాఖమంత్రి సబితా ఇంద్రారెడ్డి హామీ ఇచ్చారు. బుధవారం 1998 డీఎస్సీ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కె.శ్రీనివాస్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం మంత్రి సబితను పంజగుట్ట శ్రీనగర్ కాలనీలోని ఆమె నివాసంలో కలిశారు. తమకు ఉద్యోగాలు ఇంకెప్పుడు వస్తాయోనన్న ఆందోళనలో క్వాలిఫైడ్ అభ్యర్థులు తీవ్ర మానసిక సంఘర్షణకు గురవుతున్నారని వివరించారు. ఈనెల 20న సీఎం సూర్యాపేట జిల్లా కేంద్రంలో పర్యటన, బహిరంగ సభ సందర్భంగా వినతిపత్రాన్ని అందజేసినట్లు శ్రీనివాస్ చెప్పారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.